

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 12+10 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 32

గురువారం 24-4-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


BHASHYAM®
BLOOMS
the global school
Andhra Pradesh | Telangana | Karnataka
NURTURING
YOUNG MINDS
Bhashyam Blooms - The fastest growing chain of CBSE campuses in South India
Tirupati
Kakinada
Vizianagaram
Tanuku
Rajahmundry
Vijayawada
Guntur
Brahamanapalli
Peerzadiguda
Nagole
Our
VIBRANT
Campuses
Maheswaram
Kapra
Alwal
Manikonda
Samanagar
Hayathnagar
Patancheru
Pragathi Nagar
Bengaluru-Electronic City
Bengaluru-Bannerghatta
Kukatpally
ANDHRA PRADESH
GUNTUR : Tel.: 0863-2246015, 2256939, Mbl.: 98485 36968
VIJAYAWADA : Mbl.: 95422 54444, 96185 08686
TIRUPATI : Mbl.: 88855 34848
RAJAHMUNDRY : Mbl.: 88869 22422, 88869 33433
KAKINADA : Mbl.: 88850 34224, 88861 24949
VIZIANAGARAM : Mbl.: 88862 86677, 88862 96677
TANUKU : Mbl.: 88850 34849
TELANGANA
MANIKONDA : Mbl.: 88866 77111, 88866 55444, MAHESWARAM : Mbl.: 88866 68985/86
NAGOLE : Tel.: 040-29704920, Mbl.: 88866 69920/30, ECIL : Mbl.: 88866 33746/56/96
PRAGATHI NAGAR : Mbl.: 91213 26111/222/333, PATANCHERU : Mbl.: 91213 26444/555
HAYATH NAGAR : Mbl.: 73374 46363/6464, PEERZADIGUDA : Mbl.: 73374 48282/8383
ALWAL : Mbl.: 93917 75428/29, SAMANAGAR : Mbl.: 63039 12101/02/03
BRAHMANAPALLY : Mbl.: 88861 24646/4747
BROOKS, KUKATPALLY : Mbl.: 98487 79020, 88855 50044
KARNATAKA | BENGALURU - BANNERGHATTA : Mob : 99880 90948, 99880 90947, BENGALURU - ELECTRONIC CITY : Mob : 88850 34276, 88850 34842


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+10 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 32

గురువారం 24-4-2025



రైజర్స్ పరాజయాల సిక్సర్

ముంబైపై ఏడు వికెట్ల తేడాతో హైదరాబాద్ పరాజయం - 9లో



సెన్సెక్స్ మళ్లీ 80,000 పైకి..

ఏడో రోజూ బుల్ దూకుడు.. ఐటీ, ఆటో షేర్లకు డిమాండ్ - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఉగ్రవాదానికి భారత్ తలవంచదు

ఉగ్రవాదానికి భారత్ ఏనాడూ తలవంచదని.. ఉగ్ర పంజా విసిరిన వారిని వదిలిపెట్టేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.

వివరాలు 6లో ▸



ఈ దాడి.. దేశంపై దాడి

పహల్గాంలో దాడి భారత సార్వభౌమత్వం, సమగ్రతపై జరిగిన దాడి అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸



విషాదం మిగిల్చిన వేడుకలు

ఒక జంటది హనీమూన్.. కొందరిది పెళ్లి రోజు.. పహల్గాం మారణకాండ 26 కుటుంబాల్లో తీరని విషాదం నింపింది.

వివరాలు 6లో ▸



ఆ నవ వరుడు నేవీ అధికారి

'ఉగ్ర తూటాలకు బలైన భర్త.. పక్కన రోదిస్తున్న నవ వధువు' ఇందులో మరణించిన వ్యక్తి నేవీ అధికారి అని తేలింది.

వివరాలు 6లో ▸

పాక్‌కు పంచ్

దౌత్య సంబంధాలకు కత్తెర.. ఆ దేశ పౌరులకు వీసాలు రద్దు

సింధూ ఒప్పందం సస్పెన్షన్.. అటారీ సరిహద్దు మూత

దౌత్య సిబ్బంది బహిష్కరణ

సీసీఎస్ భేటీలో నిర్ణయాలు..

పహల్గాం దాడికి ఖండన..

మోదీ సారథ్యంలో లోతుగా చర్చ.. ఉగ్రవాదాన్ని పోషిస్తోందంటూ పాక్‌పై ధ్వజం

దాడికి దీటైన ప్రతీకారం తప్పదని సంకేతాలు



సీసీఎస్ భేటీలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై మంగళవారం ఉగ్ర ముష్కరులు జరిపిన ఆటవిక దాడిని భారత్ అత్యంత తీవ్రంగా పరిగణించింది. దీని వెనక పాకిస్తాన్ హస్తం స్పష్టంగా కనిపిస్తోందంటూ మండిపడింది. సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాదిపై కఠిన చర్యలకు దిగింది. పాకిస్తాన్ పౌరులకు భారత్‌లోకి ప్రవేశాన్ని నిషేధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. అంతే గాక పాక్‌తో దౌత్య సంబంధాలకు చాలావరకు కత్తెర వేసింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో సమావేశమైన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ మేరకు ఐదు కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ నదీ జలాల ఒప్పందం సస్పెన్షన్, అటారీ సరిహద్దు మూసివేత, దౌత్య సిబ్బంది తగ్గింపు తదితరాలు వీటిలో ఉన్నాయి. దీంతో పాక్‌తో ఇప్పటికే క్షీణించిన దౌత్య సంబంధాలు మరింత అట్టడుగుకు దిగజారాయి. ఈ చర్యలతోనే సరిపెట్టకుండా ఉగ్ర ముష్కరులకు, వారిని ప్రేరేపిస్తున్న పొరుగు దేశానికి దీటుగా బదులిచ్చేందుకు కూడా కేంద్రం సమాయత్తమవుతోంది. ఆ దిశగా చేపట్టాల్సిన చర్యలపై సీసీఎస్ భేటీలో రెండున్నర గంటలకు పైగా లోతుగా చర్చ జరిగింది.

విమానాశ్రయంలోనే మోదీ సమీక్ష

మంగళవారం రాత్రి సౌదీ అరేబియా పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని వెనుదిరిగిన ప్రధాని మోదీ బుధవారం తెల్లవారుజామున

మిగతా 6వ పేజీలో ▶

గట్టిగా బదులిస్తాం

రక్షణ మంత్రి రాజ్‌నాథ్

ఏమిటీ సింధూ జలాల ఒప్పందం?

6లో

విహారానికి వెళ్లి..ఉగ్రదాడికి గురై

పహల్గాం ఉగ్రదాడిలో ఇద్దరు ఏపీ వాసులు మృతి

ఒకరిది విశాఖ.. మరొకరిది కావలి

విషాదం నింపిన విహార యాత్ర

9లో

ఉగ్ర దాడిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శాంతి ర్యాలీలు

పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు కదం తొక్కిన పార్టీ శ్రేణులు

అమానుష చర్యను ఖండిస్తూ నినాదాలు

కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళి

సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును విజయవాడ జైలుకు తరలిస్తున్న సీఐడీ అధికారులు



పక్కా కక్షే... అక్రమ కేసే

సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుపై రెడ్‌బుక్ కుట్ర

కాదంబరి జత్వానీతో ఇప్పించింది అబద్ధపు ఫిర్యాదే

అంతకు ముందే అక్రమ కేసుకు రంగం సిద్ధం

జత్వానీ నేరాలపై దర్యాప్తులో ఉన్న అంశాల వక్రీకరణ

ఎవిడెన్స్ యాక్ట్‌ను వక్రీకరిస్తూ అక్రమ కేసు

రిమాండ్ నివేదిక సాక్షిగా కుట్రలు బట్టబయలు

తాను ఎలాంటి తప్పూ చేయలేదని పీఎస్ఆర్ స్పష్టీకరణ

కోర్టులో తన కేసు తానే వాదించుకున్న పీఎస్ఆర్

14 రోజుల రిమాండ్ విధించిన న్యాయస్థానం

రఘురామరాజు కక్ష సాధింపు కేసులోనూ పీఎస్ఆర్‌ను ఇరికించేందుకు మెమో దాఖలు చేసిన సీఐడీ

మరిన్ని అక్రమ కేసులకు కూటమి సర్కారు కుటిల పన్నాగాలు

2లో

న్యూస్‌రీల్

గోనవరం @ 44 డిగ్రీలు



నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఈ వేసవిలో ఇప్పటిదాకా ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. రాష్ట్రంలో మొత్తం 135 ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం 30 మండలాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

వివరాలు 7లో ▸

ఇదేం ధ'రొయ్యో'!



రొయ్య రైతులు విలవిల్లాడుతున్నారు. గిట్టుబాటు ధర రాక సతమతమవుతున్నారు. ట్రంప్ సుంకాల పేరు చెప్పి ఎగుమతిదారులు అడ్డగోలుగా ధరలు తగ్గించేయడంతో ఈ దుస్థితి తలెత్తింది. అయినా కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు.

వివరాలు 5లో ▸


నేటి నుంచి వేసవి సెలవులు

కాలేజీలు జూన్ 2న.. స్కూళ్లు 12న పునః ప్రారంభం



సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం విద్యా సంవత్సరం ముగియడంతో వేసవి సెలవులు ప్రకటించారు. జూనియర్ కాలేజీలు జూన్ 2న, పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభం అవుతాయి. అయితే, అన్ని యాజమాన్య పాఠశాలల్లోని ఉపాధ్యాయులు జూన్ 6న విధుల్లో చేరాలని విద్యా శాఖ ఆదేశించింది.

ఇదండీ సంగతి





తాజ్‌మహల్ ఓ అద్భుతం!

న్యూఢిల్లీ: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో కలిసి బుధవారం తాజ్‌మహల్‌ను సందర్శించారు. గంటపాటు ఆ అద్భుత నిర్మాణాన్ని వీక్షించిన ఆయన.. 'తాజ్‌మహల్ ఓ అద్భుతం. నిజమైన ప్రేమకు, మానవ నైపుణ్యానికి నిదర్శనం' అని సందర్శకుల డైరీలో రాశారు. పర్యటన అనంతరం వాన్స్ కుటుంబం రామ్‌బాగ్ ప్యాలెస్‌కు వెళ్లింది. నాలుగు రోజుల భారత పర్యటనలో ఉన్న వాన్స్ కుటుంబం గురువారం ఉదయం అమెరికాకు తిరిగి వెళ్లనుంది.

'పది'పోయిన ఫలితాలు

పదో తరగతి ఫలితాల్లో స్పష్టంగా కనిపించిన ప్రభుత్వ తీరు

విద్యా రంగంలో బెడిసికొట్టిన కూటమి సర్కారు ప్రయోగాలు

- గత ఏడాది కంటే ఉత్తీర్ణతలో 5.55 శాతం తగ్గుదల నమోదు
- నిరుడు వందశాతం ఉత్తీర్ణత స్కూళ్లు 2,800.. ఈసారి 1,680
- పరీక్షలకు 6,14,459 మంది విద్యార్థుల హాజరు.. 4,98,585 మంది పాస్
- 84.09 శాతం బాలికలు, 78.31 శాతం బాలురు ఉత్తీర్ణత
- 93.90 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమం
- 47.64 శాతంతో చివరి స్థానంలో అల్లూరి జిల్లా
- 1,680 పాఠశాలల్లో 100 శాతం.. 19 పాఠశాలల్లో 'జీరో'
- ఇంగ్లిష్ మీడియంలో 83.19 శాతం.. తెలుగు మాధ్యమంలో 58.59 శాతం
- మే 19 నుంచి 28 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
- ఈ నెల 30 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం
- ఆలస్య రుసుముతో మే 18 వరకు గడువు
- ఉపాధ్యాయుల సర్దుబాటులో సాగదీతతో చేదు ఫలితం
- అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల తొలగింపుతో చేటు

2లో



600/600

పది ఫలితాల్లో 600 మార్కులు సాధించిన నేహాంజని

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కాకినాడకు చెందిన యళ్ల నేహాంజని 600కు 600 మార్కులు సాధించి విశేష ప్రతిభ చూపింది. ప్రాథమిక విద్య నుంచి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తోంది. ప్రణాళికాబద్ధంగా చదివి కాకినాడ చరిత్రలో పదిలో నూటికి నూరుశాతం మార్కులతో ఘనత చాటింది. సివిల్స్ సాధించి పేద ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు నేహాంజని తెలిపింది. తండ్రి శ్రీనివాసరావు ప్రైవేట్ ఉద్యోగి కాగా తల్లి గంగా భవానీ గృహిణిగా ఉన్నారు. తమ విద్యార్థిని వై.నేహాంజని స్టేట్ టాపర్‌గా నిలిచిందని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు.

పోలవరం ఎత్తు కుదింపు

తొలిదశ కింద 135 అడుగులకు తగ్గింపు

కేంద్ర కేబినెట్‌లో నిర్ణయం

పోలవరం ప్రాజెక్టు అథారిటీ భేటీలో ఏపీ వెల్లడి


దీంతో తెలంగాణలో ముంపు ఉండదని వాదన

3లో



వీరయ్యచౌదరి హత్య కేసులో

దోషుల్ని వదిలిపెట్టం



ముఖ్యమంత్రి చంద్రబాబు

7లో

■ ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో హత్యకు గురైన టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి మృతదేహానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. వీరయ్యచౌదరి హత్య కేసులో దోషుల్ని వదిలిపెట్టనన్నారు.



ఆ ఆరు రాష్ట్రాల విద్యార్థులు రావద్దు

- ఆస్ట్రేలియా వర్సిటీల నిషేధం
- విద్యార్థి వీసాల ముసుగులో అక్రమ వలసల నిరోధానికి చర్యలు
- హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్ విద్యార్థులపై కఠిన ఆంక్షలు
- వీసాల మంజూరుకు పొదుపు మొత్తం పెంపు
- చట్టబద్ధమైన దరఖాస్తుదారుల భవితవ్యంపై తీవ్ర ప్రభావం

7లో



వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించం

5లో

కడప వీధుల్లో నినదించిన ముస్లిం మహిళలు.. భారీ ఎత్తున ర్యాలీ

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించే ప్రసక్తే లేదని ముస్లిం మహిళలు తెగేసి చెప్పారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కడప ముస్లిం మహిళలు బుధవారం 'మేము సైతం' అంటూ భారీ సంఖ్యలో రోడ్డెక్కారు. ఇప్పటి వరకు ఇల్లు దాటి అడుగు బయటపెట్టని తాము ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా రోడ్డెక్కాల్సి వచ్చిందని మహిళలు చెప్పారు.

క్లుప్తంగా...

నేడు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్ భేటీ



సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీలు, అనంతపురం జిల్లా కంబదూరు, తిరుపతి రూరల్ వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమావేశం కానున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వరుస సమావేశాల్లో భాగంగా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఈ సమావేశం జరుగనుంది. దీనికి ఎంపీపీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలను ఆహ్వానించారు. వీరితో పాటు ఆయా జిల్లాలకు సంబంధించిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు కూడా హాజరుకానున్నారు.

25 వరకు ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు

సాక్షి, అమరావతి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్టు ఇంటర్ విద్య కార్యదర్శి కృతికా శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. మే 12 నుంచి 19 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే, జవాబు పత్రాల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు గడువును కూడా ఏప్రిల్ 25 వరకు పొడిగించినట్టు ఆమె తెలిపారు.

రాజ్ కేసిరెడ్డి కస్టడీకి సిట్ పిటిషన్

ఈ కేసులో మరొకరి అరెస్ట్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంపై నమోదైన అక్రమ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డిని కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు న్యాయస్థానాన్ని కోరారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాజ్ ను కస్టడీకి కోరుతూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం గురువారం విచారించే అవకాశం ఉంది. కాగా ఈ కేసులో ఏ 8గా ఉన్న బూనేటి చాణక్యను సిట్ బుధవారం అరెస్టు చేసి విజయవాడకు తరలించారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

పహల్గాం దాడిని ఖండించిన హైకోర్టు న్యాయవాదుల సంఘం



సాక్షి, అమరావతి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఏపీహెచ్‌సీఏఏ) తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయాలని కోరింది. భోజన విరామ సమయంలో సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, ప్రధాన కార్యదర్శి చేజర్ల సుబోధ్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు హైకోర్టు ప్రాంగణం వెలుపల నిరసన ర్యాలీ నిర్వహించారు. 'ఉగ్రవాదం నశించాలి.. భాషలు, ప్రాంతాలకు అతీతంగా దేశం కోసం ఏకమవుదాం.. కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ఖండిద్దాం' అనే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి, అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) చల్లా ధనంజయ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావులతో పాటు పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

67 మందికి రాష్ట్ర స్థాయి పంచాయతీ అవార్డులు

నేడు పంచాయతీరాజ్ దినోత్సవం

సాక్షి, అమరావతి: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పలు విభాగాల్లో ఉత్తమ సేవలందించిన 67 మందిని రాష్ట్ర స్థాయి అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేసింది. మంగళగిరిలో గురువారం జరగనున్న పంచాయతీరాజ్ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం జరగనుందని ఆశాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది, ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై ఎస్ఐఆర్‌డీ కమిషనర్ ముత్యాలరాజు, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో అనంతపురం, సత్యసాయి జిల్లాల కలెక్టర్లు వి.వినోద్‌కుమార్, టీఎస్ చేతన్‌లు అవార్డులకు ఎంపికయ్యారు. అలాగే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ మంచినీటి సరఫరా, ఎస్ఐఆర్‌డీ, సోషల్ ఆడిట్ విభాగాలకు చెందిన అధికారులతో పాటు గ్రామ సర్పంచులను అవార్డులకు ఎంపిక చేశారు.

నేడు ప్రత్యేక కేటగిరీ పంచాయతీ అవార్డుల ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బిహార్‌లోని లోహానాలో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక కేటగిరీ జాతీయ పంచాయతీ అవార్డులు–2025 ప్రదానం చేస్తారని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ బుధవారం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బిహార్, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలకు ఈ అవార్డులు లభించినట్లు తెలిపింది.

పక్కా కక్షే... అక్రమ కేసే

సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులుపై రెడ్‌బుక్ కుట్రే

సాక్షి, అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుపై టీడీపీ కూటమి సర్కారు పక్కా పన్నాగంతో అక్రమ కేసు నమోదు చేసింది. సీఐడీ దాఖలు చేసిన రిమాండ్ నివేదికే ఆ కుట్రలను బహిర్గతం చేసింది. వలపు వల విసిరి బడాబాబులను బురిడీ కొట్టించే నేర చరిత్ర ఉన్న ముంబై నటి కాదంబరి జత్వానీతో అబద్ధపు ఫిర్యాదు ఇప్పించేందుకు ఎంతటి పన్నాగంతో వ్యవహరించారో బయటపడింది. ఆమెపై గతంలో నమోదైన క్రిమినల్ కేసులు దర్యాప్తు ఉండగానే వాటిని వక్రీకరిస్తూ... భారత సాక్ష్యాధారాల చట్టానికి విరుద్ధంగా కక్ష పూరితంగా అక్రమ కేసు నమోదు చేసినట్లు స్పష్టమైంది. తాను ఎలాంటి తప్పూ చేయలేదని... జత్వానీపై గతంలో విజయవాడ పోలీసులు నమోదు చేసిన కేసుతో నాడు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న తనకు ఎలాంటి సంబంధం లేదని పీఎస్ఆర్ ఆంజనేయులు తన వాదనలను న్యాయస్థానంలో స్వయంగా వినిపించారు. ఈ కేసులో ఆయనకు న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించింది. మరోవైపు ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గతంలో చేసిన ఫిర్యాదుతో నమోదు చేసిన అక్రమ కేసులోనూ పీఎస్ఆర్ పేరును చేరుస్తూ సీఐడీ మెమో దాఖలు చేయడంతోపాటు మరిన్ని అక్రమ కేసులకు ప్రభుత్వం సిద్ధమైంది.



ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులును విజయవాడ జైలుకు తరలిస్తున్న సీఐడీ అధికారులు

జత్వానీ అబద్ధపు ఫిర్యాదు.. అక్రమ కేసు

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పీఎస్ఆర్ ఆంజనేయులుపై అక్రమ కేసు నమోదు చేసేందుకు ఉపక్రమించింది. అందుకోసం కాదంబరీ జత్వానీని సాధనంగా చేసుకుంది. విజయవాడకు చెందిన పారిశ్రామికవేత్త కుక్కల విద్యాసాగర్‌కు చెందిన భూములను ఫోర్జరీ పత్రాలతో విక్రయించేందుకు యత్నించిన కేసులో ఆమె నిందితురాలు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాదంబరి జత్వానీ ఒక్కసారిగా రాష్ట్ర ప్రభుత్వ గౌరవ అతిథిగా మారిపోయారు. అక్రమ కేసు నమోదుకు రంగం సిద్ధం చేస్తూ ముందుగా 2024 ఆగస్టులో టీడీపీ అనుకూల చానల్‌తో ఆమెను మాట్లాడించారు. వెంటనే విజయవాడ పోలీసులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెతో మాట్లాడారు. ఈ క్రమంలో ఆమెను 2024 సెప్టెంబరు 5న విజయవాడకు రప్పించడంతో ఏసీపీతోపాటు విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబును కలిశారు. వారం రోజులు ఆమె విజయవాడలోనే ప్రభుత్వ అతిథి హోదాలో ఉన్నారు. ఈ కేసులో విచారణ అధికారిగా నియమించాలని అప్పటికే నిర్ణయించిన ఉమామహేశ్వరరావు ఆమెకు కుట్ర కేసు నమోదు కథను వివరించారు. అనంతరం 2024 సెప్టెంబరు 13 అర్ధరాత్రి కాదంబరీ జత్వానీ ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడం... వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం చకచకా జరిగిపోయాయి.

జత్వానీ ఫోర్జరీ పత్రాలపై కేసు విచారణలో ఉండగానే పోలీసులపై ఫిర్యాదా..!

పీఎస్ఆర్ ఆంజనేయులుపై అక్రమ కేసు నమోదు చేసేందుకే కాదంబరీ జత్వానీతో అబద్ధపు ఆరోపణలతో ఫిర్యాదు చేయించినట్లు సీఐడీ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. కుక్కల విద్యా సాగర్‌కు చెందిన భూములను విక్రయించేందుకు వాటిని 2018లో కొనుగోలు చేసినట్టు ఆమె 2023లో ఫోర్జరీ పత్రాలు సృష్టించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఆ కేసు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉంది. కానీ తనపై అక్రమ కేసు పెట్టారని జత్వానీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫిర్యాదు చేయడం గమనార్హం. అవి ఫోర్జరీ పత్రాలో.. కావో అన్నది పోలీసుల దర్యాప్తులో నిగ్గు తేలుతుంది. అంతిమంగా న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వాలి. అంతేగానీ ఇంకా దర్యాప్తులో ఉన్న కేసులోని అభియోగాలు తప్పని చెబుతూ నిందితులు పోలీసులపైనే ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేయడం నిబంధనలకు విరుద్ధం. అదే విధానంగా మారితే దేశంలో ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు చేస్తున్న అన్ని క్రిమినల్ కేసుల్లోనూ నిందితులు తిరిగి పోలీసులపై ఫిర్యాదు చేసి అక్రమ కేసులు పెట్టేందుకు అనుమతించినట్టే అవుతుంది.

తప్పు చేయలేదు... జత్వానీ ఎవరో తెలియదు

తనపై నమోదు చేసిన అక్రమ కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు న్యాయస్థానంలో స్వయంగా వాదనలు వినిపించారు. కాదంబరి జత్వానీపై గతంలో విజయవాడ పోలీసులు నమోదు చేసిన కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని విస్పష్టంగా ప్రకటించారు. సివిల్ పోలీసులు పర్యవేక్షించే క్రిమినల్ కేసులు, ఇతర దర్యాప్తులతో ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్న తనకు ఎలాంటి సంబంధం ఉండదని పోలీసు సర్వీసు నియమావళిని ఉటంకిస్తూ వివరించారు. జత్వానీ తనపై చేసిన ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవాలన్నారు. అందుకే తాను కనీసం ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేయలేదని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. తనపై అబద్ధపు అభియోగాలతోనే పోలీసులు, సీఐడీ అధికారులు అక్రమ కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసులో మరో నిందితుడు ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ న్యాయమూర్తి ఎదుట వాంగ్మూలం ఇవ్వలేదనే విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. పోలీసుల ఒత్తిడితో ఆయన నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకోకూడదని కోరారు. తాను సదా అందుబాటులో ఉన్నానని... దర్యాప్తునకు పూర్తిగా సహకరించేందుకు సిద్ధమని చెప్పినా సరే సీఐడీ అధికారులు తనను అక్రమంగా అరెస్టు చేశారన్నారు.

అబద్ధపు వాంగ్మూలం కోసం పీఎస్ఆర్‌పై ఒత్తిడి

ఈ కేసులో అబద్ధపు వాంగ్మూలాల కోసం సీఐడీ అధికారులు సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులపై ఒత్తిడి తేవడం గమనార్హం. ఆయన్ని హైదరాబాద్‌లో అరెస్టు చేసే సమయంలో తన వద్ద ఉన్న ఒకే ఒక్క ఫోన్‌ను సీఐడీ అధికారులకు అప్పగించారు. అదే విషయాన్ని అధికారులకు చెప్పడంతో వారు సమ్మతించారు. కానీ పీఎస్ఆర్‌ను విజయవాడకు తీసుకువచ్చిన తరువాత సీఐడీ అధికారులు మధ్యవర్తుల నివేదిక పేరుతో ఓ పత్రాన్ని తెచ్చి సంతకం చేయాలని పేర్కొన్నారు. అందులో ఆయన వద్ద ల్యాప్‌టాప్, ఐప్యాడ్, మరో సెల్ ఫోన్ ఉన్నాయని అంగీకరించినట్లుగా పొందుపరిచారు. దీనిపై పీఎస్ఆర్ ఆంజనేయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తన వద్ద లేని ఎల్రక్టానిక్ పరికరాలు ఉన్నట్టుగా రాసేందుకు నిరాకరించారు. హైదరాబాద్‌లో తన ఇంటి వద్దే అన్ని విషయాలు చెప్పానని, ఇప్పుడు ఇలా అబద్ధపు వాంగ్మూలం రాయమని చెప్పడం ఏమిటని నిలదీశారు. తమపై ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిడి ఉందని సీఐడీ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేయడం గమనార్హం. ఇదే విషయాన్ని పీఎస్ఆర్ న్యాయస్థానం దృష్టికి తెచ్చారు.

సాక్ష్యాధారాల చట్టం వక్రీకరణ...

పోలీసులే తన చేతిలో ఫోర్జరీ పత్రాలు పెట్టి వెంటనే స్వాధీనం చేసుకున్నారని కాదంబరి జత్వానీ తన ఫిర్యాదులో పేర్కొనడం మరో అబద్ధపు అభియోగం. విచారణ జరుగుతున్న కేసులో భారత సాక్ష్యాధారాల చట్టాన్ని వక్రీకరించేందుకు తెగించడం గమనార్హం. డ్రగ్స్, గంజాయి, ఇతర స్మగ్లింగ్ నిరోధక కేసుల్లో దేశవ్యాప్తంగా పోలీసులు, కస్టమ్స్ అధికారులు అనుసరించే విధానాన్నే నాడు విజయవాడ పోలీసులు పాటించారు. ఆమె నివాసంలో సోదాలు నిర్వహించగా ఫోర్జరీ పత్రాలు లభించాయి. పోలీసులే తన చేతిలో ఫోర్జరీ పత్రాలు పెట్టారని ఆమె ప్రస్తుతం తప్పుడు అభియోగాలు మోపడం వెనుక కూటమి ప్రభుత్వ పెద్దల పన్నాగం ఉంది.

టిఫిన్ కూడా పెట్టకుండా..

సీఐడీ అధికారులు సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు పట్ల మానవత్వం లేకుండా, అగౌరవంగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. ఆయన్ని బుధవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చిన అనంతరం న్యాయస్థానానికి తరలించారు. ఆయనకు కనీసం టిఫిన్ కూడా పెట్టలేదు. అనంతరం మధ్యాహ్నం రిమాండ్ కోసం విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. పీఎస్ఆర్‌పై మరిన్ని అక్రమ కేసులు నమోదు చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

- ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు గతంలో ఇచ్చిన అబద్ధపు ఫిర్యాదులో పీఎస్ఆర్ ఆంజనేయులును ఇరికించేందుకు కుట్ర పన్నుతున్నారు. తనను సీఐడీ అధికారులు హింసించారని రఘురామ గతంలో ఫిర్యాదు చేశారు. సుప్రీంకోర్టు దీన్ని తోసిపుచ్చినప్పటికీ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ కేసు నమోదు చేసింది. ఈ కేసులో అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్‌కుమార్‌తోపాటు ఇతర అధికారులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. ఈ కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులును కూడా చేరుస్తూ న్యాయస్థానంలో సీడీఐ బుధవారం మెమో దాఖలు చేయడం గమనార్హం. అసలు ఆయనకు సీఐడీతో ఎలాంటి సంబంధం లేదు. ఆ సమయంలో ఆయన ఇంటెలిజెన్స్ చీఫ్‌గా కూడా లేరు. ఏసీబీ డీజీగా ఉన్నారు. అయినా సరే పీఎస్ఆర్‌ను ఆ కేసులో నిందితుడుగా చేర్చడం విస్మయం కలిగిస్తోంది.
- పీఎస్ఆర్ ఆంజనేయులు గతంలో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ సమయంలో కొన్ని ఫైళ్లు కనపడకుండా పోయాయంటూ దాదాపు నాలుగేళ్ల తరువాత ఏపీపీఎస్సీ కార్యదర్శితో తాజాగా ఫిర్యాదు ఇప్పించడం కూటమి సర్కారు కుట్రలకు నిదర్శనం.
- గతంలో పీఎస్ఆర్ ఆంజనేయులు తనను బెదిరించారంటూ ఉద్యోగ సంఘం నేత సూర్యనారాయణతో టీడీపీ ప్రభుత్వం ఇటీవల అబద్ధాలతో ఫిర్యాదు ఇప్పించింది. ఆ ఫిర్యాదును సీఐడీకి తాజాగా పంపించడం ప్రభుత్వ కుటిల పన్నాగానికి నిదర్శనం.

'పది'పోయిన ఫలితాలు

పదో తరగతి ఫలితాల్లో స్పష్టంగా కనిపించిన ప్రభుత్వ తీరు

సాక్షి, అమరావతి: విద్యా సంవత్సరం మధ్యలో ప్రారంభించిన ఉపాధ్యాయుల సర్దుబాటు సెప్టెంబరు వరకు సాగదీత.. అప్పర్ ప్రైమరీ (యూపీ) పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల తొలగింపు.. ఇలా పాఠశాల విద్యలో కూటమి ప్రభుత్వం చేసిన ప్రయోగాలు బెడిసికొట్టాయి. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఫలితాలు దిగజారాయి. గత ఏడాది కంటే ఉత్తీర్ణత 5.55 శాతం తగ్గింది. పదో తరగతి ఫలితాలను బుధవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో విడుదల చేశారు.

- ఈ ఏడాది పరీక్షలకు 6,19,286 మంది రిజిస్టర్ చేసుకోగా, 6,14,459 మంది హాజరయ్యారు. వీరిలో 4,98,585 మంది (81.14 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పాసైన వారిలో బాలికలు 2,53,278 మంది (84.09 శాతం), బాలురు 2,45,307 మంది (78.31 శాతం) ఉన్నారు.
- ఈ ఏడాది పరీక్షలు ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియంలోనూ రాసేందుకు అవకాశం కల్పించారు.
- ఇంగ్లిష్ మీడియంలో రాసిన 5,60,864 మందిలో 4,66,586 మంది (83.19 శాతం), తెలుగు మీడియంలో 49,519 మందికి గాను 29,012 మంది (58.59 శాతం) ఉత్తీర్ణులయ్యారు.
- మొత్తం విద్యార్థుల్లో 65.36 శాతం ప్రథమ, 10.69 శాతం ద్వితీయ, 5.09 శాతం మంది విద్యార్థులు తృతీయ శ్రేణి సాధించారు.

టాప్‌లో మన్యం.. చివరిలో అల్లూరి జిల్లాలు

పదో తరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా 93.90 శాతంతో టాప్‌లో నిలిచింది. వరుసగా మూడో ఏడాది ఈ ఘనతను అందుకుంది.

- 47.64 శాతం ఉత్తీర్ణతతో అల్లూరు సీతారామ రాజు జిల్లా చివరి స్థానంలో ఉంది.
- మొత్తం 11,819 ఉన్నత పాఠశాలల (4,879 ప్రైవేటు, మిగిలినవి ప్రభుత్వ యాజమాన్యం లోనివి) నుంచి విద్యార్థులు పరీక్షలు రాశారు. 1680 పాఠశాలలు 100 శాతం ఫలితాలను సాధించాయి. 19 'సున్నా' ఫలితాలను నమోదు చేశాయి.

నేటి నుంచి రీ కౌంటింగ్‌కు అవకాశం

పరీక్షలు తప్పిన, మార్కులు తక్కువగా వచ్చిన విద్యార్థులు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు విద్యా శాఖ అవకాశం కల్పించింది. పాఠశాల విద్యా శాఖ వెబ్‌సైట్‌లో వారివారి స్కూల్ లాగిన్‌లో గురువారం నుంచి మే 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.

మే 19 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

పదో తరగతి పరీక్షల్లో విఫలమైన విద్యార్థుల కోసం పాఠశాల విద్యా శాఖ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు షెడ్యూల్ ప్రకటించింది. మే 19 నుంచి 28వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా శాఖ పేర్కొంది. త్వరలోనే టైమ్ టేబుల్ విడుదల చేయనున్నట్టు పేర్కొంది. విద్యార్థులు గురువారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని, ఆలస్య రుసుముతో జూన్ 18 వరకు గడువు ఇచ్చింది.

కనిపించని మెరుపులు

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో విజయవంతమైన విద్యా సంస్కరణలతో మెరుగైన ఫలితాలను సాధించింది. రెండేళ్ల పాటు కోవిడ్–19తో సరిగా తరగతులు జరగక, పరీక్షలు నిర్వహించకపోయినా, 2022–23 విద్యా సంవత్సరంలో 933 స్కూళ్లు పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి.

- 2023–24 విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన వాటి సంఖ్య 2,803కు పెరగడంతో పాటు జీరో ఫలితాలు సాధించినవి 17కి తగ్గాయి.
- తాజాగా 2024–25 విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన స్కూళ్లు 1,680కి తగ్గిపోగా, జీరో ఫలితాల స్కూళ్ల సంఖ్య 19కి పెరిగింది.

ఓపెన్ పది, ఇంటర్ ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలను కూడా మంత్రి లోకేశ్ బుధవారం విడుదల చేశారు. 26,679 మంది పదో తరగతి పరీక్షలు రాయగా, 10,119 మంది (37.93 శాతం) ఉత్తీర్ణులవగా, ఇంటర్మీడియట్‌లో 63,668 మందికి గాను 33,819 మంది (53.12 శాతం) విజయం సాధించారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 26 నుంచి మే 5 వరకు ఏపీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ నరసింహారావు తెలిపారు. ప్రతి సబ్జెక్టు రీకౌంటింగ్‌కు రూ.200, రీ వెరిఫికేషన్ కు రూ.రూ.1000 ఫీజుగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పది, ఇంటర్ మే–2025 పరీక్షలు రెగ్యులర్ పదో తరగతి పరీక్షలతో కలిపి నిర్వహించనున్నట్టు తెలిపారు.

పీఎస్ఆర్‌కు 7 వరకు రిమాండ్

- విజయవాడ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు
- తనకు సంబంధం లేని కేసులో దురుద్దేశపూర్వకంగా అరెస్ట్ చేశారన్న పీఎస్ఆర్



సాక్షి ప్రతినిధి, విజయవాడ: సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు విజయవాడ మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. గతేడాది ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో మెమో ఆధారంగా ఆయన్ను ఈ నెల మంగళ వారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న సీఐడీ పోలీసులు అదే రోజు మధ్యాహ్నం విజయవాడ తరలించి కానూరులోని రీజినల్ కార్యాలయంలో విచారించారు. బుధవారం ఉదయం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయస్థానంలో హాజరుపర్చారు. 16 పేజీల రిమాండ్ రిపోర్టును సీఐడీ పోలీసులు న్యాయస్థానానికి సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆయనకు మే 7వతేదీ వరకు రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. కనీసం మెమో ఇవ్వకుండా అరెస్ట్ చేశారని న్యాయమూర్తికి పీఎస్ఆర్ నివేదించారు. ఈ ఫిర్యాదులో తన పేరు లేదని, ఎఫ్ఐఆర్‌లో నిందితుడుగా గానీ, సాక్షిగా గానీ తన పేరు లేదని, తాను ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పని చేశానని, ఈ కేసు విచారణ అధికారిగా కానీ, సూపర్‌వైజింగ్ అధికారిగా కానీ, కనీసం ఉన్నతాధికారిగా కానీ లేనని, తనకు ఎలాంటి సంబంధం లేని కేసులో దురుద్దేశ పూర్వకంగానే అరెస్ట్ చేశారని పీఎస్ఆర్ పేర్కొన్నారు. సెప్టెంబర్ నెలలో ఫిర్యాదు చేసిన జత్వానీ ఎవరో తనకు అప్పటి వరకు తెలియదన్నారు. ఏ తప్పూ చేయలేదు కాబట్టే ఇప్పటి వరకు ముందస్తు బెయిల్‌కు ప్రయత్నించలేదని తెలిపారు.

రూ. 500 కోట్ల 'పల్లె' నిధులు.. 'డైవర్షన్'!

- రెండేళ్లుగా పెద్దగా వినియోగించని గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ డబ్బు గోల్‌మాల్
- గ్రామీణ, స్థానిక సంస్థల ప్రతినిధులు, అధికారుల్లో తీవ్ర చర్చ

సాక్షి, అమరావతి: సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సీఎఫ్ఎంఎస్) పోర్టల్‌కు సంబంధించి గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లు అంతగా వినియోగించని ఖాతాల్లో గత రెండేళ్లుగా ఉన్న దాదాపు రూ. 500 కోట్ల ఆర్థిక సంఘం నిధులు ఇప్పుడు హఠాత్తుగా మాయం అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీలతో అనుసంధానమైన పోర్టల్‌లో గత 25 రోజులుగా ఈ నిధులు కనిపించడం లేదు. పంచాయతీ రాజ్ వ్యవస్థ పటిష్టతకు గురువారం (ప్రతి ఏడాది ఏప్రిల్ 24) దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నేపథ్యంలో ఈ పరిణామంపై గ్రామీణ, స్థానిక సంస్థల అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వరకూ తీవ్ర చర్చ సాగుతోంది. కాగా, ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వేరే అవసరాలకు మళ్లించి ఉండొచ్చని సంబంధిత అధికారులు అంటున్నారు.

సత్తా చా'టెన్'

- గరివిడి విద్యార్థిని అనీషాకు 599 మార్కులు
- రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం



చీపురుపల్లి రూరల్ (గరివిడి): విజయనగరం జిల్లా గరివిడి పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థిని యండా అనీషా 599 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆమె యలమంచిలిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. బాలిక తండ్రి విజయ్ కుమార్ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. తల్లి శ్రీలక్ష్మి యలమంచిలిలో ప్రభుత్వ టీచర్. అనీషా సైన్సు సబ్జెక్టులో మాత్రమే 100 మార్కులకు 99 మార్కులు పొందగా, మిగిలిన అన్ని సబ్జెక్టుల్లోనూ నూటికి నూరు మార్కులు సాధించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ టాపర్

598 మార్కులు సాధించిన ఒప్పిచర్ల విద్యార్థిని పావని



కారెంపూడి: పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని అంగడి పావని చంద్రిక పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు 598 మార్కులు సాధించింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ ఫస్టు ర్యాంకు సాధించింది. ఈమెకు హిందీ, ఇంగ్లిషుల్లో మాత్రమే ఒక్కో మార్కు తగ్గింది మిగిలిన అన్ని సబ్జెక్టుల్లోనూ నూటికి నూరు మార్కులు వచ్చాయి. పావని తండ్రి సాంబశివరావు వినుకొండ మున్సిపాలిటీలో అటెండర్. తల్లి సంధ్య పిడుగురాళ్ల కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో వాచ్ ఉమెన్‌గా పని చేస్తున్నారు. వీరి స్వగ్రామం పిడుగురాళ్ల. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అక్కడ ఇంటిని అమ్మేశారు. అప్పటి నుంచి పావని చంద్రిక ఒప్పిచర్లలో ఉన్న అమ్మమ్మ సామ్రాజ్యం సంరక్షణలో ఉంటూ ఇంటికి దగ్గర్లోని జెడ్పీ హైస్కూల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివింది.

రూపంలోనే కాదు మార్కులూ సేమ్ టూ సేమ్

538 మార్కులు తెచ్చుకున్న కాజులూరు కవలలు



కాజులూరు: రూపంలోనే కాదు మార్కులలోనూ సేమ్ టూ సేమ్ అనిపించుకున్నారు ఆ కవలలు. కాకినాడ జిల్లా కాజులూరుకు చెందిన యాళ్ళ వీరసత్య పాల్గుణరావు, సుబ్బలక్ష్మి దంపతులకు రేణుక, రేష్మ సంతానం. వీరిద్దరూ కవలలు. చిన్నప్పటి నుంచి ఏ విషయంలోనూ తగాదాలు పడకుండా చదువులోనూ ఆటపాటల్లోనూ పోటీ పడుతూ ఐక్యతతో ముందుకు వెళ్లేవారు. ఇద్దరూ ఈ ఏడాది కాజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి పరీక్ష రాశారు. మంగళవారం విడుదలైన ఫలితాలలో ఇద్దరికీ ఒకే విధంగా 538/600 మార్కులు వచ్చాయి. దేవుడు ఇద్దరినీ ఒకే రోజు పుట్టించి ఒకే రూపం ఇస్తే వీరిద్దరూ పరీక్షలలో ఒకే విధంగా మార్కులు తెచ్చుకోవటంతో స్థానికులు ఆశ్చర్య చకితులవుతున్నారు.

తండ్రీతనయల ఉత్తీర్ణత





రొంపిచెర్ల/గాలివీడు: తండ్రీతనయలు ఒకే సారి పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అరుదైన ఘటనలు రెండుచోట్ల జరిగాయి. చదువుకు వయసుతో పనిలేదని చాటాయి. చిత్తూరు జిల్లా రొంపిచెర్ల పాళ్యంవీధికి చెందిన 45ఏళ్ల బి.షబీర్ ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్ష రాశారు. 500 మార్కులకు 319 మార్కులు సాధించి ఉత్తర్ణత అయ్యారు. ఆయన కుమార్తె బి.సమీనా రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో పదో తగరతి పరీక్షలు రాసి 309 మార్కులు సాధించింది. షబీర్ 1995–96 సంవత్సరంలో పదో తరగతి ఫెయిల్ అయ్యారు. రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు విరిగింది. దీంతో వికలాంగులయ్యారు. పదో తరగతి పాస్ అయితే వికలాంగుల కోటాలో ఉద్యోగం సాధించవచ్చునని కుమార్తెతో కలిసి పదో తరగతి పరీక్ష రాశారు. పరీక్షల్లో తండ్రి షబీర్, కుమార్తె సమీనా ఇద్దరూ ఉత్తర్ణీత సాధించారు.





- అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గోరాన్ చెరువు గ్రామం ఆవుల శెట్టివారి పల్లెకు చెందిన తండ్రి మోడెం వెంకటేష్ ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాసి 268 మార్కులతో ఉత్తీర్ణులు కాగా, ఆయన కుమార్తె మోడెం పూజిత తిరుపతి నారాయణ విద్యాసంస్థల్లో చదువుతూ 585 మార్కులు సాధించింది. మండల స్థాయి టాపర్‌గా కూడా నిలిచింది. ఈసందర్భంగా మోడెం వెంకటేష్ మాట్లాడుతూ చదువుకు వయస్సుతో సంబంధం లేదని, కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలియజేసేందుకు పరీక్షలు రాశానని వెంకటేశ్ చెప్పారు.

క్లుప్తంగా...

7వరకు వంశీ రిమాండ్ పొడిగింపు

విజయవాడ లీగల్: గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడిచేశారనే అభియోగంపై జిల్లా జైలులో ఉన్న వల్లభనేని వంశీతోపాటు సహ నిందితుల రిమాండ్ ముగియడంతో బుధవారం పోలీసులు వారిని సీఐడీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. వచ్చేనెల 7వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. అనంతరం పోలీసులు వారిని జిల్లా జైలుకు తరలించారు. ఇదే కేసులో నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా వున్న మరికొంతమంది నిందితులను వర్చువల్ విధానంలో కోర్టులో పోలీసులు హాజరుపరిచారు.

జనసేన పార్టీ మూడు రోజుల సంతాప దినాలు

సాక్షి, అమరావతి: జమ్మూ కశ్మీర్ లో జరిగిన ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ, ఘటనలో మృతి చెందిన వారికి నివాళిగా జనసేన పార్టీ మూడురోజుల పాటు సంతాపదినాలు పాటిస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జెండాను అవనతం చేసినట్లు ఎమ్మెల్సీ, పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం పతాకాన్ని సగం వరకూ దించారు. అలాగే సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద కార్యకర్తల ప్రదర్శన నిర్వహించారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ బీజేపీ కార్యకర్తల ర్యాలీ

సాక్షి, అమరావతి: కశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రంలో పలుచోట్ల కార్యకర్తల ర్యాలీలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం ఉదయం అందుబాటులో ఉన్న పార్టీ నాయకులతో కాన్ఫరెన్స్ నిర్వహించి, ర్యాలీ కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

జొన్నల కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి

సాక్షి, అమరావతి: మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధరకు జొన్నల కొనుగోలుకు ఎట్టకేలకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మొత్తం దిగుబడిలో 25 శాతం (69, 270 టన్నులు) మాత్రమే కనీస మద్దతు ధరపై కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ధరల స్థిరీకరణ నిధి నుంచి రూ.280 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో కనీసం 10 శాతం కొనుగోళ్లకు అవసరమైన రుణపరపతి కోసం రూ.40 కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హరిప్రసాద్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నమయ్య జిల్లాకు చెందిన వి.హరిప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

డైట్ కాలేజీల్లో డిప్యుటేషన్లు రద్దు

సాక్షి, అమరావతి: ఫారన్ సర్వీసెస్ కింద 2024-25 విద్యా సంవత్సరంలో డైట్ లెక్చరర్లుగా నియమితులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను రద్దుచేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామ రాజు బుధవారం ఆదేశాలు జారీచేశారు. డిప్యుటేషన్ కాలపరిమితి ముగిస్తున్నందున ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి కొత్తవారిని ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను రిలీవ్ చేయాలని డీఈవోలు, డైట్ ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. ఓడీ ప్రాతిపదికన స్టేట్ అసెస్‌మెంట్ సెల్‌లో పనిచేస్తున్న సిబ్బంది డిప్యుటేషన్లను సైతం రద్దుచేస్తున్నట్టు తెలిపారు.

'సిపెట్' డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: పదో తరగతి అర్హతతో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్)-విజయవాడలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్టు సిపెట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కాల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ) కోర్సులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందన్నారు. జూన్ 8న జరిగే సిపెట్ అడ్మిషన్ టెస్ట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. కోర్సుల్లో చేరేందుకు https://cipet25.onlineregistration form.org/CIPET/ లింకు ద్వారా మే 29 లోపు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు 7893586494 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



ఒకసారి ఏడాది ప్లానింగ్ పూర్తయ్యాక ఆ పనులకే పరిమితం
ఇస్రో - నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో యాప్ అనుసంధానం
ఎక్కడ ఏ పనులు చేపట్టవచ్చో దీని ద్వారా గుర్తింపు
ఈ ఏడాది మండలానికి ఒక గ్రామ పంచాయతీలో అమలు
వచ్చే ఏడాది అన్ని గ్రామాల్లో అమలు!

'ఉపాధి'లో రాష్ట్రాలకు చక్రబంధనాలు

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రాలపై కేంద్రం నియంత్రణను మరింత పెంచింది. రాష్ట్రాల్లో పథకం అమలులో దుర్వినియోగానికి తావులేకుండా పలు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తాజాగా పథకం పనుల ప్లానింగ్, మంజూరులో సైతం మార్పులు తెచ్చింది. ఇందుకోసం 'యుక్తధార' పేరుతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌ను ఇస్రో - నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో అనుసంధానం చేసింది. తద్వారా ఈ పనులను తన నియంత్రణలోకి తీసుకుంటోంది. ఈ విధానం వల్ల ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు చాలా వరకు తగ్గిపోతాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. చాలా కాలం నుంచి ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలను కేంద్రమే నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోంది. ఇటీవల మెటీరియల్ కేటగిరీ (సిమెంట్ రోడ్లు లేదా ఇతర కూలీలను ఉపయోగించని) పనుల బిల్లులనూ నేరుగా కేంద్రమే ఆ వ్యక్తులకు, సంస్థలకు చెల్లిస్తోంది. ఇందులో రాష్ట్రాలు వాటి వాటా 25 శాతం నిధులను ఉమ్మడి ఖాతాకు జమ చేస్తేనే కేంద్రం 75 శాతం వాటా కలిపి బిల్లులు చెల్లిస్తోంది. ఇప్పుడు ఈ పథకం పనుల ప్రణాళిక, అమలును కూడా కేంద్రమే ప్రత్యక్షంగా పర్యవేక్షించనుంది.

ఇస్రో - నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో యాప్ అనుసంధానం

ప్రస్తుతం ఈ పథకం పనుల ప్రణాళిక ఆఫ్ లైన్ విధానంలో రూపొందించి, ఎంత మంది పేదలకు పనులు కల్పిస్తారో సంఖ్య మాత్రమే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ పథకం పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఆ పనుల నంబర్లను పోర్టల్‌లో ఎంటర్ చేసి, వాటికి బిల్లులు పెడుతున్నారు. కొత్త విధానంలో మొబైల్ యాప్ ద్వారా ప్రణాళిక పూర్తిగా ఆన్‌లైన్‌లో రూపొందుతుంది. ఏ పంచాయతీలో ఏ రకమైన పనిని ఏ ప్రదేశంలో చేపడతారో గూగుల్ మ్యాప్‌లో గుర్తించి, యాప్‌లో నమోదు చేస్తారు. ఈ యాప్ పూర్తిగా ఇస్రో - నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఇలా అన్ని పనులు జియో ట్యాగింగ్ చేసి, మ్యాప్‌లోనే ఒక్కో పనికి ఒక్కో నంబరును కేటాయిస్తారు. ప్రతి పనికి అంచనా విలువ సైతం యాప్‌లోనే నమోదు చేస్తారు. ఏ పనికి బిల్లులు పెట్టాలన్నా యాప్‌లో నమోదు చేసిన ప్రకారం వర్క్ ఐడీలను ఎంపిక చేసుకొని బిల్లులు పెట్టాలి.

పనుల గుర్తింపు కూడా సాంకేతికతోనే..

ఈ పథకంలో అవకతవకలకు సైతం వీలుండదని అధికారులు చెబుతున్నారు. ఒక ప్రాంతంలో చేపట్టడానికి అవకాశం లేని పనులను ప్రణాళికలో చేర్చే అవకాశం 'యుక్తధార' యాప్‌లో ఉండదని చెబుతున్నారు. యాప్ పూర్తిగా ఇస్రో ఆధ్వర్యంలో సమగ్ర గూగుల్ మ్యాప్‌నకు అనుసంధానమై ఉండటం వల్ల చెరువులు ఉన్న ప్రాంతంలోనే వాటి పూడిక తీత పనులు చేపట్టే వీలుంటుందని తెలిపారు. కొన్ని రకాల పనులకు ఆ ప్రాంత భూగర్భ పరిస్థితులు అనుకూలమా లేదా అన్నది కూడా పని నిర్ధారణ సమయంలోనే తెలిసిపోతుందని వివరించారు. తద్వారా పనుల గుర్తింపులో అక్రమాలకు తెరపడుతుందని చెబుతున్నారు.

వచ్చే ఏడాది నుంచి అన్ని గ్రామాల్లో అమలు..

ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం.. ఏటా పంచాయతీల వారీగా ఉపాధి హామీ పథకం పనుల కల్పన, ప్రణాళికల రూపకల్పన ఆర్థిక సంవత్సరం ఆరంభానికి ముందే అక్టోబరు-ఫిబ్రవరి నెలల మధ్య రాష్ట్ర స్థాయిలో జరుగుతుండేది. ఈ ప్రణాళికలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మార్చి నెలలో రాష్ట్రాలవారీగా సమావేశాలు నిర్వహించి వాటికి లేబర్ బడ్జెట్ పేరుతో ఆమోదం తెలిపేది. కొత్తగా గుర్తించిన పనులను గ్రామ పంచాయతీ లేదా మండల, జిల్లా పరిషత్‌లో తీర్మానం అనంతరం మంజూరు చేసేవారు. కేంద్రం తెచ్చిన కొత్త విధానం ప్రకారం ఇకపై ఆర్థిక సంవత్సరం మొత్తానికి కేంద్రం ఒకేసారి ఆ రాష్ట్రంలో గ్రామ పంచాయతీల వారీగా లేబర్ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. ఏడాది మధ్యలో పనులు మంజూరు కావు. ఇలా ఏడాది ప్రణాళిక రూపకల్పనకు 'యుక్తధార' మొబైల్ యాప్ ప్రవేశపెట్టింది. ఈ ఏప్రిల్ 1 నుంచి మండలానికి ఒక గ్రామ పంచాయతీ చొప్పున ఈ విధానం అమలు చేస్తుండగా, వచ్చే ఏడాది నుంచి అన్ని గ్రామాల్లో అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

దొంగ మస్టర్లకూ చెక్!

ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్లకూ కేంద్రం చెక్ పెట్టబోతోంది. దీని ప్రకారం ఒక ప్రదేశంలో కూలీలు పనిచేసే సమయంలో రోజూ ఉపాధి హామీ పథకం సిబ్బంది ఫొటో తీయాలి. ఆ ఫొటోలో ఉన్న కూలీల సంఖ్య, అక్కడ పనికి హాజరైనట్టు సిబ్బంది మస్టర్ షీట్‌లో నమోదు చేసే కూలీల సంఖ్య ఒక్కటిగా ఉంటేనే ఆ రోజు వేతనాల చెల్లింపు జరుగుతుంది. ఫొటోలో, మస్టర్ షీట్‌లో సంఖ్యలో తేడా ఉంటే ఆ మస్టర్ షీటును పరిగణనలోకి కూడా తీసుకోరు.

స్కీముల్లేవు అన్నీ స్కాములే

- ఉర్సాకు భూములను ఎలా ధారాదత్తం చేస్తారు
- కూటమి సర్కారుపై మాజీ ఎంపీ భరత్‌రామ్ ధ్వజం



రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వంలో స్కీములు అమలు చేయడం లేదు కానీ స్కాములు చేస్తున్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. బుధవారం రాజమహేంద్రవరం సిటీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం నడిబొడ్డున భూములు ఎకరం 50 కోట్లు విలువ చేస్తుంటే ఉర్సా వంటి ఊరూపేరూలేని కంపెనీలకు వాటిని కట్టబెట్టడం దారుణమన్నారు. ఒకపక్క రాష్ట్రంలో అప్పుల మీద అప్పులు చేస్తూ, మరోపక్క విలువైన భూములను కారుచౌకగా ఇచ్చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. దీనిలో భాగంగానే నీతి, నిజాయితీకి మారుపేరైన ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేసిందని ఆరోపించారు. ఉర్సాకు కట్టబెట్టిన భూముల స్కామ్ నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికే పీఎస్ఆర్ ఆంజనేయులును ప్రభుత్వం అరెస్టు చేసిందని భరత్ విమర్శించారు.

దేశ సుస్థిరత, సమగ్రత దెబ్బతీస్తే మనమంతా ఒక్కటై పోరాడదాం

- ప్రజలే పోలీసులుగా మారాలి
- ఉగ్రదాడిలో రాష్ట్రానికి చెందిన ఇద్దర్ని కోల్పోవడం బాధాకరం
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- విశాఖ ఎయిర్‌పోర్టులో చంద్రమౌళి భౌతిక కాయానికి నివాళులు


చంద్రమౌళి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం/గోపాలపట్నం: దేశ సుస్థిరత, సమగ్రత దెబ్బతీసేందుకు ఎవరు ప్రయత్నించినా.. భారతీయులంతా ఏకమై దీటుగా ఎదుర్కొందామని సీఎం చంద్రబాబు అన్నారు. జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో విశాఖకు చెందిన చంద్రమౌళి, కావలిలో మధుసూదన్‌ని కోల్పోవడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. చంద్రమౌళి మృతదేహం విశాఖ ఎయిర్‌పోర్టుకు బుధవారం రాత్రి 8 గంటలకు చేరుకోగా.. విమానాశ్రయంలోని శ్రద్ధాంజలి ఘాట్‌లో ఉంచారు. రాత్రి 8.34 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎం చంద్రబాబు.. చంద్రమౌళి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. జరిగిన ఘటన గురించి చంద్రమౌళి సతీమణి నాగమణి, కుటుంబసభ్యుల్ని అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ భారతీయుల ప్రాణాల్ని బలిగొన్న తీవ్రవాద ఘటనని దేశంలోని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ప్రతి భారతీయుడు ఒక ఇంటెలిజెన్స్ అధికారిగా, ఒక పోలీస్‌గా వ్యవహరించి.. ఎవరిమీదైనా అనుమానం వస్తే.. వెంటనే భద్రతా వ్యవస్థకు సమాచారం అందిస్తే.. ఈ తరహా దుర్ఘటనలు పునరావృతం కావని అభిప్రాయపడ్డారు.

తిరుమల భద్రతా లోపాలపై కేంద్రం ఆగ్రహం

ఎంపీ గురుమూర్తి ఫిర్యాదుతో స్పందించిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ



తిరుపతి మంగళం: తిరుమలలో భద్రతా లోపాలపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుమలలో జరుగుతున్న వరుస ఘటనలపై తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఇటీవల ఫిర్యాదు చేయడంతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన తిరుమలలో భద్రత చాలా కీలకమని, అలాంటి చోట వరుసగా పునరావృతమవుతున్న భద్రతా లోపాలు ఆందోళన కలిగిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఎంపీ గురుమూర్తి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ లేఖలో భక్తుల రక్షణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను మెరుగుపర్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, కానీ రెడ్ బుక్ రాజ్యాంగంపై దృష్టి సారించిన ప్రభుత్వం పాలనపై పట్టు కోల్పోయిందని గురుమూర్తి పేర్కొన్నారు. తిరుమలలో భద్రతా లోపాలు భక్తుల జీవితాలను ప్రమాదంలో పడేయడంతో పాటు, వేంకటేశ్వర స్వామి ఆలయ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీశాయని వివరించారు. భద్రతా చర్యలను సమర్థంగా అమలు చేయడంలో ప్రస్తుత టీటీడీ పాలక మండలి పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సెక్రటరీ మృత్యుంజయ్ త్రిపాఠి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీకి ఈనెల 17న లేఖ రాశారు. ఈ అంశంపై నిశితంగా పరిశీలించి సమాధానం పంపాలని ఆదేశించారు.

ఉగ్ర దాడిని ఖండించిన ఎంపీ గురుమూర్తి

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. అమాయక పర్యాటకులపై జరిగిన ఈ కిరాతక దాడిని ముష్కర మూకల పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పింఛన్!

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమకు పింఛన్, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఇవ్వాలని కొందరు విద్యుత్ ఉద్యోగులు మంత్రులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. న్యాయం చేస్తానన్న చంద్రబాబు, ఏళ్లు గడిచిపోతున్నా ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 2004 సెప్టెంబర్ 1న ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్, 1980ని సవరించి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను అమలులోకి తెచ్చారు. కానీ సీపీఎస్ అమలులోకి వచ్చిన 2004 నుంచి కాకుండా, 1999 ఫిబ్రవరి 1 నుంచి పాత పెన్షన్ స్కీమ్‌ను ఎత్తివేసి ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) స్కీమ్‌ను విద్యుత్ సంస్థల్లో అమలు చేస్తున్నారు. దీనివల్ల 1999 నుంచి 2004 మధ్య నియమితులైన సుమారు 5,311 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు నష్టపోతున్నారు.

ఒక్క మరుగుదొడ్డీ లేదా?

- ప్రభుత్వ కార్యాలయంలో కనీస సదుపాయాలు లేకపోవడమేంటి?
- సమస్యను పరిష్కరించకుంటే సీఎస్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిస్తాం
- సమాచార కమిషన్‌లో సదుపాయాలపై ధర్మాసనం స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో సామాన్యుల కోసం ఒక్క మరుగుదొడ్డి కూడా లేకపోవడం పట్ల హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఇది తమను తీవ్ర ఆశ్చర్యానికి గురి చేస్తోందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ కార్యాలయంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడం ఏమిటని ప్రశ్నించింది. మరుగుదొడ్డి కూడా లేకపోతే సమాచార కమిషన్ కార్యాలయానికి వచ్చే సామాన్యులు, ముఖ్యంగా మహిళల పరిస్థితి ఏమిటని నిలదీసింది. మౌలిక సదుపాయాల కల్పనను ప్రభుత్వం విస్మరించిందా? అంటూ సందేహం వ్యక్తం చేసింది. మరుగుదొడ్డి లేకుంటే సమాచార కమిషన్‌ను మరో చోటుకి తరలించాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ని ఆదేశించింది. లేకుంటే వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిస్తామని తేల్చి చెప్పింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో కనీస మౌలిక సదుపాయాలు ముఖ్యంగా మరుగుదొడ్డి సౌకర్యం కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లాకు చెందిన బి.కాంత్రికుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఉప్పలూరి అభినవ్ కృష్ణ వాదనలు వినిపిస్తూ, సమాచార కమిషన్ సామాన్యుల కోసం ఒక్క మరుగుదొడ్డి కూడా లేదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతి వాదనలు వినిపిస్తూ, భవన యజమానితో వివాదం కొనసాగుతోందన్నారు. కొంత సమయం ఇస్తే పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతానని ఆమె తెలిపారు.

మంత్రి నారా లోకేశ్ బినామీలదే 'ఉర్సా'

డొల్ల కంపెనీలకు విలువైన భూములను ధారాదత్తం చేస్తున్నారు

- ప్రజల సంపదను దోచుకుంటున్నారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కారుమూరు వెంకటరెడ్డి ఆగ్రహం



సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో రూ.3 వేల కోట్ల విలువైన భూములను కారుచౌకగా ఉర్సా క్లస్టర్స్‌కు కేటాయించడం వెనుక మంత్రి నారా లోకేశ్, ఆయన బినామీలే సూత్రధారులని వైఎస్సార్‌సీపీ జాయింట్ సెక్రటరీ కారుమూరు వెంకటరెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి లోకేశ్ తన సన్నిహితుడైన కిలారు రాజేశ్ ద్వారా డొల్ల కంపెనీలను సృష్టించి.. వాటికి ప్రభుత్వం ద్వారా కారుచౌకగా విలువైన భూములను కట్టబెడుతున్నారని చెప్పారు. తద్వారా ప్రజల సంపదను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఊరూ పేరు లేని ఉర్సా క్లస్టర్స్ హైదరాబాద్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో 2 నెలల కిందటే రిజిస్టర్ అయ్యిందని.. అటువంటి కంపెనీకి విశాఖలో ఎకరం 99 పైసలకే దాదాపు 60 ఎకరాల భూమిని ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. ఈ కంపెనీకి ఇద్దరు డైరెక్టర్లు తప్ప ఒక్క ఉద్యోగి కూడా లేరని దుయ్యబట్టారు. ఇది ఒక ఆర్గనైజ్డ్ స్కామ్ అని చెప్పారు. ఉర్సా ప్రతినిధులని చెబుతున్న పెందుర్తి విజయ్‌కుమార్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఒక ఉద్యోగి అని.. మరో డైరెక్టర్ అబ్బూరి సతీశ్ అమెరికాలో చిన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని వెంకటరెడ్డి చెప్పారు. వీరిద్దరూ కలిసి ఏపీలో రూ.5 వేల కోట్ల పెట్టుబడులు పెడతారని చెప్పగా.. దీనిని స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ ఆమోదించడం, వెంటనే కేబినెట్ కూడా ఎకరం 99 పైసల చొప్పున దాదాపు 60 ఎకరాలను కట్టబెట్టడం చూస్తుంటే ఎంతో ప్రణాళికాబద్ధంగా స్కామ్‌ను నడిపించారో అర్థం అవుతోందన్నారు. వైఎస్ జగన్ హయాంలోనే టీసీఎస్ ప్రతినిధులతో పాటు చంద్రశేఖరన్‌తో సంప్రదింపులు జరిగాయని వెంకటరెడ్డి గుర్తుచేశారు. కోవిడ్ పరిస్థితుల వల్ల టీసీఎస్ ఏపీకి రావడం ఆలస్యమయ్యిందన్నారు. అదే టీసీఎస్‌కు విశాఖలో 21.16 ఎకరాల భూమిని ఎకరం 99 పైసలకే కట్టబెడుతూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిందని చెప్పారు. ఈ భూముల విలువ రూ.వేల కోట్లు ఉంటుందన్నారు. ఆ సంస్థ కల్పించే 12 వేల ఉద్యోగాల్లో 2 వేల మంది ఏపీ వారు ఉంటే, మిగిలిన 10 వేల మంది ఇతర రాష్ట్రాల వారే ఉంటారన్నారు. అలాంటప్పుడు 99 పైసలకే భూ కేటాయింపులు ఎందుకని ప్రశ్నించారు.

పోలవరం ఎత్తు కుదింపు

- తొలిదశ కింద 135 అడుగులకు తగ్గింపు.. కేంద్ర కేబినెట్‌లో నిర్ణయం
- పోలవరం ప్రాజెక్టు అథారిటీ భేటీలో ఏపీ వెల్లడి
- దీంతో తెలంగాణలో ముంపు ఉండదని వాదన

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టును 150 అడుగుల ఎత్తులో నిర్మించాలని ప్రతిపాదించగా, తొలిదశ కింద 135 అడుగులకే ఎత్తును కుదించి నిర్మించాలని కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్టు ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతానికి ప్రాజెక్టులో 135 అడుగుల నీటిమట్టంతో నీటిని నిల్వ చేస్తే.. ప్రాజెక్టు కింద తెలంగాణ భూభాగంలో ఎలాంటి ముంపు ఉండదని స్పష్టం చేసింది. ప్రాజెక్టు ఎత్తు 150 అడుగులకు ఎప్పుడు పెంచితే అప్పుడే తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై సంయుక్త సర్వే నిర్వహించే అంశంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ఈ నెల 8న హైదరాబాద్‌లో ఏపీ, తెలంగాణ అధికారులతో నిర్వహించిన సమావేశం మినట్స్‌లో ఈ విషయాన్ని పొందుపరిచింది. పోలవరం బ్యాక్‌వాటర్‌తో కిన్నెరసాని, ముర్రేడువాగులు ఉప్పొంగి తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై మాత్రమే అధ్యయనం చేయాలని ఎన్జీటీ తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆ మేరకే నిర్వహిస్తామని ఈ సమావేశంలో ఏపీ పేర్కొంది. పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ట నీటిమట్టం మేర నీటిని నిల్వ చేస్తే మిగిలిన 5 వాగులకు ఉండనున్న ముంపు ప్రభావంపై సైతం ఏకకాలంలో అధ్యయనం చేయాలని సమావేశంలో తెలంగాణ పట్టుబట్టింది. మొత్తం 954.15 ఎకరాల్లో ముంపు ఏర్పడుతుందని స్పష్టం చేసింది. ఈ పరిస్థితిలో తాము స్వయంగా మిగిలిన 5 వాగులకు ఉండే ముంపు ప్రభావంపై అధ్యయనం జరుపుతామని పీపీఏ సీఈఓ అనిల్‌జైన్ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

పోలవరం ముంపుపై అధ్యయనం చేయండి

ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణలోని 6 వాగులకు ఏర్పడనున్న ముంపు ప్రభావంపై అధ్యయనం నిర్వహించాలని కేంద్ర జలసంఘానికి పోలవరం ప్రాజెక్టు అథారిటీ కోరింది. ఈ మేరకు పీపీఏ సీఈఓ అనిల్ జైన్ తాజాగా సీడబ్ల్యూసీకి లేఖ రాశారు.



జీవితానికి తనదైన గుప్త శక్తులు ఉన్నాయని
నువ్వు జీవించడం ద్వారానే తెలుసుకోగలవు.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 24 ఏప్రిల్ 2025

మళ్లీ ఉగ్ర కాండ!

ఊరు తెలియదు, పేరు తెలియదు... ఎవరో, ఎక్కడివారో అసలే తెలియదు. తమ ప్రాంతం కాదు... భాష కాదు. అలాంటివారిని నిష్కారణంగా, నిర్దయగా కాల్చి చంపడం హేయం, దారుణం. కశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలోని బైసారన్ పట్టణంలో పర్యాటకులపై విరుచుకుపడి 28 మందిని పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులు అక్షరాలా మానవాకార మృగాలు. భయకంపితులు తమకు తాము ధైర్యం తెచ్చుకోవటానికి సాగించే క్రూర చర్యే బీభత్సమని మార్క్సిస్టు సిద్ధాంతవేత్త ఫ్రెడరిక్ ఏంగెల్స్ అంటాడు. వీళ్లు నిజంగా భీరువులు. పొరుగు దేశం చేతుల్లో పావులు. ఈ ఘోరానికి ఎంచుకున్న సమయం, సందర్భం గమనిస్తే ఇది యాదృచ్ఛికంగా, చెదురుమదురుగా జరిగిన దాడి కాదని స్పష్టంగా తెలుస్తుంది. మన దేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబ సమేతంగా పర్యటిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇస్లామిక్ ప్రపంచంలో అత్యంత పలుకుబడి కలిగిన సౌదీ అరేబియా పర్యటనకెళ్లారు. అంతర్జాతీయంగా అందరి దృష్టీ పడాలంటే ఇంతకన్నా మెరుగైన సమయం లేదని వీరిని వెనకుండి నడిపించిన పాకిస్తాన్‌లోని సూత్రధారులు అనుకున్న పర్యవసానంగానే ఈ దారుణం చోటుచేసుకుంది. దాడికి తెగబడిన ఏడుగురూ సైనిక దుస్తుల్లో ఆ ప్రాంతంలోకి చొరబడ్డారని, వారిలో దాదాపు అయిదుగురు పాకిస్తానీ పౌరులేనని అంటున్నారు. ఈ దాడిని కేంద్రం చాలా తీవ్రంగా తీసుకున్నదని ప్రధాని అర్ధంతరంగా తన సౌదీ పర్యటనను రద్దు చేసుకుని రావడాన్ని గమనిస్తే అర్థమవుతుంది. మోదీ నేతృత్వంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ బుధవారం హుటాహుటిన సమావేశమైంది. కాల్పుల్లో గాయపడినవారూ, తప్పించుకున్నవారూ చెబుతున్న కథనాలు హృదయ విదారకంగా ఉన్నాయి. పెళ్లయి కేవలం ఆరు రోజులే అయిన జంటను ఆ దుర్మార్గులు లక్ష్యంగా ఎంచుకుని భర్తను కాల్చిచంపటం ఎలాంటి వారికైనా కంటతడి పెట్టిస్తుంది. తమ దురంతాన్ని ప్రధానికి చెప్పుకోవాలని, అందుకే ప్రాణాలతో విడిచిపెడుతున్నామని నవవధువుతో వారు చెప్పిన తీరు గమనిస్తే ఉన్మాదం ఏ స్థాయిలో ముదిరిందో తెలుస్తుంది.

ఒక ప్రాంతాన్ని బలప్రయోగం ద్వారానైనా సొంతం చేసుకోవాలని, దానిపై సర్వహక్కులూ తమకే ఉన్నాయని ఒక దేశమైనా, ఒక ముఠా అయినా భావించటం ఆశ్చర్యం కలిగిస్తుంది. సాధారణ పౌరులను లక్ష్యంగా ఎంచుకుని సంహరిస్తే మందీమార్బలంవున్న ప్రభుత్వం లొంగిపోతుందనుకోవటం పిచ్చితనమని ఈ ఉన్మాదులూ, వీరి వెనకుండి ప్రోత్సహిస్తున్నవారూ గ్రహించలేకపోతున్నారు. ఈ మధ్యే పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ కశ్మీర్ తమ కంఠనాళమని, దాన్ని మరిచిపోయే లేదా విడనాడే ప్రసక్తేలేదని ప్రకటించారు. కానీ ఈ దుస్సంఘటన జరిగిన వెంటనే దీనితో తమకు సంబంధం లేదంటూ పాత పాటే అందుకున్నారు. తాను పెంచి పోషించిన విష సర్పం తననే కాటేస్తున్న ఉదంతాలున్నా పాక్ మూర్ఖంగా ప్రవర్తిస్తోంది.

ఉగ్రవాదుల మతిమాలిన చర్యలకు అక్కడి సమాజం మద్దతు లేదని బుధవారం వెలువడిన పత్రికలు చూస్తేనే తెలుస్తుంది. అక్కడి పత్రికలన్నీ ముష్కరుల దురంతానికి నిరసనగా నల్లటి కాగితంపై తెల్లటి అక్షరాలతో మొదటి పేజీని నింపాయి. పాలక పక్షానికి నేతృత్వం వహిస్తున్న నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, హురియత్ కాన్ఫరెన్స్‌తోపాటు పౌర సమాజం మొత్తం దాడిని ముక్తకంఠంతో ఖండించింది. పర్యాటకులపై ఈ స్థాయిలో విరుచుకుపడటం 2012 తర్వాత ఇదే మొదటిసారి. ఆ సంవత్సరం బిజ్‌బెహరా ప్రాంతంలో ఉగ్రవాదులు మహారాష్ట్ర నుంచి వెళ్లిన నలుగురు మహిళా పర్యాటకులను పొట్టన బెట్టుకున్నారు. అంతకుముందు పహల్గామ్‌లో 2000 సంవత్సరంలో తీర్థ యాత్రల కోసం వచ్చిన 32 మంది ప్రాణాలు తీశారు. ఆ తర్వాత ఇదే పెద్ద దాడి. జమ్మూ–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని 2019 ఆగస్టులో కేంద్రం రద్దు చేసిన నాటినుంచీ తీసుకున్న చర్యల వల్ల అక్కడ పరిస్థితులు మెరుగు పడుతున్నాయన్న అభిప్రాయం అందరిలో కలిగింది. కానీ అదంతా నిజం కాకపోవచ్చని అడపా దడపా జరుగుతున్న సంఘటనలు నిరూపిస్తూనే ఉన్నాయి. అందుకే భద్రతా దళాలు మరింత అప్రమత్తంగా ఉండాల్సింది. ఇటీవల జరిగిన దాడుల్లో కూలిపనుల కోసం వెళ్లే స్థానికేతరులను ఉగ్రవాదులు లక్ష్యంగా ఎంచుకున్నారు. కానీ మంగళవారం నాటి ఘటన తీరు గమనిస్తే వారి వ్యూహం మారిందన్న అభిప్రాయం కలుగుతుంది.

కశ్మీర్‌లో ఉగ్రవాదం కోరలు పీకామని, ఇక అక్కడేం చేయలేక జమ్మూ ప్రాంతంలో మిలిటెంట్లు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారని ఈమధ్యే జమ్మూ, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. ఉగ్రవాదం ఎప్పుడు పడగవిప్పి బుసలు కొడుతుందో అంచనా వేయటం సులభం కాదు. కొన్ని మీడియా సంస్థల కథనాల ప్రకారం పర్యాటకులపై దాడి జరిగే అవకాశం వున్నదని నిఘా సంస్థలు హెచ్చరించాయి. అదే నిజమైతే లోటుపాట్లకు కారకులైనవారిపై కఠినంగా చర్య తీసుకోవాల్సిన అవసరం వుంది. అందాల కశ్మీరాన్ని తనివితీరా చూడాలని, స్థానిక రుచులను ఆస్వాదించి అక్కడి సంస్కృతిని ఆకళింపు చేసుకోవాలని దేశం నలుమూలల నుంచీ అనేకమంది నిత్యం అక్కడికెళ్తున్నారు. ఇప్పుడు ఉగ్రదాడిలో మరణించినవారిలో కూడా భిన్న రాష్ట్రాలకు చెందినవారున్నారు. దాడికి దిగిన ముఠా సభ్యులు ఎటునుంచి వచ్చారో తెలుసుకోవటం, వారిని సజీవంగా పట్టుకుని విషయాలు రాబట్టడం, అంతర్జాతీయంగా పాక్ నిజస్వరూపాన్ని చాటడం అత్యవసరం. దేశం మొత్తం ఏకమై ఉగ్రవాదాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాల్సిన తరుణమిది. అందుకే బాధ్యతాయుతంగా మాట్లాడటం అవసరమని రాజకీయ పక్షాలన్నీ గ్రహించాలి.

నాడు క్షీరధార! నేడు కన్నీటి వరద!

విశ్లేషణ



భూమన కరుణాకర రెడ్డి



- వైఎస్ రాజశేఖరరెడ్డి ఆదేశంతో తి.తి.దే. ఆధ్వర్యంలో గోసంరక్షణ కోసం మూడు రోజుల 'వందే గోమాతరం' అంతర్జాతీయ సదస్సు జరిగింది.
- స్వామివారికి వెన్న కొనడం తగదు అని తిరుమలలోనే గోశాలను ఎనిమిది ఎకరాలకు విస్తరించారు జగన్ మోహన్ రెడ్డి. పైగా కవ్వంతో చిలికి వెన్నతీసే సంప్రదాయ పద్ధతిని ఏర్పాటు చేశారు.
- ఇరువురు ముఖ్యమంత్రులు ఇంతగా అభివృద్ధి చేసిన తి.తి.దే. గోశాల నేడు దీనంగా ఉంది. ఆవు క్షీరధార బదులు, కన్నీటిధార విడుస్తోంది.

సర్వదేవ మయే దేవీ–సర్వ దేవా రలంకృతా
మామాభిలషితం కర్మ–సఫలం కురు నందినీ

ఇది హిందువులు చేసే గోప్రార్థన. 'సర్వ దేవతా స్వరూపిణీ! సర్వదేవతలచే అలంకరింపబడినదానా! ఓ నందినీ! నా కోరికలను సఫలం చేయి' అని అర్థం.

కేవలం గోవును పూజిస్తే సమస్త దేవతలను పూజించిన ఫలం దక్కుతుందని పెద్దల వాక్కు. ఇది వేదం నుంచి వచ్చిన సంప్రదాయం, నమ్మకం. హిందువులకు ఆవు ఓ జంతువు కాదు, అభీష్టాలను నెరవేర్చే దైవ స్వరూపం. ఆకలి తీర్చే అన్నపూర్ణ.

హిందూ ధర్మానికి వేదం మూలం. వేదం నుంచి యజ్ఞం వచ్చింది. యజ్ఞం వల్ల వర్షం కురుస్తుంది. మానవాళి ఆకలి తీరుతుంది. ఆ యజ్ఞపు అగ్నిహోత్రానికి ఘృతాన్ని (నెయ్యి) సమర్పించాలి. యజ్ఞానికి ఆవు నెయ్యి తప్ప ఇతరాలు సమర్పించరు. గోవు అనే పదానికి సూర్యుడు, యజ్ఞము, భూమి, నీరు, స్వర్గం... ఇలా అనేక అర్థాలు ఉన్నాయి.

''గవా మంగేషు తిష్ఠంతి/ భువవాని చతుర్దశ''

గోవు శరీర భాగాలలో పదునాలుగు భువనాలు ఉంటాయట. అంటే సమస్త సృష్టికి మూలం గోవు. గోవు అంత పవిత్రమైనది కాబట్టే దాని పేడ, పంచకాలను కూడా ఔషధాలకు ఉపయోగిస్తున్నాం. శాస్త్రం అంగీకరిస్తున్న సత్యం ఇది.

పూర్వకాలంలో గోవులేని ఇల్లు వుండేది కాదు. ఎన్ని గోవులుంటే అంత సంపద వున్నట్టు. మహాభారతంలో విరాటరాజు గోవులను దుర్యోధనాదులు అపహరించటానికి పూనుకున్నది ఈ కారణం వల్లే!

ఆవు నడయాడిన ప్రాంతంలో క్షేమం తప్ప, క్షామం ఉండదు. నూతన గృహప్రవేశ కాలంలో గోవును తీసుకువెళ్లేది ఇందుకే!

శ్రీ మన్మహావిష్ణువు... గోపాలుడు, గోవిందుడు. గోకులంలో ఉండటం, గోవులను కాయడం ఆయనకు ఇష్టం. కాయడం అంటే కేవలం కాపలా కాదు, అన్ని విధాలా రక్షించడం! శ్రీ మహావిష్ణువు వైకుంఠంలో ఉంటాడన్నది మన నమ్మకం. నిజానికి ఆ స్వామికి నిత్య స్థానము గోలోకమట. అది వైకుంఠం కన్నా పైన ఉంటుందట. అందుకే గోవిందా అని పిలిస్తేనే ఆ స్వామికి ఇష్టం. నవనీత చోరుడు కదా! నేటికీ తిరుమలలో శ్రీవారికి నవనీత నివేదన జరుగుతూనే ఉంది.

గోహృదయం తెలిసిన వైఎస్

ఆ శ్రీవారి సన్నిధానంలో గోవులకు ఆస్థానం ఉండాలని 1956లో డైరీ ఫారం పేరుతో చిన్న గోశాల ఏర్పాటు చేశారు తిరుమల తిరుపతి దేవస్థానం వారు. 2002లో దాన్ని ట్రస్టు గానూ, 2004లో శ్రీ వేంకటేశ్వర గోరక్షణ శాలగానూ మార్చారు.

ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా, నేను తి.తి.దే. అధ్యక్షుడిగా ఉన్న కాలంలో తిరుపతి గోశాలను అభివృద్ధి చేసినంతగా మరెవ్వరూ చేయలేదు అన్నది అతిశయోక్తి కాదు. రైతు హృదయమే కాదు, రైతుకు సంపద అయిన గోహృదయం కూడా తెలిసినవారు రాజశేఖరరెడ్డి. ఆయన ఆదేశంతో గోసంరక్షణ కోసం తిరుపతిలో మూడు రోజుల పాటు 'వందే గోమాతరం' పేరుతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించాం. నోబెల్ బహుమతి గ్రహీతలైన ఇద్దరు ప్రముఖులు, అరవై మందికి పైగా గోసంరక్షణ ఉద్యమకారులు, వివిధ పీఠాధిపతులు ఆ సదస్సులో పాల్గొన్నారు. ఔషధీకరణ రీత్యా గోవిసర్జితాలు ఎంత ముఖ్యమైనవో, వీరు తమ ప్రసంగాల ద్వారా నిరూపించారు. గోసంరక్షణకు చేపట్టాల్సిన కార్యక్రమాలు వివరించారు. వందే గోమాతరం సదస్సును దేశమంతా ప్రశంసించింది. ఎందరో పీఠాధిపతులు ఆశీస్సులు పంపారు. అప్పటి రాష్ట్రపతి రాజశేఖర రెడ్డి గారిని అభినందిస్తూ లేఖ పంపారు.

శ్రీవారి సన్నిధానంలో ఉన్న గోశాలను మరింత విస్తృత పరచాలన్న రాజశేఖర రెడ్డి ఆదేశానుసారం పలమనేరులో అతి పెద్ద గోశాలకు అంకురార్పణ చేశాం.

తండ్రి వలెనే ప్రత్యేక శ్రద్ధ

వై.ఎస్. జగన్‌మోహన రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తండ్రి వలెనే గోసంరక్షణ మీద ప్రత్యేక శ్రద్ధ వహించారు. గోసంపద మరింత విస్తరించాలని సాహివాల్, గిర్, కాంక్రీజ్ వంటి నాణ్యమైన దేశవాళీ గోవులు సుమారు 550 తెప్పించారు. రిలయన్స్, మై హోమ్, ఇతర పారిశ్రామిక వేత్తల సహాయంతో ఈ గోవులను పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి తెప్పించారు. రవాణాలో అవి ఇబ్బందులకు గురి కాకూడదని, అప్పటి రైల్వే మంత్రితో మాట్లాడి ప్రత్యేక కంపార్టుమెంట్ల ద్వారా తెప్పించడం జరిగింది. ఇదీ నాటి ముఖ్యమంత్రి జగన్‌కు ఉన్న శ్రద్ధ.

పూర్వకాలపు పద్ధతిలో కవ్వంతో చిలికి వెన్నతీసి, దానిని తిరుమలలో ధూప దీప నైవేద్యాలకు, అన్నప్రసాదాలకు వినియోగించాలని ఏర్పాట్లు చేయడం జరిగింది. కవ్వంతో చిలికి వెన్న తీయడాన్ని బిలోనా పద్ధతి అంటారు. దీనికి 5 కోట్ల నిధిని కేటాయించాం.

ఈ 550 గోవుల ద్వారా పునరుత్పత్తి చేసి నాణ్యమైన గోవుల సంఖ్య మరింత పెంచాలని నిర్ణయించాం. దీనికి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు సహకారం తీసుకున్నాం. దాదాపు 48 కోట్ల రూపాయల ఖర్చుతో ఆవుల కృత్రిమ గర్భధారణకు ప్రయత్నాలు చేస్తూ, అందులో 90 శాతం ఆడ దూడల జననం కొరకు బృహత్ సంకల్పం చేశాం.

నవనీత చోరుడు, నవనీత ప్రియుడు అయిన వెంకటేశ్వర స్వామి వారికి సుప్రభాత అనంతరం నవనీత (వెన్న) నివేదన చేస్తారు. ఆ వెన్నను పూర్వం బయట నుంచి కొని తీసుకువచ్చేవారు. స్వామికి వెన్న కొనడం తగదు అని తిరుమలలో గోశాలను ఎనిమిది ఎకరాలకు విస్తరించేలా చేశారు జగన్‌మోహన్ రెడ్డి. అందులో 50 సాహివాల్ గోవులను ఉంచి, శ్రీవారి సేవకులైన మహిళల ద్వారా వెన్న చిలికించారు. ఆ వెన్నను ప్రతిదినం గోశాల నుండి ఊరేగింపుగా తీసుకువచ్చి శ్రీవారి నవనీత సేవకు అందేలా ఏర్పాటు చేశారు.

శ్రీవారికి నివేదించిన వివిధ రకాల పుష్పాలను వృథాగా పారేయక వాటి ద్వారా అగరుబత్తీలు, తదితర పరిమళ ద్రవ్యాలు తయారు చేయడానికి, గోమయంతో సబ్బులు తదితర 14 ఉత్పత్తులు గోశాల ద్వారా రావటానికి ముఖ్య కారకులు జగన్ గారే! ఈ రోజు ఆ ఉత్పత్తుల ద్వారా 40 కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది. శ్రీవారికి దాదాపు 10 కోట్ల లాభం వస్తోంది. డబ్బు విషయం పక్కన పెడితే, కొన్ని కోట్ల గృహాలలో శ్రీవారి అగరుబత్తీలు వెలుగుతూ తిరుమలను తలపిస్తున్నాయి.

అలిపిరి దగ్గర గోప్రదక్షిణశాలను పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చింది జగన్ గారే.

ఆవు అలమటిస్తోంది!

కొండంత చేసినా కొంచెంగా ఉండటం మాకు అలవాటు. అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిగా చేశాం తప్ప ప్రచారం కోసం కాదు. చేసినవి చెప్పుకోవడంలో తప్పులేదు. కానీ కళ్ళు మూసుకుని కనిపించలేదు అంటే అది తప్పు!

ఇరువురు ముఖ్యమంత్రులు ఇంతగా అభివృద్ధి చేసిన గోశాల నేడు దీనంగా ఉంది. ఆవు అలమటిస్తోంది. క్షీరధార బదులు, కన్నీటిధార విడుస్తోంది. నిజం చెబితే దాన్ని స్వీకరించాలి, సరిదిద్దుకోవాలి. అంతేగానీ విమర్శకు విలవిలలాడిపోయి ఎదురుదాడికి దిగితే, దొంగ కేసులు పెడితే అది వారికే నష్టం.

నేను కోరేది ఒక్కటే! అధికారాలు, ప్రభుత్వాలు మారవచ్చు. కానీ పీఠంపై ఎవరున్నా శ్రీవారికి ఇష్టమైన 'గోపతు'లుగా ఉండాలి తప్ప, 'గోఘ్నులు'గా ఉండకూడదు అని!

వ్యాసకర్త టీటీడీ మాజీ చైర్మన్

సోషల్ మీడియా

నరకమైన స్వర్గం



భూమ్మీది స్వర్గం లాంటి కశ్మీర్ నరకంగా మారుతోంది. అమాయక జనాలను లక్ష్యంగా చేసుకున్నారు. వారి కుటుంబాల పట్ల తీవ్ర వేదన కలుగుతోంది. ఒక్క అమాయకుడిని చంపినా, అది మొత్తం సృష్టిని చంపడంతో సమానం.

– సల్మాన్ ఖాన్, నటుడు

బాధితురాలేనా?



సరిహద్దులను దాటుతున్న దేశ ప్రాయోజిత తీవ్రవాదం మీద గట్టి మూల్యం విధించనంతవరకూ, తీవ్రవాదంపై తీసుకునే చర్యలు ప్రభావవంతంగా ఉండవు. వరుస భారత ప్రభుత్వాల కథనం ఎన్నడూ దృఢమైన చర్యలలోకి దిగలేదు. ఒక దేశం బాధితురాలిగానే ఉండదలిస్తే, అది శాపవశాత్తూ బాధితురాలిగానే ఉండిపోతుంది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల వ్యాఖ్యాత

ఒక పోలిక



యూఎస్–ఇండియా వాణిజ్యాన్ని 2030 కల్లా రెట్టింపు చేస్తూ 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని ట్రంప్, మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక పోలిక కోసం: యూరోపియన్ యూనియన్‌తో యూఎస్ మొత్తం వాణిజ్యం 2024లో 975.9 బిలియన్ డాలర్లు.

– వెలీనా త్చకరోవా, జియోపొలిటికల్ కామెంటేటర్

కొత్త అధ్యాయం



డాల్ఫిన్ మాటల్ని కృత్రిమ మేధ సాయంతో డీకోడ్ చేయడానికి మేము దగ్గర్లో ఉన్నాం. ఇది సఫలమైతే, జంతువుల ప్రజ్ఞను అర్థం చేసుకోవడంలో మునుపెన్నడూ సాధ్యం కాని కొత్త అధ్యాయం మొదలవుతుంది.

– పీటర్ హెచ్. డయమాండిస్, ఆంట్రప్రెన్యూర్

ఆరోగ్యం మీ చేతిలో!



మీరు ఆరోగ్యవంతమైన కుటుంబం నుంచి రాకపోతే, మీ నుంచి ఆరోగ్యవంతమైన కుటుంబం వచ్చేట్టుగా చూసుకోండి. మార్పు మీ నుంచే మొదలుకానీండి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఇన్ బాక్స్

స్థానిక సంస్థలను ఆదుకోవాలి!

ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలు పంచాయతీరాజ్ సంస్థలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నా క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో ఉన్న స్థానిక సమస్యలపై వాటికి తగిన అవగాహన ఉండదు. అందుకే అధికార వికేంద్రీకరణ ద్వారా స్థానిక స్వయంపాలక పంచాయతీ వ్యవస్థ అవసరం ఏర్పడింది. మొదట్లో ఆదేశ సూత్రాల్లో పంచాయతీ వ్యవస్థ ఉండడంతో పాలకులు పంచాయతీ వ్యవస్థపై అంతగా శ్రద్ధ చూపలేదు. దీంతో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1992లో పంచాయతీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి బలోపేతం చేసింది నాటి కేంద్ర ప్రభుత్వం. ఈ రాజ్యాంగ సవరణను గుర్తు చేసుకుంటూ... పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయడంకోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఏప్రిల్ 24వ తేదీనాడు 'జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవా'న్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆదర్శ గ్రామంగా నిలిచిన గ్రామ పంచాయతీలను, గ్రామసభలను... 'శక్తి కరణ్' అవార్డు వంటివాటితో సత్కరిస్తారు. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం... ప్రతి గ్రామపంచాయతీలో అనివార్యంగా గ్రామసభ సమావేశాలను ఏడాదికి కనీసం రెండు సార్లు నిర్వహించాలి. గ్రామంలోని ఓటర్లందరూ గ్రామసభలో సభ్యులు. గ్రామసభ గ్రామ స్థాయి శాసనసభ వలె పని చేయాలి. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లబ్ధిదారుల ఎంపికలో గ్రామసభ ప్రధాన పాత్రను పోషిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు నియమిత కాలంలో పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు అనేక గ్రామాలు ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

73వ రాజ్యాంగ సవరణను అనుసరించి వెనుకబడిన తరగతుల వారితో పాటు మహిళలకు 1/3వ వంతు రిజర్వేషన్లు మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో కల్పించారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాయి. దేశ వ్యాప్తంగా 32.29 లక్షల మంది పంచాయతీరాజ్ సంస్థలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. వీరిలో 46.6% మంది మహిళలు. అయితే మహిళా ప్రజాప్రతినిధులను బొమ్మలను చేసి వారి కుటుంబాల్లోని పురుషులు వారి పదవీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇది మహిళా సాధికారతకు గొడ్డలిపెట్టు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల్లో అతి ప్రధానమైనది – ఆర్థిక వనరుల సమస్య. తగిన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు అందక, అవసరమైన ఆర్థిక వనరులు లేక పంచాయతీరాజ్ సంస్థలు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

– డా॥ పి. మోహన్‌రావు,
ప్రభుత్వ పాలన శాస్త్ర విశ్రాంత ప్రొఫెసర్, హైదరాబాద్
(నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం)

అతి జాప్యంతో అదృశ్యమైన న్యాయం!

సందర్భం




ఎన్. వేణుగోపాల్

ఇటీవల ఒక న్యాయ, చట్ట సంబంధమైన వార్తల వెబ్ సైట్‌లో ఒక ఆశ్చర్యకరమైన వార్తా కథనం కనబడింది. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ముందు, తన కక్షిదారు చనిపోయాడనీ, ఆ కేసులో నిందితులుగా ఉన్న ఇరవై ఆరు మందీ చనిపోయారనీ ఒక న్యాయవాది చెప్పారు. అవి ప్రతీకార హత్యలేమీ కావు, సహజ మరణాలు. ఈ దేశంలో సామాజిక వ్యవస్థ గురించీ, న్యాయవ్యవస్థ గురించీ ఎన్నో పాఠాలు చెప్పగల నేరమూ–శిక్షా కథ ఇది.

బిహార్ లోని అర్వాల్ జిల్లా లక్ష్మణ్ పూర్ బాతే అనే గ్రామంలో 1997 డిసెంబర్ 1న నరసంహారం జరిగింది. రాజధాని పట్నాకు తొంభై కి.మీ. దూరంలో సోన్ నదీ తీరగ్రామం లక్ష్మణ్ పూర్ బాతే. అప్పుడు ఆ ప్రాంతంలో ఎన్నో అరాచకాలకూ, హత్యాకాండలకూ పాల్పడిన రణ వీర్ సేన అనే అగ్రవర్ణాల సేన ఆ గ్రామంలోని దళితుల ఇళ్ల మీద దాడి చేసి చిన్నారి పిల్లలు, స్త్రీలతో సహా 58 మందిని ఊచకోత కోసింది. హతులలో ఒక ఏడాది పసిపాప, ఒక గర్భిణి కూడా ఉన్నారు. నదికి అవతలి ఒడ్డు నుంచి రాత్రి పదకొండు గంటలకు పడవలలో వచ్చి దళిత వాడలో ఇళ్ల తలుపులు విరగ్గొట్టి, లోపలికి చొరబడి, పడుకున్నవాళ్లను పడుకున్నట్టే కాల్చి చంపారు. మూడు గంటల పాటు జరిగిన మారణకాండలో యువతుల మీద అత్యాచారాలు చేసి చంపేశారు. తర్వాత అక్కడికి వెళ్లిన పోలీసులకు అత్యాచారానికి గురైన ఐదుగురు బాలికల నగ్న మృతదేహాలు కనిపించాయి. ఈ నరసంహారం సాగించి, తిరిగి అదే పడవలలో నది దాటిన హంతకులు సాక్ష్యాధారాలు లేకుండా చేయడానికి తమను నది దాటించిన ఇద్దరు పడవవాళ్ల గొంతులు కోసి చంపేశారు.

అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ 'దేశానికి సిగ్గుచేటు' అని అభివర్ణించిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనానికి దారి తీసింది. ఈ మారణకాండ కారణాలు, పూర్వరంగం ఏమైనప్పటికీ, తర్వాత జరిగిన న్యాయ విచారణా ప్రక్రియ ఆశ్చర్యకరమైన మలుపులు తిరిగింది. జహానాబాద్ జిల్లా సెషన్స్ కోర్టులో జరగవలసిన ఈ విచారణను పట్నా హైకోర్టు ఆదేశాల మేరకు 1999 అక్టోబర్‌లో పట్నాకు బదిలీ చేశారు. తొమ్మిది సంవత్సరాల సుదీర్ఘ విచారణ తర్వాత 2008 డిసెంబర్‌లో 46 మంది రణవీర్ సేన కార్యకర్తల మీద నేరారోపణలు నమోదయ్యాయి. రెండు సంవత్సరాల తర్వాత 2010 ఏప్రిల్ 7న పట్నా అదనపు జిల్లా సెషన్స్ జడ్జి విజయ్ ప్రకాష్ మిశ్రా నిందితులలో 16 మందికి మరణశిక్ష, 10 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. ఈ హత్యాకాండ 'పౌర సమాజం మీద మచ్చ' అనీ, 'పాశవికత్వంలో అరుదైన వాటిలోకెల్లా అరుదైనది' అనీ తీర్పులో రాశారు.



శిక్షితులు అప్పీలుకు వెళ్లగా పట్నా హైకోర్టు జస్టిస్ వీఎన్ సిన్హా, జస్టిస్ ఏకే లాల్ ద్విసభ్య 'ధర్మాసనం' 2013 అక్టోబర్ 9న 'సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా' శిక్షలన్నిటినీ కొట్టివేసింది. ఇంత అన్యాయమైన హైకోర్టు తీర్పు వార్త ప్రధాన స్రవంతి పత్రికలకు పట్టనే లేదు. యాభై ఎనిమిది మందిని హత్య చేసి, కింది కోర్టులో నేరం రుజువై తీవ్రమైన శిక్షలు కూడా పడిన నేరస్థులను, అలా సాక్ష్యాధారాలు లేవంటూ వదిలివేసిన దుర్మార్గమైన వార్త కన్నా ఆ రోజే క్రికెట్ నుంచి విరమించుకుంటున్నానని సచిన్ టెండూల్కర్ చేసిన ప్రకటన పెద్ద వార్త అయింది! హైకోర్టు తీర్పును బిహార్ ప్రభుత్వమూ, బిహార్‌లోని రాజకీయ పార్టీలన్నీ తప్పు పట్టాయి. ఈ తీర్పును ఎంత మాత్రమూ అంగీకరించడానికి వీలు లేదని, తీర్పును సమీక్షించమని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలని బిహార్ రాజకీయ పార్టీలు కోరాయి.

పట్నా హైకోర్టు తీర్పును సమీక్షించి, కొట్టివేయాలని, మారణకాండ దోషులకు కఠిన శిక్షలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం 2013 డిసెంబర్‌లో సుప్రీంకోర్టును అభ్యర్థించింది. 2014 జనవరి 13న సుప్రీంకోర్టు కేసు నమోదు చేసుకుని నోటీసులు పంపింది. నాలుగు సంవత్సరాల తర్వాత 2018, 2019లలో కాస్త విచారణ జరిగి, కేసు మౌలిక దస్తావేజులు, అదనపు పత్రాలు పంపమని కింది కోర్టులను ఆదేశించడంలోనే సమయం గడిచిపోయింది. 2023 ఒక్క సంవత్సరంలోనే ఎటువంటి వాదనలు, విచారణ జరగకుండా ఆరుసార్లు వాయిదాలు పడ్డాయి. ఈ మధ్యలో కొందరు నిందితులు మరణించారని న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తెస్తూనే ఉన్నారు. 2025 జనవరి 1 నాటికి ఇరవై ఆరు మందిలో ఐదుగురు మరణించారని నమోదయింది. పన్నెండేళ్లుగా వాయిదాలు పడుతూ నత్తనడకలతో సాగుతూ సాగుతూ వచ్చిన ఆ కేసులో 2025 ఏప్రిల్ 3న ఒక నిందితుడి తరఫున వాదిస్తున్న న్యాయవాది 'ఇరవై ఆరు మంది నిందితులూ మరణించారని ధర్మాసనానికి తెలియజేస్తున్నాం' అన్నారు. వాస్తవ స్థితి ఏమిటో చెప్పాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చిన ధర్మాసనం కేసును మళ్లీ వాయిదా వేసింది.

అలస్యం చేయడమంటే న్యాయాన్ని నిరాకరించినట్టే అనే నానుడిని నిజం చేస్తూ మన న్యాయవ్యవస్థ సాచివేత ద్వారా న్యాయాన్ని నిరాకరిస్తున్న తీరు ఇది! ఇప్పుడు నడుస్తున్న మందకొడి వేగంతోనే నేర విచారణలు సాగుతూ పోతే దేశంలో ఆ నాటికి న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ పూర్తి కావడానికి 324 సంవత్సరాలు పడుతుందని 2018లో నీతి ఆయోగ్ ఒక వ్యూహ పత్రంలో నిర్ధారించింది. ఆ నాటికి దేశం మొత్తం మీద పెండింగ్‌లో ఉన్న కేసులు రెండు కోట్ల తొంబై లక్షలు కాగా, 2025 జనవరి నాటికి ఆ సంఖ్య ఐదు కోట్ల ఇరవై లక్షలకు చేరింది. నీతి ఆయోగ్ అంచనా ప్రకారమే చూస్తే, ప్రస్తుత పెండింగ్ కేసులు పూర్తి కావడానికి 580 సంవత్సరాలు పడుతుంది!! అప్పటికి వాదులూ ఉండరు, ప్రతివాదులూ ఉండరు. అటు, ఇటు వాదించే న్యాయవాదులూ ఉండరు! న్యాయం ఉంటుందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

దేవుని చేరే మార్గం

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

కళలన్నింటిలోనూ సంగీతం అతి ప్రాచీనమైనది. బొమ్మలు దేనినైతే స్పష్టంగా వ్యక్తీకరించలేవో, కవిత్వం పదాల ద్వారా వివరిస్తుంది. కానీ కవి కవిత్వం ద్వారా తెలుపలేని దానిని కూడా సంగీతం ద్వారా తెలుపవచ్చు. మత సంబంధమైన బాహ్య క్రియల ద్వారా జరుగు ఆత్మోన్నతి కంటే మించిన ఉన్నతిని సంగీతం మానవుని ఆత్మకు కలుగజేస్తుంది. అన్ని యుగాలలో ఆధ్యాత్మిక వేత్తలు, దివ్య జ్ఞాన సంపన్నులు సంగీతాన్ని అమితంగా ప్రేమించారు. సంగీతం సహాయంతో చేసే ధ్యానం అనాదిగా వస్తున్న ఒక రకమైన ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతి. సంగీతం అంతఃసంజ్ఞను విస్తరింప జేస్తుంది. ధ్యానించే వ్యక్తి హృదయ కవాటాన్ని తెరుస్తుంది. అలాగే ఆంతరంగిక, బాహ్య సౌందర్యాలను దర్శింప చేసి అతనిని అభివృద్ధి చేస్తుంది. ప్రతి వ్యక్తి పూర్ణత్వాన్నే కోరుకుంటాడు. అటువంటి పూర్ణత్వాన్ని కూడా సంగీతం సిద్ధింపచేస్తుంది.

శరీరానికి ఆహారం ఎట్లాగో, ఆత్మకు సంగీతం అటువంటిది. మనస్సు ఎల్లప్పుడూ చంచలంగా ఉంటుంది. అటువంటి మనస్సు ఆత్మను చేరడానికి కావలసిన శక్తిని సంగీతం చేకూరుస్తుంది. తొలి అనుభవాన్ని భవిష్యత్తులో కలుగబోవు పురోభివృద్ధిని దృఢపరుస్తుంది. ఉదాహరణగా ఒక శిశువును తీసుకుందాం. ఒక మారు జోలపాట వినిపిస్తూ శిశువును పడుకోబెడితే, ఆ శిశువు ప్రతిసారీ తనను పడుకోబెట్టినప్పుడు జోలపాట పాడితేనే నిద్ర పోయేలా తయారవుతుంది. అదే విధంగా ఏ వ్యక్తి ఆత్మ దర్శనాన్ని కోరుకుంటాడో ఆ వ్యక్తి అందుకు దోహదంగా ఉండడానికి సంగీతాన్ని మరల, మరల కోరుకుంటాడు. మనస్సునకు దైవ సామ్రాజ్యం లోనికి ఎగబాగడానికి కావలసిన పోషణ, ప్రేరణ, ఉత్సాహాలు సంగీతం ద్వారా లభిస్తాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.ఏకాదశి ప.10.14 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: శతభిషం ఉ.6.52 వరకు, తదుపరి పూర్వాభాద్ర తె.5.45 వరకు (తెల్లవారితే శుక్రవారం), వర్జ్యం: ప.12.58, నుండి 2.30 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.55 నుండి 10.45 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.43 వరకు, అమృతఘడియలు: రా.10.04 నుండి 11.36 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.13.

● బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి నగరానికి చెందిన వివాహిత యువకుడు ఓ బాలికతో కొన్ని రోజులుగా పరిచయం పెంచుకున్నాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని సీఐ చెప్పారు. ఆ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించం

కడప వీధుల్లో నినదించిన ముస్లిం మహిళలు | భారీ ఎత్తున ర్యాలీ

కడప కల్చరల్: వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించే ప్రసక్తే లేదని ముస్లిం మహిళలు తెగేసి చెప్పారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కడప ముస్లిం మహిళలు బుధవారం 'మేము సైతం' అంటూ భారీ సంఖ్యలో రోడ్డెక్కారు. ఉదయం అల్మాస్‌పేట సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో నగరంలోని పాఠశాలలు, మదరసాలతో విద్యార్థులతోపాటు గృహిణిలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మట్టిపెద్దపులి వీధి, రెండో గాంధీబొమ్మ, వన్‌టౌన్ సర్కిల్, గోకుల్ సర్కిల్ మీదుగా ఏడురోడ్ల కూడలికి ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ముస్లింల మేలు కోసమే వక్ఫ్ సవరణ చట్టమని చెబుతున్న ఎన్‌డీఏ ప్రభుత్వం వారి అణిచివేతకు కారణమవుతోందని, ఈ చట్టాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఇల్లు దాటి అడుగు బయటపెట్టని తాము ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా, తమ జీవితాలను బాగు చేసుకునేందుకు రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. ప్రధాని మోదీ కారణంగానే ఈ దుర్గతి పట్టిందని విమర్శించారు. వక్ఫ్ ఉద్యమ జేఏసీ నాయకులు బాబు భాయ్ మాట్లాడుతూ ముస్లిమేతర మత సంఘాల్లో తామెప్పుడు జోక్యం చేసుకోలేదని, ఈ చట్టం ద్వారా వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు ప్రవేశం కల్పించడం ఏం న్యాయమని నిలదీశారు. వక్ఫ్ ఉద్యమ జేఏసీ నేత సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ముస్లింలను అణిచివేతకు గురి చేస్తున్నట్లు ప్రధానికి కూడా స్పష్టంగా తెలుసునని విమర్శించారు. ర్యాలీ పొడవునా ముస్లిం మహిళలు 'మోదీ, బీజేపీ, జనసేన, టీడీపీ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేశారు.


కడపలో జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మహిళలు

ఇదేంధ'రొయ్యో'..!

అడ్డగోలుగా ధర తగ్గిస్తున్న సిండికేట్

పట్టించుకోని కూటమి సర్కారు

- ఆక్వా రైతుల్లో పెరుగుతున్న అసంతృప్తి
- ధరలు గిట్టుబాటు కావంటూ ఆవేదన
- సాగు సమ్మె దిశగా వేగంగా అడుగులు
- పశ్చిమగోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో పంట విరామం

ఇతర జిల్లాల్లోని రైతులందరిదీ అదే బాట



రొయ్య రైతులు విలవిల్లాడుతున్నారు. గిట్టుబాటు ధర రాక సతమతమవుతున్నారు. ట్రంప్ సుంకాల పేరు చెప్పి ఎగుమతిదారులు అడ్డగోలుగా ధరలు తగ్గించేయడంతో ఈ దుస్థితి తలెత్తింది. అయినా కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. సాగు సమ్మె బాట పడుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే పట్టుబడి పూర్తయిన 25 శాతం విస్తీర్ణంలో మెజార్టీ రైతులు పంట విరామం దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన, కంపెనీలు చెల్లిస్తున్న ధరలు తమకు ఏమాత్రం గిట్టుబాటు కావని ఆవేదన చెందుతున్నారు.

- సాక్షి, అమరావతి

పశ్చిమగోదావరిలో నిరసన గళం

వారం రోజుల క్రితం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం శిరగాలపల్లి, పాలకొల్లు మండలం చందుపర్రు గ్రామాల రైతులు సాగు సమ్మెకు శ్రీకారం చుట్టారు. తాజాగా ఇదే జిల్లాలో నరసాపురం మండలం తూర్పుతాళ్ల గ్రామంతోపాటు పోడూరు మండల రైతులు కూడా సాగు సమ్మెకు సిద్ధపడుతున్నారు. ఆక్వా సాగు ఇక చేయలేమని, క్రాప్ హాలిడే పాటించాలని నిర్ణయించామని చెరువుల వద్ద బోర్డులు పెట్టి మరీ నిరసన వ్యక్తం చేస్తున్నారు ఏలూరు, తూర్పుగోదావరి, కృష్ణా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతులూ సాగు సమ్మెకు సిద్ధమవుతున్నారు.

5.72 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు

రాష్ట్రంలో ఈ–ఫిష్ డేటా ప్రకారం 1.62 లక్షల మంది ఆక్వా రైతులు 5.72 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అత్యధికంగా ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోనే 1.20 లక్షల మంది 4.25 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు.

కౌంట్‌ల పేరిట.. అడ్డగోలు దోపిడీ

ప్రస్తుతం పెరిగిన లీజు, ఫీడ్, విద్యుత్ చార్జీల వల్ల రొయ్యలు 100 కౌంట్‌కు రావాలంటే కిలోకు రూ.220–250 వరకు ఖర్చవుతుంది. అదే 50 కౌంట్‌కు చేరాలంటే కిలోకు రూ.330–350 వరకు, గరిష్ఠంగా 30 కౌంట్‌కు రావాలంటే కిలోకు రూ.450 చొప్పున ఖర్చవుతుంది. కానీ ప్రస్తుతం 100 కౌంట్ రూ.230, 50 కౌంట్ రూ.325, 30 కౌంట్ రూ.425 చొప్పున కంపెనీలు ధరలు ప్రకటించాయి. ఈ ధరల్లోనూ ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ కంపెనీలు, వ్యాపారులతో పాటు గ్రామ స్థాయిలో రొయ్యలు కొనుగోలు చేసే షెడ్ల నిర్వాహకులు సిండికేట్‌గా మారి అడ్డగోలుగా కోత విధిస్తున్నారు. కిలోకు రూ.పది నుంచి రూ.30 వరకు కోత పెడుతున్నారు. 1–3 టన్నుల్లోపైతే 100 కౌంట్‌కు రూ.220, 50 కౌంట్‌కు రూ.310, 30 కౌంట్‌కు రూ.400 చెల్లిస్తున్నారు. అదే నాణ్యత కొంచెం తక్కువగా ఉంటే ధరలో ఇంకా భారీగా కోత పెడుతున్నారు.

ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు



ప్రస్తుతం ఉన్న ధరలు రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావట్లేదు. 100 కౌంట్‌కు కిలోకు రూ.220–250 వరకు ఖర్చవుతుంటే, కంపెనీలు రూ.230 ధరగా ప్రకటించాయి. అది కూడా 3 టన్నుల పైబడి అమ్మితేనే ఈ ధర. 3 టన్నులలోపు అయితే వ్యాపారులు అడ్డగోలుగా కోత కోస్తున్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. అందువల్లే సాగు సమ్మెకు దిగాల్సి వచ్చింది.

– మామిడిశెట్టి గిరిధర్
తూర్పుతాళ్లు, పశ్చిమగోదావరి జిల్లా

రూ.13 లక్షలు నష్టపోయాను



ఎగుమతి దారులు, ప్రాసెసింగ్ కంపెనీలు, వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారు. ఈ సీజన్‌లో ఎకరాకు 1.50 లక్షల రొయ్య పిల్లలు వేశాను. ఆరెకరాలకు రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టా. 70 కౌంట్ వచ్చింది. వ్యాపారులు ధర బాగా తగ్గించారు. కిలో రూ.280 చొప్పున ఇచ్చారు. రూ.17లక్షల రాగా, రూ.13 లక్షలు నష్టపోయా. గతంలో ఎప్పుడూ ఇలా లేదు.

– ఈమన రామాంజనేయులు
పోడూరు, పశ్చిమగోదావరి జిల్లా

అది పరువు హత్యే...!

యాస్మిన్ భాను కేసులో వీడిన మిస్టరీ

కులాంతర వివాహం చేసుకోవడంతో కూతుర్ని చంపిన తండ్రి

గొంతుకు తాడువేసి హత్య..

తండ్రి, సోదరుని అరెస్ట్


యాస్మిన్ తండ్రి షౌకత్ అలీ, సోదరుడు లాలా

చిత్తూరు అర్బన్: సంచలనం సృష్టించిన యాస్మిన్ భాను (26) అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ వీడింది. ఆమెది ఆత్మహత్య కాదని, పరువు హత్యేనని నిర్ధారణ అయ్యింది. కన్న కూతురు ఇతర మతస్తుడిని ప్రేమించి పెళ్లి చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక కూతురిని హత్య చేసిన తండ్రి షౌకత్ అలీ (56), వరుసకు సోదరుడు అయిన మహ్మద్ బాషా అలియాస్ లాలా (29)ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు అబ్దుల్ కలామ్ పరారీలో ఉన్నాడు. ఈ ఘటన వివరాలను చిత్తూరు టూటౌన్ సీఐ నెట్టికంటయ్య బుధవారం మీడియాకు వివరించారు.

పోలీసులను ఆశ్రయించినా లేని ఫలితం!

చిత్తూరులోని బాలాజీ కాలనీకి చెందిన షౌకత్ అలీ చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మింద గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. మూడో కూతురు యాస్మిన్ భాను బీటెక్ చదివే సమయంలో సాయితేజతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. భాను తన ప్రేమ విషయం పెద్దలకు చెబితే వారు అంగీకరించలేదు. పైగా తమ సమీప బంధువుతో ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన పెళ్లి చేయాలని నిశ్చయించి, అందరికీ శుభ లేఖలు కూడా పంచేశారు. అయితే ఫిబ్రవరి 6వ తేదీన యాస్మిన్ భాను, సాయితేజ ఒక ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. పెద్దల నుంచి ముప్పు ఉందంటూ చంద్రగిరి డీఎస్పీని కూడా ఆశ్రయించారు. దీనితో షౌకత్ అలీని చంద్రగిరికి పిలిపించి, వీళ్ల జోలికి వెళ్లొద్దంటూ కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. అటు తర్వాత సాయితేజ భార్యతో తన సొంత ఊరైన పూతలపట్టు మండలంలోని పోటుకనుమ గ్రామంలో కాపురం పెట్టాడు. కొద్ది రోజుల్లోనే తల్లి ముంతాజ్, ఇద్దరు అక్కలు యాస్మిన్ భానుతో ఫోన్‌లో మాట్లాడుకుంటూ దగ్గరయ్యారు.

నమ్మించి గొంతు నులిమి..

ఆగిపోయిన వ్యక్తితోనే పెళ్లి చేసి, కూతురిని దుబాయ్ పంపాలనుకున్న షౌకత్ అలీ.. ప్లాన్ బీ కూడా సిద్ధం చేసుకున్నాడు. అనారోగ్యంతో ఉన్న తండ్రిని చూసి వెళ్లాలని తల్లి కోరడంతో, ఏప్రిల్ 13వ తేదీన భర్తతో కలిసి యాస్మిన్‌భాను చిత్తూరుకు కారులో వచ్చింది. అప్పటికే మరో కారులో వేచివున్న లాలా, వారి మరో సమీప బంధువు అబ్దుల్ కలాం.. భానును వారి కారులో ఎక్కించుకుని అక్కడి నుంచి బయలు దేరారు. మధ్యలో తండ్రి షౌకత్ అలీ కూడా కారులో ఎక్కాడు. మాపాక్షి గ్రామ సమీపంలోకి వెళ్లిన తర్వాత, సాయితేజను వదిలేసి తాను చూసిన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని యాస్మిన్‌ను తండ్రి షౌకత్ కోరాడు. ఆమె ఎంతకూ ఒప్పుకోలేదు. దీనితో కూతురి కాళ్లను తొక్కిపెట్టి, అప్పటికే తెచ్చుకున్న తాడుతో ఆమె గొంతుకు బిగించి చంపేశాడు. ఆపై బాలాజీ కాలనీలోని తన ఇంటివద్దకు వెళ్లి మృతదేహాన్ని ఇంట్లో పడేసి వెళ్లిపోయాడు. తన కుమార్తె కొన ప్రాణాలతో ఉందేమోనని భావించిన తల్లి ముంతాజ్, స్థానికుల సాయంతో యాస్మిన్‌ను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన భర్త తిట్టడంతోనే భాను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ముంతాజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అనుమానాస్పద మృతిగా ఈ కేసును తొలుత పోలీసులు నమోదు చేశారు. తన భార్యను కుటుంబ సభ్యులే హత్య చేసినట్లు సాయితేజ పోలీసులకు చెప్పడం, యాస్మిన్ గొంతుకు రెండుసార్లు తాడు బిగించిన ఆనవాళ్లు ఉండటంతో కేసు దర్యాప్తు మరో దిశలో సాగింది. పరారీలో ఉన్న షౌకత్ అలీతో పాటు లాలాను పోలీసులు అరెస్టు చేసి, హత్యకు ఉపయోగించిన కారు, తాడును స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు కొనసాగుతోంది. అవసరమైతే మరికొందరు అరెస్టు అయ్యే అవకాశం ఉంది.

బీసీలపై టీడీపీ వర్గీయుల దాడి

- వైఎస్సార్‌సీపీకి మద్దతిస్తున్నారని దాష్టీకం
- ముగ్గురికి తీవ్రగాయాలు
- బాపట్ల జిల్లాలో దారుణం


గాయపడ్డ వెంకటాద్రి, లింగారావు

బల్లికురవ: వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తున్నారని, వారిని ఎలాగైనా ఊరి నుంచి గెంటేయాలని భావించిన టీడీపీ సానుభూతిపరులు కొందరు, బీసీ సామాజిక వర్గం ఇళ్లపైకి మూకుమ్మడిగా మారణాయుధాలతో దాడులకు తెగబడిన ఘటన ఇది. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ముక్తేశ్వరం పంచాయతీలోని రామాంజనేయపురంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో గోరంట్ల లింగారావు, వెంకటాద్రి ఆయన భార్య రామాంజమ్మ తీవ్రంగా గాయపడి, ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితులు తెలిపిన సమాచారం ప్రకారం, టీడీపీకి చెందిన సానుభూతిపరులు కమతం కొండయ్య, శ్రీనివాసరావు, అంకశాల అశోక్‌తో పాటు మరికొంత మంది మూడురోజులుగా బాధితుల ఇళ్ల వద్దకు వచ్చి దుర్భాషలాడారు. బుధవారం ఏకంగా రాడ్లు, గడ్డపారలతో వచ్చి తీవ్రంగా తిడుతూ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ముగ్గురి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.

అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ

ఈ దాడిపై బాధితులు బల్లికురవ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, ఎస్సై టీడీపీ సానుభూతిపరులకు కొమ్ముకాస్తూ, గాయాలపాలైన బాధితుల కేసు తీసుకోకుండా, దాదాపు 4 గంటలపాటు స్టేషన్‌లో ఉంచారు. దాడి విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. క్షతగాత్రులను చికిత్సకు వైద్యశాలకు తరలించకుండా, ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఎస్సైను ప్రశ్నిస్తూ, తన కారులో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సమాయత్తమయ్యారు. దీనితో వెంటనే ఎస్సై తానే వైద్యశాలకు పంపుతానంటూ బాధితులు ముగ్గురిని అద్దంకి వైద్యశాలకు తరలించారు. అద్దంకిలో ప్రాథమిక చికిత్స అనంతరం బాధితులను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కృష్ణబాబు మాట్లాడుతూ, గ్రామాల్లో ఈ తరహా దాడులు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇరు వర్గాలకు చెందిన ఆరుగురిపై రెండు కేసులు నమోదు చేయడం గమనార్హం.

రఘురామకృష్ణరాజు ప్రోద్బలంతోనే ఇళ్ల కూల్చివేత

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ధ్వజం

సాక్షి, అమరావతి: శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రోద్బలంతోనే ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను అన్యాయంగా కూల్చివేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానం చేసిన టీడీపీ నాయకులు ఇప్పుడు అన్యాయంగా ఇళ్లను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉండి నియోజకవర్గంలో ఇప్పటికే ఇళ్ల కూల్చివేత ద్వారా 800 కుటుంబాలను రోడ్డున పడేశారని, మరో 600 ఇళ్లను కూల్చేందుకు సిద్ధమయ్యారన్నారు. అల్లూరి సీతారామరాజు కాలనీ వెనుక భాగంలో 15 ఎకరాలను అక్రమంగా సాగు చేసుకుంటున్న భూస్వాముల జోలికి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. పిఠాపురంలో దళితుల్ని సాంఘిక బహిష్కరణకు గురిచేసిన పెత్తందార్లపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై టీడీపీ మూకల దాడి

గుంతకల్లు: అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం నెలగొండకు చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ మాజీ కోఆర్డినేటర్ పాటిల్ జయరామిరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ మూకలు దాడి చేశాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... పాటిల్ జయరామిరెడ్డి బుధవారం మధ్యాహ్నం గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కాంప్లెక్స్‌లో ఉన్న బేకరీ వద్ద స్నేహితుడు గోవిందు నాయక్‌తో కలిసి టీ తాగుతున్నారు. అదే సమయంలో నెలగొండకు చెందిన టీడీపీ నాయకులు సింగాడి శ్రీనివాసులు, బండమీద రాజ, పెద్ద సుంకన్న, జ్యోతప్పగారి సురేశ్ ఆయనపై దాడి చేశారు. దుర్భాషలాడుతూ కుటుంబ సభ్యులను దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. చొక్కాను చించేసి.. అంతు చూస్తామంటూ హెచ్చరించారు. చుట్టుపక్కల వారు ప్రతిఘటించడంతో జయరామిరెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ దాడిపై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.


దాడిలో గాయపడిన జయరామిరెడ్డి

పొగాకు రైతులను ఆదుకోవాలి

- గిట్టుబాటు ధర కల్పించాలి
- మాజీ మంత్రి మేరుగు డిమాండ్


ఈడీ బి.విశ్వశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న మేరుగు నాగార్జున, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి

కొరిటెపాడు(గుంటూరు): మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరులోని భారత పొగాకు బోర్డు కార్యాలయంలో బుధవారం బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) బి.విశ్వశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులెవరూ సంతోషంగా లేరని, ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

గత ప్రభుత్వంలో పొగాకుకు రికార్డుస్థాయి ధర

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా పొగాకు రైతులు ధైర్యంగా పంట పండించి అమ్ముకున్నారని మేరుగు గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రికార్డుస్థాయి ధరలను రైతులు చూశారని వివరించారు. 2019–20లో పొగాకు వ్యాపారులు సిండికేట్ అయి ధర తగ్గిస్తే నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి రూ.200 కోట్లు మంజూరు చేసి, మార్క్‌ఫెడ్ ద్వారా చివరి కిలో వరకు కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఫలితంగా ఆ తర్వాత వరుసగా మూడేళ్ల పాటు రైతులు మంచి ధర పొందారని వివరించారు. గత ప్రభుత్వంలో పొగాకు క్వింటా ధర రూ.36 వేల నుంచి రూ.38 వేల వరకు పలికిందని చెప్పారు.

ఇప్పుడు భారీగా పతనం

కూటమి సర్కారు వచ్చాక ధర భారీగా పతనమైందని అన్నారు. కంపెనీలు క్వింటా పొగాకును రూ.22 వేలు, రూ.23 వేలకు కొనడానికీ తటపటాయిస్తున్నాయని వివరించారు. వేలం కేంద్రానికి తీసుకొచ్చిన పొగాకు బేళ్లనూ సగానికి పైగా వ్యాపారులు తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017–18లో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా పొగాకు ధరలు దారుణంగా పడిపోయాయని గుర్తుచేశారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనే పొగాకు రైతులకు దుస్థితి దాపురించిందని పేర్కొన్నారు. పొగాకు రైతులకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అండగా నిలబడతారని స్పష్టం చేశారు.

న్యాయం జరిగేలా చూస్తాం: పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ

పొగాకు బోర్డు మాజీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇండెంట్ ఇచ్చిన ప్రతి పొగాకు వ్యాపారీ వేలంలో పాల్గొనేలా చూడాలని బోర్డు ఈడీ విశ్వశ్రీని కోరారు. దీనికి స్పందించిన పొగాకు ఈడీ విశ్వశ్రీ మాట్లాడుతూ పొగాకు రైతుల సమస్యలపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖతో మాట్లాడి, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈడీని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు రాజకుమార్ ఉన్నారు.


పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా


ఆసుపత్రిలో క్షతగాత్రుడికి అమిత్ షా పరామర్శ



ఉగ్రదాడి జరిగింది బైసారన్‌లోని ఈ పిక్నిక్ స్పాట్‌లోనే



పహల్గాం మృతులకు శ్రీనగర్‌లో కొవ్వొత్తులతో నివాళి

ఉగ్రవాదానికి భారత్ తలవంచదు

హోం మంత్రి అమిత్ షా ● పహల్గాం ఘటనాస్థలిని పరిశీలించిన మంత్రి

శ్రీనగర్/న్యూఢిల్లీ: ఉగ్రవాదానికి భారత్ ఏనాడూ తలవంచదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అమాయక పర్యాటకులపై ఉగ్రపంజా విసిరిన వారిని వదిలిపెట్టేదిలేదని ఆయన స్పష్టంచేశారు. బుధవారం ఆయన బైసారన్ ఉగ్రదాడి మృతులకు శ్రీనగర్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద నివాళులర్పించారు. 26 మంది బాధితుల మృతదేహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. అక్కడే ఉన్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులను ఓదార్చారు. దారుణదాడికి తెగబడిన వారిని చట్టం ముందు నిలబెడతామని వారికి హామీ ఇచ్చారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సైతం మృతులకు నివాళులర్పించారు. తర్వాత అమిత్‌షా అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్య బోధనాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి పరామర్శించారు. తర్వాత అమిత్‌షా ఘటనాస్థలికి చేరుకుని అక్కడి పరిసరాలను పరిశీలించారు. దాడి జరిగిన తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత కొద్దిసేపు హెలికాప్టర్‌లో ఏరియల్ వ్యూలో పాల్గొన్నారు. ''పహల్గాం ఉగ్రదాడి బాధితులకు భారమైన హృదయంతో తుది వీడ్కోలు పలికా. ఉగ్రవాదానికి భారత్ తలవంచదని పునరుద్ఘాటిస్తున్నా. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన వారిని వదిలిపెట్టబోమని బాధిత కుటుంబాలకు, యావత్ భారతావనికి మాట ఇస్తున్నా'' అని తర్వాత తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో అమిత్‌షా ఒక పోస్ట్‌పెట్టారు. ''తమ వాళ్లను కోల్పోయిన బాధిత కుటుంబాల బాధను యావత్ భారతదేశం అనుభవిస్తోంది. ఇంతటి విషాదాన్ని మాటల్లో వర్ణించలేం'' అని ఆయన మరో పోస్ట్ పెట్టారు. దాడి జరిగిన కొన్ని గంటల్లోపే అమిత్ షా కశ్మీర్‌కు చేరుకోగా జమ్మూకశ్మీర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నళిని ప్రభాత్, ఆర్మీ 15 కోర్ లెఫ్టినెంట్ జనరల్ ప్రశాంత్ శ్రీవాస్తవ తాజా పరిస్థితిని ఆయనకు వివరించారు. వెంటనే ఆయన లెఫ్టినెంట్ గవర్నర్‌తో కలిసి భద్రతా సమీక్ష సమావేశాన్ని ఏర్పాటుచేశారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు తలో రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1లక్ష పరిహారం ఇస్తున్నట్లు తెలిపింది. స్థానిక పోలీసులకు దర్యాప్తులో సాయపడేందుకు ఐజీ నేతృత్వంలోని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) బృందం ఢిల్లీ నుంచి కశ్మీర్‌కు బయల్దేరింది. దారుణదాడిని మూకుమ్మడిగా ఖండిస్తూ సంతాప సూచికగా కశ్మీర్ లోయ అంతటా బంద్ పాటించారు. ఇలా కశ్మీర్ అంతటా బంద్ పాటించడం గత 35 ఏళ్లలో ఇదే తొలిసారి. అధికార నేషనల్ కాన్ఫరెన్స్‌సహా పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, పీపుల్స్ కాన్ఫరెన్స్, అప్నీ పార్టీలు ఈ బంద్‌కు పిలుపునిచ్చాయి. కశ్మీర్‌లో ప్రచురితమయ్యే ప్రధాన దినపత్రికలన్నీ తమ ఫ్రంట్‌పేజీలను నల్లరంగులో ముద్రించాయి. అమానవీయ చర్యను వ్యాపార సంఘాలు, నేతలు, మీడియా సహా పౌర సమాజం మొత్తం ఖండిస్తోందంటూ పదునైన హెడ్డింగ్‌లతో పతాక శీర్షికలను ఎరుపు రంగులో ప్రింట్ చేశాయి. పలు చోట్ల శాంతియుత ర్యాలీలు జరిగాయి. దాడి నేపథ్యంలో కశ్మీర్ సందర్శనను పర్యాటకులు హఠాత్తుగా రద్దుచేసుకుని వెనుదిరిగే పక్షంలో శ్రీనగర్ రూట్‌లో విమానచార్జీలను ఒక్కసారిగా పెంచకూడదని విమానసంస్థలను పౌరవిమాన యాన శాఖ హెచ్చరించింది.



ముష్కరులు ఏడుగురు!

నరమేధంలో నలుగురు ● వారికి రక్షణగా ముగ్గురు

బాడీ కెమెరాల్లో చిత్రీకరణ ● అందరికీ పాక్‌లోనే శిక్షణ!

ఇద్దరు స్థానికుల సహకారం ● ఊహాచిత్రాలు విడుదల

శ్రీనగర్: నిస్సహాయులైన పర్యాటకులను చుట్టుముట్టారు. మగవారిని మాత్రం మహిళలు, పిల్లల నుంచి వేరు చేసి వరుసగా నుంచోబెట్టారు. ఒక్కొక్కరిగా కాల్చి పొట్టన పెట్టుకున్నారు. తమ పైశాచిక చర్యను ఆద్యంతం బాడీ కెమెరాల్లో చిత్రించారు. ఇదీ మంగళవారం నాటి పహల్గాం ఉగ్రదాడి సందర్భంగా ముష్కరులు వ్యవహరించిన తీరు! దాడిలో ఐదు నుంచి ఏడుగురు ఉగ్రవాదులు పాల్గొన్నట్టు భావిస్తున్నారు. నలుగురు పర్యాటకులపై పాయింట్ బ్లాంక్‌లో కాల్పులకు తెగబడుతుండగా ముగ్గురు మూడువైపులా నుంచుని పరిసరాలను కాపుకాశారని నిఘా వర్గాలు తెలిపాయి. ప్రత్యక్ష సాక్షులైన బాధితులు చెప్పిన వివరాలు, నిఘా సమాచారం ఆధారంగా ఈ మేరకు నిర్ధారించాయి. వారందరూ పాకిస్తాన్‌లోనే శిక్షణ పొందినట్టు వెల్లడించాయి. కనీసం ఇద్దరు స్థానిక మిలిటెంట్లు వారికి దాడిలో అన్నివిధాలా సాయపడ్డట్టు తేల్చాయి.



ఏడుగురు ఉగ్రవాదుల్లో ముగ్గురి ఊహాచిత్రాలను భద్రతా సంస్థలు మంగళవారం విడుదల చేశాయి. బాధితులు చెప్పిన వివరాల మేరకు బ్లాక్ అండ్ వైట్‌లో వాటిని రూపొందించారు. ముగ్గురూ గడ్డంతో ఉన్న యువకుల్లా కన్పిస్తున్నారు. ''వారంతా పాకిస్తానీలే. వారి పేర్లు ఆసిఫ్ ఫౌజీ, సులేమాన్ షా, అబూ తల్హా. మూసా, యూనుస్, ఆసిఫ్ అని కోడ్ నేమ్స్‌తో పిలుచుకున్నారు'' అని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఉగ్రవాదుల్లో ఒకరిని కశ్మీర్‌లోని బిజ్‌బెహారాకు చెందిన ఆదిల్ ఠోకర్ అలియాస్ ఆదిల్ గురీగా పోలీసులు గుర్తించారు.

పాక్‌కు పంచ్

▶ మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ చేరుకున్నారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీతో విమానాశ్రయంలోనే సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. పలు అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సాయంత్రం ఆరింటికి మోదీ సారథ్యంలో సీసీఎస్ అత్యవసరంగా సమావేశమైంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జైశంకర్, దోవల్, కేంద్ర కేబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ సింగ్, విక్రం మిస్రీ, ప్రధాని ముఖ్య కార్యదర్శులు పీకే మిశ్రా, శక్తికాంత దాస్, అత్యున్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు. సీసీఎస్ సభ్యురాలైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అమెరికా పర్యటనలో ఉండటంతో హాజరు కాలేదు. దాడిపై ప్రతిస్పందన ఎలా ఉండాలన్నదే ప్రధాన అజెండాగా భేటీ జరిగింది. దాడి జరిగిన తీరు తదితరాలను అమిత్ షా వివరించారు. 25 మంది భారతీయులు, ఒక నేపాల్ జాతీయుడు మృతి చెందినట్టు చెప్పారు.

శిక్షించి తీరతాం: మిస్రీ

పహల్గాం దాడిని సీసీఎస్ అత్యంత తీవ్రంగా ఖండించినట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ తెలిపారు. భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. దాడికి తెగబడ్డ ముష్కరులతో పాటు దాని సూత్రధారులను కూడా కఠినంగా శిక్షించి తీరాలని సీసీఎస్ తీర్మానించింది'' అని వెల్లడించారు. ముంబై దాడుల సూత్రధారుల్లో ఒకడైన తహవ్వుర్ రాణా మాదిరిగానే వారిని కూడా చట్టం ముందు నిలబెడతామని ప్రకటించారు. ''జమ్మూ కశ్మీర్‌లో విజయవంతంగా అసెంబ్లీ ఎన్నికలు జరిగి, ఆ ప్రాంతమంతా ఆర్థికాభివృద్ధితో కళకళలాడుతున్న వేళ పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిన కుట్రపూరిత దాడి ఇది. దాని వెనక దాగున్న సీమాంతర లింకులపై సీసీఎస్ లోతుగా చర్చించింది. ప్రపంచ దేశాలన్నీ దాన్ని అత్యంత తీవ్ర పదజాలంతో ఖండించిన తీరును ప్రశంసించింది. ఉగ్రవాదంపై రాజీలేని పోరులో భారత్‌కు ఆ దేశాల మద్దతుకు ఇది ప్రతీక అని పేర్కొంది. పాక్‌పై తీసుకున్న చర్యలను చదివి వినిపించారు.

పాక్‌పై దౌత్య చర్యలివే...


- సార్క్ వీసా మినహాయింపు పథకం (ఎస్‌వీఈఎస్) కింద పాక్ జాతీయులకు భారత వీసాల జారీ నిలిపివేత. ఇప్పటికే జారీ చేసిన వీసాల రద్దు. వాటిపై ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్తానీలు 48 గంటల్లో దేశం వీడాలని ఆదేశం.
- ఉగ్రవాదానికి పాక్ మద్దతివ్వడం మానుకునేదాకా 1960లో కుదుర్చుకున్న సింధు నదీ జలాల ఒప్పందం సస్పెన్షన్.
- భారత్, పాక్ మధ్య రాకపోకలు జరుగుతున్న పంజాబ్‌లోని అటారీ సరిహద్దు తక్షణం మూసివేత. దాని గుండా పాక్‌కు వెళ్లినవారు తిరిగొచ్చేందుకు మే 1 దాకా గడువు.
- ఢిల్లీలోని పాక్ హై కమిషన్ నుంచి రక్షణ, త్రివిధ దళాల సలహాదారు, వారి ఐదుగురు సహాయక సిబ్బంది బహిష్కరణ. వారంలోపు భారత్ వీడాలని ఆదేశం. ఇస్లామాబాద్‌లోని భారత హై కమిషన్ నుంచి భారత రక్షణ, త్రివిధ దళాల సలహాదారుల ఉపసంహరణ.
- ఇరుదేశాల హై కమిషన్లలో సిబ్బంది సంఖ్య 55 నుంచి 30కి తగ్గింపు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ కశ్మీర్‌లో బంద్

శ్రీనగర్/జమ్మూ: ఉగ్ర దాడిని కశ్మీర్ ముక్త కంఠంతో ఖండించింది. దాడిని తీవ్రంగా నిరసిస్తూ పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా ప్రజలు వీధుల్లోకి వచ్చారు. గత 35 ఏళ్లలో తొలిసారిగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శ్రీనగర్‌తో పాటు లోయవ్యాప్తంగా బంద్ పాటించారు! అధికార నేషనల్ కాన్ఫరెన్స్, విపక్ష పీడీపీ ఆధ్వర్యంలో శ్రీనగర్ తదితర చోట్ల శాంతియుతంగా ర్యాలీలు నిర్వహించారు.

పాక్ మల్లగుల్లాలు

ఇస్లామాబాద్: దౌత్య సంబంధాలకు కత్తెర వేస్తూ భారత్ తీసుకున్న తీవ్ర నిర్ణయాలతో పాకిస్తాన్ అవాక్కైంది. దీనిపై తగిన రీతిలో స్పందిస్తామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రకటించారు. ''ఆ దిశగా ప్రధాని షెహబాజ్ షరీఫ్ సారథ్యంలోని జాతీయ భద్రతా కమిటీ గురువారం కీలక నిర్ణయాలు తీసుకోంది'' అని ఆయన వెల్లడించారు.



గట్టిగా బదులిస్తాం

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రకటన

న్యూఢిల్లీ: పహల్గామ్‌లో ఉగ్రదాడితో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ గట్టి సమాధానం చెప్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంచేశారు. బుధవారం ఢిల్లీలో భారత వాయుసేన మార్షల్ అర్జన్‌సింగ్ స్మారకోపన్యాసం సందర్భంగా రాజ్‌నాథ్ మాట్లాడారు. ''ఈ కార్యక్రమం వేదికగా భారతీయులందరికీ నేను మాటిస్తున్నా. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరికీ భారత ప్రభుత్వం గట్టిగా బదులిస్తుంది. ఇందుకు ఏం చేయడానికైనా దేశం సిద్ధం. ఈ దాడిలో పాల్గొన్న వాళ్లను మాత్రమే వేటాడబోం. భారత గడ్డపై ఇలాంటి హేయమైన దాడులకు పాల్పడేలా ఈ ఉగ్రవాదులను ముందుండి నడిపించిన సూత్రధారులనూ బయటకు లాగుతాం. ఎంతో పురాతనమైన నాగరిక సమాజం మనది. ఇంత పెద్ద దేశాన్ని ఉగ్రదాడులతో భయపెట్టలేరు. ఉగ్రదాడులతో సంబంధం ఉన్న వాళ్లకు త్వరలోనే దీటుగా బదులిస్తాం. పహల్గాం దాడిని నిజంగా అమానవీయం. ఈ దాడి మనందరి మనసులను ఎంతగానో కలచివేసింది. అంతులేని విషాదాన్ని నింపింది. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించకూడదని భారత్ దృఢనిశ్చయంతో ఉంది'' అని రాజ్‌నాథ్ అన్నారు.

సుదీర్ఘంగా అత్యున్నత స్థాయి సమావేశం

రాజ్‌నాథ్ అధ్యక్షతన ఏకంగా రెండున్నర గంటలపాటు అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్రివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి, ఆర్మీ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై రాజ్‌నాథ్ సమీక్ష జరిపారు. సైనిక సన్నద్ధతను పెంచాలని, ఉగ్రవ్యతిరేక ఆపరేషన్లను ముమ్మరం చేయాలని రాజ్‌నాథ్ సూచించినట్లు తెలుస్తోంది. సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్చకొచ్చిన కీలక అంశాల వివరాలను అధికారికంగా వెల్లడిచేయలేదు.

ఈ దాడి.. దేశంపై దాడి

- ఉగ్రవాదాన్ని ఐక్యంగా ఎదుర్కొందాం
- ఈ విషయంలో యావత్ భారతావని ప్రభుత్వానికి అండగా ఉంటుంది: ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ/బెంగళూరు: పహల్గాం దాడిని భారత సార్వభౌమత్వం, సమగ్రతపై దాడిగా కాంగ్రెస్ అభివర్ణించింది. ఉగ్రవాదంపై పోరులో దేశం మొత్తం కేంద్ర ప్రభుత్వానికి అండగా ఉంటుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. దాడితో ప్రమేయమున్న ఉగ్రవాదులను వీలైనంత త్వరగా బంధించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో కలిసి పని చేయాలని, వారితో చర్చించాలని కోరారు. ఉగ్రవాదంపై పోరులో అన్ని రాజకీయ పార్టీల మధ్య ఐక్యత ఉందని చాటేలా అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలని, ఈ అంశంపై అఖిలపక్ష భేటీలో చర్చించాలని ఖర్గే కోరారు. బుధవారం బెంగళూరులో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఖర్గే మాట్లాడారు. ''దాడులతో భయకంపితులైన పర్యాటకుల్లో ప్రభుత్వం మళ్లీ విశ్వాసాన్ని పాదుకొల్పాలి. వారి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. దాడి ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జమ్మూకశ్మీర్ కాంగ్రెస్ చీఫ్ తారిఖ్‌లతో మాట్లాడా. ఈ దారుణమైన ఉగ్రవాద దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. ఉగ్రవాద దాడికి తగిన రీతిలో జవాబివ్వాలి. మనందరం ఒక్కటిగా కలిసి పోరాడతామని నిరూపిద్దాం'' అని ఖర్గే అన్నారు.

బాధితులకు న్యాయం చేయాలన్న రాహుల్

అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అక్కడి నుంచే 'ఎక్స్'లో పహల్గాం ఘటనపై స్పందించారు. ''బాధిత కుటుంబాలకు న్యాయం జరగాల్సిందే. వాళ్లకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయసహకారాలు అందాలి. కశ్మీర్‌లో ఇలాంటి ఘటనలు సర్వసాధారణం అన్నట్లు వ్యవహరించకుండా పూర్తి బాధ్యతాయుతంగా కేంద్రప్రభుత్వం కఠిన వైఖరిని అవలంబించాలి. ఈ విషయాన్ని చర్చించేందుకు ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేయాలి'' అని రాహుల్ అన్నారు.



విషాదం మిగిల్చిన వేడుకలు

ఒకరిది హనీమూన్, కొందరిది పెళ్లి రోజు ● మృతుల్లో ఇద్దరు మినహా అంతా హిందువులే

న్యూఢిల్లీ: ఒక జంటది హనీమూన్. కొందరిది పెళ్లి రోజు. ఇంకొందరికి ఎన్నో ఏళ్ల కల. పహల్గాం మారణకాండ 26 కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. ఒక్కొక్క పర్యాటకున్నీ పేరు, వ్యక్తిగత వివరాలు అడిగి మరీ ముష్కరులు బలి తీసుకున్న తీరు హృదయాలను కలచివేస్తోంది. దాదాపుగా అందరినీ ఆధార్ కార్డులు చూపించాలని, ఖురాన్ పంక్తులు అప్పజెప్పాలని అడిగి మరీ కాల్చేశారు. మృతుల్లో ఇద్దరు మినహా అంతా హిందువులే. వారిలో మహారాష్ట్రకు చెందిన వారు ఆరుగురు, గుజరాత్, కర్నాటక నుంచి ముగ్గురేసి, పశ్చిమబెంగాల్ నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, యూపీ, బిహార్, పంజాబ్, కేరళ, ఒడిశా, మధ్యప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీరితో పాటు ఒక నేపాలీ పర్యాటకునితో పాటు స్థానికుడు కూడా దాడిలో మరణించారు.

హార్స్ రైడింగ్‌కని బయటికొచ్చి...

ఉగ్ర కాల్పులకు బలైన వారిలో యూపీలోని కాన్పూర్‌కు చెందిన శుభం ద్వివేది అనే 31 ఏళ్ల వ్యాపారవేత్త కూడా ఉన్నాడు. ఆయనకు గత ఫిబ్రవరిలోనే పెళ్లైంది. భార్య, తల్లిదండ్రులు, సోదరి, ఆమె అత్తామామలు, బావమరిది తదితరులతో కలిసి సరదాగా గడిపేందుకు బైసారన్ వెళ్లాడు. మంగళవారం కుటుంబీకులంతా హోటల్‌కే పరిమితం కాగా భార్యతో కలిసి శుభం హార్స్ రైడింగ్‌కు వెళ్లాడు. ఉగ్రవాదులు అతన్ని కూడా పేరడిగారు. కల్మా చదవమన్నారు. రాదనడంతో నేరుగా తలపై కాల్చి భార్య కళ్లముందే పొట్టన పెట్టుకున్నారు.

- కేరళలోని ఎడప్పల్లికి చెందిన రామచంద్రన్ (65) కూడా కాల్పులకు బలయ్యాడు. పర్యాటకప్రియుడైన ఆయన భార్య, ఇటీవలే దుబాయ్ నుంచి వచ్చిన కూతురు, ఆమె పిల్లలతో కలిసి కశ్మీర్ వెళ్లాడు. వాళ్ల కళ్లముందే ఉగ్రవాదులు ఆయన్ను కాల్చేశారు. ఆయన్ను కూడా ఖురాన్ పంక్తులు చదవాలని అడిగి, తాను ముస్లింను కాదని చెప్పగానే చంపేశారు.
- ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన దినేశ్ మిరానియా అనే వ్యాపారవేత్త పెళ్లి రోజును సరదాగా జరుపుకునేందుకు కుటుంబీకులతో కలిసి పహల్గాం వచ్చారు. భార్యాపిల్లల కళ్లముందే ఉగ్ర తూటాలకు బలయ్యారు.
- కశ్మీర్ వెళ్లాలన్నది ఒడిశాకు చెందిన ప్రశాంత్ సత్పతి (41) కల. నెలల తరబడి డబ్బు కూడబెట్టి మరీ బైసారన్ వెళ్లాడు. భార్య, 9 ఏళ్ల కొడుకు కళ్లముందే నిస్సహాయంగా మృత్యువాత పడ్డాడు.

పోరాడిన పోనీవాలా

ఉగ్రవాదుల నుంచి పర్యాటకులను కాపాడేందుకు సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా (30) అనే స్థానిక పోనీవాలా వీరోచితంగా ప్రయత్నించాడు. ఉగ్రవాదుల నుంచి తుపాకులను లాక్కునే ప్రయత్నంలో వారి కాల్పులకు బలయ్యాడు. ఆదిల్ గొప్ప ధైర్య సాహసాలు ప్రదర్శించాడంటూ జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రస్తుతించారు. బుధవారం అతని అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.




ఆదిల్ తండ్రిని ఓదారుస్తున్న సీఎం ఒమర్ అబ్దుల్లా (ఇన్‌సెట్‌లో) ఆదిల్


లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ పార్థివదేహం వద్ద భార్య హిమాన్షీ రోదన (ఇన్‌సెట్‌లో) వినయ్

ఆ నవ వరుడు నేవీ అధికారి

పెళ్లైన ఆరు రోజులకే నూరేళ్లు

- విషాదాంతమైన హనీమూన్
- స్విట్జర్లాండ్ వెళ్లాల్సింది
- సెలవుల్లేవని పహల్గాంకు
- కన్నీటి నడుమ అంత్యక్రియలు
- గుండెలవిసేలా రోదించిన హిమాన్షీ
- 'జైహింద్' అంటూ భర్తకు తుదివీడ్కోలు

చండీగఢ్/కోచి/కర్నాల్: ఉగ్ర తూటాలకు బలైన భర్త. పక్కన హృదయ విదారకంగా రోదిస్తున్న నవ వధువు. మంగళవారం నుంచి వైరల్‌గా మారిన ఫొటో అందరినీ కంటతడి పెట్టిస్తున్న విషయం తెలిసిందే. అతడు నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్. హరియాణాలోని కర్నాల్‌కు చెందిన 26 ఏళ్ల వినయ్ ఏడాదిన్నరగా కేరళలోని కోచిలో పని చేస్తున్నారు. గురుగ్రాంకు చెందిన హిమాన్షీతో ఏప్రిల్ 16నే పెళ్లయింది! తర్వాత మూడు రోజులకు రిసెప్షన్ జరిగింది. ఇంట్లో పెళ్లి తాలూకు సందడి ఆదివారం దాకా కొనసాగింది. హనీమూన్‌కు స్విట్జర్లాండ్ వెళ్లాలని వినయ్ దంపతులు తొలుత భావించారు. సెలవులు తక్కువగా ఉండటంతో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసారన్‌ను ఎంచుకుని ఉగ్ర దాడికి బలయ్యారు. 'నువ్వు ముస్లింవా?' అని వినయ్‌ని అడిగిన టెర్రరిస్టులు, కాదని చెప్పి చెప్పడంతోనే భార్య కళ్లముందే కర్కశంగా కాల్చేశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం కర్నాల్‌లో సైనిక లాంఛనాల నడుమ ముగిశాయి. జనం ఇసుకేస్తే రాలనంతగా తరలివచ్చి ఘనంగా నివాళులర్పించారు. ఆ సందర్భంగా త్రివర్ణ పతాకంలో చుట్టిన భర్త శవపేటికను కౌగిలించుకుని హిమాన్షీ గుండెలవిసేలా రోదించడంతో అందరి కళ్లు చెమర్చాయి. కన్నీళ్ల మధ్యే 'జైహింద్' అంటూ సెల్యూట్ చేసి భర్తకు ఆమె తుదివీడ్కోలు పలికింది. ''వినయ్‌ని చూసి మేమంతా ఎంతో గర్వపడేవాళ్లం. తన ఆత్మకు శాంతి చేకూరాలి'' అంటూ మరోసారి కన్నీటి పర్యంతమైంది. హిమాన్షీ ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తోంది. వినయ్‌కి నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠీ, సహచర అధికారులు కూడా ఘనంగా నివాళులర్పించినట్టు నేవీ అధికార ప్రతినిధి ఎక్స్‌లో పేర్కొన్నారు. అంతకుముందు ఢిల్లీ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా వినయ్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఏమిటీ సింధూ నదీ జలాల ఒప్పందం?

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని భారత సర్కార్ సంచలన నిర్ణయం తీసుకోవడంతో ఈ నదీజలాల అంశం చర్చనీయాంశమైంది.

ఘర్షణతో మొదలై ఒప్పందం దాకా..

ఇరు దేశాల మధ్య విస్తరించి ఉన్న సింధూ నది, దాని ఉపనదుల జలాలను సాగు కోసం, జలవిద్యుత్‌ఉత్పత్తి, జల రవాణా, చేపల వేట తదితరాల కోసం వినియోగించుకునేందుకుగాను భారత్, పాకిస్తాన్ దశాబ్దాల క్రితం ఒక ఒప్పందం చేసుకున్నాయి. దాదాపు తొమ్మిదేళ్లపాటు విస్తృతస్థాయి చర్చల తర్వాత 1960 సెప్టెంబర్ 19వ తేదీన నాటి భారత ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్‌లు ఈ చరిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పందంలో పేర్కొన్న మేరకు సింధూ ఉపనదుల్లో తూర్పువైపుగా ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారత్‌కు హక్కులు దఖలుపడ్డాయి. సింధూ ఉపనదుల్లో పశ్చిమ దిశగా ప్రవహించే జీలం, చినాబ్‌లపై పాకిస్తాన్‌కు హక్కులు లభించాయి. ఈ నదీ జలాల వినియోగం, ఇరు దేశాల మధ్య ఉత్తరప్రత్యుత్తరాల కోసం ఒక సహకార యంత్రాంగాన్ని నెలకొల్పారు. ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా పరస్పర సహకారం భావనతో నదీజలాలను సద్వినియోగం చేసుకోవడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. భారత్ తన పాక్షిక హక్కు మేరకు పాకిస్తాన్ పరిధిలోని పశ్చిమ ఉపనదుల జలాలనూ పరిమితంగా వాడుకోవచ్చు. వ్యవసాయం, జలవిద్యుత్ ఉత్పత్తి కోసం వినియోగించుకోవచ్చు. అయితే పశ్చిమ దిశగా ప్రయాణించే జలాలు పాకిస్తాన్‌లోకి వెళ్లకుండా అడ్డుకోకూడదు. ఈ ఒప్పందంలో భాగంగానే గతంలోనే శాశ్వత సింధూ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. ఈ కమిషన్‌లో ఇరు దేశాలకు ప్రాతినిధ్యం ఉంది. ఇరు దేశాలు తమ అభ్యంతరాలను ఈ శాశ్వత కమిషన్ ద్వారా చెప్పుకోవచ్చు. ఈ నదీజలాలపై ఉద్దేశపూర్వకంగా డ్యామ్‌లను నిర్మించి, హఠాత్తుగా నీటిని వదిలి నీటిబాంబులుగా మార్చకూడదని షరతు పెట్టుకున్నారు. గడచిన ఆరు దశబ్దాల్లో ఈ నదీప్రవాహాల వెంట భౌగోళికంగా, రాజకీయంగా, పర్యావరణపరంగా చాలా మార్పులొచ్చాయి. జీలంకు ఉపనది అయిన కిషన్‌గంగ నదిపై భారత్ జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించింది. దీనిపై పాకిస్తాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. ప్రాజెక్టు కారణంగా తమ భూభాగంలోకి నదీజలాల ఉధృతి బాగా తగ్గిపోయిందని సింధూ నదీజలాల ఒప్పందానికి భారత్ తూట్లు పొడుస్తోందని పాకిస్తాన్ వాదిస్తోంది. భారత్, పాక్‌ల మధ్య గతంలో 1965, 1971, 1999లో యుద్ధాలు జరిగినా, పలుమార్లు ఉద్రిక్తతలు నెలకొన్నా సింధు జలాల ఒప్పందం అమలుకు నిరాటంకంగా కొనసాగడం విశేషం. అయితే ఇటీవలి కాలంలో డ్యామ్‌ల నిర్మాణం, నీటి వినియోగం తదితర అంశాలపై వివాదాలు ఎక్కువయ్యాయి. కిషన్‌గంగ, రాట్లే ప్రాజెక్టులపై పంచాయతీని పాకిస్తాన్ ప్రపంచబ్యాంక్ దాకా తీసుకెళ్లింది. అయితే తాజాగా ఒప్పందం నుంచి తాత్కాలికంగా భారత్ వైదొలిగితే ఇకపై కేంద్రప్రభుత్వం తనకు నచ్చినట్లు ప్రవర్తించే వీలుంది. అంటే జీలం, చినాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదీజలాలు పాకిస్తాన్‌కు స్వేచ్ఛగా ప్రవహించకుండా డ్యామ్‌లు కట్టే వీలుంది. అప్పుడు పాకిస్తాన్‌కు నీటి కష్టాలు పెరుగుతాయి. దీంతో దాయాదిదేశాన్ని జలసంక్షోభం చుట్టుముడుతుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

క్లుప్తంగా...

2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి

- 45.72 మీటర్ల ఎత్తులోనే పోలవరం
- బహుళ ప్రయోజనాలు, నదుల అనుసంధానం కోసమే నిర్ణయం
- నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



సాక్షి, విశాఖపట్నం/అన్నవరం: పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు పునరుద్ఘాటించారు. విశాఖలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. పోలవరం ఎత్తు విషయంలో రాజీపడటం లేదన్నారు. ప్రాజెక్టు బహుళ ప్రయోజనాలు, నదుల అనుసంధానం నెరవేరాలంటే 45.72 మీటర్ల ఎత్తులోనే ప్రాజెక్టు ఉండాలన్నారు. నిర్వాసితుల పరిహారం ప్రక్రియ పూర్తయ్యే వరకు 41.72 దగ్గర కాంటూరు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం కారణంగానే రూ.900 కోట్లతో డయాఫ్రమ్ వాల్ మళ్లీ నిర్మించాల్సి వచ్చిందని ఆరోపించారు.

హజ్ ఇన్‌స్పెక్టర్లకు ఆన్‌లైన్‌లో సీపీఆర్‌పై శిక్షణ

సాక్షి, అమరావతి: హజ్ యాత్ర విజయవంతం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్లడించారు. హజ్ యాత్ర పర్యవేక్షించే హజ్ ఇన్‌స్పెక్టర్లకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలందించేందుకు వీలుగా సీపీఆర్ (కార్డియో పల్మనరి రిససిటేషన్)పై ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏపీ ప్రయాణికులకు సహకారం అందించే 12 మంది రాష్ట్ర హజ్ ఇన్ స్పెక్టర్‌లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, రాష్ట్ర హజ్ కమిటీ, సిబ్బంది ఈశిక్షణలో పాల్గొన్నారు. హజ్ యాత్రలో అక్కడి వాతావరణంలో విపరీతమైన మార్పుల కారణంగా యాత్రికుల్లో కొందరికి ఆరోగ్యపరమైన చిక్కులు ఎదురవుతాయని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. గతంలో ప్రాణనష్టం జరిగిన సందర్భాలున్నాయని అందువల్ల క్షేత్రస్థాయిలో వైద్య రంగానికి సంబంధించిన కొంత అవగాహన కలిగి ఉన్నట్లయితే ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

చేనేత, జౌళి శాఖ బాధ్యతలు స్వీకరించిన సిసోడియా

సాక్షి, అమరావతి: సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్.పి.సిసోడియా బుధవారం రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ (పరిశ్రమలు, వాణిజ్య శాఖ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి శాఖకు సంబంధించిన అంశాలు, అమలులో ఉన్న పథకాలు, భవిష్యత్తు కార్యాచరణను సిసోడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సీఈఓ వీఆర్ విజయ రాఘవ నాయక్, చేనేత, జౌళి శాఖ అదనపు డైరెక్టర్లు మురళీకృష్ణ, శ్రీకాంత్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు ప్రత్యేక కౌన్సిల్



సాక్షి, అమరావతి: ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా 18 మంది సభ్యులతో స్టేట్ కౌన్సిల్ (ఏపీఎస్సీ)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ప్రతిపాదనను బుధవారం సీఎం చంద్రబాబు ఆమోదించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన ఏపీఎస్సీ వనరుల సమీకరణ, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించనుంది. ఏపీ శాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కొత్త హైపవర్ కౌన్సిల్లో మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

2029 నాటికి అర్హులకు శాశ్వత గృహాలు

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2029 చివరి నాటికి అర్హులకు శాశ్వత గృహాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ చెప్పారు. బుధవారం మల్టీ స్టేక్ హోల్డర్ హ్యాబిటాట్ ఫర్ హ్యుమానిటీ ఇండియా సహకారంతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజనను సమర్థవంతంగా అమలు చేసేందుకు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్లు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జైన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ గృహాలు పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తోందన్నారు. పీఎంఏవై 2.0 కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహకారం అందిస్తున్నాయన్నారు. 2026 నాటికి 7.32 లక్షల పురోగతిలో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని ప్రతిపాదించారు. ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ కోసం సీఎం సూర్య ఘర్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ శివప్రసాద్, హెచ్ఎఫ్‌హెచ్ జాతీయ డైరెక్టర్ ఆనంద్ బోలిమెరా తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆరు రాష్ట్రాల విద్యార్థులు రావద్దు

ఆస్ట్రేలియా వర్సిటీల నిషేధం

- విద్యార్థి వీసాల ముసుగులో అక్రమ వలసల నిరోధానికి చర్యలు
- హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్ విద్యార్థులపై కఠిన ఆంక్షలు
- వీసాల మంజూరుకు పొదుపు మొత్తం పెంపు
- చట్టబద్ధమైన దరఖాస్తుదారుల భవితవ్యంపై తీవ్ర ప్రభావం
- ట్రంప్ ఎఫెక్ట్‌తో ప్రత్యామ్నాయానికై చూస్తున్న విద్యార్థులకు శరాఘాతం

విద్యార్థి వీసాల ముసుగులో అక్రమ వలసల నిరోధానికి ఆస్ట్రేలియా చేపట్టిన చర్యలు భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఆస్ట్రేలియాలోని అనేక యూనివర్సిటీలు భారత విద్యార్థుల నమోదును నిషేధించాయి. ముఖ్యంగా హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంపై కఠిన నిబంధనలు, పరిమితులు విధించాయి. ఈ ఆరు రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులు నకిలీ ధ్రువీకరణ పత్రాలతో వీసాలు పొందుతూ వలస విధానాలకు తూట్లు పొడుస్తున్నారని వర్సిటీలు గుర్తించాయి. నియంత్రణ లేని ఏజెంట్లు, విదేశీ కన్సల్టెన్సీల ప్రతినిధులు, కొందరు ఆపరేటర్లు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని సమాచారం. ఫలితంగా విద్యార్థులు అడ్డదారులు తొక్కుతున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రభావం మొత్తం భారతదేశ విద్యార్థులపై పడే ప్రమాదం నెలకొంది.

\- సాక్షి, అమరావతి

ప్రతి నాలుగు దరఖాస్తుల్లో ఒకటి నకిలీ..

భారత్ నుంచి వచ్చే ప్రతి నాలుగు విద్యార్థి వీసా దరఖాస్తుల్లో ఒకటి నకిలీదిగా ఆస్ట్రేలియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ అఫైర్స్ ధ్రువీకరించింది. భారత్ నుంచి వచ్చే మొత్తం దరఖాస్తుల్లో దాదాపు 24.3 శాతం మోసపూరితమైనవని చెబుతోంది. అంతర్జాతీయ వర్సిటీలకు అతిపెద్ద విద్యార్థి వనరుగా భారత్ ఉంది. ఈనేపథ్యంలో ఆస్ట్రేలియా వర్సిటీల తాజా నిషేధంతో చట్టబద్ధమైన దరఖాస్తుదారుల భవితవ్యం గందరగోళంలో పడుతోంది. ఈ సమస్యను దౌత్యపరంగా పరిష్కరించకుంటే ద్వైపాక్షిక విద్యా సంబంధాలు ప్రభావితమవుతాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ విద్యార్థుల వీసాలకు సంబంధించి కఠినమైన నిబంధనలను అమలు చేసిన తర్వాత ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్న భారత విద్యార్థులకు ఆస్ట్రేలియా వర్సిటీల నిర్ణయం శరాఘాతమేనని నిపుణులు చెబుతున్నారు.



వలసలను తగ్గించేందుకు..

గత ఏడాది రికార్డు స్థాయిలో వలసలను నియంత్రించే యత్నంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం వర్సిటీలను హెచ్చరించింది. విద్యార్థి వీసా మంజూరుకు పొదుపు డిపాజిట్ మొత్తాన్నీ పెంచింది. గత ఏడాది మే 10 నుంచి విద్యార్థి వీసా మంజూరుకు కనీసం రూ.16.30 లక్షలు (29,710 ఆస్ట్రేలియన్ డాలర్ల) బ్యాంకు ఖాతాల్లో ఉన్నట్టు ఆధారాలు సమర్పించాలని ఆదేశించింది. అంతకుముందు 2023 అక్టోబర్‌లో పొదుపు మొత్తాన్ని రూ.11.46 లక్షల నుంచి రూ.13.35 లక్షలు (21,041 ఆస్ట్రేలియన్ డాలర్ల నుంచి 24,505 ఆస్ట్రేలియన్ డాలర్లకు)కు పెంచింది.

మద్యం దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

ఏం ప్రచార కార్యక్రమాలు చేపట్టారు?.. బడ్జెట్ కేటాయింపులు ఎంత చేశారు?

పూర్తి వివరాలను మా ముందుంచండి
ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: మద్యపానం దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అవగాహన కల్పించేందుకు చేపట్టిన ప్రచార కార్యక్రమాలు ఏంటి? వాటికి ఎంత బడ్జెట్ కేటాయింపులు చేశారు? తదితర వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వానికి తేల్చి చెప్పింది. అలాగే మద్యపానాన్ని మాన్పించేందుకు ఉద్దేశించిన డీ అడిక్షన్ కేంద్రాల వివరాలనూ తమ ముందుంచాలని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 16కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఓ వ్యక్తికి ఓ నెలలో గరిష్టంగా విక్రయించే మద్యం బాటిళ్ల విషయంలో పరిమితిని విధించడంతోపాటు మద్యం విక్రయాలన్నింటినీ ఆధార్ లింక్ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ విశాఖపట్నంకి చెందిన వైద్యురాలు డాక్టర్ షిరిన్ రహ్మాన్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వి.రఘు వాదనలు వినిపిస్తూ, ఓ వ్యక్తికి గరిష్ఠ మద్యం బాటిళ్ల విక్రయంపై నిర్దిష్ట నిబంధనలు ఉన్నా.. అమలు కావడం లేదని పేర్కొన్నారు. డీ అడిక్షన్ కేంద్రాల నిర్వహణ సరిగా లేదని వివరించారు. ఎంత మంది ఆ కేంద్రాల్లో చికిత్స పొందుతున్న వివరాలేవీ ప్రభుత్వం వద్ద లేవని పేర్కొన్నారు. ధర్మాసనం స్పందిస్తూ, మద్యపానం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం లేదని, అవగాహనకు సంబంధించిన ప్రచారాన్ని తామెక్కడా చూడటం లేదని పేర్కొంది. మద్యం విక్రయాల ద్వారానే ప్రభుత్వాలకు అత్యధిక ఆదాయం వస్తోందని, అందువల్ల మద్యం అమ్మకాలను నియంత్రించే స్థితిలో ప్రభుత్వం ఉండదని తెలిపింది. అయితే మద్యపానం వల్ల తలెత్తే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవసరమైన ప్రచార కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. ప్రచార కార్యక్రమాల కోసం కొంత నిధులనూ కేటాయించాలంది.

కరువు మండలాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తాం

ఈ వేసవి సెలవుల నుంచే చర్యలు తీసుకుంటాం
హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: కరువు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఈ వేసవి సెలవుల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. ఆ మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఈ వివరాలను రికార్డ్ చేసిన హైకోర్టు, పిల్‌ను పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కరువు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు వేసవి సెలవుల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా, ప్రభుత్వ న్యాయవాది (జీపీ) గుర్రం రామచంద్రరావు స్పందిస్తూ, ఈ వేసవిలో కరువు మండలాల్లోని పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు.



ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సిందే

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాల్సిందే
పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: వ్యక్తులపై వచ్చే ఫిర్యాదులను వాటి ఆధారంగా నమోదు చేసే ఎఫ్ఐఆర్‌లను ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసి తీరాల్సిందేనని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను నిజమైన స్ఫూర్తితో అమలు చేసి తీరాల్సిందేనని తేల్చి చెప్పింది. ఇప్పటికే ఇదే విషయంపై 2022లో ఇదే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఇటీవల తీర్పు వెలువరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఫిర్యాదులను, ఎఫ్ఐఆర్‌లను పోలీసులు తమ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇంటూరి రవికిరణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, పోలీసులు సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసి తీరాలని 2022లో ఇదే హైకోర్టు పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు.

సెక్షన్ 3 ప్రకారం కృష్ణాజలాల పంపిణీతో

ఏపీకి తీరని నష్టం

సుప్రీంకోర్టుకు తెలిపిన ఆంధ్రప్రదేశ్



సాక్షి, న్యూఢిల్లీ: అంతర్‌రాష్ట్ర నదీజలాల చట్టం–1956లోని సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాల పునఃపంపిణీ కోసం కేంద్రం జారీచేసిన నూతన మార్గదర్శకాల వల్ల ఏపీకి తీరని నష్టం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. గతంలోని కేటాయింపులు కాకుండా ఇప్పుడు మళ్లీ కేటాయింపులను మొదటి నుంచి పరిశీలించేలా విధివిధానాలను ఖరారు చేయడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతుందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం దృష్టికి ఏపీ ప్రభుత్వం తీసుకెళ్లింది. కృష్ణాజలాల పంపిణీకి సంబంధించి ట్రిబ్యునల్‌కు కేంద్రం జారీచేసిన సెక్షన్ 3ను రద్దుచేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. నదీజలాల కేటాయింపు విషయంలో గతేడాది తీసుకున్న కేంద్ర నిర్ణయం ఆమోదయోగ్యం కాదని, నదీజల వివాద చట్టం ప్రకారం బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు ఇలా అదనపు అంశాలు పరిశీలించే అధికారం లేదని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు. గతంలో కృష్ణానది జలాల పంపిణీలో భాగంగా ఏపీకి 811 టీఎంసీలు కేటాయించగా.. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారని తెలిపారు. అయితే ఈ కేటాయింపులను మళ్లీ మొదటి నుంచి పరిశీలించేలా విధివిధానాలు ఖరారు చేయడం వల్ల ఏపీకి తీవ్ర అన్యాయం జరిగే అవకాశముందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం కోర్టు సమయం ముగియడంతో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన తదుపరి వాదనలు గురువారం లేదా మరోరోజు వింటామని ధర్మాసనం తెలిపింది.


పిల్ వేసి వెనక్కి తీసుకుంటామంటే కుదరదు

రెండు వ్యాజ్యాల్లో పిటిషనర్లకు
సీజే ధర్మాసనం ఆదేశం

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో సమీకృత బీఎస్ఎం ప్రాజెక్ట్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ఫైనాన్సింగ్, నిర్మాణం, నిర్వహణకు సంబంధించి అర్హుల నుంచి ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) బిడ్‌లను ఆహ్వానించడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) ఉపసంహరించుకుంటామని పిటిషనర్ చెప్పడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ముందు లక్ష రూపాయలను తమ ముందు డిపాజిట్ చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యాల పేరుతో కోర్టులను ఇతర అవసరాలకు వాడుకుంటామంటే అంగీకరించబోమని తేల్చి చెప్పింది. అవసరమైతే ఈ వ్యాజ్యాన్ని ఎందుకు ఉపసంహరించుకుంటున్నారో తేల్చేందుకు కోర్టు సహాయకారిని (అమికస్ క్యూరీ) కూడా నియమిస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను.. వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వీరయ్యచౌదరి హత్య కేసులో దోషుల్ని వదిలిపెట్టం

సీఎం చంద్రబాబు



నాగులుప్పలపాడు: వీరయ్య చౌదరి హత్యకేసులో దోషుల్ని వదిలిపెట్టే ప్రసక్తి లేదని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో హత్యకు గురైన బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్యచౌదరి మృతదేహానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఎం వీరయ్య చౌదరి మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్లలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిందని, నేర రాజకీయాలకు పాల్పడే వారిని తుదముట్టించే వరకు తన పోరాటం ఆగదని చెప్పారు. వీరయ్యచౌదరి హత్య కేసుకు సంబంధించి 12 బృందాలు మూడు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయన్నారు. వీరయ్యచౌదరిని కరుడుగట్టిన నేరస్తులు కూడా చేయని విధంగా హత్య చేశారన్నారు. 53 చోట్ల కత్తిపోట్లు ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలో ఇలాంటి ఘోరాలు జరగడం జీర్ణించుకోలేకపోతున్నానన్నారు. సీఎం వెంట హోం మంత్రి వంగలపూడి అనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు బీఎస్ విజయ్‌కుమార్, ఎంఎం కొండయ్య, రాజేష్, ఏలూరి సాంబశివరావు, అశోక్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

గోనవరం @ 44 డిగ్రీలు



135 చోట్ల 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదు


సాక్షి, అమరావతి/ సాక్షి, విశాఖపట్నం: నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఈ వేసవిలో ఇప్పటిదాకా ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. ప్రకాశం జిల్లా గొల్లవిడిపిలో 43.8, వైఎస్సార్ జిల్లా మద్దూరులో 43.6, కర్నూలు జిల్లా తోవిలో 42.9, పల్నాడు జిల్లా నర్మలపాడులో 42.8, నెల్లూరు జిల్లా ఉదయగిరిలో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విజయవాడలో 40.3, తిరుపతిలో 39 డిగ్రీల ఎండలు కాసాయి. వైఎస్సార్ జిల్లాలోని 28 ప్రాంతాలు, నంద్యాల 22, ప్రకాశం 17, పల్నాడు 14, కర్నూలు 10, ఇతర చోట్లు కలిపి మొత్తం 135 ప్రాంతాల్లో 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం శ్రీకాకుళం జిల్లాలోని 6, విజయనగరం–15, పార్వతీపురం మన్యం–9, మొత్తం 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, 29 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. గడిచిన 24 గంటల్లో అల్లూరి జిల్లా హుకుంపేటలో 41 మి.మీ., పెదబయలులో 31, చింతపల్లిలో 30, జీకే వీధిలో 18, పాడేరులో 16.5 మిమీ వర్షం కురిసింది.

టెన్త్‌లో బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ



సాక్షి, అమరావతి: పదో తరగతి ఫలితాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే(ఎంజేపీ) బీసీ గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు పరిశీలిస్తే.. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లతో సమానంగా ఎంజేపీ బీసీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. ఏపీ మోడల్ స్కూళ్లు 84 శాతం, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు 89.5 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ 67.6 శాతం, కేజీబీవీలు 83 శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 71.9 శాతం, ఎయిడెడ్ స్కూళ్లు 73.3 శాతం, మున్సిపల్ పాఠశాలలు 69.3 శాతం, ప్రభుత్వ పాఠశాలలు 62.7 శాతం, ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లతో సమానంగా ఎంజేపీ స్కూళ్లు కూడా 95 శాతం మేర ఫలితాలు సాధించడం విశేషం. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల్లోనూ ఎంజేపీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సొంతం చేసుకున్నారు. 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవగా వారిలో 95 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 29 స్కూళ్లు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. రాష్ట్ర స్థాయి కంటే అధికంగా ఎంజేపీ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం నమోదుపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు విజయంలో భాగమైన ఉపాధ్యాయులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

● అనుబంధం


● ఇల్లరికం అల్లుళ్ల గ్రామంగా పేరొందిన మద్నూర్

'ఇల్లరికంలో ఉన్న మజా అది అనుభవించితే తెలియునులే... భలే ఛాన్సులే' అంటుంది సుపరిచిత సినిమా పాట. 'మజా' సంగతి ఎలా ఉన్నా 'ఇల్లరికం అల్లుడు' అంటే మజాకా కాదు. అత్తామామలను కన్నతల్లిదండ్రుల్లా చూసుకునే మంచి మనసు ఉండాలి. ఈ విషయంలో నూటికి నూరు మార్కులు తెచ్చుకున్నారు మద్నూర్ మండల ఇల్లరికం అల్లుళ్లు...

ఆ ఊళ్లో అల్లుడే పెద్దకొడుకు


● గడ్డం వార్ నడిపి గంగారాం, మల్లికార్జున్


● గంపల్‌వార్ నాగనాథ్


● తాడిచెట్లవార్ సచిన్


● గడ్డంవార్ మల్లికార్జున్


● కన్నవార్ మణికంత

మహారాష్ట్రకు సరిహద్దుల్లో ఉన్న కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో గల్లీకో నలుగురు ఇల్లరికం అల్లుళ్లు ఉంటారు. అందులో రెండు మూడు తరాల వాళ్లున్నారు. ఒకటి రెండు కుటుంబాల్లో మామ, అల్లుడు ఇద్దరూ ఇల్లరికం వాళ్లే ఉన్నారు. ఇంట్లో అందరూ ఆడపిల్లలు ఉన్న కుటుంబాల వాళ్లు తమ బంధువుల అబ్బాయిలను, తెలిసిన వాళ్ల అబ్బాయిలను, బంధుత్వం లేని వాళ్లను కూడా ఇల్లరికం తెచ్చుకుని వారికి తమ కూతురిని ఇచ్చి పెళ్లి చేస్తారు.

అత్తగారి ఇల్లే....అమ్మగారి ఇల్లు

ఇల్లరికం వచ్చిన అల్లుల్లు అత్తారింటిలో భాగం అయిపోతారు. ఇక్కడి ఇంటి పేరే వారి ఇంటి పేరుగా మారిపోతుంది. సంతానం లేని కుటుంబాల్లో దగ్గరి బంధువుల అమ్మాయిని దత్తత తీసుకుని, వేరే అబ్బాయిని ఇల్లరికం తెచ్చుకుని పెళ్లి చేసి ఇంట్లో పెట్టుకుంటారు. ఇల్లరికం వచ్చిన అల్లుళ్లు అన్నీ తామై కుటుంబాన్ని ముందుకు నడిపిస్తున్నారు.

అల్లుడే కుమారుడై...

మగ సంతానం లేకపోవడంతో ఇల్లరికం అల్లుడిని తెచ్చుకునే పద్ధతిని చాలామంది పాటిస్తున్నారు. కుటుంబ బరువు, బాధ్యతలు మోయడంతో పాటు, వృద్ధాప్యంలో అత్తామామలకు ఆసరాగా ఉంటున్నారు అల్లుళ్లు. దశాబ్దాలుగా ఇది కొనసాగుతోంది.

మంచిగ చూసుకుంటరు...

మామ... అల్లుడు ఇద్దరూ ఇల్లరికమే...

మద్నూర్‌లో గడ్డంవార్ నడిపి గంగారాం 1966లో ఆ ఇంటికి ఇల్లరికం వచ్చాడు. ఆయనే ఆ ఇంటికి కొడుకైనా, అల్లుడైనా. ఆయనకు నలుగురు ఆడపిల్లలు. ముగ్గురు పెళ్లిళ్లు చేసిన తరువాత నాలుగో కూతురికి ఇల్లరికం అల్లుడిని తెచ్చుకోవాలనుకున్నారు. 2000 సంవత్సరంలో మల్లికార్జున్‌ను ఇల్లరికం తెచ్చుకుని నాలుగో కూతురితో పెళ్లి జరిపించాడు. అప్పటి నుంచి ఇంటి బాధ్యతలు మల్లికార్జున్ చూసుకుంటున్నాడు.

అల్లుళ్ల సంఘం!

మద్నూర్ మండల కేంద్రంలో ఇల్లరికం అల్లుళ్లు కలిసి ఒక సంఘం పెట్టుకోవాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఊళ్లో ఇల్లరికం అల్లుళ్ల పేర్లతో జాబితాను రూపొందించుకున్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి వంటి పదవులకు కూడా పేర్లు నిర్ణయించుకున్నారు. ఎందుకోగానీ సంఘం పెట్టుకోవాలనే వారి కల కలగానే మిగిలిపోయింది.



చిన్న చూపు చూడలేదు... చిన్న సమస్యా రాలేదు

మా ఆయన ఇల్లరికం వచ్చిండు. మాకు అందరు బిడ్డలే. మేమూ అల్లున్ని ఇల్లరికం తెచ్చుకున్నం. ఎప్పుడు గూడా చిన్న సమస్య రాలేదు. అందరం మంచిగనే ఉంటం. ఇల్లరికం అని ఎవరినీ ఎవరూ చిన్న చూపు చూడలేదు. కలిసి మెలిసి ఉండి ఎవరి పని వాళ్లు చేసుకుంటుంటరు.

- గడ్డంవార్ చంద్రకళ

తాడిచెట్లవార్ సచిన్ సొంతూరు మహారాష్ట్రలోని సావర్మల్. అత్తమామలు తాడిచెట్ల అంజయ్య, రుక్మిణీలకు మగసంతానం లేరు. 2021లో సచిన్‌ను ఇల్లరికం తెచ్చుకున్నారు. 'మా అత్తామామలకు కొడుకు, అల్లుడు అన్నీ నేనే. వ్యాపారం చూసుకుంటాను. ఇంటి వ్యవహారాలన్నీ నేను చూస్తాను. అందరం చాలా బాగా ఉంటాం' అంటున్నాడు సచిన్.

'మాది మద్నూర్ మండలం పెద్ద ఎక్లారా. మా అత్తమామలకు ఒకతే ఆడపిల్ల కావడంతో 2022లో నన్ను ఇల్లరికం అల్లుడిగా తీసుకుని పెళ్లి జరిపించారు. ఇంట్లో అందరూ మంచిగ చూసుకుంటరు. నేను బిజినెస్ చేస్తున్నాను. ఇంట్లో అందరి సహకారం బాగుంది. ఎవరూ తేడా చూపరు' అంటున్నాడు కన్నవార్ మణికంత.

'2003 లో నేను ఇల్లరికం వచ్చాను. అల్లుడినైనా కొడుకులాగా మా అత్తామామలను చూసుకోవాలి. ఏ ఇబ్బందీ లేకుండా సంతోషంగా ఉన్నాం' అంటున్నాడు గంపల్‌వార్ నాగనాథ్.

'నాకు ముగ్గురు పిల్లలు. వాళ్లను బాగా చదివిస్తున్నాను. మా అత్తమామ నన్ను కొడుకులా చూసుకుంటారు. నాకు వాళ్లే తల్లిదండ్రులు' అంటున్నాడు గడ్డంవార్ మల్లికార్జున్. ఇవన్నీ చూస్తుంటే మనం మొదట్లో పాడుకున్న పాటకు తగ్గట్టే ఉన్నారు అనిపిస్తోంది కదా!

- ఎస్. వేణుగోపాలాచారి
సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

● సమ్‌థింగ్ స్పెషల్




ఇది రొటీన్ రేస్ కాదు!

ఈ నెల 25న ప్రపంచంలోనే తొలిసారిగా లాస్ ఏంజిల్స్‌లో 'లైవ్ స్పెర్మ్ రేస్' జరగనుంది. జీవనశైలిలో మార్పులు... మొదలైన వాటివల్ల పురుషుల్లో పెరుగుతున్న సంతాన లేమి అనే క్లిష్టమైన సమస్యపై ఈ రేస్ దృష్టి సారిస్తుంది.

'ఎవరి స్పెర్మ్ హెల్తీయెస్ట్? ఫాస్టెస్ట్?' అనే దానిపై జరిగే పోటీ ఇది.

పోటీ ఎలా ఉంటుంది? అనే విషయానికి వస్తే...

నిజమైన స్పెర్మ్‌తో కూడిన రేస్ ఇది. మానవ ప్రత్యుత్పత్తి మార్గాన్ని అనుసరించేలా మైక్రోస్కోపిక్ రేస్ ట్రాక్ రూపొందించారు. సింక్రనైజ్డ్ స్టార్టర్‌లతో రసాయన సంకేతాలు, ఫ్లూయిడ్ డైనమిక్స్ కోర్సు ద్వారా స్పెర్మ్ నమూనాలు ఈత కొట్టేలా చేస్తారు. ఈ పోటీని యాక్షన్ హై-రిజల్యూషన్ కెమెరాతో రికార్డ్ చేస్తారు.



విజేతను నిర్ణయించడానికి మూడు రేసులు జరుగుతాయి. ప్లే-బై-ప్లే కామెంటరీ అలరిస్తుంది.

ఇన్‌స్టంట్ రీప్లే, కామెంటరీ, గణంకాలు, లీడర్ బోర్డ్‌లు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లను అభిమానులు ఆస్వాదించేలా చేస్తుంది.

ఈ రేస్‌లో బెట్టింగ్ కూడా ఉంటుంది! అత్యంత వేగంగా ఈత కొట్టే స్పెర్మ్‌పై అభిమానులు పందెం కట్టవచ్చు.

'ఏ లాఫ్ విత్ ఏ డీపర్ పర్పస్' నినాదంతో ఈ రేస్‌కు శ్రీకారం చుట్టారు.

యువ మిలియనీర్‌ల బృందం ఈ విచిత్ర పోటీని నిర్వహిస్తోంది.

ఒక్క ముక్కలో చెప్పాలంటే హెల్త్, టెక్, ఎంటర్‌టైన్‌మెంట్‌లను మిళితం చేసి రూపొందించిన రేస్ ఇది.

'ఎవరూ టచ్ చేయని అంశాన్ని తీసుకొని ఆసక్తికరంగా ఈ రేస్‌ను రూపొందించాం. ఇది పురుషుల సంతానలేమి గురించి ప్రజలు నిస్సంకోచంగా మాట్లాడుకునేలా చేస్తుంది' అంటున్నారు పోటీ నిర్వాహకులు.

రేస్ ఎలా ఉండబోతుందో తెలియజేయడానికి 'ఎక్స్'లో 'ది స్పెర్మ్ ట్రాక్: నాట్ యువర్ యావరేజ్ రేస్' టైటిల్‌తో ట్రైలర్ విడుదల చేశారు. ఈ రేస్‌లో పాల్గొనే టీమ్‌లను కూడా పరిచయం చేశారు. రేస్ ఉద్దేశం గురించి 'స్పెర్మ్ రేసింగ్ మేనిఫెస్టో' కూడా విడుదల చేశారు.

ఈ మైక్రోస్కోపిక్ బ్యాటిల్‌లో వీర్య విజేత ఎవరో వేచిచూద్దాం.

● బ్యూటిప్స్



ముఖం అందంగా మెరవాలంటే...

ముఖం మిలమిలలాడాలంటే కొబ్బరి నూనెతో పాటు కాఫీ పొడర్ కలుపుకుని రాసుకోవాలి. ఓ టేబుల్ స్పూన్ కాఫీ పొడర్ ని కొబ్బరినూనెలో వేసి ఇది పేస్ట్ లా తయారయ్యేంత వరకూ బాగా కలపాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని కళ్ల కింద రాయాలి. ఇలా చేయడం వల్ల కళ్ల కింద ఉండే నల్లటి వలయాలు క్రమంగా తగ్గిపోతాయి. అక్కడ చర్మం ఆరోగ్యంగా మారుతుంది. ముడతలు కూడా తగ్గిపోతాయి.

ఆపిల్ సైడర్ వెనిగర్ కూడా చర్మాన్ని మెరిపించడంలో హెల్ప్ చేస్తుంది. దీనికోసం కొద్దిగా ఆపిల్ సైడర్ వెనిగర్ తీసుకుని అందులో నీరు కలపాలి. తర్వాత దీనిని నల్లదనం ఉన్న చోట అప్లై చేసి కాసేపు ఉంచి ఆ తర్వాత నీటితో క్లీన్ చేయాలి. దీని వల్ల నలుపు చాలా వరకూ తగ్గుతుంది.

● మన(సు)లో మాట

కడిగిందే కడుగుతున్నాడు!

మా అబ్బాయికి 14 సంవత్సరాలు. 9వ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌లో పక్కన వాళ్ళని ముట్టుకుంటే జబ్బులు వస్తాయని ఏడాది నుంచి స్కూల్‌కి వెళ్ళట్లేదు. బలవంతంగా పంపిస్తే బెంచీని శానిటైజర్‌తో కడిగాకే కూచుంటాడు. పక్కన ఎవర్నీ కూచోనివ్వడు. స్కూల్ నుంచి రాగానే బుక్స్, బ్యాగ్ శానిటైజర్‌తో క్లీన్ చేస్తాడు. బాత్‌రూమ్‌లో బకెట్స్, సబ్బుపెట్టెలు మళ్ళీ మళ్ళీ కడుగుతాడు. స్నానానికి మినరల్ వాటర్ క్యాన్స్ కావాలని గొడవ పడుతున్నాడు. ఇంటికి చుట్టాలు ఎవరైనా వచ్చి భోజనం చేస్తే ఆ ప్లేట్స్ బయట పడేసే దాకా ఊరుకోడు. బయట వాళ్ళని ఎవర్నీ ఎక్కువ సేపు ఇంట్లో ఉండనివ్వడు. వాళ్ళు కూచుని వెళ్ళిన కుర్చీలు, ముట్టుకున్న వస్తువులు సబ్బుతో క్లీన్ చేస్తాడు. తను ఆడుకోడానికి గానీ, చుట్టాల ఇళ్ళకు గానీ, వెళ్ళడు. తన వస్తువులను ఎవరూ ముట్టుకోకూడదంటాడు. ఒకప్పుడు చదువులో, ఆటల్లో ముందుండేవాడు. ఇప్పుడిలా అయిపోయాడు. ఇలా చేయకూడదు అని మేము చెప్తే మాతో గొడవ పడుతున్నాడు. దీని గురించి బయట ఎవరికైనా చెబితే చచ్చిపోతానని బెదిరిస్తున్నాడు. హాస్పిటల్‌కి వెళ్దాం అంటే రాడు. మా అమ్మగారికి కొంచెం శుభ్రత ఎక్కువగా ఉండేది కానీ మరీ ఇంత కాదు. మావాడు బాగుపడాలంటే ఏం చేయాలో చెప్పండి.

- రమాదేవి, పాలకొల్లు

మీ బాబుకి ఉన్న సమస్యని 'చైల్డ్‌హుడ్ ఓ.సి.డి. అంటారు. చిన్నపిల్లలలో ఓ.సి.డి. సమస్య -7-12 సంవత్సరాల వయసులో మొదలవడం చూస్తూంటాం. ఈ వయసులో మెదడు నిర్మాణం ఇంకా పూర్తిగా జరగకపోవడం వల్ల జబ్బు లక్షణాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. పైగా పిల్లల్లో 'మెటా కాగ్నిటివ్ స్కిల్స్' అంటే తమ ఆలోచనలని సమీక్షించి తప్పు ఒప్పులని అర్థం చేసుకొని మార్చుకోగలిగే నేర్పు పిల్లలలో పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల వాళ్ళకి వచ్చే ఆలోచనల ప్రకారమే వాళ్ళు ప్రవర్తిస్తారు. తమ తల్లి తండ్రులు కూడా తాము చెప్పినట్లే ప్రవర్తించాలి అనుకుంటారు. దీనివల్ల వాళ్ళని చికిత్సకి ఒప్పించడం కష్టం. మురికి, క్రిములు గురించి ఎక్కువగా భయపడడం, పదేపదే చేతులు కడగడం, లేనిపోని సందేహాలు... లాంటి లక్షణాలతోపాటు, తమ వారికీ ఏదో అయిపోతుందన్న భయం ఒక వైపు, ఆ భయం, ఆందోళన తగ్గించడానికి వాళ్ళు. ఏ పనైతే చేస్తారో దాన్నే మళ్లీ మళ్లీ చేస్తుంటారు. తాము ఇలా పనులు మళ్ళీ, మళ్ళీ చేయడం వలన చెడు జరగకుండా ఆపగలం అనుకుంటారు, దీన్ని 'మ్యాజికల్ థింకింగ్' అంటారు. ఇలాంటివి ప్రత్యేకంగా పిల్లల్లోనే చూస్తూంటాము. ఇలా ఎక్కువ సేపు చేయడం వల్ల, మిగిలిన పనులు సరిగా టైంకి చేయలేరు. స్కూల్‌కి లేటుగా వెళ్ళాల్సి వస్తుంది. పరీక్షలో సమయానికి సమాధానాలు రాయలేకపోతారు. చదువులో వెనకబడిపోతారు. తమని అందరూ ఎక్కడ గమనిస్తారో అని బయటకి వెళ్ళడం కూడా మానేస్తారు. ముందుగా వాళ్ళకి ఉన్నది ఒక మెడికల్ కండిషన్, దానికి కూడా వైద్యం ఉంది, అని ఒప్పించడానికి చాలా ఓర్పు, సహనం అవసరం. అలాగని వారు చెప్పే ప్రతి పని చేయడం కూడా కరెక్ట్ కాదు. మీ బాబు ఒకవేళ హాస్పిటల్‌కి రావడానికి సంకోచిస్తే ముందుగా, టెలిఫోన్ కన్సల్టేషన్ ద్వారా సైకియాట్రిస్ట్‌తో మాట్లాడించడం ద్వారా తన ఆలోచన విధానంలో నెమ్మదిగా మార్పు తీసుకురావచ్చు. అలాగే తనని మందులు వాడడానికి ఒప్పించి, తక్కువ డోస్‌లో మందులు వాడి యాంగ్జైటీని తగ్గించవచ్చు. ముందు కొంచెం ఉపశమనం కలిగితే తర్వాత మీ బాబు తనంత తానే చికిత్సకి సహకరించవచ్చు కాబట్టి మీరు ఆత్మస్థైర్యం కోల్పోకుండా మీ ప్రయత్నం మీరు చేయండి. ఆల్ ది బెస్ట్.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ
sakshifamily3@gmail.com


● డైవర్సీ మార్కెట్

వధువు కావలెను!

● డైవర్సీకే ప్రాధాన్యం

సాధారణంగా విడాకులను ముఖ్యంగా మహిళలకు సంబంధించి ఒక ఫెయిల్యూర్‌గానే పరిగణిస్తున్నారు. కాలమెంత మారినా విడాకులు తీసుకున్న మహిళను చిన్నచూపు చూసే ధోరణి మాత్రం పోలేదు. డైవోర్స్‌ని ఓ అవమానంగా, పరువు ప్రతిష్ఠలకు భంగంగా భావించే పరిస్థితే ఇంకా! అయితే వాయవ్య ఆఫ్రికా దేశమైన మారిటానియా తీరు ఇందుకు భిన్నం. అక్కడ విడాకులు అంటే ఒక వేడుక. ఆ దేశంలోని మారి తెగలోని మాతృస్వామ్య పద్ధతులే ఇందుకు కారణం అంటారు పరిశీలకులు, విశ్లేషకులు. మారిటానియాలో ఒక వివాహిత ఎన్నిసార్లయినా విడాకులు తీసుకోవచ్చు. ఆ విడాకుల సందర్భాన్ని ఒక మెహెందీ, పాటలు, డాన్సులు, విందుతో ఒక సెలబ్రేషన్‌గా నిర్వహిస్తారు. దాని ఉద్దేశం.. ఆ అమ్మాయి మళ్లీ పెళ్లికి సిద్ధంగా ఉందని తెలియజెప్పడమేనట. అమ్మాయిలైతే విడాకులను తమకు దొరికిన స్వేచ్ఛలా భావిస్తారట. విడాకులు తీసుకున్న యువతులు తమ అభిరుచుల్లో ప్రావీణ్యాన్ని పెంపొందించుకునే ప్రయత్నం చేస్తారట. కొంతమంది పైచదువులు చదువుకుంటారు, కొంతమంది రాజకీయాల వైపు మళ్లుతారు, ఇంకొంతమంది ఆర్టిస్టులు అవుతారు.. ఇలా తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుంటారు. పిల్లలుంటే వాళ్ల సంరక్షణ తల్లి చాయిసే! ఇంకో విషయం ఏంటంటే.. విడాకులు తీసుకున్న ఆడవాళ్లందరికీ ఒక మార్కెట్ ఉంటుంది. అందులో వాళ్లింటి సామాన్లన్నిటినీ అమ్మేస్తారు. ఒకరకంగా ఈ మార్కెట్‌ను వాళ్లు తమ స్వేచ్ఛకు ప్రతీకగా భావిస్తారు. పాత భారాన్నంతా దింపేసుకుని కొత్త జీవితానికి సిద్ధంగా ఉన్నామనే సూచననిస్తున్నట్టన్నమాట. ఇంకో ముఖ్యమైన విషయం.. మారిటానియాలో కొత్త పెళ్లికొడుకులు డైవోర్స్ అయిన మహిళలను చేసుకోవడానికే మొగ్గు చూపుతారు. ఎందుకంటే సంసారంలో వాళ్లు అనుభవజ్ఞులని. అందుకే పెళ్లికి అక్కడ విడాకుల వనితలకే డిమాండ్ ఎక్కువ. మరో ముఖ్యమైన సంగతేంటంటే.. విడాకుల వనితలు మాత్రం విడాకులు పొందిన పురుషులను చేసుకోరు. కొత్త పెళ్లికొడుకులనే చూస్తారు. విడాకులు పొందిన మగవాళ్లను ఫెయిల్యూర్ హజ్బెండ్స్‌గా పరిగణిస్తారట.



కూల్ సమ్మర్

చలువ అద్దాలకు జై



సమ్మర్ హీట్‌ని బీట్ చేయాలంటే కళ్లకు సన్‌గ్లాస్ పెట్టాల్సిందే. సన్‌గ్లాసెస్ ఫ్యాషన్ యాక్సెసరీ మాత్రమే కాదు అంతకంటే ఎక్కువ. సూర్యుడి అతి నీలలోహిత కిరణాలకు రేడియేషన్‌కు ఎక్కువసేపు గురి కావడం రకరకాల సమస్యలకు కారణం అవుతుంది.

సూర్యుని నుంచి వెలువడే హానికరమైన రేడియేషన్ నుంచి సన్‌గ్లాసెస్ మన కళ్లకు రక్షణగా ఉంటాయి.

ఎలాంటి సమస్యలు రాకుండా కంటి ఆరోగ్యం కోసం సన్ గ్లాసెస్ ఉపయోగపడతాయి.

తీవ్రమైన సూర్యకాంతి వల్ల కళ్లు ఒత్తిడికి గురవుతాయి. తలనొప్పి రావచ్చు. బయటికి వెళ్లినప్పుడు సూర్యకాంతి ప్రభావాన్ని తగ్గించి కంటిపై ఒత్తిడి లేకుండా చేస్తాయి కూల్ గ్లాసెస్.

ఎలాంటి సన్‌గ్లాసెస్‌ను ఎంచుకోవాలంటే...

➡ 100 శాతం యూవీ ప్రొటెక్షన్ ఇచ్చేవాటిని ఎంపిక చేసుకోవాలి ➡ పోలరైజ్డ్ లెన్సెస్ సూర్యకాంతి ప్రభావాన్ని తగ్గిస్తాయి ➡ బ్రైట్ కండీషన్స్‌లో పోలరైజ్‌డ్ గ్లాసెస్ మంక్లారిటీని ఇస్తాయి ➡ స్ట్రాంగ్, స్క్రాచ్-రెసిస్టెంట్ సన్ గ్లాసెస్‌ను ఎంచుకోవాలి ➡ లైట్ వెయిట్, ఇంపాక్ట్-రెసిస్టెంట్, గుడ్‌క్లారిటీ కోసం పాలీకార్బొనేట్ లెన్సులు పాపులర్ ఛాయిస్ ➡ రకరకాల సైజ్, షేప్‌లలో సన్‌గ్లాసెస్ వస్తున్నాయి. అయితే వాటిలో మన ముఖ ఆకృతికి నప్పే అద్దాలను ఎంచుకోవడం ఉత్తమం.

● సేవాపథం

ట్రాక్టర్ స్కూల్



భారతీయ రైల్వే ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పంజాబ్ అంతటా పర్యటించిన కెకె గార్గ్ ఎన్నో ప్రాంతాలలో, చదువుకు దూరమైన ఎంతో మంది పిల్లలను చూశాడు. రైల్వే ట్రాక్‌ల పక్కన మురికి వాడల్లో వందలాది మంది చిన్నారులు పేదరికంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని రిటైర్‌మెంట్ తరువాత మొబైల్ పాఠశాలను ప్రారంభించాడు గార్గ్.

పంజాబ్ వ్యవసాయాధారిత రాష్ట్రం కావడంతో ట్రాక్టర్లు ఎక్కువగా కనిపిస్తాయి. తన నైపుణ్యాలను ఉపయోగించి ఒక ట్రాక్టర్ ర్యాలీని మొబైల్ స్కూల్‌గా మార్చాడు గార్గ్. పైపింగ్‌తో వాటర్ ప్రూఫ్ ప్యానల్స్ రూపొందించాడు. వేడిని బయటకు పంపడానికి అవసరమైన ఏర్పాటు చేశాడు.

లైట్లు, ఫ్యాన్, బ్లాక్‌బోర్డ్‌లాంటివి మొబైల్ స్కూల్‌లో ఉంటాయి.

బఠిండాలోని ఎన్‌జీఓ 'గుడ్‌విల్ సొసైటీ' సహకారంతో 'మొబైల్ స్కూల్' పట్టాలకెక్కింది.

స్కూల్ ట్రాలీలు బఠిండాలోని వివిధ ప్రాంతాల గుండా ప్రయాణిస్తాయి.

మురికివాడలు, బడులు అందుబాటులో లేని ప్రాంతాలు, స్కూల్ డ్రాపవుట్ రేటు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ప్రతి మొబైల్ క్లాస్‌రూమ్‌లో ప్రాథమిక అభ్యాసన సామాగ్రి ఉంటుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

క్లాసులో విజువల్ ఎయిడ్స్ ఉపయోగిస్తారు. స్టోరీ టెల్లింగ్, ఇంటరాక్టివ్ గేమ్స్ ఉంటాయి.

ప్రతి సంవత్సరం వందలాది వలస కుటుంబాలు బఠిండాకు వచ్చి పోతుంటాయి. చాలామంది పిల్లలకు పాఠశాలల్లో చేరడానికి అవసరమైన డాక్యుమెంట్లు ఉండవు. మొబైల్ స్కూల్ ఈ సమస్యను పరిష్కరించింది.

మొబైల్ స్కూల్స్ ద్వారా సుమారు వెయ్యిమంది పిల్లలకు విద్య అందిస్తున్నారు. ఏడాది చదువు తరువాత పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంలో మొబైల్ స్కూళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

'పిల్లల తల్లిదండ్రుల నుంచి స్పందన బాగుంది' సంతోషంగా అంటున్నాడు గార్గ్.

● సోషల్ మీడియా

ఈ పాప తల్లిదండ్రులెవరు?



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలిలో... తల్లిదండ్రుల ఒడిలో సంతోషంగా ఉండాల్సిన పాప, ఊయలలో హాయిగా ఊగాల్సిన పాప ఎవరూ కన్నెత్తి చూడని ప్రదేశంలో, చెత్త కుప్పల దగ్గర, పాడుపడిన ఇంట్లో నేలపై పడి ఉంది. ఒళ్లంతా మట్టి. ముఖంపై గాయాలు. ఆ పాపను అక్కడ ఎవరు వదిలేసి వెళ్లారో తెలియదు.

బాలీవుడ్ నటి దిశా పటానీ సోదరి, ఆర్మీలో మాజీ లెఫ్టినెంట్ ఖుష్బూ పటానీ ఆ శిశువును రక్షించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఖుష్బూ మార్నింగ్ వాక్ చేస్తుండగా సమీపంలోని పాడుబడిన భవనం నుంచి పసికందు ఏడుపు వినిపించింది. ఆ శిథిల భవనంలోకి నేరుగా ప్రవేశం లేకపోవడంతో ఆమె ధైర్యంగా గోడ ఎక్కి దూకి అక్కడికి వెళ్లింది. ఏడుస్తున్న పాపను ఎత్తుకొని 'నీకేం కాదు' అంటూ ఇంటికి తీసుకు వెళ్లింది. పాపకు స్నానం చేయించి పాలు తాగించింది.

'మీరు బరేలికి చెందిన వారైతే, ఈ పాప తల్లిదండ్రులైతే ఇలా పాపను నిర్దాక్షిణ్యంగా ఎలా వదిలి వెళతారో చెప్పండి, ఇది సిగ్గుచేటైన విషయం' అంటుంది ఖుష్బూ.

'ఈ పాపను గుర్తు పట్టండి. ఫోటో షేర్ చేయండి' అంటూ నెటిజనులకు విజ్ఞప్తి చేసింది ఖుష్బూ.

నల్ల బ్యాండ్‌లు ధరించి... ఒక నిమిషం మౌనం పాటించి...

కశ్మీర్‌లోని పహల్గాంలో తీవ్రవాదుల చేతుల్లో మరణించిన పర్యాటకులకు నివాళిగా సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ జట్ల ప్లేయర్లు భుజాలకు నల్ల బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు. మ్యాచ్ ఆరంభానికి ముందు వారంతా ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ ఘటన పట్ల భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కూడా సంతాపం వ్యక్తం చేసింది. బుధవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో బౌండరీ బయట చీర్ గర్ల్స్‌ను పెట్టరాదని, ఎలాంటి బాణాసంచా కూడా ఉండరాదని నిర్దేశించింది. దీంతో పాటు స్టేడియంలో ఓవర్ల మధ్య విరామంలో పాటలు వినిపించకుండా డీజేను కూడా పక్కన పెట్టారు.



రైజర్స్ పరాజయాల 'సిక్సర్'



విజేత హంపి

పుణే: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి విజేతగా నిలిచింది. బుధవారం ముగిసిన ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి హంపి, చైనా గ్రాండ్‌మాస్టర్ జు జినెర్ 7 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే ఈ టోర్నీలో నల్ల పావులతో ఎక్కువ గేమ్‌లు (5) ఆడినందుకు హంపికి టైటిల్ ఖరారుకాగా... నల్ల పావులతో తక్కువ గేమ్‌లు (4) ఆడిన జు జినెర్ రన్నరప్‌గా నిలిచింది. భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్ 5.5 పాయింట్లతో మూడో స్థానంలో, ద్రోణవల్లి హారిక 4.5 పాయింట్లతో నాలుగో స్థానంలో, వైశాలి 4 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచారు. 10 మంది మేటి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరిగింది. ఎనిమిది రౌండ్లు ముగిశాక 6 పాయింట్లతో హంపి, జినెర్ సమఉజ్జీగా ఉన్నారు. చివరి రౌండ్ గేముల్లో హంపి 84 ఎత్తుల్లో సలీమోవా (బల్గేరియా)పై, జినెర్ 76 ఎత్తుల్లో పొలీనా (రష్యా)పై గెలిచారు. దివ్య (భారత్)-అలీనా పోలాండ్) గేమ్ 42 ఎత్తుల్లో... హారిక శ్రీ(భారత్)-మున్‌గున్‌తుల్ (మంగోలియా) గేమ్ 40 ఎత్తుల్లో... వైశాలి (భారత్)-సలోమి (జార్జియా) గేమ్ 37 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. 2024-2025 గ్రాండ్ ప్రి సిరీస్‌లో మొత్తం ఆరు టోర్నీలు ఉండగా... ఇప్పటికి ఐదు ముగిశాయి. ఒక్కో ప్లేయర్ గరిష్టంగా మూడింటిలో పాల్గొనాలి. హంపికి సంబంధించి మూడు టోర్నీలు ముగిశాయి. ఓవరాల్ పట్టికలో హంపి 279.17 పాయింట్లతో రెండో స్థానంలో... గొర్యాక్‌చినా (రష్యా) 308.34 పాయింట్లతో అగ్రస్థానంలో... జినెర్ 235 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. జినెర్‌కు మరో టోర్నీ మిగిలి ఉంది. టాప్-2లో నిలిచిన వారు వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు.

సొంతగడ్డపై హైదరాబాద్ మరో ఓటమి

- 7 వికెట్లతో ముంబై ఘన విజయం
- రాణించిన బౌల్ట్, రోహిత్, సూర్య

ఐపీఎల్-2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కథ దాదాపు ముగిసినట్లే అనిపిస్తోంది... గత ఏడాది రన్నరప్ ఈసారి పేలవ ప్రదర్శనతో ఆడిన ఎనిమిది మ్యాచ్‌లలో ఆరో పరాజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది...ముంబై పేసర్లు బౌల్ట్, చహర్ ధాటికి 13/4 వద్ద నిలిచి, ఆపై ఎలాగోలా 143 వరకు చేరినా... ఆ స్కోరు ఓటమిని తప్పించలేకపోయింది. రోహిత్ శర్మ మరో చక్కటి అర్ధ సెంచరీతో ముందుండి నడిపించగా మరో 26 బంతుల ముందే ముంబై విజయతీరం చేరింది.



క్లాసెన్



బౌల్ట్, హార్దిక్

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్‌లో మ్యాచ్ మ్యాచ్‌కీ జోరు పెంచుతూ చెలరేగుతున్న ముంబై ఇండియన్స్ వరుసగా నాలుగో విజయాన్ని అందుకుంది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై 7 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై నెగ్గింది. ముందుగా రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. క్లాసెన్ (44 బంతుల్లో 71; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ చేయగా, అభినవ్ మనోహర్ (37 బంతుల్లో 43; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రెంట్ బౌల్ట్ 4 వికెట్లు తీశాడు. అనంతరం ముంబై 15.4 ఓవర్లలో 3 వికెట్లకు 146 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (46 బంతుల్లో 70; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (19 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

ఆదుకున్న క్లాసెన్...

ఒకటి, రెండు, మూడు, నాలుగు... సన్‌రైజర్స్ టాప్-4 బ్యాటర్లు పూర్తిగా విఫలం కావడంతో ఇన్నింగ్స్ మరీ పేలవంగా ప్రారంభమైంది. హెడ్ (0), అభిషేక్ శర్మ (8), నితీశ్ కుమార్ రెడ్డి (2) చెత్త షాట్లు ఆడి నిష్క్రమించగా, ఇషాన్ కిషన్ (1) తన వికెట్ తానే ఇచ్చుకున్నాడు. ఈ సీజన్‌లో అత్యల్ప పవర్‌ప్లే స్కోరు (24) సన్‌రైజర్స్ నమోదు చేసింది. కొద్దిసేపటికి అనికేత్ వర్మ (12) కూడా వెనుదిరగడంతో 35/5 వద్ద రైజర్స్ కష్టాలు మరింత పెరిగాయి. స్కోరు 100 దాటుతుందా అనే సందేహం కనిపించింది. బ్యాటింగ్ కుప్పకూలటంతో ఇంపాక్ట్ ప్లేయర్‌గా అదనపు బ్యాటర్ మనోహర్‌ను తీసుకోవాల్సి వచ్చింది. క్లాసెన్, మనోహర్ కలిసి పరిస్థితిని చక్కదిద్దారు. 34 బంతుల్లో క్లాసెన్ హాఫ్ సెంచరీ పూర్తయింది. బుమ్రా బౌలింగ్‌లో రివర్స్ స్కూప్‌తో అతను కొట్టిన సిక్సర్ ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచింది. క్లాసెన్, మనోహర్ ఆరో వికెట్‌కు 63 బంతుల్లో 99 పరుగులు జోడించారు.

చకచకా లక్ష్యం వైపు...

స్వల్ప ఛేదనలో ముంబై ఆరంభంలోనే రికెల్టన్ (11) వికెట్ కోల్పోయింది. అయితే ఆ తర్వాత జట్టుకు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. రోహిత్, విల్ జాక్స్ (22; 2 ఫోర్లు, 1 సిక్స్) రెండో వికెట్‌కు 46 బంతుల్లోనే 64 పరుగులు జోడించి జట్టు విజయానికి బాటలు వేశారు. జాక్స్ వెనుదిరిగిన తర్వాత రోహిత్‌కు సూర్య జత కలిశాడు. 35 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీని అందుకున్నాడు. హర్షల్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టి మరింత జోరు ప్రదర్శించిన రోహిత్ ఎట్టకేలకు విజయానికి మరో 14 పరుగుల దూరంలో వెనుదిరిగాడు.

అవుట్ కాకుండానే...

సన్‌రైజర్స్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అనూహ్య రీతిలో వెనుదిరిగాడు. దీపక్ చహర్ వేసిన బంతి అతని లెగ్‌సైడ్ దిశగా వెళ్లగా కిషన్ గ్లాన్స్ ఆడే ప్రయత్నం చేశాడు. అయితే కీపర్ రికెల్టన్ బంతిని అందుకున్న మరుక్షణమే కిషన్ అవుట్‌గా భావించి స్వచ్ఛందంగా పెవిలియన్ వైపు నడిచాడు. నిజానికి ముంబై ఆటగాళ్లు ఎవరూ గట్టిగా అప్పీల్ కూడా చేయకపోగా... అంపైర్ వినోద్ శేషన్ కూడా వైడ్‌గా ప్రకటించేందుకు రెండు చేతులు పైకెత్తబోయాడు. అయితే కిషన్ స్పందనను చూసిన అతను తన నిర్ణయాన్ని మార్చుకొని అవుట్‌గా ఖాయం చేశాడు. కిషన్ తనంతట తానే వెళ్లిపోవడాన్ని ముంబై కెప్టెన్ పాండ్యా భుజం తట్టి మరీ అభినందించాడు. అయితే ఆ తర్వాత రీప్లేల్లో అతని బ్యాట్‌కు బంతి తగల్లేదని, నాటౌట్ అని తేలింది. ఇషాన్ కిషన్ అతిగా స్పందించకుండా ఉంటే వికెట్ చేజారేదే కాదు.





స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) నమన్ (బి) బౌల్ట్ 0; అభిషేక్ (సి) పుతూర్ (బి) బౌల్ట్ 8; ఇషాన్ కిషన్ (సి) రికెల్టన్ (బి) దీపక్ చహర్ 1; నితీశ్ రెడ్డి (సి) సాంట్నర్ (బి) దీపక్ చహర్ 2; క్లాసెన్ (సి) తిలక్ (బి) బుమ్రా 71; అనికేత్ (సి) రికెల్టన్ (బి) పాండ్యా 12; మనోహర్ (హిట్ వికెట్) (బి) బౌల్ట్ 43; కమిన్స్ (బి) బౌల్ట్ 1; హర్షల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 143.** వికెట్ల పతనం: 1-2, 2-9, 3-13, 4-13, 5-35, 6-134, 7-142, 8-143. **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-12-2, బౌల్ట్ 4-0-26-4, బుమ్రా 4-0-39-1, సాంట్నర్ 4-0-19-0, పాండ్యా 3-0-31-1, పుతూర్ 1-0-15-0. **ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** రికెల్టన్ (సి అండ్ బి) ఉనాద్కట్ 11; రోహిత్ (సి) అభిషేక్ (బి) మలింగ 70; జాక్స్ (సి)మనోహర్ (బి) అన్సారీ 22; సూర్యకుమార్ (నాటౌట్) 40; తిలక్‌వర్మ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (15.4 ఓవర్లలో 3 వికెట్లకు) 146.** వికెట్ల పతనం: 1-13, 2-77, 3-130. **బౌలింగ్:** కమిన్స్ 3-0-31-0, ఉనాద్కట్ 3-0-25-1, హర్షల్ 3-0-21-0, ఇషాన్ మలింగ 3-0-33-1, అన్సారీ 3.4-0-36-1.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	8	6	2	12	1.104
ఢిల్లీ	8	6	2	12	0.657
ముంబై	9	5	4	10	0.673
బెంగళూరు	8	5	3	10	0.472
పంజాబ్	8	5	3	10	0.177
లక్నో	9	5	4	10	-0.054
కోల్‌కతా	8	3	5	6	0.212
రాజస్తాన్	8	2	6	4	-0.633
హైదరాబాద్	8	2	6	4	-1.361
చెన్నై	8	2	6	4	-1.392

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు × రాజస్తాన్
వేదిక: బెంగళూరు
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



ఒంగోలులో గాంధీ విగ్రహం వద్ద క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



విశాఖపట్నంలో గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో వైఎస్సార్‌సీపీ నేతలు

ఉగ్ర దాడిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శాంతి ర్యాలీలు

- పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు కదం తొక్కిన పార్టీ శ్రేణులు
- అమానుష చర్యను ఖండిస్తూ నినాదాలు
- కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళి
- దాడిలో గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా బుధవారం శాంతిర్యాలీలు నిర్వహించాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు కొవ్వొత్తులు వెలిగించి పార్టీ శ్రేణులు ప్రదర్శనలు జరిపాయి. ర్యాలీల్లో పాల్గొన్న వారంతా ఉగ్రవాదుల అమానుష చర్యను ఖండిస్తూ నినాదాలు చేశారు.మరణించిన వారి పవిత్రాత్మలకు శాంతి చేకూరాలని, క్షతగాత్రులు కోలుకోవాలని ప్రార్థించారు.

ఇది పిరికిపందల చర్య: సజ్జల రామకృష్ణారెడ్డి

కశ్మీర్‌లో ఉగ్రవాదుల అమానుష దాడి పిరికిపందల చర్యగా, మానవత్వంపై జరిగిన దాడిగా వైఎస్సార్‌సీపీ భావిస్తోందని పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడికి నిరసనగా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద బుధవారం కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సజ్జల మట్లాడుతూ.. ఈ దుస్సంఘటనలో మృతుల ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నామని, ఆ కుటుంబాలకు పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ దారుణ ఘటనలో మరణించిన ఇద్దరు తెలుగువారి కుటుంబాలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పరామర్శిస్తారని చెప్పారు. తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ భరతమాత విగ్రహం వరకు కొనసాగింది. అమరుల కుటుంబాలకు సంఘీభావంగా పార్టీ నేతలు, కార్యకర్తలు సంతకాలు చేశారు.ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, పార్టీ ప్రధాన కార్యదర్శి (మీడియా వింగ్) పూడి శ్రీహరి, మాజీ ఎంపీ నందిగం సురేష్, నాయకులు పుత్తా ప్రతాప్‌రెడ్డి, ఎ. నారాయణమూర్తి, చల్లా మధుసూదన్‌రెడ్డి, కొమ్మూరి కనకారావు, ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, నాగార్జున యాదవ్, కె.వెంకటరెడ్డి, టి.జగదీశ్వర్ గుప్తా, దొంతిరెడ్డి వేమారెడ్డి, కాకుమాను రాజశేఖర్, బుర్రముక్కు వేణుగోపాల్‌రెడ్డి, పానుగంటి చైతన్య, పి.శివశంకర్ పాల్గొన్నారు.

హోరెత్తిన శాంతి ర్యాలీలు

ఉగ్ర దాడిని నిరసిస్తూ గుంటూరు బృందావన్ గార్డెన్స్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం సమీపంలోని సిగ్నల్స్ వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ శాంతిర్యాలీ నిర్వహించాయి. ఒంగోలు బాపూజీ మార్కెట్‌లోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, భీమవరం పట్టణాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉగ్ర దాడికి నిరసనగా కదం తొక్కారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం, కాకినాడ రూరల్ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాలైన అనకాపల్లి, విశాఖ నగరం, విజయనగరం జిల్లా చీపురుపల్లి, శ్రీకాకుళంలోని వైఎస్సార్ కూడలిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీలు జరిగాయి. రాయలసీమ జిల్లాల్లోనూ పార్టీ శ్రేణులు ఉగ్రదాడికి నిరసనగా కదం తొక్కారు. అనంతపురంతోపాటు ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుత్తిలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, తనకల్లు, హిందూపురం, అన్నమయ్య జిల్లా పీలేరులో శాంతి ర్యాలీలు జరిగాయి. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో భారీఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శనలు నిర్వహించారు.



ఉగ్రదాడికి నిరసనగా కడపలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు



గుంటూరులో క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ నేతలు

ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించిన వైఎస్ జగన్

- ఏపీ వాసుల మృతిపై దిగ్భ్రాంతి
- బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఉగ్రదాడిలో విశాఖ వాసి చంద్రమౌళి, కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్‌రావు ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్య అని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకొని.. అండగా నిలవాలని కేంద్రాన్ని కోరారు. బాధిత కుటుంబసభ్యులకువైఎస్ జగన్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విహారానికి వెళ్లి..ఉగ్రదాడికి గురై

పహల్గాం ఉగ్రదాడిలో ఇద్దరు ఏపీ వాసులు మృతి	ఒకరిది విశాఖ... మరొకరిది కావలి	విషాదం నింపిన విహార యాత్ర

బీచ్‌రోడ్డు/కావలి: కశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఇద్దరు అసువులు బాశారు. వీరిలో ఒకరు విశాఖకు చెందినవారు కాగా మరొకరిది శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. విశాఖపట్నం పాండురంగాపురం వాసి జరజాపు చంద్రమౌళి (69) పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో పాండురంగాపురంలో విషాదం నెలకొంది. రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి అయిన చంద్రమౌళి, నాగమణి దంపతులు ఈ నెల 18న మరో ఇద్దరు సహచర బ్యాంకు ఉద్యోగుల కుటుంబాలతో కలిసి కశ్మీర్ వెళ్లారు. 22న పహల్గాంలో సందర్శనకు వెళ్లిన వారిపై ఆర్మీ సిబ్బంది దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు దాడులు చేశారు. ఈ భయానక దాడిలో చంద్రమౌళి మరణించారు. చంద్రమౌళికి ఇద్దరు కుమార్తెలు. వారు ఆమెరికాలో ఉంటున్నారు. శేష జీవితాన్ని భార్యతో ఆనందంగా గడుపుతున్న తరుణంలో ఈ ఘోరం సంభవించింది. యాత్ర ముగించుకుని ఈ నెల 25న నగరానికి రావాల్సి ఉంది. ఇంతలోనే ఉగ్ర మూక దాడిలో తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న కుమార్తెలు ఆమెరికా నుంచి బయల్దేరారు. వారు గురువారం విశాఖకు చేరుకుంటారని కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం అంత్యక్రియలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బావ కోసం బావమరిది ఆరాటం

విశాఖ ఏసీబీలో డీఎస్పీగా పనిచేస్తున్న నాగేశ్వరరావు సోదరి నాగమణిని చంద్రమౌళి వివాహం చేసుకున్నారు. చంద్రమౌళి కుటుంబం పహల్గాం వెళ్లిన సమయంలోనే ఉగ్రదాడి జరిగింది. ఆ సమయంలోనే చంద్రమౌళి ఫోన్‌లోకి అందుబాటులోకి రాకపోవడంతో బావ జాడ కనుక్కునేందుకు నాగేశ్వరరావు విశ్వప్రయత్నాలు చేశారు. కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రంతా మెలకువతోనే ఉన్నారు. చివరికి చంద్రమౌళి మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

భార్యా పిల్లలతో గడుపుదామని...

ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సోమిశెట్టి మధుసూదన్ అసువులు బాశారు. మధుసూదన్ బెంగళూరులోని ఐబీఎం సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండగా, అతని భార్య కామాక్షి టీసీఎస్‌లో ఐటీ ఉద్యోగిని. వీరికి ఇంటర్మీడియట్ చదివే కుమార్తె మేధ, ఎనిమిదో తరగతి చదువుతున్న దత్తు అనే కుమారుడు ఉన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో కుటుంబంతో కలిసి పహల్గాంకు వెళ్లారు. అక్కడ ఉగ్రవాదులు దాడి చేసి పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో మధుసూదన్ అక్కడికక్కడే మృతి చెందాడు.



మధుసూదన్ (ఫైల్)




చంద్రమౌళి (ఫైల్)


చంద్రమౌళి తప్పించుకున్నారు అనుకున్నాం..

ఒక ట్రావెల్ ఏజెన్సీ ద్వారా విహార యాత్రకు వెళ్ళారు. మంగళవారం జరిగిన ఉగ్ర దాడుల్లో చంద్రమౌళి కనిపించటం లేదని ఆయన భార్య మాకు సమాచారం అందించారు. మీము ఆయన ఉగ్రవాదుల నుంచి తప్పించుకొని ఉంటారు అనుకున్నాం. రాత్రాంత ఆయన సమాచారం కోసం వేచి ఉన్నాం. ఇలా మరణించారు అనే వార్తా వినాల్సి వస్తుంది అనుకులేదు.

–కుమార్‌రాజా, సమీప బంధువు

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.


SRI VISWASANTHI EDUCATIONAL INSTITUTIONS
EDUCATION - DISCIPLINE
ESTD : 1975. VUYYURU
విద్యారంగంలో అర్థ శతాబ్దం ! విజయసాధనలో స్వర్ణోత్సవం !!
50 Golden Jubilee
ESTD : 1975
• LKG to Intermediate - State Syllabus • LKG to +1 & +2 CBSE Syllabus • Co-education • Residential School & College
SRI VISWASANTHI
EDUCATIONAL INSTITUTIONS
• Recognised by Govt. of A.P.
• Affiliated to B.I.E., A.P.
STATE & CBSE
• Affiliated to CBSE, Delhi.
LKG to 10th, Inter (MPC & BiPC)
LKG to X & XI, XII (PCM & PCB)
IIT & Medical Foundation from VI to X Classes
మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు
Founder & Managing Director
మాదల ప్రమీలారాణి
Founder
...The Best Residential Institution in India...
...Your Child's Bright Future Starts Here...
డా॥ మాదల సూర్యశేఖర్
M.B.B.S., M.B.A.,
Chief Executive Director
మాదల సుష్మ
MSIS., M.B.A.,
Executive Director
డా॥ మాదల రాజశేఖర్
M.B.B.S., M.S. (Ortho)
Director
డా॥ మాదల నీలిమ
M.B.B.S.,
Director
Separate Sections & Hostel
for...BOYS & GIRLS
A.C. CAMPUS
NCC "A" & "B" Certificates
VUYYURU (Near Vijayawada), Krishna Dt., ANDHRA PRADESH.
Cell : 99 48 98 4444, 913 331 8502, 924 745 6148, 99 12 77 5666, 833 300 0899.
Web Site : www.sriviswasanthischools.in
E - mail Id : director.sriviswasanthi@gmail.com
ADMISSIONS
ARE IN PROGRESS
SINGLE CAMPUS
with Limited Strength
ప్రతి ఫలితం వెనుకా ఉంది అంకితభావం...
ప్రతి విజేత వెనుకా ఉంది శ్రీ విశ్వశాంతి...
శ్రీ విశ్వశాంతి రెసిడెన్షియల్ స్కూల్
నిన్ననే ప్రకటించిన 10వ తరగతి 2025 ఫలితాలలో...
విశ్వశాంతి విద్యార్థులు సాధించిన విజయాలు
590 SHAIK BAJI BABA
588 KOLUSU PRANATHI
587 GUDAPATI RAJA
586 P. V. RAMA SAI REVANTH
584 P. KOMAL KUMAR RAJU
584 D. MANEESWAR REDDY
582 BAJOJU MURUGESH
582 KONDEPI SUNNY BABU
582 CHITTIPOTHULA POOJA SRI
582 KOLUSU AMBIKA
581 R.G. AKHILESWAR REDDY
580 ANGADALA JAHNAVI
578 GANDIKOTA VEDASRI
577 BATCHU VANI
577 BOLLA YOGA NANDINI
577 GARIKA GEETHA CHARAN
577 MAICHA SONALIKA
577 VADLADHI YAMINI REKHA
577 LANKE PRASANTH KUMAR
577 KOMMAREDDY KINEISHA
576 BONTHU BALA SIVANI
576 KATURU SRI RAM
575 V. NAVYANTH SRI SAI
Many More Toppers...
designed by : Thilak - 984 836 3105
భవిష్యత్తులో ఎటువంటి పోటీ పరీక్షలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలనే లక్ష్యంతో... 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు రెగ్యులర్ సిలబస్‌తోపాటు
IIT & NEET Foundationలో... Special Teachersచే Selected Studentsకి ప్రత్యేక శిక్షణ. ప్రతి విద్యార్థి మీద వ్యక్తిగత శ్రద్ధ.


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 12+10 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 32

గురువారం 24-4-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




TIRUMALA
A/C Hostel
Day Scholar
E. M. SCHOOL Jr. COLLEGE IIT & MEDICAL ACADEMY
రాజమహేంద్రవరం
కాతేరు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
Cell : 79970 71672, 83090 76048
విశాఖపట్నం
రాజుల తాళ్ళవలస, N.H.- 16 ప్రక్కన, భీమిలి మండలం, విశాఖపట్నం.
Cell : 98489 86450, 98489 86451
భీమవరం
ప్రకృతి ఆశ్రమం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.
Cell : 99513 94087, 91826 23317
తణుకు
కొమరవరం, ఇరగవరం రోడ్డు, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా.
Cell : 73866 20777, 73966 15777
పాయకరావుపేట
పి.యల్.పురం సెంటర్, N.H.- 16 ప్రక్కన, పాయకరావుపేట, అనకాపల్లి జిల్లా.
Cell : 80084 78777, 85209 26777
OUR BEST MARK in SSC-2025
10వ తరగతి ఫలితాలలో తిరుమల విజయ దరహాసం
597 / 600 Y. LAASYA SRI SAI
4గురు విద్యార్థులకు 596 / 600
U. JASWANTH PAVAN, Ch. S. BHARDWAJ, K. DURGA KASHYAP, K. SRIVALLI
7గురు విద్యార్థులకు 595 / 600
CH LASYA HARSHITA, S. NANDINI, D. Ch. SAHASRA, A. LAKSHMI DIVYA, B. KEERTHI SREE, G. VARUN VARSHITH, B. KALYAN RAM
594/600 M. VAMSHITHA, 594/600 E. DIVYA SRI, 594/600 K. VASANTH, 594/600 B. SAATVIKA, 594/600 L HANSUJA, 594/600 B. SHARA ZENITHA, 594/600 Y. ARPITHA VIJAYA, 594/600 A KHYATHI MODHIKA, 594/600 N. AMRUTHA VARSHINI, 594/600 K. TANVEER, 594/600 D. HARSHITHA, 593/600 Y. NITYA SRI
593/600 K. SRI VARSHINI, 593/600 T. SURYA SUHAAS, 593/600 MD SAIF QURESHI, 593/600 K. SRAVANI, 593/600 P. NIKHIL RAJ, 593/600 K. HARSHA VARDHAN, 593/600 S. ROSHINI, 593/600 T. KUSUMANJALI, 593/600 CH. KEERTHI, 593/600 SK. MUBEEN, 592/600 M. M. HASITHA, 592/600 P. VENKATA DURGA
592/600 K. BHAVISHYA, 592/600 R.T.S. DURGA, 592/600 N. SANDHYA, 592/600 B. AMRUTHA, 592/600 K. JAHNAVI, 592/600 P. SUDEEPTHI, 592/600 CH. DHRITI SRI, 592/600 K. KARTHIKA, 592/600 V. PADMASAHITI, 592/600 P. KARTHIKA, 592/600 G. VENKATA SAI, 592/600 B. KEERTHI PRIYA
592/600 B. POOJITHA, 592/600 U. LAASYA MADHURI, 592/600 M. POOJITHA, 592/600 L. AKSHAYA KUMAR, 592/600 B. AMOGH, 592/600 P. CHAITANYA, 591/600 P. LALITHA PRIYA, 591/600 R. CHAHNA, 591/600 T. ESWARI, 591/600 V.L. SOWJANYA, 591/600 V. GANESH GUPTHA, 591/600 D. NAVYA TARAKA
591/600 R. L. KARTHEEK, 591/600 N.N.V.P. KUMAR, 591/600 G. NAKSHATRA, 591/600 P.G. PARDHAVI, 591/600 G. TEJA KUMAR, 591/600 K. AVINASH, 591/600 M. AKSHAYA, 591/600 D. TEJA, 591/600 R. VARSHINI, 591/600 S.T.P. PRANAMYA, 591/600 K. SAI CHARAN, 591/600 S. AKASH
591/600 G. AKSHAYA, 591/600 Y. SAI DEEP, 591/600 CH. NISHANTH, 591/600 E. DIVYA, 591/600 R. G. SUDHEEP, 590/600 A. VARSHITHA DEVI, 590/600 D. SUDHA MADHURI, 590/600 V. LASYA SRI, 590/600 M. AKSHAY ANGELIN, 590/600 M. VINOOTHANA
590/600 Y. CHARAN, 590/600 K. SAI SATHYA VALLI, 590/600 T.R.S.S. MANASWINI, 590/600 K. ROHITH, 590/600 P. KUMIDHVINI, 590/600 K. ANGELINA VINCY, 590/600 N. POOJITHA, 590/600 Y. TEJA SAI VAMSI, 590/600 P. SAHITHI, 590/600 I. PRAVEEN KUMAR
590/600 P. JAHNAVI, 590/600 K. AVINASH, 590/600 T. SASHREETH, 590/600 G. SURYA VARSHINI, 590/600 B. RESHMA SRI, 590/600 G. MOHIT CHANDRA, 590/600 P.K. SANDEEP
మార్కుల విశ్లేషణ
పరీక్షకు హాజరైన వారు : 2732
590 & above ... 99
580 & above ... 582
570 & above ... 1114
560 & above ... 1517
550 & above ... 1798
500 & above ... 2478
ఉత్తీర్ణత శాతం : 100%
2025 - ఇంటర్ ఫలితాలలో తిరుమల ప్రభంజనం
Sr. INTER
8 మంది విద్యార్థులకు 991 / 1000
M. PRIYA HASINI, M. LEKHANA, SK. FATHIMUNNISA BEGUM, CH. HARI SURYA, P. PAVITRA, K. MANASA, S. SAI LIKHITHA, P. D. KAVYA SRI
26 మంది విద్యార్థులకు 990 / 1000
CH HASINI, V S RAMA RAJU, V L DURGA, V RESHMA SRI, K PRAGNYA, B Y LOVA SWAMI, RYD PRAVEEN, M RAJ KUMARI, I SAI SINDHURA, K VANDANA, M DURGA PRAV, G SATYA SRI, G SHRI HARS, K SRUJANA, M HARSHITHA, J SAI BRUNDA, MD ASHRAF, Y SNEHITHA, K SRUTHILAYA, K TULASI, P N VYSHNAV, CH RENUKA, VAISHNAV, B HARSHITHA, N MANI, G RITIKA
980 మార్కుల పైన 1161
950 మార్కుల పైన 3669
900 మార్కుల పైన 5130
హాజరైన వారు : 6920
ఉత్తీర్ణత శాతం : 99.3
Jr. Inter MPC
5గురు విద్యార్థులకు 467 / 470
U. VIRONIKA, M. HARSHITHA, S. TEJA, G. NAVEEN TEJA, A. VENKATA SAI LIKHI
46 మంది విద్యార్థులకు 466 / 470
V MANIKANTA, K SUSHMITHA, R YASWANTH, A AVYUKTHA, L DIVIJA, P HEMANTH, G B BALAJI, P KEERTHI SRI, B VEDA SAI SRI, V MANIKANTA, M JAYASRI, B SRIKAR, B JWALITHA, V S SIDDARTHA, K V LAKSHMI, R MANOJ, B UDAY KIRAN, S MADHU SRI, G PUNDAREESH, P MANOHAR, K NIRMALA, N SURASMI, R MADHURI, K TAPASWI, D NAVYA, M SARANYA, P SRIRAM, V ABHINAYA, D SRIVALLI, B SAI KUSANA, S LAVANYA, J LALITHA DEVI, CH PRAJHNA, D GEETHIKA, P SAI SOWMYA, K GAYATHRI, M CHAITANYA, R HEMA CHARAN, A PRAJWALITHA, K LALITADITHYA, B SIDDHARTDHA, M BHAGAVATHI, J SRILAXMI, Y THANUSRI, K DEEPIKA, K SPANDANA
460 మార్కుల పైన 1732
450 మార్కుల పైన 3464
400 మార్కుల పైన 5774
హాజరైన వారు : 8101 ఉత్తీర్ణత శాతం : 98.5
Jr. Inter BiPC
12 మంది విద్యార్థులకు 436 / 440
K SUPRIYA, A TEJASWANI, CH NEHA GRACE, G M RUPA, J BHAVITHA, K GAYATHRI, T SARAYU, B YASASWINI, SK SHAMINA, R VIVEK, P GANESH, CH MEGHANA
25 మంది విద్యార్థులకు 435 / 440
MD NAZMA ARFA, D LEECY, K NAVYAMRUTHA, L SRAVANTHI, K NAVYA, M L HARSHINI, K KEERTHI, S THANUSRI, U AKSHAYA, R BHARGAV, S CHAITANYA, G VARSHITHA, K VARSHINI, P L PRIYA, BV SANDEEP, P MOUNIKA, D YOGESWARI, V RISHITHA, V RADHA LAKSHMI, D NATASHA, K RESHMA SRI, N S PRIYA, Y MERCY VEENA, K HASINI, P M D PRASAD
430 మార్కుల పైన 192
420 మార్కుల పైన 408
370 మార్కుల పైన 681
హాజరైన వారు : 884
ఉత్తీర్ణత శాతం : 99.2


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+10 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 32

గురువారం 24-4-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విజేత హంపి

ఫిడే మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్‌లో గెలిచిన ఏపీ క్రీడాకారిణి - స్పోర్ట్స్‌లో



రూ.లక్ష దిగువకు పసిడి


ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.2,400 పతనం - బిజినెస్‌లో



ట్రాక్టర్ స్కూల్

రైల్వే ట్రాక్‌ల పక్కన ఉన్న మురికివాడల్లోని చిన్నారుల కోసం కేకే గార్గ్ అనే ఇంజినీర్ మొబైల్ స్కూల్‌ను ప్రారంభించారు.

వివరాలు ఫ్యామిలీలో ▸



అల్లుడే పెద్ద కొడుకు

వీధికో నలుగురు ఇల్లరికం అల్లుళ్లు ఉండే తెలంగాణలోని కామారెడ్డి జిల్లా మద్నూర్‌పై ప్రత్యేక కథనం.

వివరాలు ఫ్యామిలీలో ▸



డైవర్సీకే ప్రాధాన్యం!

విడాకులను విందు వినోదాలతో వేడుకలా చేసుకునే ఆఫ్రికా దేశం మారిటానియాపై కథనం.

వివరాలు ఫ్యామిలీలో ▸



ఖరీదైన వాచ్‌లపై పన్ను

హ్యాండ్ బ్యాగ్‌లు, వాచ్‌లు, పాదరక్షలు, క్రీడా వస్త్రాలు రూ.10 లక్షలు మించితే ఒక శాతం టీసీఎస్ వసూలు చేయనున్నారు.

వివరాలు బిజినెస్‌లో ▸

న్యూస్‌రీల్

తిరుమల ఘాట్ రోడ్‌లో సుమో బోల్తా



తిరుపతి క్రైమ్: తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం ఓ సుమో బోల్తా పడింది. తిరుమల ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మొదటి ఘాట్ రోడ్ లోని 33వ మలుపు వద్ద తిరుపతికి చెందిన ప్రైవేట్ టాక్సీ శ్రీవారి భక్తులను తీసుకొని వెళుతుండగా బ్రేక్ విఫలమవడంతో బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న ఆరుగురు కర్ణాటక భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సకాలంలో 108 ద్వారా తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

జాతీయ స్పెషల్ ఒలింపిక్స్‌కు 14 మంది ఎంపిక



ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ భారత్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. 14 మంది జాతీయ స్పెషల్ ఒలింపిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలు ప్రదానం చేశారు.

వివరాలు 8లో ▸

అంతకుమించి మద్యం దోపిడీ..

అందుకే డైవర్షన్ కుట్ర



2014-19, ప్రస్తుత ఆగడాల నుంచి దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు పన్నాగం

కొత్త మద్యం విధానంతో రాష్ట్రంలో టీడీపీ మాఫియా యథేచ్ఛగా దోపిడీ

- ఊరూవాడా గుడీ బడీ తేడా లేకుండా 55వేల నుంచి 60 వేల బెల్ట్ దుకాణాలు
- పచ్చ మూఠాలకే దుకాణాల పందేరం.. వేలం వేసి బెల్టు షాపుల కేటాయింపు
- సిండికేట్ కట్టి.. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 చొప్పున అధికంగా వసూలు..!
- ప్రైవేటు మద్యం సిండికేట్ విధానం పునరుద్ధరణ.. 2014-19 నాటి దోపిడీ కంటే పలు రెట్లు లక్ష్యం
- ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత.. గ్రామాల్లో ధర్నాలకు దిగుతున్న మహిళలు
- దీంతో డైవర్షన్ కుట్రలకు తెరలేపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు..
- వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం నియంత్రణ విధానం సమర్థంగా అమలు
- అయినా అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో రెడ్‌బుక్ కుట్ర
- అక్రమ కేసులతో వేధింపులు

7లో

2014-19: మద్య చంద్రబాబు హయాంలో..	2019-24: వైఎస్ జగన్ ప్రభుత్వంలో..	2024 నుంచి చంద్రబాబు సర్కారులో..
ఎడాపెడా డిస్టిలరీలకు అనుమతులు.. వీటిలో అస్మదీయులకు చెందిన నాలుగు డిస్టిలరీల నుంచే 53.25 శాతం కొనుగోళ్లు.. చీకటి జీవోలు.. టీడీపీ వారికే విచ్చలవిడిగా ప్రైవేటు మద్యం దుకాణాలు.. యథేచ్ఛగా పర్మిట్ రూమ్‌లు.. ఊరూవాడా గుడీ బడీ తేడా లేకుండా బెల్ట్ దుకాణాలు.. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు.. ఏరులై పారిన లిక్కర్..!	సమర్థంగా మద్య నియంత్రణ అమలు.. దోపిడీకి పాల్పడే ప్రైవేటు మద్యం దుకాణాల స్థానంలో ప్రభుత్వ మద్యం దుకాణాల విధానంతో సంస్కరణలు.. మద్యం దుకాణాల తగ్గింపు.. 43 వేల బెల్ట్ షాపుల తొలగింపు, పర్మిట్ రూమ్‌ల రద్దు..! ఒక్క కొత్త డిస్టిలరీకీ అనుమతి లేదు.. మద్యం అమ్మకాలను భారీగా తగ్గించి శభాష్ అనిపించుకుంది...	రాష్ట్రంలో పడగ విప్పిన మద్యం సిండికేట్.. ప్రైవేటు మద్యం షాపుల విధానం పునరుద్ధరణ.. పోలీసులతో బెదిరించి మరీ టీడీపీ కూటమి నేతలకే ఏక పక్షంగా దుకాణాలు కేటాయింపు.. మహిళల ఆందోళనలనూ లెక్కచేయకుండా నగరాలు, పల్లెల్లో వీధివీధిన బెల్ట్ షాపులు.. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు.. యథేచ్ఛగా దోపిడీ.. వరదలా పారుతున్న మద్యం..!

...పైన మూడు ఉదాహరణలు చదివారు కదా..! దీంతోనే అంతా అర్థం అయి ఉంటుంది.. ఇప్పుడు చెప్పండి..! ఎవరి పరిపాలన మద్యం దోపిడీకి స్వర్గధామంగా నిలిచింది..? ఎవరి జమానాలో అక్రమాలు జరిగే ఆస్కారం ఉంది..? ఎవరి హయాంలో అడ్డంగా అవినీతి చోటుచేసుకునే అవకాశం ఉంది..? కచ్చితంగా నాటి టీడీపీ, నేటి టీడీపీ కూటమి ప్రభుత్వాలలోనే కదా..? అయితే, డైవర్షన్ రాజకీయాలకు పెట్టింది పేరైన చంద్రబాబు నాటి తన ప్రభుత్వ నేరాలను, నేటి సర్కారు సాగిస్తోన్న తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు పన్నాగం పన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మద్యం విధానంపై అక్రమ కేసుతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు.

'తల్లికి వందనం'..

ఒకొక్క బిడ్డకు రూ.15 వేలు..

ఇద్దరుంటే రూ.30 వేలు..

ముగ్గురుంటే రూ.45 వేలు..

నలుగురుంటే రూ.60 వేలు..

ఐదుగురు ఉంటే రూ.75 వేలు

"ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నా.. ఇంకా పిల్లల్ని కనండి.. వారికీ ఇస్తా..! అప్పులు చేసి బటన్ నొక్కడం కాదు.. సంపద సృష్టించి తల్లికి వందనం కింద అందరికీ పంచుతా.

- ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ



'వందనం' లేక తల్లుల తిప్పలు..

ఓట్లేసి గెలిపించాక ఎగ్గొడితే ఎట్ట సార్?

దాదాపు రూ.15 వేల కోట్ల బకాయిలు

మా బాకీ మాకు ఇవ్వండి బాబూ

విద్యా సంవత్సరం ముగిసినా తల్లికి వందనం ఏది?

గెలిచాక పేదోళ్లకిచ్చే సాయాన్ని ఎగ్గొడితే ఎలా.?

6లో

అమ్మ ఒడి కాదు.. ఏది ఇస్తాందారు? ఏదీ ఇయ్యలే!

ఏ పార్టీ అయినా, ప్రభుత్వమైనా సేసింది సెప్పాల..

సేయంటీ సెప్పాల.. కష్టం సేసుకునేవాళ్లం..

ఇంతమంది బిడ్డల్ని సదివించాలంటే ఎట్ట సార్!

ఈయప్ప దమ్మిడీ ఇయ్యకపాయే..! జగన్ ఉన్నపుడు

అమ్మ ఒడి వచ్చేది.. ఆయప్ప ఉన్నపుడే బాగుండే!

రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది తల్లిదండ్రుల ఆక్రందన ఇదీ..!

మే 20న అంగన్‌వాడీల సమ్మె

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించకుంటే మే 20న సమ్మెకు దిగుతామని అంగన్‌వాడీ వర్కర్స్/హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. బుధవారం జరిగిన సమావేశంలో అంగన్‌వాడీలకు వేతనం పెంపుతోపాటు మినీ అంగన్‌వాడీల జీఓలను వెంటనే విడుదల చేయడం, బాల సంజీవని యాప్‌లో మార్పులు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సెంటర్ల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని కోరారు. మేలో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని తీర్మానించారు. ఈ సమస్యలపై ఐసీడీఎస్, పీడీ, సీడీపీవోలకు వినతిపత్రాలు ఇవ్వనున్నారు. సమావేశంలో అంగన్‌వాడీ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయంపై దాడికి వ్యతిరేకంగా తిరుపతిలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



గళమెత్తిన కలం

ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడికి ఖండన

7లో

కదంతొక్కిన జర్నలిస్టులు

ఊరూవాడా నినాదాల హోరు

- కమీషన్లు అందకముందు సీజ్ ద షిప్.. కమీషన్లు అందాక డోంట్ స్టాప్ ద షిప్

రేషన్ బియ్యం ఎగుమతికి 'పచ్చ' జెండా

12 వేల టన్నుల ఎగుమతికి ఆర్డర్.. మిల్లర్లతో కీలక మంత్రి వియ్యంకుడి మంతనాలు

ఏ ఇబ్బందీ ఉండదు.. అంతా తను చూసుకుంటానని భరోసా

సేకరణ బాధ్యత కొమరిపాలెంలోని బడా మిల్లర్‌కు అప్పగింత

ఎన్ని టన్నులు ఇస్తారో చెప్పండంటూ మిల్లర్లకు ఫోన్లు

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి నాదెండ్ల తీరుపై ప్రజల్లో చర్చ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: విదేశాలకు రేషన్ బియ్యం తరలించి రూ.కోట్లు కొల్లగొట్టేందుకు కూటమి నేతలు తలుపులు బార్లా తెరిచారు. కమీషన్ల కక్కుర్తితో పీడీఎస్ బియ్యం ఎగుమతికి అనుమతిస్తామని ముందుకు వచ్చారు. కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతి చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. తూర్పు ఆఫ్రికా దేశాలకు 12 వేల టన్నుల బియ్యం ఎగుమతి కోసం వచ్చిన అనుమతిని ఆసరాగా చేసుకుని రేషన్ బియ్యాన్ని విదేశాలకు తరలించేందుకు పక్కా ప్లాన్ సిద్ధమైంది. ఈ బియ్యం ఎగుమతికి అనుమతి తెచ్చుకున్నది

మిగతా 8వ పేజీలో ▶

'భారత్ సమ్మిట్ -2025'కు

వేదికగా హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరం మరోసారి అంతర్జాతీయ స్థాయి సదస్సుకు వేదిక కాబోతుంది. దేశ విదేశాలకు చెందిన వందలాది మంది ప్రతినిధులను ఆహ్వానిస్తూ తెలంగాణ ప్రభుత్వం 'భారత్ సమ్మిట్ -2025' పేరుతో సదస్సును నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఈనెల 25, 26 తేదీలలో జరిగే ఈ సదస్సుకు 100కు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. సుమారు 100 వరకు రాజకీయ పార్టీలు, 40 నుంచి 50 మంది మంత్రులు, 50 మంది సెనేటర్లు, ఎంపీలు ఈ భారత్ సమ్మిట్‌కు రాబోతున్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ క్యూబా అంతర్జాతీయ వ్యవహారాల హెడ్ ఎమిలియో లొజడా, మలేసియా న్యాయ శాఖ మంత్రి ఎం.కులా సెగరన్, అర్జెంటీనా మాజీ మంత్రి జార్జ్, కొలంబియా మాజీ కార్మిక మంత్రి, సెనేటర్ క్లారా ఎల్‌పేజ్ ఒబ్రెగన్ తదితరులు హాజరు కానున్నారు.

ప్రపంచ సాగుభూమిలో 15% కలుషితం



24.2 కోట్ల హెక్టార్ల వ్యవసాయ భూమిలో విషపూరిత భార లోహాలు

140 కోట్ల మంది ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం ● తాజా అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడి

భూమి..మన మనుగడకు మూలాధారం. మనం తినే 95% ఆహారానికే కాదు..అనుదినం తాగే నీటికి కూడా ప్రధాన వనరు భూమి. అయితే ఈ భూమిలో దాదాపు 15% విస్తీర్ణం మేర విషతుల్యమైన భార లోహాలతో కలుషితమైపోయింది. ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఐరోపా, ఆసియా ఖండాల్లోని కొన్ని దేశాల్లో ఈ కాలుష్యం అపరిమితంగా ఉంది. ఆర్సెనిక్, లెడ్ తదితర భార లోహాలు పరిమితికి మించి సాగు భూమిని కలుషితం చేసి ఆహార వ్యవస్థల్లోకి చేరిపోయాయి. సుమారు 140 కోట్ల మంది ప్రజల ఆరోగ్యానికి భార లోహాల కాలుష్యం పెనుముప్పులా మారిందని ఓ తాజా అంతర్జాతీయ అధ్యయనం హెచ్చరించింది.

- అమెరికన్ అసోసియేషన్ ఫర్ ద అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్సెస్ (ఏఏఏఎస్) ఆధ్వర్యంలో జరిగిన ఈ అధ్యయనానికి చైనాలోని సింగువా విశ్వవిద్యాలయ పరిశోధకుడు డా. దేయీ హౌ నేతృత్వం వహించారు. ఈ పరిశోధన ఫలితాలపై వ్యాసం ప్రసిద్ధ 'సైన్స్' జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైంది. ప్రపంచవ్యాప్తంగా వెయ్యి ప్రాంతీయ అధ్యయనాల గణాంకాలను సేకరించి, మెషీన్ లెర్నింగ్ సాంకేతికత ద్వారా విశ్లేషించారు.
- ప్రపంచవ్యాప్త సాగు భూమిలో కనిష్టంగా14% గరిష్టంగా 17% విస్తీర్ణంలో ఈ కాలుష్యం ఉంది. సుమారు 24.2 కోట్ల హెక్టార్ల నేలల్లో భార లోహ కాలుష్యం తిష్ట వేసిందని అధ్యయనం తేల్చింది. ఆర్సెనిక్, కాడ్మియం, కోబాల్ట్, క్రోమియం, రాగి, నికెల్, సీసం వంటి భార లోహాలు అపరిమిత స్థాయిలో సాగు భూమిలో ప్రజారోగ్యానికి తీరని హాని కలిగించే స్థాయిలో ఉన్నాయని అధ్యయనం తెలిపింది.

\- సాక్షి, స్పెషల్ డెస్క్

భార లోహాలతో ముప్పేమిటి?


శిలలు, మానవ కార్యకలాపాల వల్ల ఏర్పడే లోహాలు, మెటలాయిడ్లు ప్రపంచవ్యాప్తంగా అన్ని నేలల్లో ఉంటాయి. ఇతర లోహాలతో పోల్చితే ఈ లోహాల బరువు అణుస్థాయిలో అధికంగా ఉంటుంది. అందుకే వీటిని భార లోహాలు అంటారు. అవి మన కంటికి కనిపించవు. సేంద్రియ పదార్థం మాదిరిగా కాలగమనంలో భార లోహాలు విచ్ఛిన్నం కావు. ఒక్కసారి మట్టిలో ఇవి కలిశాయంటే దశాబ్దాల కాలం వరకూ పోవు. వీటిని మట్టిలో నుంచి పంట మొక్కల వేర్లు గ్రహిస్తాయి. అవి ఆ పంటల ధాన్యాలు, పూలు, కాయల్లోకి చేరుతాయి. ఆ విధంగా ఆహార చక్రం ద్వారా మనుషుల దేహాల్లోకి చేరుతున్నాయి.

- ఈ సమ్మేళనాలు పరిమితికి మించి దేహంలోకి చేరితే మనుషులు, జంతువులు, ఇతర జీవులకు ఆరోగ్యపరంగా తీరని హాని జరుగుతుంది.

యురేసియా దేశాలకు అధిక ముప్పు

యురేసియా తక్కువ అక్షాంశ ప్రాంతంలోని సాగుభూముల్లో భార లోహాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నాయని ఈ అధ్యయనం గుర్తించింది. దక్షిణ ఐరోపా, మధ్య ప్రాచ్య, దక్షిణాసియా, దక్షిణ చైనా ప్రాంత దేశాలకు ఈ బెడద అధికం. గ్రీకు, రోమన్, పర్షియన్, చైనా తదితర పురాతన నాగరికతలు విలసిల్లిన ప్రాంతం ఈ హైరిస్క్ జోన్‌లోనే ఉంది. గనుల తవ్వకం, లోహాలను కరిగించటం, వ్యవసాయం వంటి మానవ కార్యకలాపాలతోపాటు లోహ సంపన్న సహజ రాతిశిలలు ఉండటం, ఇవి తక్కువ వర్షపాత ప్రాంతం కావటమే ఈ కాలుష్యానికి కారణమని పరిశోధకులు విశ్లేషించారు.

- అన్నిచోట్లా సాగు భూముల్లో ఈ ఏడు భార లోహాలు ఉన్నాయని కాదు.. కనీసం ఏదో ఒక రకమైనా అపరిమిత మోతాదులో పోగుపడినట్టు శాస్త్రబద్ధమైన అధ్యయనంలో గుర్తించామని డా. దేయీ హౌ స్పష్టం చేశారు. వీటిల్లో కాడ్మియం కాలుష్యం అత్యధికంగా ఉంది. ప్రపంచ నేలల్లో కనీసం 9% భూమిని కలుషితం చేసింది. ఉత్తర, మధ్య భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, దక్షిణ చైనాతో పాటు ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో కొన్ని ప్రాంతపు నేలల్లో కాడ్మియం ఎక్కువగా ఉంది.



భారత్‌కు పోటెత్తిన పర్యాటకులు

8లో

2023-24లో 95.21 లక్షల మంది విదేశీ పర్యాటకుల రాక

కేవలం 10 దేశాల నుంచే 67.25 లక్షల మంది పర్యాటకులు

2022-23తో పోలిస్తే 30.83 లక్షల మంది పెరుగుదల

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ వెల్లడి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	521	80,116
నిఫ్టీ ▲	162	24,329

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	16,819	▲	519
డోజోన్స్	39,855	▲	643
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,403	▲	75
డాక్స్	21,962	▲	668
షాంఘై	3,296	▼	3
నికాయ్	34,868	▼	648

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	95,450
బంగారం (22 క్యారెట్లు)	90,900
వెండి (కిలో)	1,11,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.75	85.77
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	115.45	112.50
€	యూరో	ఒకటి	97.00	99.72
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	59.74	61.32
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.76	55.95
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.99	67.70
SAR	సౌదీ రియాల్	ఫాయిస్‌టీ	21.80	23.31
UAE D	యూఏఈ దిర్హామ్	ఫాయిస్‌టీ	22.29	24.07
¥	చైనా యువాన్	ఫాయిస్‌టీ	10.82	12.64

ఏథర్ ఎనర్జీ @ 304-321

• ఈ నెల 28–30న ఐపీవో



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీ ఏథర్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూకి రూ. 304–321 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 2,626 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.1 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 2,981 కోట్లు సమీకరించనుంది. వెరసి కొత్త ఆర్థిక సంవత్సరం (2025–26)లో తొలి పబ్లిక్ ఇష్యూగా నిలవనుంది. ఐపీవో ద్వారా దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో గతేడాది ఆగస్టులో లిస్టయిన ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ తదుపరి రెండో ద్విచక్ర ఈవీ కంపెనీగా ఏథర్ నిలవనుంది.

మేఘా ఇంజనీరింగ్‌కు భారీ కాంట్రాక్టు

• ఎన్‌పీసీఐఎల్ నుంచి రూ. 12,800 కోట్ల ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) తాజాగా న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐఎల్) నుంచి భారీ ఆర్డరు దక్కించుకుంది. దీని విలువ రూ. 12,800 కోట్లని కంపెనీ వెల్లడించింది. ఎన్‌పీసీఐఎల్ చరిత్రలోనే ఈ అతి పెద్ద కాంట్రాక్టుని బీహెచ్‌ఈఎల్, ఎల్‌అండ్‌టీలాంటి దిగ్గజాలతో పోటీపడి దక్కించుకున్నట్లు తెలిపింది.



దీని కింద కర్ణాటకలోని కైగా వద్ద ఒక్కోటి 700 మెగావాట్ల సామర్థ్యం గల రెండు న్యూక్లియర్ రియాక్టర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వివరించింది. ఈ కాంట్రాక్టుతో అణు ఇంధన రంగంలోకి ప్రవేశించినట్లయిందని కంపెనీ పేర్కొంది. అత్యున్నత ప్రమాణాలు, భద్రత, విశ్వసనీయతకు కట్టుబడి ఉంటూ ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని ఎంఈఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సీహెచ్ సుబ్బయ్య ధీమా వ్యక్తం చేశారు.

ఖరీదైన వాచ్‌లు, హ్యాండ్‌బ్యాగ్‌లపై పన్ను

రూ.10 లక్షలు మించితే ఒక శాతం టీసీఎస్



న్యూఢిల్లీ: హ్యాండ్ బ్యాగ్‌లు, చేతి గడియారాలు, పాదరక్షలు, క్రీడా వస్త్రాలు రూ.10 లక్షలు మించినవి మరింత ఖరీదుగా మారనున్నాయి. వీటిపై ఒక శాతం మూలం వద్దే పన్ను వసూలు (టీసీఎస్) చేయనున్నారు. ప్రస్తుతం ఒక శాతం టీసీఎస్ రూ.10 లక్షలు మించిన మోటారు వాహనాలపైనే అమలవుతోంది. ఒక శాతం టీసీఎస్ వర్తించే విలాస వస్తువుల జాబితాను ఆదాయపన్ను శాఖ తాజాగా విడుదల చేసింది. పెయింటింగ్‌లు, శిల్పాలు, పురాతన వస్తువులు, కాయిన్లు, స్టాంప్‌లు, పడవలు, హెలికాప్టర్లు, లగ్జరీ హ్యాండ్ బ్యాగ్‌లు, కళ్లద్దాలు, పాదరక్షలు, క్రీడావస్త్రాలు, క్రీడా పరికరాలు, హోమ్ థియేటర్ సిస్టమ్‌లు, రేసింగ్ కోసం ఉద్దేశించిన గుర్రాల విక్రయ ధరపై ఒక శాతం టీసీఎస్ అమలవుతుంది. కొనుగోలుదారుల నుంచి ఉత్పత్తి ధరపై ఒక శాతం అదనంగా టీసీఎస్‌ను విక్రయదారులే వసూలు చేస్తారు. వారి పాన్ వివరాలు కూడా తీసుకుని, ఆదాయపన్ను శాఖకు జమ చేస్తారు. కొనుగోలుదారులు ఆదాయపన్ను రిటర్నులు వేయడం ద్వారా తమ పన్ను చెల్లింపులో సర్దుబాటు చేసుకోవచ్చు. పన్ను చెల్లించే బాధ్యత లేకపోతే రిఫండ్ కోరొచ్చు. టీసీఎస్ రూపంలో ఆదాయపన్ను శాఖకు అదనంగా ఎలాంటి పన్ను ఆదాయం రాదు. కాకపోతే అధిక కొనుగోళ్ల వివరాలను పాన్ నంబర్ల ఆధారంగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. అధిక విలువతో కూడిన విచక్షణారహిత కొనుగోళ్ల పర్యవేక్షణను బలోపేతం చేయడం, పన్ను చెల్లింపుదారులను పెంచుకోవడం దీని లక్ష్యమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సెన్సెక్స్ మళ్లీ 80,000 పైకి

• ఐటీ, ఆటో షేర్లకు డిమాండ్
• ఏడో రోజూ బుల్ దూకుడు



ముంబై: ఐటీ, ఆటో రంగ షేర్ల ర్యాలీతో నాలుగు నెలల తర్వాత సెన్సెక్స్ సూచీ మళ్లీ 80 వేల స్థాయి పైకి చేరుకుంది. అమెరికా చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతుండడంతో, అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు విశ్వాసాన్నిచ్చాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 521 పాయింట్లు పెరిగి 80,116 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 162 పాయింట్లు బలపడి 24,329 వద్ద నిలిచింది. గతేడాది డిసెంబర్ 18 తర్వాత(నాలుగు నెలల) రెండు సూచీలు ఈ స్థాయిలపై ముగియడం ఇదే తొలిసారి. ఉదయం భారీ లాభాలతో మొదలైన సూచీలు ప్రారంభంలో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో ఆరంభ లాభాలన్నీ కోల్పోయాయి. అయితే ఐటీ, ఆటోతో పాటు కీలక రంగాల షేర్లకు డిమాండ్ లభించడంతో సూచీలు తిరిగి పుంజుకున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 659 పాయింట్లు దూసుకెళ్లి 80,255 వద్ద, నిఫ్టీ 192 పాయింట్లు బలపడి 24,359 వద్ద గరిష్టాన్ని తాకాయి. చైనాపై వాణిజ్య సుంకాలు గణనీయంగా తగ్గుతాయని ట్రంప్ వ్యాఖ్యలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

- వరుసగా ఏడు ట్రేడింగ్ సెషన్లలో రూ.36.65 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే, బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.430.47 లక్షల కోట్ల (5.04 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది.
- మార్చి క్వార్టర్ నికరలాభం 8% వృద్ధి నమోదుతో హెచ్‌సీఎల్ టెక్ షేరు 7.72% లాభపడి రూ.1,594 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 8% ఎగసి రూ.1,600 వద్ద గరిష్టాన్ని తాకింది. టెక్ మహీంద్రా(4.63%), ఇన్ఫోసిస్(3.69%), టీసీఎస్(3%) షేర్లు సైతం రాణించాయి.
- ఇటీవల భారీగా పెరిగిన ఫైనాన్స్, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ చోటుచేసుకుంది. ముత్తూట్ ఫైనాన్స్ 3.50%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్ 2% నష్టపోయాయి.
- ఈ వేసవిలో కూలింగ్ ఉత్పత్తులకు ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉండకపోవచ్చనే అంచనాలతో కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్లూస్టార్ 6%, వోల్టాస్ 3.50%, హావెల్స్ 3%, క్రాంప్టన్ 2.50%, వర్ల్‌పూల్ రెండు శాతం మేర నష్టపోయాయి.
- రూపాయి విలువ గడిచిన రెండు వారాల్లో అతిపెద్ద పతనాన్ని చూవిచూసింది. డాలర్ మారకంలో 25 పైసలు క్షీణించి 85.44 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

యాపిల్, మెటాకు ఈయూ షాక్	ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం ఫ్లస్

బంగారం డిమాండ్‌కు 'ధరా'ఘాతం!

అమ్మకాలు 10% తగ్గొచ్చు

- పరిమాణం అంతే ఉండొచ్చు
- మార్కెట్లో సానుకూల సెంటిమెంట్
- అక్షయ తృతీయ, పెళ్లిళ్లు అనుకూలం
- జ్యుయలర్లు, క్రిసిల్ అభిప్రాయాలు

ముంబై: బంగారం ధరలు గణనీయంగా పెరిగిపోవడం వినియోగ డిమాండ్‌ను దెబ్బతీయొచ్చని పరిశ్రమ వర్గాలు, రేటింగ్ ఏజెన్సీలు భావిస్తున్నాయి. అయినప్పటికీ ఈ నెల 30న అక్షయ తృతీయ, తదుపరి మే చివరి వరకు వివాహాల సీజన్ నేపథ్యంలో కొనుగోళ్ల సెంటిమెంట్ సానుకూలంగా ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 22న బంగారం 10 గ్రాములకు ఢిల్లీలో రూ.1,01,350కు పెరిగిపోవడం తెలిసిందే. ''బంగారం ధరలు అనూహ్యంగా పెరగడం అన్నది డిమాండ్‌పై కచ్చితంగా ప్రభావం చూపిస్తుంది. ఈ షాక్ నుంచి తేరుకున్న తర్వాత డిమాండ్ స్థిరపడుతుంది. మొత్తం మీద అయితే మార్కెట్లో సానుకూల సెంటిమెంట్ ఉంది. అక్షయ తృతీయ, వివాహాల సీజన్ నేపథ్యంలో వినియోగదారుల నుంచి మంచి డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నాం'' అని ఆల్ ఇండియా జెమ్స్ అండ్ జ్యుయలరీ డొమెస్టిక్ కౌన్సిల్ చైర్మన్ రాజేష్ రోక్డే తెలిపారు. 2023లో 741 టన్నుల బంగారం దిగుమతి కాగా, ధరలు 20% మేర పెరిగినప్పటికీ 2024లో 802 టన్నులు దిగుమతి కావడాన్ని ఆయన ప్రస్తావించారు. బంగారం ధర రూ.లక్షకు చేరడం కచ్చితంగా డిమాండ్‌పై 10–15% ప్రభావం ఉండొచ్చని ఆల్ ఇండియా జెమ్స్ అండ్ జ్యుయలరీ డొమెస్టిక్ కౌన్సిల్ వైస్ చైర్మన్ అవినాష్ గుప్తా చెప్పారు.

ఒత్తిడి ఉన్నప్పటికీ..

''మార్కెట్లో ఆశావహ వాతావరణం కనిపిస్తోంది. బంగారం ధరలు భవిష్యత్తులో ఇంకా పెరుగుతాయన్న అంచనాలు నెలకొన్నాయి. కొంతకాలంగా ధరలు పెరుగుదలతో అమ్మకాల పరిమాణంపై ఒత్తిడి నెలకొంది. అయినప్పటికీ వినియోగదారుల్లో ఉన్న సానుకూల సెంటిమెంట్ పరిశ్రమకు అనుకూలిస్తుంది'' అని పీఎస్ గాడ్గిల్ జ్యుయలర్స్ చైర్మన్ సౌరభ్ గాడ్గిల్ తెలిపారు.

విక్రయాలు 9–11 శాతం తగ్గొచ్చు..

బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్టాలకు చేరినందున ఈ ఏడాది (2025–26) సంస్థాగత రిటైల్ జ్యుయలర్ల అమ్మకాలు (పరిమాణం పరంగా) 9–11% వరకు తగ్గొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. అధిక ధరల కారణంగా వినియోగదారులు తక్కువ పరిమాణంలో కొనుగోళ్లకు మొగ్గు చూపించొచ్చని పేర్కొంది. కొనుగోలు వ్యయం అంతే ఉండి, క్యారట్, గ్రాముల రూపంలో తగ్గొచ్చని వివరించింది. అయినప్పటికీ అమ్మకాల ఆదాయం క్రితం ఆర్థిక సంవత్సరం కంటే 13–15% పెరగొచ్చని తాజా నివేదికలో తెలిపింది.



రూ.లక్ష దిగువకు పసిడి

బంగారం ధర రూ.లక్షను దాటిన ఒక్కరోజులోనే అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నది. బుధవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.2,400 నష్టపోయింది. రూ.99,200 వద్ద స్థిరపడింది. 99.5% స్వచ్ఛత బంగారం రూ.3,400 నష్టపోయి రూ.98,700కు దిగొచ్చింది. చైనాపై విధించిన టారిఫ్‌లు చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని త్వరలోనే తగ్గించనున్నట్టు ట్రంప్ ప్రకటించడం అమ్మకాలకు దారితీసింది.

పసిడి పరుగుతో లాకర్లకు డిమాండ్

గోద్రెజ్ స్మార్ట్ సెక్యూరిటీ సొల్యూషన్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పసిడి ధర పరుగులు తీస్తున్న నేపథ్యంలో హోమ్ లాకర్లకు కూడా గణనీయంగా డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్‌నకు చెందిన సెక్యూరిటీ సొల్యూషన్స్ విభాగం సరికొత్త సెక్యూరిటీ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించింది. గృహ, వ్యాపార అవసరాల కోసం ఉపయోగపడే 7 ఉత్పత్తులు ఉన్నాయి.



వీటిలో డిజిటల్.. బయోమెట్రిక్ యాక్సెస్, ఇంటెలిజెంట్ ఐబజ్ అలారం సిస్టం వంటి ఫీచర్లు ఉన్నట్లు సెక్యూరిటీ సొల్యూషన్స్ బిజినెస్ హెడ్ పుష్కర్ గోఖలే వివరించారు. ఇళ్లలో వినియోగించే ఉత్పత్తుల ధర శ్రేణి రూ. 9,000 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఏపీ, తెలంగాణలో 500 పైచిలుకు అవుట్‌లెట్స్ ఉండగా, సుమారు రూ. 130 కోట్ల ఆదాయం ఉంటోందని జోనల్ హెడ్ శరత్ మోహన్ పేర్కొన్నారు.

సాక్షి సినిమా

కథ నచ్చితే ఆ తేడా చూడను

- హరీష్ శంకర్



• అనుదీప్, హరీష్ శంకర్, నస్లెన్, సుబ్బారెడ్డి, ఖలీద్ రెహమాన్

''నాకు సినిమా కథ నచ్చితే భాష, చిన్న సినిమా.. పెద్ద సినిమా అనే తేడా చూడకుండా ప్రమోట్ చేయడానికి ముందుంటాను. 'జింఖానా' చిత్రం ట్రైలర్ నాకు చాలా నచ్చింది. ఈ సినిమాని అందరూ తప్పకుండా ఎంజాయ్ చేస్తారు'' అని డైరెక్టర్ హరీష్ శంకర్ చెప్పారు. నస్లెన్, లుక్మాన్ అవరన్, గణపతి, సందీప్ ప్రదీప్ ముఖ్య తారలుగా ఖలీద్ రెహమాన్ దర్శకత్వం వహించిన చిత్రం 'అలప్పుజ జింఖానా'. ఖలీద్ రెహమాన్, జోబిన్ జార్జ్, సమీర్ కారత్, సుబీష్ కన్నంచెరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న మలయాళంలో విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ నరసింహ మూవీ మేకర్స్‌పై సుబ్బారెడ్డి తెలుగులో 'జింఖానా' పేరుతో ఈ నెల 25న విడుదల చేస్తున్నారు.
ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన **హరీష్ శంకర్ మాట్లాడుతూ–** ''జింఖానా' సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్న సుబ్బారెడ్డిగారికి అభినందనలు. నైజాంలో మైత్రీ మూవీస్ శశిగారు రిలీజ్ చేస్తున్నారు కాబట్టి తిరుగుండదు'' అన్నారు.
డైరెక్టర్ **అనుదీప్ మాట్లాడుతూ–** ''ఈ సినిమా నేను చూశాను.. చాలా బాగుంది. స్పోర్ట్స్ కామెడీ నేపథ్యంలో చాలా బాగా తీశారు'' అని చెప్పారు. ''స్పోర్ట్స్ కామెడీ ఫిల్మ్ 'జింఖానా'. చాలా మంచి యాక్షన్ సీక్వెన్స్‌లు, పాటలుంటాయి'' అని ఖలీద్ రెహమాన్ తెలిపారు. హీరో **నస్లెన్ మాట్లాడుతూ–**
''నేను నటించిన 'ప్రేమలు' సినిమాకి తెలుగు ప్రేక్షకులు ఇచ్చిన సపోర్ట్ మర్చిపోలేను. 'జింఖానా'ని కూడా ఆదరించాలి'' అన్నారు. ఈ వేడుకలో మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి, డైరెక్టర్స్ సాగర్ కె. చంద్ర, సుజీత్, సందీప్, నటీనటులు బేబీ జీన్, లుక్మాన్ అవరన్, సందీప్ ప్రదీప్ మాట్లాడారు.

నేను చెప్పేది మీరంతా వినాలి!



• మోహన్‌లాల్, శోభన

మోహన్‌లాల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'తుడరుమ్'. తరుణ్ మూర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శోభన హీరోయిన్‌గా నటించారు. ఎం. రంజిత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. కాగా, దీపా ఆర్ట్స్‌పై పి. శ్రీనివాస్ గౌడ్ ఈ చిత్రాన్ని ఈ నెల 26న తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'ఆ గడ్డాన్ని ముట్టుకుంటే చేయి నరికేస్తా..., అన్నా.. మీరు ఇలా గడ్డం తడుముకుంటూ అయ్యోపాపం అని తిరిగితే ఎలా.., హేయ్.. ఈ గడ్డం ఉంటే ఎవరికిరా.. ప్రాబ్లమ్..., ఒరేయ్ ఎందరో మహానుభావులు ఎక్కిన బండిరా ఇది..., ఈ కారు కోసం నువ్వు ఫ్యాన్‌లా ఈ స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉండాలి, ఇక నేను చెప్పేది మీరంతా వినాలి!' వంటి డైలాగ్స్ 'తుడరుమ్' ట్రైలర్‌లో ఉన్నాయి. ఓ ట్యాక్సీ డ్రైవర్ కుటుంబం, అతని కారు పోలీస్‌స్టేషన్‌లో చిక్కుకోవడం, ఆ తర్వాత వచ్చే సంఘటనల సమాహారంగా ఈ మూవీ ఉండబోతున్నట్లుగా ట్రైలర్ స్పష్టం చేస్తోంది. మణియంపిల్ల రాజు, బిను పప్పు, ఇర్షాద్ అలీ, ఫర్హాన్ ఫాజిల్ , థామస్ మాథ్యూ, షైజో ఆదిమాలి ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు జేక్స్ బిజోయ్ స్వరకర్త.

డాన్‌తో జోడీ?



• కృతీసనన్

బాలీవుడ్ కొత్త డాన్ రణ్‌వీర్ సింగ్ సరసన కృతీసనన్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. బాలీవుడ్ 'డాన్' ఫ్రాంచైజీలో రూపొందనున్న కొత్త చిత్రం 'డాన్ 3'. రణ్‌వీర్ సింగ్ హీరోగా ఫర్హాన్ అక్తర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. రితేష్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ నిర్మించనున్న ఈ మూవీని 2023 ఆగస్టులోనే ప్రకటించారు. కానీ, వివిధ కారణాల వల్ల ఈ చిత్రం ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. ఈ వేసవి నుంచి షూటింగ్‌ను స్టార్ట్ చేయాలనుకుంటున్నారు. అయితే ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా కియారా అద్వానీని ఎంపిక చేసుకున్నారు మేకర్స్. కానీ, ప్రస్తుతం ఆమె గర్భిణిగా ఉండటంతో ఈ మూవీలో హీరోయిన్‌గా కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో 'డాన్ 3' కోసం కొత్త హీరోయిన్‌ని ఎంపిక చేసే పనిలో పడ్డారు ఫర్హాన్ అక్తర్. అందులో భాగంగా ఇటీవల శర్వారీ పేరు తెరపైకి వచ్చింది. తాజాగా కృతీసనన్ పేరు బాలీవుడ్‌లో వినిపిస్తోంది. మరి.. 'డాన్ 3' లో రణ్‌వీర్ సింగ్ సరసన కృతీసనన్ కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. కాగా హిందీలో వచ్చిన 'డాన్' (2006), 'డాన్ 2' (2011) సినిమాల్లో షారుక్ ఖాన్ హీరోగా, 1978లో వచ్చిన 'డాన్'లో అమితాబ్ బచ్చన్ హీరోగా నటించిన విషయం తెలిసిందే.

శివ శంభో లాంటి సినిమాలను గౌరవించాలి

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



• సుగుణ దోరవేటి, గోరటి వెంకన్న, నర్సింగ్ రావు

''భక్తి, సంగీతం, సాహిత్యం, నృత్యం నేపథ్యంలో రూపొందిన అరుదైన సినిమా 'శివ శంభో'. ఇటువంటి చిత్రాలను మనమంతా గౌరవించాలి. అభిరుచి గల ప్రేక్షకులు ఈ తరహా చిత్రాలను తప్పక ఆదరిస్తారు'' అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. తనికెళ్ల భరణి, సుమన్, కృష్ణ ఇస్లావత్, సాయి చక్రవర్తి, కేశవర్ధిని బేబీ రిషిత ప్రధాన పాత్రల్లో నర్సింగ్ రావు దర్శకత్వం వహించిన భక్తిరస చిత్రం 'శివ శంభో'. అనంత ఆర్ట్స్ బ్యానర్‌పై బొజ్జ రాజగోపాల్, దోరవేటి సుగుణ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో **తనికెళ్ల భరణి మాట్లాడుతూ–** ''శివ శంభో' లాంటి భక్తి చిత్రాలు అరుదుగా వస్తాయి. సంగీతం, సాహిత్యం, నృత్యం ప్రధానాంశాలుగా కలిగిన ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలి'' అన్నారు. ''మా సినిమాకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుంది'' అని నర్సింగ్ రావు తెలిపారు. ''థియేటర్‌కు వెళ్లి మా సినిమాని చూడాలి'' అని నిర్మాత, రచయిత, సంగీత దర్శకుడు సుగుణ దోరవేటి కోరారు. ఈ వేడుకలో బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్, బర్దీపుర పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ సిద్ధేశ్వర గిరి స్వామీజీ, ఫిల్మ్‌ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్, చిత్రపురి కాలనీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ పాల్గొన్నారు.

నా లక్ష్యం అదే

- వశిష్ట ఎన్. సింహా



''హారర్, కాలేజ్ లవ్‌స్టోరీ సినిమాలు చేయాలనుకోవడం లేదు. ఒకవేళ ఎవరైనా నాకు అలాంటి కథలు చెప్పాలనుకుంటే సమయం వృథా చేసుకోవద్దని చెబుతాను. 'ఓదెల 2' చిత్రం హారర్ ఫిల్మ్ కాదు.. దైవానికి, దుష్ట శక్తికి మధ్య వైరం. ఈ మూవీలో నేను ఓ ఆత్మ పాత్ర చేశాను. హీరో, విలన్ అని కాదు.. ప్రేక్షకుల చేత మంచి నటుడిగా పేరు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం'' అని వశిష్ఠ ఎన్. సింహా చెప్పారు. తమన్నా భాటియా లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఓదెల 2'. దర్శకుడు సంపత్‌నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదలైంది. ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించిన వశిష్ఠ ఎన్. సింహా బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ– ''కిరాక్‌పార్టీ' (2018) సినిమాలోని 'నీచమైన..' అనే పాటను పాడి, సింగర్‌గా తెలుగులోకి వచ్చాను నేను. కన్నడలో నన్ను సింగర్‌గా పరిచయం చేసిన మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోక్‌నాథ్ గారే తెలుగులోనూ గాయకుడిగా పరిచయం చేశారు. ఇక 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమా తర్వాత ఓ రోజు సంపత్ నందిగారు కాల్ చేసి, 'ఓదెల 2' గురించి, నా పాత్ర గురించి చెప్పినప్పుడు సర్‌ప్రైజ్ అయ్యాను. ఈ తరహా దెయ్యం పాత్ర నేను ఎప్పుడూ చేయలేదని వెంటనే ఓకే చెప్పాను. ఈ సినిమాలోని సమాధి శిక్ష సీక్వెన్స్ సవాల్‌గా అనిపించింది. 'ఓదెల 2' లో స్క్రీన్‌పై తిరుపతి ఉన్నా లేకపోయినా అతని నామస్మరణ మాత్రం సినిమాలోని క్యారెక్టర్స్ చెబుతూనే ఉంటాయి. అలా ఈ సినిమాకు ఎవరైనా హీరో ఉంటే అది తిరుపతి పాత్రే. తమన్నాగారు నాగసాధువుగా అద్భుతంగా నటించారు. సంపత్‌నందిగారు 'ఓదెల 2' కథను అద్భుతంగా రాశారు. అశోక్ తేజ మంచి విజన్ ఉన్న డైరెక్టర్. డి.మధుగారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్. డిఫరెంట్ రోల్స్‌తో ఆడియన్స్ నన్ను గుర్తుపెట్టుకునే పాత్రలు చేయాలని ఉంది'' అని అన్నారు.

స్టోరీనే హీరో

- ఇంద్ర రామ్



''ఈ రోజుల్లో కథే హీరో. మా 'చౌర్యపాఠం' సినిమాకు కూడా కథే మెయిన్ హీరో. మేమంతా కొత్తవాళ్లం కాబట్టి మాపై ప్రేక్షకుల్లో అంచనాలు తక్కువగా ఉంటాయి. అయితే ప్రేక్షకులు సినిమా చూసిన తర్వాత మేము ఓ మంచి చిత్రం చేశామని అనుకుంటారనే ఆత్మ విశ్వాసంతో ఉన్నాం'' అని ఇంద్ర రామ్ అన్నారు. కార్తీక్ కథతో నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో ఇంద్ర రామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నటించిన సినిమా 'చౌర్యపాఠం'. దర్శకుడు నక్కిన త్రినాథరావు నిర్మించారు. చూడమణి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం రేపు(శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఇంద్ర రామ్ విలేకరులతో మాట్లాడుతూ– ''మా స్వస్థలం విజయవాడ. ఢిల్లీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. రామ్‌గోపాల్ వర్మగారిపై అభిమానంతో ఆయన్ని కలవగా 'వంగవీటి' సినిమాలో ఓ చిన్న పాత్ర ఇచ్చారు. ఆ తర్వాత అజయ్ భూపతిగారితో 'ఆర్‌ఎక్స్ 100' మూవీ కోసం ట్రావెల్ అయ్యాను. కానీ, కొన్ని కారణాల వల్ల ఆ మూవీ నేను చేయలేదు. అయితే కార్తికేయ బాగా చేశాడు. 'చౌర్యపాఠం' అనేది రెగ్యులర్ ఫిల్మ్ కాదు. ఈ సినిమాకు కథ అందించిన కార్తీక్ తండ్రి ఐజీగా పనిచేశారు. అసలు నేరాలు జరగని ఓ గ్రామంలో ఓ బ్యాంకు దొంగతనం జరిగితే ఎలా ఉంటుంది? అన్నదే ఈ సినిమా కథనం. త్రినాథరావుగారు రాజీ పడకుండా ఈ మూవీ నిర్మించారు. కొత్తవారు నటించిన 'కోర్ట్, కమిటీ కుర్రాళ్ళు' వంటి సినిమాలు మంచి విజయాలు సాధించాయి.. మా సినిమా కూడా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. మా సినిమాకు విజయ్ సేతుపతి, నాగచైతన్య, వరుణ్ తేజ్‌గార్లు సపోర్ట్ చేశారు. విజయ్ సేతుపతిగారి సలహాతో మా మూవీని తమిళంలో రిలీజ్ చేస్తున్నాం. మా సినిమా ట్రైలర్ నచ్చి ఏషియన్ సునీల్‌గారు మా సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు'' అని తెలిపారు.

కర్మణి ప్రారంభం



• నాగమహేశ్

నాగమహేశ్, రూపాలక్ష్మి, 'బాహుబలి' ప్రభాకర్, రచ్చ రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'కర్మణి'. 'మన్నించవా..' ఫేమ్ రమేష్ అనెగౌని దర్శకత్వంలో మంజుల చవన్, రమేష్ గౌడ్ అనెగౌని నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత మంజుల చవన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నాగమహేశ్ క్లాప్ ఇచ్చారు. రమేష్ అనెగౌని మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథతో మా సినిమా రూపొందుతోంది. మే మొదటి వారంలో ఈ చిత్రం తొలి షెడ్యూల్‌ను ప్రారంభిస్తాం'' అని తెలిపారు. ''మంచి టాలెంట్ ఉన్న టీమ్‌తో ఈ సినిమా చేస్తున్నాం. ఇండస్ట్రీకి ఒక మంచి సినిమా అందిస్తామనే నమ్మకం ఉంది'' అని మంజుల చవన్ చెప్పారు. ఈ సినిమాకు సంగీతం: జాన్ భూషన్, కెమేరా: జగదీష్ కొమరి.



కొవ్వొత్తులతో ర్యాలీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడుల మృతులకు నివాళులర్పిస్తూ విజయవాడలో బుధవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.



బండెనక బండి కట్టి..

చందర్లపాడు మండలం తుర్లపాడులో జరుగుతున్న ఉరుసుకు బుధవారం కంచికచర్ల మండలం పెండ్యాల నుంచి ముస్లింలు బండెనెక బండికట్టి తరలివెళ్లారు.

4లో



ఆకస్మిక తనిఖీ

మైలవరం: రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కమిషన్ ఛైర్మన్ కె.పట్టాభి బుధవారం మైలవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బుధవారం పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. విజయవాడకు చెందిన ఎల్.నారాయణ కుటుంబం ఆలయ అధికారులను కలిసి రూ.1,01,116 విరాళం అందజేసింది. ఒంగోలుకు చెందిన డి.శివకృష్ణ ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మహిళలకు 'శక్తి' యాప్‌తో రక్షణ



విజయవాడస్పోర్ట్స్: ఆపద సమయంలో మహిళలకు 'శక్తి' యాప్ రక్షణగా నిలుస్తుందని మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ లతాకుమారి సూచించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శక్తి యాప్ ఆవశ్యకతపై విద్యార్థినులు, గృహిణులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జి.కొండూరు గ్రామం, విజయవాడ నగరంలోని డెంటల్ కాలేజీ, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో మహిళా హాస్టల్, పలు ప్రధాన కూడళ్ల వద్ద విద్యార్థినులు, గృహిణులకు మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది బుధవారం ఈ యాప్‌పై అవగాహన కల్పించారు. ఏసీపీ లతాకుమారి మాట్లాడుతూ.. మహిళలు, బాలికల రక్షణకు ఎన్నో చట్టాలున్నాయన్నారు. ఆపద సమయంలో మహిళలకు రక్షణగా నిలిచేందుకు శక్తి యాప్‌ను రూపొందించామన్నారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని ఆపద సమయంలో సాయం పొందాలని సూచించారు. బాధితులు యాప్‌లో సమాచారం అందించిన పది నిమిషాల్లో పోలీస్ సాయం అందుతుందన్నారు.

నియోజకవర్గాల యాక్షన్ ప్లాన్‌పై వర్క్‌షాప్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'స్వర్ణాంధ్ర 2047' సాధనలో భాగంగా నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు రెండు రోజులు జరిగే వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సిబ్బందికి వర్క్‌షాప్ చేపట్టారు. ఏపీ సెక్రటేరియట్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్లు రావి రాంబాబు, జె.విజయలక్ష్మి, సీనియర్ సలహాదారు డి.వి.వి.సీతాపతిరావు పాల్గొని సిబ్బందికి శిక్షణనిచ్చారు. విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు నియోజకవర్గాల పరిధిలోని అవకాశాలు, బలాలు, అనుకూల, ప్రతికూల అంశాలను గుర్తించడంపై అవగాహన కల్పించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, వారి టీం సభ్యుల నుంచి సలహాలు, అభిప్రాయాలు సేకరించారు. వర్క్‌షాప్‌లో రెండు జిల్లాల నుంచి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ హెడ్ క్వార్టర్ మండల పరిషత్ అధికారులు, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్లు, ప్రణాళిక శాఖ సిబ్బంది, జీఎస్‌డబ్ల్యూఎస్ నుంచి ప్రణాళికా శాఖకు ఆన్‌డ్యూటీపై తీసుకున్న సిబ్బంది పాల్గొన్నారు. వర్క్‌షాప్ గురువారం కూడా కొనసాగుతుందని అర్థగణాంకాధికారి ఎం.లలితాదేవి తెలిపారు.

కార్మికుల బతుకు బండలు

- నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లో 160కి పైగా క్వారీలు
- క్వారీల్లో పనికోసం ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికులు
- కార్మికుల భద్రతకు చర్యలు చేపట్టని క్వారీల నిర్వాహకులు
- బ్లాస్టింగ్‌కు అధిక మోతాదులో పేలుడు పదార్థాల వినియోగం
- పేలుళ్ల ధాటికి క్వారీల్లోనే తనువు చాలిస్తున్న పేద బతుకులు



కంచికచర్ల మండలం దొనబండలో 100 అడుగుల లోతు బ్లాస్టింగ్ చేసిన దృశ్యం

కంచికచర్ల: పొట్ట చేతపట్టుకుని ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కార్మికులు రాతి క్వారీల్లో పనిచేసుకుంటూ బతుకుబండి లాగుతున్నారు. కొండలను పిండి చేస్తూ అరకొర వేతనాలతోనే సరిపెట్టుకుంటున్నారు. అయితే క్వారీల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా జరుగుతున్న ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు తీవ్రగాయాల పాలవుతున్నారు. క్వారీల్లో పేలుళ్లకు నిబంధనలకు విరుద్ధంగా జిలెటిన్ స్టిక్స్ (పేలుడు పదార్థాలు) ఉపయోగించడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని ప్రమాదాల సమాచారం అధికారులు, మీడియాకు తెలియడంతో బహిర్గతం అవుతున్నాయి. మరికొన్ని ప్రమాదాలు మూడో కంటికి తెలియడంలేదు. ప్రమాదాలు జరిగిన సమయంలో బాధిత కుటుంబాలకు క్వారీ యజమానులు ఎంతో కొంత పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు.

ఏడాదిలో 10 మంది వరకు మృతి

ఏడాది కాలంలో దొనబండ రాతి క్వారీల్లో పది మంది వరకు మృత్యువాతపడ్డారు. వారిలో ఒడిశా, బిహార్ రాష్ట్రాల వారు ఉన్నారు. వర్షంలో బ్లాస్టింగ్ చేసిన బండరాళ్లను తొలగించే క్రమంలో బండలన్నీ కార్మికులపై పడిపోవటంతో ఒకేసారి ముగ్గురు మృతిచెందారు. క్వారీ గుంత వద్దకు దుస్తులు ఉతికేందుకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీటిలో పడి ప్రాణాలు కోల్పోయారు. ఓ క్రషర్‌లో రివర్సు చేస్తున్న డోజర్ తగిలి ఓ వ్యక్తి మృతిచెందాడు. కంకరలోడుతో వెళ్తున్న లారీ రోడ్డు పక్కన పల్టీకొట్టడంతో ఓ డ్రైవర్ మృతిచెందాడు. బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు వచ్చి క్వారీల్లో పనిచేసే కార్మికులకు తగలడంతో తీవ్రగాయాల పాలయిన వారు మరో 20 మంది వరకు ఉన్నారు.

కనిపించని భద్రతా చర్యలు

క్వారీల్లో కార్మికుల రక్షణ కోసం నిర్వాహకులు ఎటువంటి భద్రతా చర్యలూ చేపట్టడంలేదు. పేలుళ్ల సమయంలో కొండ పైకి బెంచీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కార్మికులు పనిచేసే సమయంలో కాళ్లకు బూట్లు, బెల్టు, టోపీ, చేతులకు గ్లౌజులు సరఫరా చేయాలి. కార్మికులు కొండపైన డ్రిల్లింగ్ చేసే సమయంలో నాణ్యమైన తాళ్లు ఇవ్వాల్సి ఉంది. నాసిరకం తాళ్లు ఇవ్వటంతో అవి తెగి కార్మికులు కొండపై నుంచి కొందకు పడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి.



దొనబండ క్వారీలో బండరాళ్ల మధ్య మృత్యువాత పడిన కార్మికుడు (ఫైల్)

నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లోని కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు మండలాల్లో సుమారు 160 వరకు రాతి క్వారీలు, 80 వరకు క్రషర్లు ఉన్నాయి. కొన్ని క్వారీలు మూతపడ్డాయి. కొన్ని క్వారీలు అధికారికంగా, మరికొన్ని అనధికారికంగా నడుస్తున్నాయి. బ్లాస్టింగ్ చేసే సమయంలో

వంద అడుగుల లోతుతో బ్లాస్టింగ్

ఎనిమిది అడుగుల లోతులో మాత్రమే డ్రిల్లింగ్ చేయాల్సి ఉంది. అయితే ఒకేసారి 100 లారీలకు సరిపడా ముడి సరుకు వచ్చేలా నిబంధనలకు విరుద్ధంగా వంద అడుగుల వరకు డ్రిల్లింగ్ చేస్తున్నారు. పెద్ద పెద్ద బండరాళ్లు ఒకేసారి పగిలిపోతున్నాయి. ఈ పేలుళ్ల ధాటికి కొన్నిసార్లు కార్మికులు మృత్యువాత పడుతున్నారు. మరి కొందరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారు. కంచికచర్ల మండలంలోని దొనబండ రాతి క్వారీలో ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల కార్మికులు, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు, జూపూడి క్వారీల్లో ఒడిశా, తమిళనాడు కార్మికులు పనిచేస్తున్నారు.

అనుభవంలేని కార్మికులతో బ్లాస్టింగ్‌లు

రాతి క్వారీల్లో బండలను పేల్చే పనులను అనుభవం లేని కార్మికులతో చేయిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రిగ్ బ్లాస్టింగ్ చేయకూడదు. 100 లారీలకు ముడి సరుకు ఒకేసారి దిగుమతి కావాలన్న ఆశతో ఘాతాలు తవ్వి, వాటిలో మోతాదకు మించి జిలెటిన్స్ స్టిక్స్ వాడి బ్లాస్టింగ్ చేస్తున్నారు. పేలుడు ధాటికి పెద్ద పెద్ద బండరాళ్లు ఎగిరిపడి కార్మికులు మృతి చెందుతున్నారు. కొన్నిసార్లు క్వారీలకు మూడు కిలోమీటర్ల సమీపంలోని ఇళ్లు పేలుడు ధాటికి పగుళ్లు ఇస్తున్నాయి. మరికొన్ని చోట్ల ప్రహరీలు పడిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ జరుగుతున్నా మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏవైనా ప్రమాదాలు జరిగి, అవి బయటకు తెలిస్తేనే అధికారులు మొక్కుబడిగా క్వారీల వద్దకు వస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



క్వారీలో మృతిచెందిన కార్మికుడిని తరలిస్తున్న పోలీసులు (ఫైల్)

రక్షణ చర్యలు చేపట్టాలి



క్వారీల్లో బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రిగ్ బ్లాస్టింగ్ చేస్తున్నారు. దీంతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. క్వారీలో పనిచేసే కార్మికుల రక్షణకు నిర్వాహకులు చర్యలు చేపట్టాలి. నిబంధనలు పాటించని క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

– కోట కల్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయవాడ

అధిక మోతాదులో పేలుడు పదార్థాలు



అనుభవం లేని వ్యక్తులతో బ్లాస్టింగ్ చేయటం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్లాసింగ్ సమమంలో అధిక మోతాదులో పేలుడు పదార్థాలను వాడుతున్నారు. ఫలితంగా క్వారీల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాతపడుతున్నారు. ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల కార్మికులు, మైనర్లతో పనులు చేయిస్తున్నారు.

– జి.హరికృష్ణారెడ్డి, భవన నిర్మాణ రంగ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు

పదవిలో బాధ్యతగా వ్యవహరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి గోపీ

చిలకలపూడి(మచిలీపట్నం): పదవి ద్వారా వచ్చిన అధికారంతో బాధ్యతగా వ్యవహరించాలి తప్ప అజమాయిషీ చేయకూడదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపీ సూచించారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం, జిల్లాకు బదిలీపై వచ్చిన న్యాయమూర్తులకు స్వాగతం, బదిలీపై వెళ్లిన న్యాయమూర్తులకు వీడ్కోలు కార్యక్రమం బార్ అసోసియేషన్ హాలులో బుధవారం జరిగింది. తొలుత బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి మాట్లాడుతూ.. మచిలీపట్నంతో తనకు అనుబంధం ఉందని, తన మామయ్య మచిలీపట్నంలో ఎనిమిదేళ్ల పాటు పనిచేశారని పేర్కొన్నారు. తాను మచిలీపట్నం బదిలీ అయినట్లు తెలియగానే ఎంతో సంతోషించానన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.పోతురాజు మాట్లాడుతూ.. తనతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్న న్యాయవాదులకు ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. బార్, బెంచ్ సమన్వయంతో పనిచేసేలా తనవంతు కృషి చేస్తానన్నారు. మచిలీపట్నంలో ట్రిబ్యునల్ కోర్టులు రావడానికి సహాయసహకారాలు అందించాలని న్యాయమూర్తులను కోరారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపీ, ఆరో అదనపు జడ్జి పి.పాండురంగమూర్తి, శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ ఒ.వెంకటేశ్వరరావుకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. జిల్లా కోర్టు నుంచి బదిలీపై వెళుతున్న జడ్జిలు ఎన్.మేరీ, ఎం.వి.వాహిని, సాయిశ్రీవాణిని శాలువాలతో సత్కరించారు. తొలుత మంత్రి కొల్లు రవీంద్ర బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ఎన్టీఆర్ జిల్లా ఇంటర్మీడియెట్ అధికారిగా ప్రభాకరరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా బి.ప్రభాకరరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆ పదవిలో కొనసాగిన సి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి కడపకు బదిలీపై వెళ్లారు. పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న రెడ్డికి జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం ఆయన ప్రమోషన్‌పై కడప అధికారిగా నియమితులయ్యారు. ఏలూరు జిల్లా నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రభాకరరావుకు ఎన్టీఆర్ జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు.

పది ఫలితాల్లో 8వ స్థానం

- ఎన్టీఆర్ జిల్లాలో 85.68 శాతం ఉత్తీర్ణత
- గత ఏడాది 13వ స్థానంలో నిలిచిన జిల్లా
- సత్తాచాటిన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు



పసుపులేటి నందిని
593



గాదంశెట్టి సాయిచరణ్
593



కొంపెల్లి ప్రణీత్‌కుమార్
592

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మరోసారి సత్తాచాటింది. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు 85.68 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో ఎనిమిదో సానం కైవసం చేసుకున్నారు. గత ఏడాది జిల్లా 13వ స్థానంలో నిలువగా, ఈ ఏడాది ఆరు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరింది. గత ఏడాది 88.76 శాతం ఉత్తీర్ణత సాధించిన జిల్లా ఈ ఏడాది 85.68 శాతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ఈ సారీ బాలికలదే పైచేయి

ఈ ఏడాదీ బాలికలే పైచేయి సాధించారు. 13,938 మంది బాలురు, 13,529 మంది బాలికలు కలిపి 27,467 మంది పరీక్షలు రాశారు. బాలురు 11,662 (83.67 శాతం) మంది, బాలికలు 11,872 (87.75 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 2023–24 విద్యా సంవత్సరంలో మొత్తం 27,899 మంది పరీక్షలు రాయగా 24,763 మంది (88.76శాతం) ఉత్తీర్ణత సాధించారు.

పటిష్ట ప్రణాళికతో..

పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ఎనిమిదో స్థానంలో నిలవడానికి జిల్లా విద్యాశాఖ ప్రణాళికాబద్ధంగా కృషి చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి, ఇతర అధికారులు పాఠశాలల పునఃప్రారంభం నుంచి పదో తరగతిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ విద్యా సంవత్సరంలో జూలై నుంచే ఉదయం, సాయంత్రం పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. హెచ్‌ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చేలా పర్యవేక్షణ చేశారు. 100 రోజుల ప్రణాళికను అమలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు చేపట్టారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంల నుంచి ఆర్జేడీ స్థాయి వరకు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. నవంబర్ – డిసెంబర్‌లో సిలబస్ పూర్తి చేసి, ప్రతి రోజూ రివిజన్ చేపట్టారు. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టెస్టులు తయారు చేసి విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. జెడ్పీ యాజమాన్యం స్టడీ మెటీరియల్ సరఫరా చేసింది. ఈ చర్యలు మెరుగైన ఉత్తీర్ణతకు దోహదం చేశాయని పలువురు హెచ్‌ఎంలు పేర్కొన్నారు.



సెల్‌ఫోనుల్లో పరీక్ష ఫలితాలను చూసుకుంటున్న విద్యార్థులు

63 పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు

జిల్లాలో 63 పాఠశాలలు పదోతరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాయి. ప్రభుత్వ యాజమాన్య పరిధిలో తొమ్మిది పాఠశాలలు, ప్రైవేట్ యజమాన్యంలోని 54 విద్యాసంస్థలు ఇందులో ఉన్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల నుంచి 11,524 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8,747 మంది (75.90 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేట్ యాజమాన్యాల నుంచి 15,943 మంది పరీక్షలకు హాజరవగా 14,787 మంది (92.75 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ స్కూల్స్ 91.30 శాతం, ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ స్కూల్స్ 80 శాతం, ఏపీసోషల్ వెల్ఫేర్ 93.82 శాతం, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ 82.55 శాతం, బీసీ వెల్ఫేర్ 97.27 శాతం, కేజీబీవీ 96.43 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ స్కూల్ 70.45 శాతం, జెడ్పీ స్కూల్స్ 71.36 శాతం, మునిసిపల్ విద్యాసంస్థలు 80.76 శాతం, ప్రైవేట్ ఎయిడెడ్ 83.03 శాతం, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ 92.75 శాతం, రాష్ట్ర ప్రభుత్వ విద్యాసంస్థలు 48.94 శాతం చొప్పున ఫలితాలు సాధించాయి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు.

19,589 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత

జిల్లా వ్యాపితంగా 23,534 మంది ఉత్తీర్ణత సాధించగా వారిలో 19,589 మంది ప్రథమ శ్రేణిలో నిలిచారు. 2,782 మంది ద్వితీయ, 1,163 తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని అధికారులు ప్రకటించారు. జిల్లాలో ఉన్న 20 మండలాల్లో చందర్లపాడు మండలం 93.25 శాతం ఫలితాలతో మొదటి స్థానంలో నిలవగా గంపలగూడెం 92.63 శాతం, విజయవాడ (తూర్పు) 90.84 శాతంతో ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి.

ఫలితాలు సంతృప్తికరం



టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలో ఎన్టీఆర్ జిల్లా 8వ స్థానంలో నిలిచింది. గతేడాది 13వ స్థానంలో ఉండగా అది ఆరు స్థానాలు పైకి చేరి ఎనిమిదో స్థానాన్ని సాధించాం. ఫలితాలు సంతృప్తికరంగా వచ్చాయి. సంతోషంగా ఉంది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు ప్రత్యేక తరగ తులు, నిత్యం పరీక్షల నిర్వహణతోనే ఈ ఫలితాలు సాధించాం. ఈ విజయంలో భాగస్వాములైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు అభినందనలు.

– యు.వి.సుబ్బారావు, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి

	విద్యార్థి పేరు	సాధించిన మార్కులు	పాఠశాల పేరు
ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు	పసుపులేటి నందిని	593	జెడ్పీ హైస్కూల్, మైలవరం
	గాదంశెట్టి సాయిచరణ్	593	ఎస్‌టీబీ హైస్కూల్, విజయవాడ
	కొంపెల్లి ప్రణీత్‌కుమార్	592	ఏకేటీపీఎం స్కూల్ విజయవాడ
	పల్లపోతు రాజేష్	591	జెడ్పీ హైస్కూల్ నున్న
	అప్పుది సుల్తానా	590	జెడ్పీహైస్కూల్ గొల్లపూడి
	బందారు నేహాప్రియ	590	జెడీఈటీఎంసీ హైస్కూల్ పటమట, విజయవాడ
	మేదరపు సాయి సింధు	589	జెడ్పీ హైస్కూల్ రామవరప్పాడు





బడికి టాటా.. సెలవుల బాట

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం గురువారం నుంచి సెలవులు ప్రకటించింది. ఈ విద్యా సంవత్సరం చివరి రోజైన బుధవారం పాఠశాలల వేళలు ముగియగానే విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. తరగతి గదుల నుంచి బయటకు వచ్చి చిందులు వేస్తూ సందడి చేశారు. పుస్తకాలను చింపి గాల్లోకి ఎగురవేసి కేరింతలు కొట్టారు. విజయవాడ దుర్గాపురంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద సందడి చేస్తున్న విద్యార్థులను 'సాక్షి' ఇలా కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

30 వరకు పది సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదోతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజును ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకూ చెల్లించవచ్చని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యుపీ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు మే 19 నుంచి 28వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. మే ఒకటి నుంచి రూ.50 ఆలస్యరుసుంతో పరీక్షలకు ఒకరోజు ముందు వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు. మూడు సబ్జెక్ట్‌ల వరకూ రూ.110, మూడు అంత కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా వెబ్‌సైట్‌లో ఈ చెల్లింపు చేయవచ్చని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫీజు చెల్లింపు తేదీల పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. పది పరీక్షల జవాబుపత్రాల రీకౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ–చెల్లింపులను మే ఒకటో తేదీ వరకూ చేయవచ్చన్నారు. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరు కావాలనుకునే ఉత్తీర్ణతకానీ విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఎదురు చూడకుడా గడువు తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. జిల్లాలో పది పరీక్షల్లో 3933మంది ఫెయిల్ అయ్యారన్నారు. అందులో 2276 మంది బాలురు, 1657మంది బాలికలు ఉన్నట్లు డీఈఓ వివరించారు.

వైద్యశిబిరాలకు అనుమతులు తప్పనిసరి


డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలకు జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా అనుమతులు లేకుండా వైద్యశిబిరాలు నిర్వహిస్తే ఆయా సంస్థలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించే ఆస్పత్రులు, సంస్థలు తప్పకుండా అనుమతి తీసుకోవాల్సిందేనని డీఎంహెచ్‌ఓ స్పష్టం చేశారు.

దిగజారిన సార్వత్రిక విద్యాపీఠం ఫలితాలు

- పదిలో 4.34శాతం ఉత్తీర్ణత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జిల్లాలో జరిగిన ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం భారీగా దిగజారింది. పదో తరగతిలో 1499మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, వారిలో కేవలం 65 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 4.34 శాతం మాత్రమే ఉత్తీర్ణులైనట్లు అధికారులు ప్రకటించారు. ఇంటర్మీడియట్ కోర్సుకు సంబంధించి 2751 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 567 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం కేవలం 20.61 శాతం మాత్రమే కావడం గమనార్హం.

మామిడి రైతుకూ నష్టాలే

- మామిడిచెట్లకు తొలుత తెగుళ్లు..
- ఇటీవల గాలి దుమారం.. అకాల వర్షాలు
- కోత సమయాన నేలరాలిన కాయలు
- తీవ్రనష్టాల్లో మామిడిసాగు రైతులు


గాలివానకు పెనుగంచిప్రోలులో నేలరాలిన మామిడి కాయలు(ఫైల్)

పెనుగంచిప్రోలు: ఈ ఏడాది మామిడి రైతులకు దెబ్బ మీద దెబ్బ తగిలింది. కోలుకోలేని నష్టం వాటిల్లింది. సాధారణంగా మే నెలలో చెడుగాలులు, వానలు వస్తాయి. ఈసారి ఏప్రిల్ మొదటి వారం నుంచే అకాల వర్షంతోపాటు గాలి దుమ్ములు రావడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోతకు వచ్చిన తరుణంలో అకాల వర్షం, గాలులకు మామిడి కాయలు నేల రాలాయి. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో గాలివాన రావడంతో 40 నుంచి 60 శాతానికి పైగా కాయలు రాలిపోయాయి. గాలిదుమ్ము రాక ముందు మామిడి టన్ను రూ.40వేల నుంచి రూ.లక్ష వరకు పలుకగా ప్రస్తుతం టన్ను ధర రూ.30వేల నుంచి రూ.40వేలకు పడిపోయింది. కాయ నాణ్యత ఆధారంగా ధర మారుతోంది.

కౌలురైతులకు మరింత నష్టం...

ఎకరాకి రూ.20వేలు నుంచి రూ.30వేలు కౌలు చెల్లించి మామిడి తోటలను సాగుచేస్తున్న వారికి ఈ ఏడాది మరింత నష్టం వాటిల్లింది. తెగుళ్లతోపాటు గాలులకు కాయలు రాలడంతో కోలుకోలేని దెబ్బతిన్నారు. ఎకరానికి రూ.20వేలు నుంచి రూ. 25వేల వరకు నష్టాలు తప్పేలా లేవని కౌలురైతులు వాపోతున్నారు. జిల్లాలో మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో గాలులు మామిడికాయలు భారీగా నేలరాలడంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు ఉద్యానవనశాఖ అధికారులు చెబుతుండగా, నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

55 వేల ఎకరాల్లో మామిడి..


మామిడి కాయలు కోస్తున్న రైతు

ఎన్టీఆర్ జిల్లాలో 55 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. మైలవరం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో మామిడి సాగు అధికంగా ఉంది. గత నెలరోజుల్లో నాలుగుసార్లు గాలిదుమ్ములతో కూడిన వర్షాలు పడటంతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. సాధారణంగా ఏప్రిల్ నెలలో మామిడి కోతలు ప్రారంభమై మే నెలాఖరుతో ముగుస్తాయి. అంతకుముందు మంచు కారణంగా పూత రాలింది. పూత నిలిచేందుకు రైతులు 5 నుంచి 10సార్లు మందులు స్ప్రే చేశారు. ఇందుకు అదనంగా రైతుకు ఎకరానికి రూ.15 నుంచి రూ.20 వేలు పెట్టుబడి అయింది. తరువాత మంగు తెగులు కారణంగా కొంత నష్టం వాటిల్లింది.

అనుకూలించని వాతావరణం



ఈ ఏడాది మామిడికి వాతావరణం అనుకూలించలేదు. పూత ఆలస్యం కావడంతోపాటు పూత దశలో నల్లతామర, మంగుపురుగు, తెగుళ్లతో కాపు తగ్గింది. కోత సమయంలో గాలులు, వానలకు అధికశాతం కాయ నేలరాలింది. తెగుళ్ల నివారణ మందులు కొట్టేందుకు ఎకరానికి రూ.20వేలు దాకా ఖర్చులు అయ్యాయి.

– తిరుపతిరావు, కౌలు రైతు, పెనుగంచిప్రోలు

రూ.లక్షకు పైగా నష్టం తప్పేలా లేదు



ఈ ఏడాది ఐదెకరాలు మామిడి తోట కౌలుకు తీసుకున్నాను. గాలిదుమ్ములు రాక ముందు టన్ను రూ.లక్ష వరకు ఉంది. ఇప్పుడు టన్ను రూ.30వేలు నుంచి రూ.40వేలు మాత్రమే ఉంది. ఐదెకరాలపై రూ.లక్షకుపైగా నష్టం వచ్చేలా ఉంది. ధర పెరిగితేనే నష్టాల ఊబి నుంచి గట్టెక్కగలం.

– దారా వెంకటేశ్వర్లు, కౌలురైతు, పెనుగంచిప్రోలు

జక్కంపూడి కాలనీలో కార్డన్ సెర్చ్


కార్డన్ సెర్చ్‌పై పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న ఏసీపీ దుర్గారావు


ఓ ఇంటిలో అనుమానాస్పదంగా ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బుధవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కాలనీలోని 20 బ్లాకుల్లోని 640 ప్లాట్లలో నివాసం ఉంటున్న ఆయా కుటుంబీకుల వివరాలు, ఆధార్ కార్డులను పోలీసులు తనిఖీ చేశారు. ఇన్‌చార్జి డీసీపీ గుణ్ణం రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు పర్యవేక్షణలో కొత్తపేట సీఐ చిన్న కొండలరావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, సీఐలు చంద్రశేఖర్, ఉమామహేశ్వరరావు, కృష్ణమోహన్, లక్ష్మీనారాయణలతోపాటు పలుస్టేషన్లకు చెందిన ఎస్ఐలు, ఏఎస్ఐలతో కలిపి మొత్తం 130మంది పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఇళ్లలో ఏవైనా అనుమానాస్పద వస్తువులు ఉన్నాయేమోనని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా ప్లాట్లలో ఎంత కాలం నుంచి నివాసం ఉంటున్నారు..మీ చుట్టు పక్కల కొత్తగా ఎవరైనా అద్దెకు వచ్చారా..వారేమైనా అనుమానాస్పదంగా ఉన్నారా అని కాలనీవాసులను ఆరా తీశారు. కాలనీలో ఎవరైనా మద్యం, గంజాయి, ఇతర మత్తుమందులు విక్రయిస్తున్నారా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ ద్వారా కాలనీ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ ఐరీష్ వాహనం ద్వారా 128మందికి ఐరీష్ తీయగా వారిలో ఐదుగురు అనుమానితులు ఉండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. 350 బైక్‌లు, ఆటోల రికార్డులు పరిశీలించారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 50 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విజయవాడ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిరసన ప్రదర్శన జరిగింది. సిద్ధార్థ కళాశాల దగ్గర నుంచి మొదలైన నిరసన ప్రదర్శన మదర్‌థెరిస్సా జంక్షన్, సిద్ధార్థ స్కూల్ రోడ్డు, ఆర్‌ఆర్ జంక్షన్, జమ్మిచెట్టు సెంటర్, శిఖామణి సెంటర్ మీదుగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి మాట్లాడుతూ ఇటువంటి సంఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. పహల్గాం ఘటనను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కులమతాలకు అతీతంగా ఉగ్రవాదాన్ని అణిచివేతకు కేంద్రానికి అందరూ సహకరించాలని కోరారు. పరిషత్ రాష్ట్ర కార్య సమితి సభ్యులు దుర్గారావు, అఖిల్, ఖాసీం, శ్యామ్, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పల్లె పండుగ నిధులు మంజూరు ఎప్పుడో?

- జిల్లావ్యాప్తంగా సుమారు రూ.100 కోట్ల పనులు
- పదిశాతం నిధులు కూడా ఇవ్వని కూటమి ప్రభుత్వం
- బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు
- గోకులం షెడ్ల సబ్సిడీ నిధుల కోసం లబ్ధిదారుల వేడుకోలు


పరిటాలలో గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎంపీ కేశినేని(ఫైల్)

జగ్గయ్యపేట: ఉపాధి హామీ పథకంలో భాగంగా గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ఆర్భాటంగా పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాల పేరుతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు ఇంకా మంజూరుకాలేదు. ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సిమెంట్ రోడ్లు, గ్రావెల్ పనులు, రోడ్డు చదును, పశువులషెడ్ల పనులకు బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయోనని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

624 పనులు కేటాయింపు...

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 16మండలాల్లో కలిపి రూ. 94.32కోట్ల విలువగల 624 పనులకు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోగా ఈ పనులు పూర్తిచేయాలని నిర్దేశించారు. వీటిలో 535 పనులు పూర్తికాగా, 63 పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. వత్సవాయి మండలంలో ఐదు పనులు, విజయవాడ–2, పెనుగంచిప్రోలు–4, వీరులపాడు–5, కంచికచర్ల–3, నందిగామ–2, ఏ.కొండూరు మండలంలో ఐదు పనులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. పూర్తయిన పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వం కేవలం రూ.6.8కోట్లు మాత్రమే విడుదల చేసింది. మిగిలిన నిధులను మంజూరు చేయకపోవడంతో కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

720 గోకులం షెడ్లు మంజూరు...

పల్లె పండుగలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 720 పశువుల షెడ్లు మంజూరు కాగా ఇందులో 615 పూర్తయ్యాయి. ఇందులో కనీసం పదిశాతం నిధులు కూడా ప్రభుత్వం మంజూరు చేయలేదు. 559 షెడ్లకు సంబంధించి రూ.9కోట్ల మేర బిల్లులు ఇవ్వలేదు. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి షెడ్లు నిర్మాణం పూర్తిచేసుకుంటే ఇప్పటివరకు బిల్లులు ఇవ్వలేదంటూ రైతులు వాపోతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు, గోకులం షెడ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.

బడ్జెట్ రాగానే బిల్లులు చెల్లిస్తాం...

ఉపాధి హామీ పథకం, పంచాయితీరాజ్‌శాఖలో చేసిన పనులకు సంబంధించిన అన్ని బిల్లుల వివరాలను కూడా ప్రభుత్వానికి అందించాం. ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాగానే చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తాం.

–ఏ.రాము, డ్వామా పీడీ, విజయవాడ

ప్రమాద బాధితులకు పరిహారం అందజేత


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: రోడ్డు ప్రమాదం(హిట్ అండ్ రన్) కేసుల్లో బాధితులకు కేంద్రప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేసిందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. జిల్లాలోని 101మంది బాధితులకు కేంద్రం నుంచి రూ.89.5లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం ఆయన ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు నగదు చెక్కులను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ బాధితులకు నష్టపరిహారం అందించడంలో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో జిల్లావ్యాప్తంగా 253 ప్రమాదాలు చోటుచేసుకోగా, ఇప్పటివరకు 101 కుటుంబాలకు నష్టపరిహారం అందించామన్నారు. కేంద్రప్రభుత్వం రోడ్డుప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.2లక్షలు, గాయపడిన వ్యక్తికి రూ.50వేలు మంజూరు చేస్తుందన్నారు. తాజాగా 26కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున, 75కుటుంబాలకు రూ.50వేల చొప్పున మంజూరుకావడంతో బాధితులకు అందించినట్లు వివరించారు. మిగిలినవారికి కూడా త్వరలోనే పరిహారం అందేలా చూస్తామన్నారు. గుర్తుతెలియని వాహనాలు చేసిన రోడ్డు ప్రమాదం(హిట్ అండ్ రన్) కేసులను ఛేదింపు, కేంద్రం నుంచి నష్టపరిహారం మంజూరుకు కావాల్సిన పత్రాలను సేకరించేందుకు డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ) కృష్ణమూర్తినాయుడు నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 3000 సీసీ కెమెరాలను చేసినట్లు చెప్పారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని కచ్చితంగా స్వాధీనం చేసుకోవాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కేంద్రం నుంచి నష్టపరిహారం అందేలా కీలకంగా వ్యవహరించిన డీసీపీ కృష్ణమూర్తినాయుడు, డెప్యూటీ కలెక్టర్ జి.మహేశ్వరరావు, రాష్ట్ర జనరల్ ఇన్సూరెన్స్ అధికారి డి.రామ్‌సుధాకర్, ఏసీపీ రామచంద్రరావు, మహిళా ఎస్ఐ మల్లీశ్వరి, కలెక్టరేట్, పోలీస్‌శాఖ సిబ్బందిని కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి.సరిత, జి.గుణ్ణం రామకృష్ణ పాల్గొన్నారు.

మద్యం మాఫియాను ప్రోత్సహించడం తగదు : అవినాష్


మాట్లాడుతున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మద్యం మాఫియా పెరిగిపోయిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదల కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాసంక్షేమం కనుమరుగైందన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు కూటమి నేతలు దందాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం నిర్వహించే మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారని దయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం మద్యం మాఫియాను ప్రోత్సహిస్తోందని, ఈ పద్ధతి తగదన్నారు. కూటమి నాయకులు వీధివీధికి బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని శాఖలు పారదర్శకంగా పనిచేశాయని గుర్తుచేశారు. మద్యాన్ని అదుపులో ఉంచడంలో గత ప్రభుత్వం నిబద్ధతతో పనిచేసిందని వివరించారు. కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడిని దేవినేని అవినాష్ ఖండించారు. ఉగ్రవాదుల చర్య అమానుషమన్నారు. ఈ దాడిలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతిచెందడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు.

ఏడాదిలో రూ.5 లక్షల కోట్ల వ్యాపారం

యూకోబ్యాంక్ డీజీఎం శ్రీకాంత్


బ్యాంకు నూతన ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ శ్రీకాంత్, మేనేజర్ శ్రీనివాస్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒకటైన యూకోబ్యాంక్ గత ఆర్థిక సంవత్సరంలో ఐదు లక్షల కోట్ల వ్యాపారం చేసిందని ఆ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పాతబస్తీ బ్రాహ్మణవీధిలో ఏర్పాటు చేసిన ఆబ్యాంక్ విజయవాడ వన్‌టౌన్ శాఖ నూతన ప్రాంగణాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్విట్ ఇండియా సమయంలో గాంధీజీ పిలుపు మేరకు దేశంలోని వ్యాపారవర్గాల కోసం జీడీ బిర్లా 1943లో యూకోబ్యాంకును స్థాపించారన్నారు. నాటినుంచి దేశంతోపాటు హంకాంగ్, సింగపూర్ తదితర దేశాల్లోనూ మూడువేలకు పైగా శాఖలతో సేవలందిస్తున్నట్లు వివరించారు. తమ బ్యాంకు ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి దేశాభ్యున్నతికి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. కస్టమర్లకు గృహ, వాహన రుణాలను గంటల్లోనే మంజూరు చేస్తున్నామన్నారు. మొబైల్ బ్యాంకింగ్ సేవల్లో తమ బ్యాంక్ యాప్‌నకు టాప్ ర్యాంకింగ్ ఉందన్నారు. జోనల్‌లో ప్రస్తుతం 91శాఖలు ఉన్నాయని, మరో ఐదు శాఖలు త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. వన్‌టౌన్‌శాఖ మేనేజర్ యు.శ్రీనివాస్ మాట్లాడుతూ వన్‌టౌన్‌లో తమబ్యాంక్ 48 ఏళ్లుగా సేవలందిస్తున్నట్లు వివరించారు.

పది పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఆత్మహత్య


మృతుడు మింటు

బంటుమిల్లి: పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై బంటుమిల్లి మండల పరిధిలోని పెదతుమ్మిడి పంచాయితీ శివారు అర్జావానిగూడెం గ్రామానికి చెందిన గోవాడ మింటు(17) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండోసారి కూడా పరీక్షల్లో ఫెయిల్ కావడంతో కలత చెంది ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వ్యాన్ డ్రైవరుగా పనిచేస్తున్న మింటు తండ్రి రామకృష్ణ డ్యూటీకి వెళ్లగా, పనుల నిమిత్తం తల్లి బయటకు వెళ్లింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న మింటు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు బలవన్మరణానికి పాల్పడటం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. స్థానికులు మింటు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబసభ్యులను ఓదార్చారు.

చదువుల ఒత్తిడే చంపేసింది


మృతురాలు ఖ్యాతిశ్రీ

పెనమలూరు: కానూరు ఇంజినీరింగ్ కాలేజీలో మృతి చెందిన బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న యార్లగడ్డ ఖ్యాతిశ్రీ (22) చదువుల ఒత్తిడితోనే మృతి చెందిందని ఆమె తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు పంచనామా చేశారు. కానూరు ఇంజినీరింగ్ కాలేజీలో ఖ్యాతిశ్రీ మంగళవారం హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకోని మృతిచెందడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆమెతండ్రి యార్లగడ్డ శ్రీనివాసరావు విజయవాడ జీజీహెచ్ వద్ద బుధవారం జరిగిన శవపంచనామాకు హాజరై తమ కుమార్తె ఖ్యాతిశ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిందని తెలపడంతో ఈ మేరకు పోలీసులు కేసు పంచనామా పూర్తిచేశారు. ఖ్యాతిశ్రీ మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం చేశారు.

బండెనక బండి కట్టి..

ఉరుసు ఉత్సవాలకు తరలిన ముస్లింలు


ఎడ్లబండ్లను ప్రారంభిస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు


ఎడ్లబండ్లపై ఉరుసు ఉత్సవాలకు తరలివెళ్తున్న ముస్లింలు

కంచికచర్ల: చందర్లపాడు మండలం తుర్లపాడులో నిర్వహించే బడేహజరత్ ఉరుసు ఉత్సవాలకు ముస్లింసోదరులు బుధవారం భారీగా తరలివెళ్లారు. తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల నుంచి ముస్లింలు ఎడ్లబండ్లతో ఉరుసు ఉత్సవాలకు హాజరయ్యేందుకు తరలివచ్చారు. ఉరుసు ఉత్సవాలకు తరలివెళ్లే ఎండ్లబండ్లను కంచికచర్ల మండలంలోని పెండ్యాల మున్నేటి తీరాన మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం ప్రారంభించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతానికి వచ్చిన ముస్లింలు బండెనక బండి కట్టి ఉరుసు ఉత్సవాలకు తరలివెళ్లారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ మతాలకతీతంగా అందరూ ఉరుసు ఉత్సవాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎడ్లబండ్లపై ఉత్సవాలకు వెళ్తున్న భక్తులకు మున్నేటి తీరాన ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్ల సవారీలను చూసేందుకు పెండ్యాల మునేటి తీరానికి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ బడేహజరత్, వైఎస్సార్‌సీపీ నాయకులు జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ గౌస్‌పాషా, సయ్యద్ అహ్మద్, షేక్ పీర్‌సామియా, షేక్ చాన్ బహదూర్, ఫయింపాష, అబ్దుల్‌కరీం, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



పటమట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ జీవితంలో క్రీడలకు అత్యున్నత స్థానం ఇవ్వాలని, ఉద్యోగులు కూడా క్రీడల్లో పాల్గొనటం ద్వారా మానసిక, శారీరక ఒత్తిడి తగ్గుతుందని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి. కృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి క్రీడాపోటీలను ఆయన సాయిసందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు వయస్సు అడ్డు కాదని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. అనంతరం ఆయన పీసీబీ ఉద్యోగులకు క్రికెట్, బ్యాడ్మింటన్, కేరమ్స్, చెస్, పరుగు పోటీలను ప్రారంభించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 27వ తేదీన విశాఖపట్నం వేదికగా ఫైనల్ పోటీలు జరుగుతాయని అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఉన్నత అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా.. విద్యార్థులకు సత్కారం



ఇషిత. బి(98.49)

లబ్బీపేట(విజయవాడ తూర్పు): జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన నలంద విద్యార్థులను బుధవారం అభినందించారు. బెంజి సర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్‌లో బుధవారం క్రౌన్ ది టాలెంట్ అనే పేరుతో పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీఏ, సీసీఏ కార్యకలాపాలలో ప్రావీణ్యం కనబరిచిన విద్యార్థులను సత్కరించి, వారికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. జేఈఈ మెయిన్స్‌లో 98.49 పర్సంటైల్ సాధించిన నలంద విద్యార్థిని ఇషిత బి, 99.80 పర్సంటైల్ సాధించిన సత్యవత్ జి, కె. వెంకట సత్య శంకర వాసుదేవ, డివియన్ కార్తీక్, అనిరుధ్‌లను ప్రిన్సిపాల్ మాదల పద్మజతో పాటు ముఖ్యఅతిథి ఏసీఐసీ-కెల్ స్టార్టప్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వల్లభనేని రమన్ కాంత్ అభినందించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు స్క్రీన్ ప్రింటింగ్, పెయింటింగ్ ఆర్టికల్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలోనే ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు 28వ తేదీలోగా తమ సంస్థ కార్యాలయానికి స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. వివరాలకు 0866-2470240లో సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయ ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. హరిబాబు తెలిపారు. కనకదుర్గ కాలనీ, పంటకాలువరోడ్డు, హైస్కూలురోడ్డు, రైతుబజారురోడ్డు, వంద అడుగుల రోడ్డుతో పాటు మారుతీ కాలనీ, పోలీస్ స్టేషన్ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెడుగా ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు

పాయకాపురం(విజయవాడ రూరల్): తన కుమార్తెల గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడని, పెళ్లి సంబంధాలు చెడగొడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు బుధవారం ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నున్న గ్రామానికి చెందిన వర్రి జయలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె భర్త 13 సంవత్సరాల క్రితం చనిపోవడంతో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఈ క్రమంలో ఆమె ఆగిరిపల్లికి చెందిన సముద్రాల రవికిరణ్‌తో సహజీవనం చేస్తోంది. రవికిరణ్ తన పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, పిల్లలకు వచ్చిన పెళ్లి సంబంధాలను చెడగొడుతున్నాడని చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డంపింగ్ యార్డులా నదీతీరం

కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో ఇష్టారాజ్యం

- చెత్త, ప్లాస్టిక్, బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ డంపింగ్
- అడ్డూ అదుపు లేకుండా వాహనాల రాకపోకలు
- దుర్గంధమయంగా ఆహ్లాద తీరం
- పట్టించుకోని అధికారులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పవిత్ర కృష్ణానది పరీవాహక ప్రాంతం కాలుష్యకోరల్లో చిక్కుకుంటోంది. నదీగర్భం ప్లాస్టిక్, భవన నిర్మాణ వ్యర్థాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. నగరానికే వన్నె తెచ్చే కృష్ణమ్మ ఒడి చెత్తాచెదారాలతో నిండిపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది. నగరంలో ఇళ్లను కూల్చివేయగా వచ్చే భవన నిర్మాణ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లు, ఆటోల ద్వారా తరలించి నదీగర్భంలో డంప్ చేస్తున్నారు. దీంతో కృష్ణలంకలోని 20, 21, 15 నుంచి 18 డివిజన్ల పరిధిలో ఉన్న నది పరీవాహక ప్రాంతంలో రిటైనింగ్ వాల్ వెంబడి వ్యర్థాలు పేరుకుపోయి కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. పట్టపగలే వాహనాల ద్వారా చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి నదిలో పారేస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదని పర్యావరణ ప్రేమికులు, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెత్తాచెదారాలతో నిండిపోయిన నదీతీరం



కృష్ణానదిలో దర్శనమిస్తున్న బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ కుప్పలు

ఇసుకాసురులు చూపిన బాటలో..

కృష్ణానదిలో రోజురోజుకూ పెరుగుతున్న భవనాల వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలకు ఇసుకాసురులే కారణమనే వాదన వినిపిస్తోంది. నదిలో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఇతర వాహనదారులు నదిలోకి సులభంగా రాకపోకలు సాగించేందుకు అనధికార రహదారి ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఇసుకతతంగం ఎన్నో ఏళ్లుగా సుదీర్ఘంగా కొనసాగుతున్నా.. వారిపై చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. ఈ మార్గం గుండానే ట్రాక్టర్లు, ఆటోలలో వ్యర్థాలు తెచ్చిపడేస్తున్నట్లు తెలుస్తోంది.

గేటు ఏర్పాటు చేస్తే అడ్డుకట్ట..

రిటైనింగ్ వాల్ నిర్మాణ సమయంలో లారీలు, పొక్లయిన్, ఇతర వాహనాల రాకపోకలకు వీలుగా ఉండేటట్లు కనకదుర్గ వారధికి, రివర్‌ఫ్రంట్ పార్క్‌కు మధ్య కరకట్టపై నుంచి నదిలోకి ర్యాంపు ఏర్పాటు చేశారు. వాల్ నిర్మాణం పూర్తయిన తర్వాత నదిలోకి ఎలాంటి వాహనాలు ప్రవేశించకుండా ఇరిగేషన్ అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ గేటు ఏర్పాటు చేయలేదు. అదే అదునుగా చేసుకుని ఈ మార్గం నుంచే నగరంలోని కొంతమంది వేస్ట్ మెటీరియల్ వ్యాపారస్తులు ట్రాక్టర్లు, ఆటోలతో భవన వ్యర్థాలను తీసుకొచ్చి నదిలో డంప్ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అలాగే రాత్రి సమయాల్లో ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై నదిలోకి వెళ్లి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నదిలోకి అనుమతిలేని ఎలాంటి వాహనాలు ప్రవేశించకుండా గోడ గానీ, భారీ గేటు గానీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆహ్లాదం కనుమరుగు..



బిల్డింగ్ వేస్ట్‌ను బస్తాలలో ఆటో ద్వారా తీసుకొచ్చి నదిలో పడేస్తున్న దృశ్యం

విజయవాడ బస్టాండ్ నుంచి రామలింగేశ్వర నగర్ వరకు ఉన్న కృష్ణానదీ పరివాహక ప్రాంతం స్థానిక ప్రజలకు ఎంతో ఉల్లాసాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుంది. స్థానిక ప్రజలే కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా ఉదయం, సాయంత్రం నదీలో ఇసుక తిన్నెలపైకి వెళ్లి వాకింగ్‌తో పాటు వ్యాయామం చేసి సేదదీరుతుంటారు. అయితే ఇటీవల గత కొన్ని నెలలుగా చెత్తాచెదారం భారీగా పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోందని ప్రజలు చెబుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

తాగునీటి జలాలతో కళకళలాడాల్సిన కృష్ణమ్మ డంపింగ్ యార్డుగా మారిపోయింది. జంతు కళేబరాలు, ప్లాస్టిక్, వంటి ప్రమాదకరమైన వ్యర్థాలను గుట్టు చప్పుడు కాకుండా తీసుకొచ్చి నదిలో డంప్ చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి, నదిలోకి వాహనాలు ప్రవేశించకుండా గేటు ఏర్పాటు చేయడంతో పాటు నదిని కలుషితం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.



– జోగారమణ, కృష్ణలంక

అల్జీ నివారణకు ప్రత్యేక చర్యలు

హెడ్ వాటర్ వర్క్స్ సందర్శనలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



హెడ్ వాటర్ వర్క్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని డాక్టర్ కేఎల్ రావు మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి నీటిలో అల్జీ విపరీతంగా పెరుగుతుందని, తద్వారా నీటిలో తేలియాడే పదార్థాలు అధికం కావడం, ఫిల్టర్ బెడ్స్‌లో నీటి ఫిల్టరేషన్ రేటు పడిపోతుందని వివరించారు. దీని వల్ల నీటి రంగు మారి, దుర్వాసన వస్తుందని చెప్పారు. దీనిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇన్‌టేక్ వెల్ వద్ద అల్జీ ప్రవేశాన్ని నివారించేందుకు, అలాగే నీటిలో ఆక్సిజన్ స్థాయిని పెంచి దుర్వాసన తగ్గించేందుకు కృష్ణానదిలో పెడల్ ఏరేటర్స్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇన్‌టేక్ వెల్ చుట్టూ చిన్న రంధ్రాలు ఉన్న క్లాత్‌ను ఏర్పాటు చేయడం ద్వారా తేలియాడే పదార్థాలు, అల్జీ, చిన్న చేపలు ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. నీటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు పంపిణీ లైన్లను క్రమంగా స్కొరింగ్ చేయడాన్ని పెంచారని చెప్పారు. ప్రస్తుతం హెడ్ వాటర్ వర్క్స్‌లో క్లియర్ వాటర్ ఉత్పత్తి పరిమాణం 185 ఎంఎల్‌డీ నుంచి 204 ఎమ్ఎల్‌డీకి పెరిగిందన్నారు. తద్వారా నగరానికి తాగునీటి సరఫరా మరింత మెరుగైందని తెలిపారు.

'పది'లో ప్రభుత్వ పాఠశాలల సత్తా

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పాఠశాలల్లో 10వ తరగతి చదివిన విద్యార్థులు బుధవారం విడుదలైన ఫలితాల్లో అద్భుత ప్రతిభను చూపారు. నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని మొత్తం 29 పాఠశాలల నుంచి 2,544 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా వారిలో 2,056 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 80.81 శాతం ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారు. సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్లో 10వ తరగతి చదివిన పి. ప్రణీత్ కుమార్ 592 మార్కులు సాధించి టాపర్‌గా నిలువగా తెలుగు, సైన్స్, గణితం సబ్జెక్టుల్లో 100/100 సాధించారు.

కృష్ణలంక పరిధిలో..

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి పరీక్షా ఫలితాలలో కృష్ణలంక ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ హైస్కూల్‌కు చెందిన 58 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 78శాతం ఉత్తీర్ణతతో 45 మంది పాసయ్యారు. షేక్ మహమ్మద్ బిలాల్ 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించగా, యజ్ఞశ్రీ 545 మార్కులు, కె.రూపేష్ 534 మార్కులు సాధించారని, 500పైగా మార్కులను 5మంది విద్యార్థులు పొందారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమేష్ తెలిపారు.

- ఎస్‌పీ రంగా బాలికల హైస్కూల్‌కు చెందిన 44 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 100శాతం ఉత్తీర్ణత సాధించారు. పి.పావని 600 మార్కులకు గాను 580 మార్కులు సాధించగా, టి.భార్గవి 559 మార్కులు, ఎస్.గోపి భవాని 554 మార్కులు సాధించారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గ్రేసమ్మ తెలిపారు.
- భ్రమరాంభపురంలోని ఎస్‌వీరెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలకు చెందిన 33మంది విద్యార్థులు పరీక్షరాయగా సుమారు 70శాతం ఉత్తీర్ణతతో 23 మంది పాసయ్యారు. 500 పైగా మార్కులను ముగ్గురు సాధించారు. పి. షంషాద్ భేగం 600 మార్కులకు గాను 532 మార్కులు సాధించగా, ఖాన్ షాజాద్ హుస్సేన్ 530 మార్కులు, షేక్ అబ్దుల్‌జకీర్ 517మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు.



ప్రతిభచూపిన విద్యార్థులతో చైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు





పి. ప్రణీత్ కుమార్(592) టి. మహేశ్వరి(594)

పలు ప్రైవేటు పాఠశాలల్లో..

పటమట(విజయవాడతూర్పు): పటమటలంకలోని శ్రీకృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారని పాఠశాల డైరెక్టర్ కె.వి రమణరావు తెలిపారు. తమ పాఠశాల్లో చదివిన విద్యార్థిని వి. సూర్య ప్రసన్న 595 మార్కులు సాధించి స్టేట్‌లో 6వ ర్యాంక్‌గా నిలిచిందని అన్నారు. పాఠశాల విద్యార్థిని పి. మధుహాసిని, హైందవి విద్యార్థులు 589 మార్కులు సాధించారన్నారు.



టాపర్‌ను అభినందిస్తున్న కె.వి రమణరావు



షేక్ మహమ్మద్ బిలాల్(586)

చైతన్య విద్యార్థుల ప్రతిభ..

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి అత్యుత్తమ ఫలితాలు సాధించారని చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మద్దినేని మురళీకృష్ణ చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను బందరు రోడ్డులోని చైతన్య పాఠశాల ఆవరణలో అభినందించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ చైతన్య విద్యాసంస్థల విజయవాడ జోన్‌లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యధికంగా నలుగురు విద్యార్థులు 600లకు గాను 597 మార్కులు సాధించారని చెప్పారు. 596 మార్కులకుపైగా ఏడుగురు, 24 మంది 595 మార్కులకు పైగా, 182 మంది 590 మార్కులు, 647 మంది విద్యార్థులు 580పైగా మార్కులు సాధించారని వివరించారు.

కృష్ణచైతన్య విద్యార్థికి 594మార్కులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని కృష్ణచైతన్య పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారు. అత్యధికంగా తుమ్మలపల్లి మహేశ్వరి 600 మార్కులకు గాను 594, సాని కొమ్ము కమల్‌సాత్విక్ 586 మార్కులు, ముక్కుమాల సాయి సాహిత్య 583 మార్కులు సాధించి రికార్డు సృష్టించారు.

డ్రెయిన్లలో డీసిల్టింగ్ పనులు వేగవంతం

సిబ్బందికి వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉండే డ్రెయిన్లలో తప్పనిసరిగా డీసిల్టింగ్ పనులు చేయట్టాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఎక్సెల్ ప్లాంట్, రాధానగర్ డ్రెయిన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ముస్తాబాద రోడ్ ఔట్ ఫాల్ డ్రెయిన్, సింగ్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్సెల్ ప్లాంట్‌లో వ్యర్థాలు అన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ జిందాల్ కంపెనీకి పంపించాలన్నారు. రాధానగర్ డ్రెయిన్ చిన్నగా ఉండటం వల్ల వ్యర్థాలు పేరుకుపోతే, వర్షపు నీటి నిల్వలు వెంటనే రోడ్డుపైకి వచ్చే అవకాశాలు ఉన్నందున దానిని పెద్దది చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగర శివారులైన ఇన్నర్ రింగ్ రోడ్డు, ముస్తాబాద, రోడ్ ఔట్ ఫాల్ డ్రెయిన్ డీసిల్టింగ్ పనులను శరవేగంగా చేయాలని, రానున్న వర్షాకాలంలో వర్షపునీటి నిల్వలు రోడ్డుపైన రాకుండా ఉండాలంటే ఇది తప్పనిసరి అన్నారు. పర్యటనలో ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్, ఎస్ఈ (వర్క్స్) పి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.



డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఉగ్రదాడికి నిరసనగా కాగడాల ప్రదర్శన



బీఆర్‌టీఎస్ రోడ్డులో నిరసన తెలియజేస్తున్న హిందూ జేఏసీ నాయకులు



పంజా సెంటర్‌లో ఎంసీపీఐ క్యాండిల్ ర్యాలీ

విజయవాడ కల్చరల్: దేశ సార్వభౌమత్వానికి సమగ్రతకు పెను సవాల్ విసురుతున్న ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహించాలని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. హిందూ జేఏసీ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్‌రోడ్డులో కశ్మీర్‌లో హిందువులపై జరిగిన దాడిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ కశ్మీర్‌లో యాత్రికులపై తూటాలు కురిపించిన సంఘటన యావత్ హిందూ జాతిని కలచివేసిందన్నారు. ఉగ్రవాదులను తుదముట్టించడానికి కేంద్ర బలగాలను కశ్మీరుకు పంపాలని సూచించారు. శివస్వామి మాట్లాడుతూ కశ్మీర్‌లో హిందువులని నిర్ధారించుకున్న తరువాతనే వారిని హతమార్చారన్నారు. కశ్మీర్‌లో మరణించిన హిందువులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నిరసన కార్యక్రమంలో నాగలింగం శివాజీ, అవుటపల్లి శివప్రసాద్, విశ్వహిందూ పరిషత్ నగర ఉపాధ్యక్షుడు జేఏసీ నాయకులు, కృష్ణభగవాన్, జింకాచక్రధర్, కొరప్రోలు శ్రీనివాస్ తదితరులు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు.

పిరికి పంద చర్య..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్ బాషా అన్నారు. ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ క్యాండిల్ ర్యాలీని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ ఉగ్రవాదులదాడులు వల్ల 30 మంది ప్రాణాలు పోగొట్టుకోవటం యావత్ దేశాన్ని కలిచివేసిందన్నారు. అమాయక ప్రాణాలు తీయటం ఏ మత గ్రంథంలో లేదన్నారు. ఒక మానవుని చంపితే సమస్త మానవులను చంపినట్లేనన్నారు. జమ్మూ కశ్మీర్‌లో నిఘా వ్యవస్థను పెంచాలన్నారు. ఉగ్రవాదాలపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విదేశీ పర్యాటకులకు ధైర్యం ఇవ్వాలని కోరారు. నాయకులు సలీమ్, అజాజ్, వాహేద్, వానపల్లి గంగాధర్, ఫరూక్, సమద్, అజ్మి, తాజ్, తాహేర్ పాల్గొన్నారు.

నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో..

దాడులకు పాల్పడిన ఉగ్రవాదాలను కఠినంగా శిక్షించాలని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు అన్నారు. కశ్మీర్ ఉగ్రదాడిలో చనిపోయిన 30 మందికి శాంతి చేకూర్చాలని నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పాతబస్తీ కాశేశ్వర్ మార్కెట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శనను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గురునాథం, అన్సారి, బషీర్ అహ్మద్, గణేష్, సునీత, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

చార్లెస్ శోభరాజ్ భవన్ అని నామకరణం చేయండి

విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై సోషల్ మీడియా వేదికగా మాజీ ఎంపీ నాని విమర్శనాస్త్రాలు

విజయవాడస్పోర్ట్స్: గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో కూర్చొని అక్రమ ఇసుక, ఫ్లై యాష్ తోలకం, గ్రావెల్ అమ్మకాలు, భూ దందాలు, బ్రోకరేజీలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తూ, రేషన్ బియ్యం మాఫియాకు కొమ్ము కాస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై మాజీ ఎంపీ కేశినేని నాని ఫేస్‌బుక్, ఎక్స్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. విజయవాడ ప్రజలు చరిత్రలో లేని విధంగా భారీ మెజారిటీతో తనను గెలిపించుకున్నారని గర్వంగా చెప్పుకునే ప్రజా ప్రతినిధి కార్యాలయం పేరు 'ఎన్టీఆర్ భవన్' అని పోస్ట్‌లో పేర్కొన్నారు. తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, నీతి, నిజాయితీకి మారుపేరు, ప్రజా సేవ అంటే చాలా పవిత్రమైన కార్యక్రమం అని ప్రపంచానికి చాటిన మహానుభావుడు ఎన్టీఆర్ అని, ఆయన పేరును కార్యాలయానికి పెట్టుకుని ఆ కార్యాలయంలో కూర్చుని అక్రమ దందాలకు పాల్పడుతుండటాన్ని తప్పుబట్టారు. కార్యాలయానికి వెంటనే ఎన్టీఆర్ పేరును తొలగించి ప్రపంచ స్థాయి స్మగ్లర్ అయిన 'చార్లెస్ శోభరాజ్' పేరును కార్యాలయానికి పెట్టుకుంటే బాగుంటుందని సూచించారు. ఇది భారీ మెజార్టీతో ఎంపీగా తనను గెలిపించిన విజయవాడ ప్రజల కోరికగా పోస్ట్‌లో అభివర్ణించారు.

27న పటమటలో గంగానమ్మ జాతర

పటమట(విజయవాడతూర్పు): పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న గంగానమ్మ గుడిలో ఈ నెల 27వ తేదీన జాతర నిర్వహిస్తున్నట్లు చింతల సాంబయ్య, ఊకోటి రమేష్, రేఖబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాతరలో ఉదయం సహస్ర కలశాభిషేకం మహాశాంతి యజ్ఞ మహోత్సవం జరుగుతుందని, 28వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

లూపింగ్ నెట్‌వర్క్‌తో కొండ ప్రాంతాలకు నీటి సరఫరా

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాలకు లూపింగ్ నెట్ వర్క్ డిజైన్‌తో నీటి సరఫరా చేస్తున్నట్లు మైసూర్ కార్పొరేషన్ డెప్యూటీ కమిషనర్ (డెవలప్‌మెంట్) కేజే సింధు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల స్టడీ టూర్‌లో భాగంగా ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ల బృందం బుధవారం మైసూర్ నగరపాలక సంస్థ జోనల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 84 డివిజన్లు, 9 జోన్లు కలిగిన మైసూర్ కార్పొరేషన్ పరిపాలన విధానం, మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వివిధ ప్రాజక్టుల అమలు, పార్కుల నిర్వహణ, కాలుష్య నివారణకు తీసుకున్న చర్యల గురించి సింధు వివరించారు. అదే విధంగా ప్రజల సమస్యల పరిష్కార విధానం, సంక్షేమ పథకాలు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను అధికారులు సమగ్రంగా తెలియజేశారు. ఈ సందర్భంగా పలు కార్పొరేషన్ల అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా తాము ఇక్కడకు రావడం సంతోషంగా ఉందని కార్పొరేటర్ల బృందం పేర్కొంది. విజయవాడ నగరంలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అక్కడి అధికారులకు వివరించారు.



మైసూర్‌లో హెడ్ వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కార్పొరేటర్ల బృందం

నెట్ వర్క్ డిజైన్‌తో..

అనంతరం మైసూర్ రామస్వామి సర్కిల్‌లోగల 45ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు కావేరీ డ్యామ్ నుంచి రా వాటర్ పంపింగ్ చేసుకుని, అక్కడ శుద్ధి చేసిన తర్వాత ప్రజలకు రక్షిత మంచినీటిని అందిస్తున్నామని వారు చెప్పారు. ఈ విధంగానే నాలుగు ప్రదేశాల్లో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున ఆ నెట్‌వర్క్ డిజైన్‌ను ఇక్కడ అమలు చేస్తే ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడవచ్చని విజయవాడ కార్పొరేటర్ల బృందం అభిప్రాయపడింది.

సృజనాత్మక వెలికితీయాలి

పటమట(విజయవాడతూర్పు): బాల్యం నుంచి ఆటపాటలు, పుస్తక పఠనం ద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని, వేసవి సెలవుల్లో పిల్లల్లో ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమం దోహద పడుతూ ఉందని పిల్లల వైద్య నిపుణులు శ్రీముఖి ఆశాభావం వ్యక్తం చేశారు. పటమట సర్వోత్తమ గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం టాయ్ లైబ్రరీని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె ప్రారంభించారు. ఏపీ గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఉచిత పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, దానితో పాటు ఈ ఏడాది టాయ్ లైబ్రరీ ఏర్పాటు చేశామని అన్నారు. జూన్ 10వ తేదీ వరకు సాయంత్రం 4 నుంచి 6 సమయంలో పిల్లల్ని తీసుకుని వచ్చి వయసుకు తగ్గ ఆట వస్తువులు, బొమ్మలు సృజనాత్మక పెంచే పలు ఆసక్తికరమైన కార్యక్రమాలు, పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయం సంఘం అధ్యక్షుడు కె. పట్టాభి రామయ్య, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



టాయ్ లైబ్రరీని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీముఖి

'అమ్మ ఒడి' పథకం పేరు మార్చేసి 'తల్లికి వందనం' అన్నారు. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రతిచోటా చెప్పారు. టీవీల నుంచి ఫోన్ల దాకా ఎక్కడ చూసినా ఇదే ప్రచారం చేయడంతో నిజమని నమ్మి ఓట్లేసి నష్టపోయాం..!

ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన మాటలను నమ్మి ఆశ పడ్డాం. తల్లికి వందనం ద్వారా మాకు రూ.30 వేలు.. రూ.45 వేలు.. రూ.60 వేలు వస్తాయనుకున్నాం..!

ఈయప్ప(చంద్రబాబు) దమ్మిడీ ఇయ్యకపాయే! జగన్ ఉన్నపుడు అమ్మ ఒడి వచ్చేది! ఆయప్ప ఉన్నపుడే బాగుండే! మాలా కష్టం సేసుకునేవాళ్లం ఇంతమంది బిడ్డల్ని సదివించాలంటే ఎట్ట సార్! శానా ఇబ్బందిగా ఉంది..!

స్కూల్ యాజమాన్యం ఒత్తిడి తట్టుకోలేక ఊళ్లో అప్పులు తెచ్చి ఫీజులు కట్టి నెల నెలా వడ్డీలు చెల్లిస్తున్నాం. రేపు మాపు అంటూ చెబుతున్నారు గానీ తల్లికి వందనం మాత్రం ఇవ్వడం లేదు..!

– సాక్షి, అమరావతి

ఒకపక్క పెరిగిన ఇంటి ఖర్చులు..! మరోపక్క 'అమ్మ ఒడి' ఆగిపోవడంతో భారంగా మారిన పిల్లల చదువులతో అప్పుల పాలై అల్లాడుతున్న తల్లిదండ్రుల దుస్థితి ఇదీ!! ఏడాదంతా ఎదురు చూసినా 'తల్లికి వందనం' జాడ లేక.. పిల్లల చదువులు ఆగిపోతుంటే చూడలేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. చంద్రబాబును నమ్మి ఓటేస్తే నిండా ముంచారని ఆక్రోశిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'తల్లికి వందనం' పథకం అమలు చేస్తామని దెందులూరు సభ సాక్షిగా చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. జగనన్న అమ్మ ఒడి ఇవ్వకపోగా.. తల్లికి వందనం ఎగ్గొట్టారని మండిపడుతున్నారు. గెలిచాక పేదోళ్లకిచ్చే సాయాన్ని ఎగ్గొడితే ఎలా సార్..? అని నిలదీస్తున్నారు. విద్యా సంవత్సరం పూర్తి కావడంతో స్కూళ్లు మూతబడి నేటి నుంచి వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల అగచాట్లను తెలుసుకునేందుకు 'సాక్షి' ప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. చదువులకు దూరమై పనులకు వెళుతున్న విద్యార్థులు.. మట్టి తట్టలు మోస్తూ కూలి పనులు చేస్తున్న చిన్నారులు కనిపించారు.

సేసింది సెప్పాల.. సేయందీ సెప్పాల !!



'ఈ ఫోటోలో కనిపిస్తున్న వెంకటేశ్ కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం ఉల్చాలలో ఉంటారు. ఆయనకు నలుగురు ఆడపిల్లలు. ఒక అమ్మాయికి పెళ్లయింది. మరో కుమార్తెకు మాటలు రావు. మిగతా ఇద్దరిలో శ్రీలక్ష్మి 10వ తరగతి, వైశాలి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వంలో వీరికి 'అమ్మ ఒడి' మూడు విడతలు వచ్చింది. 'తల్లికి వందనం' గురించి వెంకటేశ్ వద్ద ప్రస్తావిస్తే 'సార్.. నేను పక్కా టీడీపీ! గతంలో నా భార్య సావిత్రి అకౌంట్లో అమ్మఒడి జమ అయ్యేది. ఇప్పుడు రూపాయి రాలేదు. ఏ పార్టీ అయినా, ప్రభుత్వమైనా సేసింది సెప్పాల.. సేయందీ సెప్పాల.. అమ్మ ఒడి డబ్బులతో పిల్లోళ్ల సదువుకు మేలైంది..' అని చెబుతున్నాడు.


ఈయప్ప.. దమ్మిడీ ఇయ్యక పాయే..!



కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం పర్ల గ్రామంలో దళితవాడలో నివసించే మద్దమ్మ, హోసన్నకు నలుగురు సంతానం. పిల్లల చదువుల గురించి సాక్షి ప్రతినిధి వారి వద్ద ప్రస్తావించగా.. 'యాడ సార్! నలుగురు బిడ్డలను సదవియ్యాలంటే శానా ఇబ్బందైతాంది! సెంద్రబాబు డబ్బులేస్తే నలుగురికి రూ.60 వేలు వస్తాది.. ఇద్దరినీ మంచి ప్రైవేటు స్కూలుకు పంపుదాం.. తక్కిన డబ్బులు పెద్దపాప, పదో తరగతికి పోయే రెండో పాపకు మేలయితాది అనుకుంటిమి. ఈయప్ప(చంద్రబాబు) దమ్మిడీ ఇయ్యకపాయే! జగన్ ఉన్నపుడు అమ్మ ఒడి వచ్చేది. ఆయప్ప ఉన్నపుడే బాగుండే. మాలా కష్టం సేసుకునేవాళ్లం ఇంతమంది బిడ్డల్ని సదివించాలంటే ఎట్ట సార్! శానా ఇబ్బందిగా ఉంది' అని గోడు చెప్పుకున్నారు.

రెండూ పాయే..!

'సార్! నాకు ఇద్దరు పిల్లలు.. ఆదిత్య, సింధు. మా ఆయన ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేసేవాడు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత తీసేశారు. ఇంక మేం బతికే మార్గమేది? నాకు అమ్మ ఒడి వచ్చేది! మా ఆయనకు జీతం వచ్చేది! ఇప్పుడు రెండూ పాయే! ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఒక్క రూపాయి ఇవ్వకపాయే! మా లాంటి పేదోళ్ల గురించి కూడా కాస్త ఆలోచించాలి కదా సార్!' అని కర్నూలు జిల్లా పర్ల ఎస్సీ కాలనీలో అంజలి ఆవేదనగా చెప్పింది. అదే గ్రామంలో నివసించే ప్రమీల, ఈరన్నను సాక్షి ప్రతినిధి పలుకరించగా 'సార్.. మాకు ఎకరంన్నర పొలం ఉంది. ఇద్దరు ఆడపిల్లలు. ఎస్తేర్‌రాణి ఇంటర్, జాను 9 చదువుతున్నారు. తల్లికి వందనం డబ్బులు రూ.30 వేలు పడితే ఒకర్ని అయినా కర్నూలులో ప్రైవేట్‌లో చదివిద్దామనుకున్నాం.. కానీ రూపాయి ఇయ్యలేదు. మాకు స్తోమత లేదు. సదివిన కాడికి సదవని అని పంపుతాండం' అని నిర్వేదంగా చెప్పారు. పక్కనే ఉన్న వృద్ధులు స్పందిస్తూ.. 'అమ్మ ఒడి కాదు.. ఏది ఇస్తాండారు..? ఏదీ ఇయ్యలే! ఆయప్ప (జగన్) ఉంటే పాపం .. బిడ్డ ఏదో ఒక డబ్బులు ఇస్తాండె! పిల్లోళ్ల సదువులు, ఎరువులు, మందులు, పొలంలో ఇత్తనాలకు ఉపయోగపడ తాండే! ఇప్పుడు ఏదీ ఇయ్యలేదు. పో సార్.. పో! మంచి ప్రభుత్వం వచ్చింది గానీ!' అని మండిపడ్డారు.




'వందనం' లేక తల్లుల తిప్పలు..

ఓట్లేసి గెలిపించాక ఎగ్గొడితే ఎట్ట సార్?



ఏడాదంతా ఎదురు చూసినా...

యూడైస్ ప్లస్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 87.42 లక్షల మంది ఉండగా ఇంటర్ విద్యార్థులు మరో 10.50 లక్షల మంది కూడా కలిపితే మొత్తం 97.92 లక్షల మంది ఉన్నారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం ద్వారా ఏటా రూ.15,000 చొప్పున ఇస్తామని సూపర్ సిక్స్ హామీల్లో కూటమి పార్టీలు చెప్పాయి. ఆ హామీ మేరకు సీఎం చంద్రబాబు వీరందరికీ ''తల్లికి వందనం'' కింద ఈ ఏడాది రూ. 14,688 కోట్ల మేర బకాయి పడ్డారు. నిజానికి ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం ఇస్తామన్న కూటమి పార్టీల హామీ మేరకు రాష్ట్రంలో అంగన్‌వాడీల నుంచి ఉన్న దాదాపు 1.10 కోట్ల మంది పిల్లలకు రూ.15,150 కోట్లు ఇవ్వాలి. 2024–25 విద్యా సంవత్సరం బుధవారంతో ముగిసినా.. గత జూన్‌లోనే అందించాల్సిన సాయాన్ని ఇంతవరకూ ఇవ్వకపోవడంతో పిల్లల చదువులు సంకటంలో పడ్డాయి.



విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించి..

'పేదలకు ఉచిత విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత కాదు.. ప్రభుత్వ బడుల్లో సదుపాయాలు ఉండవు.. వాటిని కల్పించే పరిస్థితి లేదు.. డబ్బున్నవారు ప్రైవేట్ స్కూళ్లల్లో చదువుకోవచ్చు.. అక్కడ ఇంగ్లిష్ మీడియం ఉంటుంది.. అన్నీ బాగుంటాయి..!' గతంలో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేసిన బహిరంగ ప్రకటన ఇదీ!! దీనికి అనుగుణంగానే ఈసారి అధికారంలోకి వస్తూనే చంద్రబాబు విద్యా రంగ సంస్కరణలను నీరుగార్చి ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. పేద పిల్లల చదువులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఏటా విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే జూన్ నెలలో అమ్మ ఒడి డబ్బులు తల్లుల ఖాతాల్లో జమయ్యేవి. కానీ ఈసారి విద్యా సంవత్సరం ముగిసినా కనీసం ప్రకటన చేయకపోవడంపై లక్షలాది మంది తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇద్దరు ముగ్గురు పిల్లలున్న తల్లిదండ్రులు తల్లికి వందనంతో తమకు ఏడాదికి రూ.30 వేల నుంచి రూ.45 వేల వరకు అందుతాయని, ఫీజుల భారం తగ్గుతుందని ఆశపడ్డారు. కానీ టీడీపీ కూటమి సర్కారు వస్తూనే గత జూన్‌లో ఇవ్వాల్సిన అమ్మ ఒడి సాయాన్ని నిలిపివేసింది. మొత్తం ఫీజు చెల్లిస్తేనే పిల్లలను పరీక్షలు రాయనిస్తామని గత మార్చిలో పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేయడంతో తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించారు. పెండింగ్ ఫీజులు చెల్లించకుంటే విద్యార్థులను పై తరగతులకు పంపించడం సాధ్యం కాదని ప్రైవేట్ స్కూళ్లు తెగేసి చెబుతున్నాయి.

తల్లికి వందనం లేదు..

తల్లికి తోడుగా మట్టి మోస్తోంది!



కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం ఉల్చాల గ్రామాన్ని సందర్శించిన సాక్షి ప్రతినిధికి గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన స్కూలు యూనిఫాం ధరించి మట్టి తట్ట మోస్తున్న చిన్నారి మనీష కనిపించింది. ఆ కుటుంబంలో మొత్తం ముగ్గురు పిల్లలున్నారు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళుతుంటారు. పిల్లల చదువులు తలకు మించిన భారం కావడంతో పిల్లలను కూడా పనులకు పంపుతున్నారు.

గెలిచాక ఎగ్గొడితే ఎలా సార్?



బాపట్ల శివారు సూర్యలంక రోడ్డు హనుమంతునగర్ ఎస్టీ కాలనీలో నివసించే నిరుపేదలు బొజ్జా గోవిందు, నారాయణమ్మకు ముగ్గురు సంతానం. కూలి పనులే ఆ కుటుంబానికి జీవనాధారం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి డబ్బులిస్తామని నమ్మబలికిన చంద్రబాబు పైసా ఇవ్వడం లేదని పిల్లల నాయనమ్మ సుబ్బరామమ్మ ఆవేదనగా చెప్పింది. గెలిచాక పేదోళ్లకిచ్చే సాయాన్ని ఎగ్గొడితే ఎలా సార్? అని నిలదీసి అడుగుతోంది. జగన్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకొని డబ్బులిచ్చినప్పుడు చంద్రబాబు ఎందుకివ్వరు? ఇది మోసం కాదా? అని ప్రశ్నించింది.

మా పరిస్థితి ఏమిటి?



నాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఇద్దరికీ ఏడాదికి రూ.30 వేలు వస్తే ఫీజు భారం కొంత తగ్గుతుందని ఆశపడ్డా. కానీ గతేడాది డబ్బులు ఇవ్వలేదు. ఈ ఏడాదీ అంతే. ఫీజులు కట్టాలని మాపై ఒత్తిడి పెరుగుతోంది. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం డబ్బులు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఇవ్వకపోతే మా పరిస్థితి ఏమిటి? గత ప్రభుత్వంలో సమయానికి అమ్మ ఒడి రావడంతో చదువులు సజావుగా సాగాయి.

– ఉల్లూరి కనకదుర్గ శ్రీను, విద్యార్థుల తండ్రి, కోటనందూరు (కాకినాడ జిల్లా)

చదువుకునే పరిస్థితి లేదు

మా అమ్మాయి సీలేరులోని ప్రైవేట్ స్కూల్లో చదువుతోంది. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు వచ్చేవి. కూలి చేసుకుని బతికే మాకు తల్లికి వందనం రాకపోతే నా కుమార్తె చదువు సాగే పరిస్థితి లేదు.

– కొప్పు సురేష్, సీలేరు (ఏఎస్సార్ జిల్లా)

నమ్మకం లేదు..



నా భర్త డేవిడ్ ఆటోడ్రైవర్. మాకు ముగ్గురు పిల్లలు. గత ప్రభుత్వంలో జగనన్న అమ్మఒడి పిల్లల చదువులకు ఎంతో ఆసరాగా నిలిచింది. గతేడాది సాయం అందలేదు. ఇక ఈ ప్రభుత్వం ఇస్తుందనే నమ్మకం లేదు.

– కె.ప్రవీణ, పేరెంట్, గుంటూరు

మోసం చేశారు..

ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నా. గత ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేయడంతో ఇద్దరు పిల్లలను నగర పాలక ప్రాథమిక పాఠశాలలో చేర్పించా. ఏటా జగనన్న అమ్మఒడి ద్వారా రూ.15 వేలు వచ్చేవి. ఈ ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా ఒక్కో పిల్లాడికి రూ.15 వేలు చొప్పున ఇస్తామనడంతో ప్రైవేటు స్కూల్లో చేర్చా. ఇద్దరికీ రూ.45 వేలు కడుతున్నా. తల్లికి వందనం ఎగ్గొట్టారు. ఈ ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది. – కె.వంశీ, పేరెంట్, గుంటూరు

ఆశ పెట్టారు..

నాకు ముగ్గురు పిల్లలు. తల్లికి వందనం రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తామని ఆశ చూపించారు. ఒక్కరికీ ఇవ్వలేదు.

– పాంగి బంగారయ్య, సీలేరు (ఏఎస్సార్ జిల్లా)

చదివించలేక పోతున్నాం...



గతంలో క్రమం తప్పకుండా అమ్మఒడి పథకం కింద డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు. ఈ ప్రభుత్వం తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఇప్పటికి రూపాయి కూడా ఇవ్వలేదు. కూలి పనులే మాకు జీవనాధారం. ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను చదివించలేకపోతున్నాం.

– పెంకి లక్ష్మి, పార్వతీపురం



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఉండేల రామకృష్ణారెడ్డి పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం చాగంటివారిపాలెంలో టీ స్టాల్ నిర్వహిస్తున్నారు. ఆయనకు అదే జీవనాధారం, సొంత ఇల్లు లేదు. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివిస్తున్నారు. గతంలో అమ్మ ఒడి సాయం ఊరటనిచ్చిందని గుర్తు చేసుకుంటున్నారు. ఈ ప్రభుత్వం మాట ప్రకారం రూ.30 వేల సాయం అందించాలని కోరుతున్నారు.

నాడు నేరుగా ఖాతాలో జమ..



మాకు ఇద్దరు అమ్మాయిలు. తాళ్లపూడిలోని ఓ ప్రైవేటు స్కూల్లో మూడు, ఆరు తరగతులు చదువుతున్నారు. గత ప్రభుత్వంలో ఏటా అమ్మ ఒడి సొమ్ము బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ అయ్యేది. నాలుగుసార్లు అమ్మ ఒడి అందుకున్నాం. వాటితో పిల్లలకు ఫీజులు చెల్లించాం. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయడం లేదు. ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసి తీరాలి.

– పిట్టా ఆనంద కుమారి, విద్యార్థి తల్లి, అన్నదేవరపేట, తాళ్లపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా



చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పేట గంగ. శ్రీసత్యసాయి జిల్లా అమడగూరు మండలం రెడ్డివారిపల్లిలో నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. అమడగూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి ద్వారా ఏటా డబ్బులు జమ అయ్యేవి. తల్లికి వందనం కింద రూ.30 వేలు వస్తాయని ఆశగా ఎదురు చూసింది. విద్యా సంవత్సరం ముగిసిందని, తల్లికి వందనం డబ్బులు ఇంకెప్పుడు ఇస్తారని అడుగుతోంది.

భర్తకు గుండె ఆపరేషన్.. కుమార్తె ఫీజుల కోసం అప్పులు



ఏలూరు రూరల్ పోణంగి రోడ్డులో నివాసం ఉంటున్న బీబీ ఫిజ్జ భర్త వెల్డింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. గతేడాది గుండె సంబంధిత వ్యాధి బారిన పడటంతో ఆమె భర్తకు శస్త్ర చికిత్స (వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో) జరిగింది. అప్పటి నుంచి వైద్యుల సూచనలతో వెల్డింగ్ పనులకు దూరంగా ఉంటున్నారు. గత ప్రభుత్వంలో పలు పథకాల ద్వారా ఆ కుటుంబం లబ్ధి పొందింది. అమ్మ ఒడి ద్వారా అందుకున్న డబ్బులు పిల్లల చదువులకు ఉపయోగపడ్డాయి. ఇప్పుడు తల్లికి వందనం రాకపోవడం.. కుటుంబ పెద్ద అనారోగ్య కారణాలతో పనులు చేయలేని పరిస్థితిలో ఉండటంతో కుమార్తె ఫీజుల కోసం అప్పులు చేసి ఆర్థికంగా కుంగిపోయారు.

బకాయిల భారం..



విశాఖలోని మద్దిలపాలెంలో చిన్న ఫ్యాన్సీ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్న మామిడి రమ గత ప్రభుత్వం ఇచ్చిన అమ్మ ఒడితో పిల్లలను నిశ్చింతగా చదివించుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దీన్ని నిలిపి వేయడంతో ఆమెకు దిక్కు తోచడం లేదు. ఏటా స్కూల్ ఫీజులు పెరుగుతున్నాయి. అప్పులు చేసి కడుతున్నా ఇంకా రూ.6 వేలు బకాయిలు చెల్లించాలంటూ యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది.

డబ్బులు పడతాయని రోజూ ఎదురుచూపులే




విశాఖ దక్షిణ నియోజకవర్గం టౌన్ కొత్తరోడ్డులో నివసించే గుర్రాల శ్రీదేవి అరటిపళ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కి ధీటుగా ఉండటంతో పిల్లల్ని జీవీఎంసీ బడిలో చేర్పించారు. ప్రతి ఏటా అమ్మ ఒడి అందేది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ నీరుగారడంతోపాటు ఇంగ్లిష్ బోధన, సీబీఎస్ఈ తొలగించారని తెలియడంతో ప్రైవేట్ స్కూల్‌లో చేర్చాలని భావించినా డబ్బులు లేక విరమించుకున్నారు. తల్లికి వందనం డబ్బులు పడతాయని ప్రతి రోజూ ఎదురు చూస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల చదువులకు ప్రభుత్వం సహకరించదా?



విశాఖ సీతమ్మధారలో పండ్ల వ్యాపారం చేసుకుంటూ బతికే పిల్లా తవిటినాయుడు కుమారుడు నందకిశోర్ ప్రైవేట్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. నెలకు రూ.1,500 చొప్పున ఫీజు చెల్లిస్తున్నాడు. ఒకటో తరగతి నుంచి అమ్మ ఒడి అందడంతో గతంలో నిశ్చింతగా చదువులు సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సాయం నిలిచిపోయింది. కనీసం ఇప్పుడైనా తల్లికి వందనం డబ్బులిస్తే తనలాంటి చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలకు మేలు జరుగుతుందంటున్నాడు.



నీట్..నిజంగా పరీక్షే!

రెండున్నర గంటల ముందుగా రిపోర్టింగ్ టైం

మధ్యాహ్నం 2 గంటలకు జరిగే పరీక్షకు 1.30 గంటల తర్వాత అనుమతికి నో

ఫుల్ షర్టు, జీన్స్, షూస్, చెవి రింగులు లాంటివి ధరిస్తే అనుమతి లేదు

ఏప్రిల్ 26న సిటీ ఇంటిమేషన్ స్లిప్.. మే 1న అడ్మిట్ కార్డు.. మే 4న ప్రవేశ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) వచ్చే నెల 4న జరిపేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఏర్పాట్లు చేస్తోంది. దేశవ్యాప్తంగా 24 లక్షల మందికి పైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాయనుండగా తెలంగాణ నుంచి 80 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. రాష్ట్రంలో 2023లో 72,842 మంది, 2024లో 77,849 మంది పరీక్ష రాశారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ తదితర కోర్సుల ప్రవేశ పరీక్షలు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో జరుగుతుండగా, నీట్ మాత్రం పెన్, పేపర్ విధానంలో రాత పరీక్ష ద్వారానే జరుగుతుండటం గమనార్హం. అభ్యర్థి ఏ కేంద్రంలో పరీక్ష రాయాల్సి ఉంటుందో తెలియజేసే 'సిటీ ఇంటిమేషన్ స్లిప్'ను ఈనెల 26న విడుదల చేస్తారు. మే 1న అడ్మిట్ కార్డు విడుదల చేస్తారు.

పరీక్షకు అరగంట ముందు వరకే..

నీట్ పరీక్ష మే 4న రాష్ట్రంలోని 24 నగరాల్లో జరగనుంది. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులు రెండున్నర గంటల ముందు నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రిపోర్టింగ్ టైమ్‌గా ఎన్టీఏ నిర్ణయించింది. 1.30 గంటల తరువాత కేంద్రంలోకి అనుమతించరు.

వీటికి అనుమతి నో...

పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, స్టేషనరీ, ఆభరణాలు తదితరాలకు అనుమతి లేదు. ఆభరణాల్లో... రింగులు, బ్రేస్‌లెట్లు, చెవి రింగులు, ముక్కు రింగులు, గొలుసులు, పెండెంట్లు, బ్యాడ్జీలు; ఎలక్ట్రానిక్ వస్తువుల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, కాల్క్యులేటర్లు, బ్లూటూత్ డివైస్‌లు తేవడం నిషేధం. పెన్సిల్స్, జామెట్రీ బాక్స్, స్కేల్, రైటింగ్ ప్యాడ్, లాగ్ టేబుల్ వంటి వాటితోపాటు హ్యాండ్‌బ్యాగ్‌లు, వాలెట్లు, బెల్టులు, క్యాప్‌లు, వాచ్‌లు నిషేధిత జాబితాలో ఉన్నాయి.

నీట్‌గా... డ్రెస్ కోడ్

- **పురుషులకు అనుమతించే దుస్తులు:** లైట్ కలర్, హాఫ్ స్లీవ్స్ షర్ట్ లేదా టీ–షర్ట్, సాదా ప్యాంట్లు.
- **నిషేధిత దుస్తులు:** ఫుల్ స్లీవ్ షర్ట్, జిప్‌లు, పెద్ద బటన్‌లు, లేయర్స్ ఉన్న దుస్తులు, కుర్తా పైజామా, ట్రాక్ ప్యాంట్లు, షార్ట్‌లు.
- **మహిళలకు అనుమతించే దుస్తులు:** లైట్ కలర్, హాఫ్ స్లీవ్ టాప్‌లు లేదా షర్ట్, సాదా సల్వార్ లేదా ట్రౌజర్లు.
- **నిషేధిత దుస్తులు:** ఎంబ్రాయిడరీ, ఫ్రిల్స్, లేయర్స్ ఉన్న దుస్తులు, జీన్స్ (పెద్ద జిప్‌లు లేదా డిజైన్ ఉన్నవి), లెగింగ్స్, ప్లాజో ప్యాంట్లు, స్కార్ఫ్
- **ఆభరణాలు:** ఎలాంటి ఆభరణాలు (మెటాలిక్ లేదా నాన్ – మెటాలిక్) అనుమతించరు.
- **పాదరక్షలు:** స్లిప్పర్లు లేదా ఓపెన్ శాండల్స్ మాత్రమే అనుమతిస్తారు. హై హీల్స్, షూలు నిషిద్ధం.

మతపరమైన దుస్తులు

మతపరమైన లేదా సంప్రదాయ దుస్తులు (టర్బన్, హిజాబ్, బుర్ఖా) ధరించే అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే ఆ విషయాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. వాళ్లు పరీక్షా కేంద్రానికి మధ్యాహ్నం 12:30 గంటలకల్లా రావాలి. తద్వారా భద్రతా తనిఖీలు నిర్దేశిత సమయానికి పూర్తవుతాయి.

అంతకుమించి మద్యం దోపిడీ..
అందుకే డైవర్షన్ కుట్ర

2014–19, ప్రస్తుత ఆగడాల నుంచి దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు పన్నాగం

కొత్త మద్యం విధానంతో రాష్ట్రంలో టీడీపీ మాఫియా యథేచ్ఛగా దోపిడీ

ఊరూవాడా గుడీ బడీ తేడా లేకుండా 55వేల నుంచి 60 వేల బెల్ట్ దుకాణాలు


ఒంగోలులో విచ్చలవిడి మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా నిరసనకు దిగిన మహిళలపై పోలీసుల దౌర్జన్యం

సాక్షి, అమరావతి; వేలం వేసి మరీ బెల్టు షాపుల కేటాయింపు..! పచ్చ ముఠాలకే మద్యం దుకాణాల పందేరం..! ప్రతి క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అధికంగా వసూలు..! సిండికేట్ కట్టి.. కొత్త మద్యం విధానంతో రాష్ట్రంలో టీడీపీ మాఫియా యథేచ్ఛగా సాగిస్తున్న దోపిడీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. గ్రామాల్లో మహిళలు ధర్నాలకు సైతం దిగుతున్నారు. దీంతో తమ 'దోపిడీ విధానం' నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు అలవాటైన రీతిలో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత సమర్థంగా అమలు చేసిన దశలవారీ మద్య నియంత్రణ విధానంపై అక్రమ కేసు నమోదు చేశారు. ఇందుకోసం గతంలో పనిచేసిన ఉన్నతాధికారులు, డిస్టిలరీల ప్రతినిధులు, ఇతరులను బెదిరించి, వేధించి మరీ అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలు నమోదు చేయిస్తున్నారు. వాస్తవానికి చంద్రబాబు హయాంలోనే మద్యం అక్రమ దందా సాగింది. ఆయన అస్మదీయులకు చెందిన నాలుగు డిస్టిలరీల నుంచే 53.25 శాతం మద్యం కొనుగోలు చేసినట్లు టీడీపీ కూటమి ప్రభుత్వమే ఏర్పాటు చేసిన సిట్.. న్యాయస్థానానికి సమర్పించిన రిమాండ్ నివేదిక సాక్షిగా బయటపడింది.

మద్యం దందాకు చెక్ పెట్టిన వైఎస్ జగన్
సమర్థంగా దశలవారీ మద్య నియంత్రణ విధానం అమలు

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో టీడీపీ హయాంలో జరిగిన మద్యం దోపిడీకి అడ్డుకట్ట వేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో దశలవారీ మద్య నియంత్రణ విధానం కోసం విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టారు. దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని రద్దు చేశారు. ఆ స్థానంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రవేశపెట్టారు. టీడీపీ ప్రభుత్వంలో ఉన్న 4,380 మద్యం దుకాణాలను 2,934కు తగ్గించారు. దుకాణాల వేళలను కుదించి ప్రభుత్వం ఆధ్వర్యంలో పరిమితంగా నిర్వహించారు. కొత్తగా బార్లకు అనుమతి ఇవ్వలేదు. టీడీపీ ప్రభుత్వంలో కొనసాగిన 43 వేల బెల్ట్ దుకాణాలను తొలగించారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా చంద్రబాబు ప్రభుత్వం అనుమతినిచ్చిన 4,380 పర్మిట్ రూమ్‌లను రద్దు చేశారు. కొత్తగా ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదు. మేనిఫెస్టోలో చెప్పినట్టుగా మద్య పానాన్ని నిరుత్సాహ పరిచేందుకు మద్యం ధరలను షాక్ కొట్టేలా పెంచారు. అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఏఆర్ఈటీ)నూ విధించారు.

▲ ఇక దశలవారీగా మద్య నియంత్రణ విధానం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలిచ్చాయి. 2014–19లోని టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే 2019–24లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయాలను సగానికి పడిపోయాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయని ఎక్సైజ్ శాఖ రికార్డులే వెల్లడిస్తున్నాయి. మరి డిస్టిలరీలు ఎందుకు కమీషన్లు ఇస్తాయి. కానీ ఇచ్చినట్టుగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని కొందరు డిస్టిలరీల ప్రతినిధులను కిడ్నాప్ చేసి మరీ సిట్ అధికారులు వేధించారు. దానిపై వారు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క కొత్త డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వనేలేదు. అయినా కమీషన్లు ఇచ్చినట్టుగా అబద్ధపు ఆధారాలు చూపించేందుకు సిట్ కట్టుకథలు అల్లింది.

డైవర్షన్ పాలిటిక్స్... అందుకే అక్రమ కేసు

విజయసాయిరెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్ కేసిరెడ్డితోపాటు బెవరేజస్ కార్పొరేషన్ అధికారులు సమావేశమై ఆదాన్ డిస్టిలరీ ఏర్పాటుపై చర్చించారని అభియోగం మోపింది. ఇక దర్యాప్తులో రాజ్ కేసిరెడ్డి చెప్పని విషయాలు చెప్పినట్టుగా సిట్ అధికారులే అబద్ధపు వాంగ్మూలం నమోదు చేయడం ఈ కుట్రకు పరాకాష్ట. కానీ ఆ వాంగ్మూల పత్రంపై సంతకం చేయమని తాము చెప్పినా సరే రాజ్ కేసిరెడ్డి నిరాకరించారని సిట్ తన నివేదికలో పేర్కొనడం గమనార్హం. అక్రమ కేసును నిరూపించేందుకు సిట్ ద్వారా చంద్రబాబు ప్రభుత్వం ఎంతగా బరితెగిస్తోందన్నది ఆ నివేదికే బట్టబయలు చేసింది. ఇంకా అక్రమ అరెస్టులు, వేధింపులతో చంద్రబాబు ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించేందుకు కుట్రకు పదునుపెడుతోంది. తద్వారా టీడీపీ కూటమి మద్యం సిండికేట్‌దోపిడీ నుంచి ప్రజల దృష్టి మళ్లించాలన్నదే చంద్రబాబు ఏకైక లక్ష్యంగా మారింది.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే మద్యం సిండికేట్

టీడీపీ సిండికేట్‌కే మొత్తం 3,396 మద్యం దుకాణాలు

55వేల నుంచి 60 వేల బెల్ట్ దుకాణాలు

గత ఏడాది అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో మద్యం సిండికేట్ దోపిడీని మళ్లీ తెరపైకి తెచ్చింది. ప్రైవేటు మద్యం దుకాణాల ద్వారా భారీ దోపిడీకి టీడీపీ మద్యం సిండికేట్‌ను రూపొందించింది. టీడీపీ ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు, బినామీలకే రాష్ట్రంలోని మొత్తం 3,396 మద్యం దుకాణాలను కేటాయించింది. ఇతరులు ఎవరూ లైసెన్సుల కోసం దరఖాస్తు చేయకుండా పోలీసులతో బెదిరింపులు, టీడీపీ గుండాలతో వేధింపులకు పాల్పడి అడ్డుకుంది. మరోవైపు బార్లు, లిక్కర్ మార్ట్‌లు, కల్లుగీత కుటుంబాలకు కేటాయించిన మద్యం దుకాణాలను కూడా టీడీపీ సిండికేట్‌కే ఏకపక్షంగా కట్టబెట్టేలా కథ నడిపించింది. ఇక రాష్ట్రంలో ఇప్పటికే 55వేల నుంచి 60 వేల బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేయడం గమనార్హం. నగరాల్లోని కాలనీలు, గ్రామాల్లోని వీధులతోసహా ..బడి గుడీ అని కూడా చూడకుండా వేలం పాటలు నిర్వహించి మరీ బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. అధికారిక మద్యం దుకాణాల్లో ప్రతి మద్యం బాటిల్‌పై రూ.15 చొప్పున అధికంగా... బెల్ట్ దుకాణాల్లో ప్రతి బాటిల్‌పై అదనంగా మరో రూ.20 అధిక ధరకు విక్రయిస్తున్నారు. టీడీపీ కూటమి మద్యం దోపిడీకి వత్తాసు పలుకుతూ ఎక్సైజ్ శాఖ చోద్యం చూస్తోంది. ఇక గతంలో అనధికారిక బార్లుగా టీడీపీ ప్రభుత్వం అనుమతించిన పర్మిట్ రూమ్‌లకు త్వరలో అనుమతి మంజూరు చేయనుంది.



ఇది నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌లో మద్యం దుకాణం. వైన్ షాపు పక్కనే కూల్‌డ్రింక్స్ షాపు పేరుతో బెల్టు దుకాణం ఏర్పాటు చేశారు. అక్కడ ఎనీటైం మద్యం అందుబాటులో ఉంచారు. బెల్టు దుకాణంలో మాత్రం బాటిల్‌పై అదనంగా రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతోంది. కానీ.. అధికారులకు మాత్రం కన్పించదు.

ప్రస్తుతం చంద్రబాబు హయాంలో పరిస్థితి ఇదీ..


ఏలూరు జిల్లా కొయ్యలగూడెం గ్రామంలో బార్‌ను తలపిస్తున్న ఓ బెల్టుషాపు


బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్లపల్లిలో ఓ తోటలో చక్కటి ఏర్పాట్లతో బెల్టు షాపు


విజయనగరం జిల్లా గజపతినగరం మండలం గంటచోళ్లపెంటలోని బెల్ట్‌షాపులో పెగ్ లెక్కన మద్యం విక్రయాలు

2014–19 మద్య దోపిడీకి రాచబాట


సీఎం హోదాలో చంద్రబాబు 2014–19 మధ్య మద్యం దోపిడీకి నేతృత్వం వహించారు. ఇందుకోసం టీడీపీ ప్రైవేటు మద్యం సిండికేట్‌ను ఏర్పాటు చేయించారు. మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ పన్నును గుట్టుచప్పుడు కాకుండా తొలగించారు. మంత్రివర్గాన్ని బురిడీ కొట్టిస్తూ చీకటి జీవోలు జారీ చేశారు. అందుకు సంబంధించిన నోట్ ఫైళ్లపై సీఎంగా చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి హోదాలో కొల్లు రవీంద్ర సంతకాలు చేయడం వారి పన్నాగానికి నిదర్శనం. రాష్ట్రంలో 4,380 మద్యం దుకాణాలకు అనుబంధంగా మరో 4,380 అనధికారిక బార్లుగా పర్మిట్ రూమ్‌లకు లైసెన్సులు జారీ చేశారు. అనంతరం ఊరూవాడా 43 వేల బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేయించి మద్యాన్ని ఏరులై పారించారు. మద్యం దుకాణాల్లో బాటిల్‌పై ఎంఆర్‌పీ కంటే రూ.10 అదనంగా, బెల్ట్ దుకాణాల్లో బాటిల్‌పై మరో రూ.10 అదనంగా విక్రయిస్తూ దోపిడీకి పాల్పడ్డారు. 2014–19 మధ్య భారీ స్థాయిలో దోపిడీ జరిగిందన్న విషయాన్ని రాజ్యాంగబద్ధ సంస్థ 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్'(కాగ్) ధృవీకరించింది. ఇప్పుడు కూడా అప్పటికిమించి దోచుకోవడానికి చంద్రబాబు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

- రాష్ట్రంలో 20 మద్యం డిస్టిలరీలు ఉండగా వాటిలో 14 డిస్టిలరీలకు చంద్రబాబు ప్రభుత్వమే అనుమతులు ఇచ్చింది. మిగిలిన 6 డిస్టిలరీలకు అంతకుముందు ప్రభుత్వాలు అనుమతులిచ్చాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019–24లో రాష్ట్రంలో ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదు. మరోవైపు 2014 నవంబరులో జీవో నెంబర్ 993 ప్రకారం రెవెన్యూ (ఎక్సైజ్–2) డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా, కమిటీ సూచించిన వాటి కంటే ఎక్కువ డిస్టిలరీల స్థాపనకు టీడీపీ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.
- టీడీపీ సర్కారు కొత్త మద్యం బ్రాండ్లను ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడింది. టీడీపీ మద్యం సిండికేట్ దోపిడీపై గతంలోనే సీఐడీ కేసు నమోదు చేసి పూర్తి ఆధారాలతో నిగ్గు తేల్చింది. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ కమిషనర్‌గా వ్యవహరించిన ఐఏఎస్ నరేష్, అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సీఎం చంద్రబాబు, తదితరులపై ఐపీసీ, సెక్షన్లు: 166, 167, 409, 120(బి) రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు: 13(1),(డి), రెడ్ విత్ 13(2) కింద సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.


Note # 5
Digitally Signed
03/12/2015 9:10 AM
KOLLU RAVINDRA
(MINISTER)


Note # 6
Digitally Signed
Para 14 of approved.
04/12/2015 1:44 PM
NARA CHANDRABABU NAIDU
(CHIEF MINISTER)
Digitally Signed

మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలని రూపొందించిన ఫైల్‌పై చంద్రబాబు, కొల్లు రవీంద్ర చేసిన డిజిటల్ సంతకాలు


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
Rules – The Andhra Pradesh Excise (Grant of licence of selling by shop and conditions of licence) Rules, 2012 – Amendments – Orders – Issued.

REVENUE (EXCISE-II) DEPARTMENT
G.O.Ms.No.218
Dated:22.06.2015.
Read the following:
1. G.O.Ms. No.391, Rev (Ex.II) Dept, dated:18.06.2012
2. G.O.Ms. No.357, Rev (Ex.II) Dept, dated:22.06.2013
3. G.O.Ms. No.216, Rev (Ex.II) Dept, dated:22.06.2015
4. G.O.Ms. No.217, Rev (Ex.II) Dept, dated:22.06.2015
5. From the Commr.of Prohibition & Excise, A.P., Hyderabad, D.O.Lr.in Cr.No.999/2015/CPE/E3, Dated: 22.06.2015.

కేబినెట్ ఆమోదం లేకుండా మద్యం దుకాణాలపై ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో–218 కాపీ


To
The Commissioner of Printing and Stationery and Stores Purchase, Hyderabad(He is requested to furnish 200 copies to Government and 500 copies to the Commissioner of Prohibition & Excise, A.P,Hyderabad and 50 copies to Special Commissioner of Information and Public Relations, Hyderabad.)
The Commissioner of Prohibition and Excise, Andhra Pradesh, Hyderabad.
Copy to:
The PS to Principal Secretary to CM.
The PS to Minister for Excise and Prohibition
The PS to Spl. CS to Govt, Revenue Department.

ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని సీఎం చంద్రబాబు ముఖ్య కార్యదర్శికి పంపినట్లు ఆధారం

లిక్కర్ కేసు డైవర్షన్ రాజకీయమే
మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ధ్వజం



సాక్షి, రాజమహేంద్రవరం: మద్యం మాఫియాను పెంచి పోషిస్తున్న కూటమి ప్రభుత్వం తన అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు గత ప్రభుత్వంలో పారదర్శకంగా అమలు చేసిన లిక్కర్ పాలసీ స్కామ్ అంటూ తప్పుడు కేసులు పెడుతూ కొత్త నాటకానికి తెరలేపిందని వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో నంద్యాల మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డికి చెందిన ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కి, అయ్యన్నపాత్రుడికి చెందిన విశాఖ డిస్టిలరీకి, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు వియ్యంకుడు పుట్టా సుధాకర్‌యాదవ్‌కు చెందిన పీఎంకే డిస్టిలరీకి అడ్డగోలుగా మేలు చేకూర్చారని ధ్వజమెత్తారు. దీని కోసం ఏకంగా 2012 ఎక్సైజ్ పాలసీని మార్చేసిన మాట వాస్తవం కాదా అని చంద్రబాబును వేణు ప్రశ్నించారు. 2012 నుంచి 2015 వరకు ప్రభుత్వానికి రూ.2,984 కోట్లు పన్నులు రాగా, 2015లో కొత్త పాలసీ తీసుకువచ్చి ప్రభుత్వానికి ఈ పన్నులు రాకుండా చేసిన మాట నిజం కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు బేవరేజ్‌లు, మూడు డిస్టిలరీలకు లబ్ధి చేకూర్చడానికి చంద్రబాబు ప్రభుత్వం క్విడ్ ప్రోకోకి పాల్పడినట్లు సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై ఎందుకు విచారణ ముందుకు కదలడం లేదు అని వేణు ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ కుంభకోణం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ.1,300 కోట్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. 2019 ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కొన్ని కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తూ, వారి ఉత్పత్తులకు, వారి మార్కెట్ వాటాకు అనుకూలంగా హడావుడిగా ఆర్డర్లు ఇచ్చేశారని, ఇది చంద్రబాబు చేసిన నేరం కాదా అని దుయ్యబట్టారు. ప్రైవేటు దుకాణాల నుంచి 30 శాతం కమీషన్లు తీసుకున్నారని, ఇవ్వని వారిపై ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు దాడులు చేయడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2012 నుంచి అమలులో ఉన్న మద్యం కొనుగోళ్లపై ప్రివిలేజ్ ఫీజును తొలగించి అస్మదీయ కంపెనీలకు ప్రయోజనం కలిగించేందుకు అడ్డగోలుగా కథ నడిపిన చంద్రబాబు తీరుపై వైఎస్సార్‌సీపీ హయాంలో సీఐడీ వద్ద కీలక ఆధారాలు ఉన్నాయని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతులివ్వలేదని వేణు స్పష్టం చేశారు. లిక్కర్‌స్కాంలో సిట్ విచారణ అంతా తప్పులతడకగా ఉందని ధ్వజమెత్తారు. వాసుదేవరెడ్డి, సత్య ప్రసాద్ తదితరులను బెదిరించి ఇప్పించిన అబద్ధపు వాంగ్మూలాలతో లిక్కర్‌స్కాం అంటూ టీడీపీ పెద్దలు కట్టుకథ అల్లారని వేణు విమర్శించారు.


విశాఖపట్నంలోని గాంధీ పార్కులో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు


గుంటూరు ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

గళమెత్తిన కలం
సాక్షి కార్యాలయంపై దాడికి ఖండన • కదంతొక్కిన జర్నలిస్టులు

ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడిని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ రౌడీయిజంపై నిరసన గళమెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జర్నలిస్టులు కదంతొక్కారు. మీడియాను భయభ్రాంతులకు గురిచేసి ప్రశ్నించే గొంతుల్ని నులిమేయడమే లక్ష్యంగా అధికార కూటమి నేతలు పేట్రేగిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని ఆవేదన చెందారు. తక్షణం చింతమనేని ప్రభాకర్ క్షమాపణ చెప్పాలని నినదించారు.

- గుంటూరులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏఎస్పీ రమణమూర్తికి వినతిపత్రం అందించారు.
- బాపట్లలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. కలెక్టర్ వెంకటమురళీ, ఏఎస్పీ విఠలేశ్వర్‌లకు వినతిపత్రం అందజేశారు.
- పశ్చిమగోదావరి జిల్లా భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.
- ఏలూరులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు.ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.
- కోనసీమ జిల్లా వ్యాప్తంగా చింతమనేని తీరుకు నిరసనగా జర్నలిస్టులు కదంతొక్కారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.
- కాకినాడ జిల్లా పిఠాపురం, పెద్దాపురంలలో జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు. ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.
- శ్రీకాకుళంలోని డేఅండ్ నైట్ కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు జర్నలిస్టులు ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. మానవహారం నిర్మించారు.
- విశాఖపట్నంలో పాత్రికేయులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు.
- అనంతపురంలో గాంధీజీ విగ్రహం వద్ద జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.


శ్రీకాకుళంలో జర్నలిస్టు, ప్రజా సంఘాల మానవహారం

- కడపలో పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. చింతమనేనిపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు.
- కర్నూలులో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణాకు వినతిపత్రాలు అందించారు.
- చిత్తూరులో పాత్రికేయులు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.
- చింతమనేనిపై చర్యలు తీసుకోవాలని తిరుపతిలో జర్నలిస్టులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

సమ్మర్ షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు 25లోగా దరఖాస్తులు


సాక్షి, అమరావతి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సమ్మర్ ఆన్‌లైన్ షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం మొదటి బ్యాచ్ శిక్షణ కోసం ఏప్రిల్ 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ ఎండీ జి.గణేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బ్యాచ్ క్లాసులు ఏప్రిల్ 28 నుంచి మొదలవుతాయి. రెండో విడత నమోదుకు ఆఖరు తేదీ మే 9. క్లాసులు మే 12 నుంచి ప్రారంభమవుతాయి. నమోదుతో పాటు మరిన్ని వివరాలకు http://naipunyam.ap.gov.in/user& registration ను సందర్శించాల్సిందిగా ఏపీఎస్ఎస్‌డీసీ ఓ ప్రకటనలో కోరింది.

యూడీఐడీ సమన్వయకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: విభిన్న ప్రతిభావంతుల విభాగంలోని యూడీఐడీ ప్రాజెక్టుకు రాష్ట్ర సమన్వయకర్త పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ శాఖ సంచాలకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 5లోగా udidapsc@gmail.comకు దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు https://wcdsc.ap.gov.in ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్పెషల్ ఒలింపిక్స్‌కు 14 మంది ఎంపిక

సాక్షి, అమరావతి: సాధారణ వ్యక్తులతో సమానంగా దివ్యాంగుల్లోనూ ఎన్నో ప్రత్యేకతలు ఉంటాయని, వారిని ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్స్ భారత్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల చివరిరోజు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో దివ్యాంగ పిల్లల గుర్తింపునకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఆటిజం గల పిల్లలకు ప్రారంభ దశలో చికిత్స, వ్యక్తిగత విద్య సక్రమంగా అందిస్తే మెరుగైన ఫలితాలు చూడవచ్చన్నారు. ఇలాంటి పిల్లల కోసం 125 పురపాలక ప్రాంతాల్లో ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కాగా రాష్ట్ర స్థాయి పోటీల్లో 150 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులు సాఫ్ట్ బాల్, సైక్లింగ్, షాట్‌పుట్, బ్యాడ్మింటన్ తదితర ఆటల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వీరిలో 14 మంది జాతీయ స్పెషల్ ఒలింపిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలు ప్రదానం చేశారు.



భారత్‌కు పోటెత్తిన పర్యాటకులు

2023-24లో 95.21 లక్షల మంది విదేశీ పర్యాటకుల రాక

కేవలం 10 దేశాల నుంచే 67.25 లక్షల మంది పర్యాటకులు

2022-23తో పోలిస్తే 30.83 లక్షల మంది పెరుగుదల

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ వెల్లడి

2023-24లో విదేశీ పర్యాటకులు అత్యధికంగా సందర్శించిన టాప్ స్మారక చిహ్నాలు ఇవే

తాజ్‌మహల్	6.81	ఫతేపూర్ సిక్రీ	0.94
కుతుబ్ మినార్	2.20	ఇతిమాద్-ఉద్-దౌలా సమాధి	0.84
ఆగ్రా కోట	2.18	ఢిల్లీ ఎర్రకోట	0.84
హుమాయూన్ సమాధి	1.17	తవ్విన అవశేషాలు, సారనాథ్	0.77
అభనేరి దౌసా వద్ద 5 మెట్ల బావి	0.96	సాహెత్ మహేత్	0.71

సందర్శించిన విదేశీ పర్యాటకుల సంఖ్య (లక్షల్లో)



వహ్.. తాజ్!

2023-24లో స్వదేశీ పర్యాటకులతోపాటు విదేశీ పర్యాటకుల్లో అత్యధికులు తాజ్‌మహల్‌ను సందర్శించినట్టు పర్యాటక శాఖ గణాంకాలు వెల్లడించాయి. విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో కుతుబ్ మినార్ రెండో స్థానంలో నిలిచింది. అంతకుముందు ఏడాది ఆగ్రా పోర్ట్ ఈ స్థానాన్ని దక్కించుకుంది. స్వదేశీ పర్యాటకుల రాకలో కోణార్క్‌లోని సూర్య దేవాలయం రెండో స్థానంలో నిలిచింది.

సాక్షి, అమరావతి: భారతదేశానికి విదేశీ పర్యాటకులు పోటెత్తుతున్నారు. 2023–24లో 95,20,928 మంది విదేశీ పర్యాటకులు భారత్ వచ్చినట్లు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీరిలో కేవలం 10 దేశాల నుంచే 67.25 లక్షల మంది మన దేశంలో పర్యటించినట్టు పేర్కొంది. వీరిలో అత్యధికంగా బంగ్లాదేశ్ నుంచి, ఆ తరువాత స్థానంలో అమెరికా నుంచి పర్యాటకులు వచ్చినట్లు తెలిపింది. 2022–23 సంవత్సరంతో పోలిస్తే.. 2023–24లో 30.83 లక్షల మంది విదేశీయులు అధికంగా వచ్చినట్లు వివరించింది.

2023-24లో స్వదేశీ పర్యాటకులు అత్యధికంగా సందర్శించిన టాప్ 10 కేంద్ర రక్షిత చిహ్నాలు ఇవే

తాజ్‌మహల్	60.99
సూర్య దేవాలయం, కోణార్క్	31.97
కుతుబ్ మినార్	31.24
ఎర్రకోట	27.94
ఎల్లోరా గుహలు	17.41
గోల్కొండ కోట	16.08
ఆగ్రా కోట	14.10
రబీస్ దురానీ సమాధి	12.95
చార్మినార్	12.90
శనివారవాడ	12.61

స్వదేశీ పర్యాటకుల సంఖ్య (లక్షల్లో)

2023-24లో టాప్-10 దేశాల నుంచి వచ్చిన పర్యాటకుల సంఖ్య

దేశం	పర్యాటకుల సంఖ్య (లక్షల్లో)	వాటా శాతం	దేశం	పర్యాటకుల సంఖ్య (లక్షల్లో)	వాటా శాతం
బంగ్లాదేశ్	21.20	22.26	శ్రీలంక	2.80	2.94
అమెరికా	16.91	17.77	మలేసియా	2.62	2.76
బ్రిటన్	9.21	9.67	జర్మనీ	2.24	2.35
ఆస్ట్రేలియా	4.56	4.79	నేపాల్	1.95	2.05
కెనడా	3.86	4.05	ఫ్రాన్స్	1.89	1.98

రేషన్ బియ్యం ఎగుమతికి 'పచ్చ' జెండా

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర కేబినెట్‌లో కీలక మంత్రికి స్వయానా వియ్యంకుడే. ఈయనే ఈ మొత్తం వ్యవహారంలో చక్రం తిప్పుతున్నారు. గోదావరి జిల్లాల్లో రైస్ మిల్లింగ్ రంగంలోనే కాకుండా విదేశాలకు బియ్యం ఎగుమతుల్లో పెద్దన్న పాత్ర పోషిస్తోన్న ఈయన ద్వారా బహిరంగంగానే కమీషన్లు ఆఫర్ చేస్తున్నారు. కూటమి పెద్దల కనుసన్నల్లోనే మంత్రి వియ్యంకుడు.. ఎగుమతిదారులు, మిల్లర్ల మధ్య రాయ'బే రాలు' నడుపుతూ వచ్చారు. పై స్థాయిలో ఎటువంటి ఇబ్బంది లేకుండా అంతా తాను చూసుకుంటానని, టన్నుకు రూ.2,000 చెల్లిస్తే రాజమార్గంలో కాకినాడ పోర్టు నుంచి ఏ దేశానికైనా ఎగుమతి చేసుకునేలా లైన్ క్లియర్ చేయిస్తానని బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఆంధ్రాతో పాటు తమిళనాడు, కేరళ నుంచి పీడీఎస్‌తో పాటు రా రైస్, బాయిల్డ్ రైస్‌ను విదేశాలకు ఎగుమతి చేయడంలో అపార అనుభవం కలిగిన ఈయన కూటమి పెద్దల తరఫున ఆ మేరకు వకాల్తా పుచ్చుకుని రంగంలోకి దిగారు. కొద్ది రోజుల క్రితం కాకినాడలోని ఒక స్టార్ హోటల్‌లో ఎగుమతిదారులతో సమావేశమై హామీ ఇచ్చారు. అయితే బియ్యం ఎగుమతుల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్న కాకినాడ పోర్టును దెబ్బతీసి, ఇప్పుడు పీడీఎస్ ఎగుమతులకు అనుమతి ఇస్తామంటే ఎలా అని ఎగుమతిదారులు నాటి సమావేశంలో వ్యతిరేకించారు.

రైస్ మిల్లర్లతోనూ చర్చలు

రెండో దఫా భేటీలో టన్నుకు కమీషన్ రూ.1,500కు తగ్గించినా ఎగుమతిదారులు ఏ విషయం తేల్చక పోవడంతో మంత్రి వియ్యంకుడు మలివిడత రైస్ మిల్లర్లతో చర్చలు జరిపారు. ప్రభుత్వం వైపు నుంచి ప్రతిబంధకాలు ఎదురు కాకుండా చూసుకుంటామని, పీడీఎస్ బియ్యం గోడౌన్‌లో నిల్వ చేసినా.. యంత్రాంగం నుంచి ఎటువంటి తనిఖీలు, దాడులు లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. పీడీఎస్ బియ్యం ఎగుమతిపై తేల్చి చెప్పేందుకు మిల్లర్లకు ఇచ్చిన గడువు ఏప్రిల్ 20వ తేదీతో ముగిసింది. అయితే వారి నుంచి ప్రతిస్పందన లేకపోవడంతో ప్లాన్-బి తెరమీదకు తీసుకు వచ్చారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంకు చెందిన ఒక బడా మిల్లర్‌కు పీడీఎస్ బియ్యం సేకరించే బాధ్యతను అప్పగించారు. ఆ మిల్లర్ ఇతర మిల్లర్లతో మాట్లాడుకుని పీడీఎస్ బియ్యాన్ని కాకినాడ పోర్టు గోడౌన్‌ల వరకు చేర్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఈ బడా మిల్లర్ అందరికీ ఫోన్లు చేస్తూ.. ఎక్కడా ఇబ్బందులుండవని చెబుతూ.. ఎన్ని టన్నులు పంపుతారంటూ ఆరా తీస్తున్నారు. అలా 12 వేల టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సేకరించాలని నిర్ణయించారు. కాగా, ఈ బియ్యం ఎగుమతిలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు భారీగా కమీషన్ ముట్టజెప్పేలా డీల్ కుదిరిందని సమాచారం.



అప్పుడలా.. ఇప్పుడిలా..

పవన్ కళ్యాణ్ గత నవంబర్‌లో కాకినాడ పోర్టులో 'సీజ్ ద షిప్' అంటూ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. స్టెల్లా-ఎల్ నౌకను తనిఖీ చేసిన పవన్.. అదే సముద్ర జలాల్లో ఉన్న కెన్‌స్టార్ (ఇందులో మంత్రి వియ్యంకుడి బియ్యం ఉన్నాయి) నౌక వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మంత్రి మనోహర్ రెండు రోజులు కాకినాడలోనే మకాం వేసి గోడౌన్‌లలో ఉన్న బియ్యాన్ని కూడా తనిఖీ చేశారు. నాడు ఇంతగా గగ్గోలు పెట్టిన ఇదే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు.. ఇప్పుడు కమీషన్ల కోసం పీడీఎస్ బియ్యం ఎగుమతికి బేరసారాలు నడపడం సిగ్గుచేటనే విమర్శలు వస్తున్నాయి.

సీడాప్‌తో లిడ్‌క్యాప్ ఒప్పందం

సాక్షి, అమరావతి: చర్మకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఉచితంగా శిక్షణ అందించి ఉద్యోగాల కల్పన కోసం సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్)– లిడ్‌క్యాప్ (లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్)లతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన, వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ చైర్మన్ దీపక్ రెడ్డి తెలిపారు. విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ నిరుద్యోగ యువతకు, మహిళలకు నైపుణ్యాభివృద్ధిలో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు. ఈ శిక్షణలో ఉచిత భోజనం, వసతి ఉంటాయని, ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తామన్నారు.

దళితుల సాంఘిక బహిష్కరణ దారుణం

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దళితులపై దురహంకార దాడులు, హత్యలు, సాంఘిక బహిష్కరణలు జరుగుతుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ.నల్లప్ప, అంద్ర మాల్యాద్రి మండిపడ్డారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం పోతురాజుపేటలో కొందరు పెత్తందారులు దళితులను సాంఘిక బహిష్కరణ చేస్తే ఇప్పటి వరకు హోం మంత్రి స్పందించలేదని వారు ఆరోపించారు. దళితులపై దారుణాలకు ఒడిగడుతున్న పెత్తందారులను కఠినంగా శిక్షించాలంటూ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఏపీటీడీసీ ఆర్థిక పరిస్థితిపై థర్డ్ పార్టీ ఆడిట్

సాక్షి, అమరావతి: ఏపీ పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆర్థిక పరిస్థితిపై థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలని 204వ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ అధ్యక్షతన బుధవారం బోర్డు సమావేశం జరిగింది. ఏపీటీడీసీ ఎస్ఈగా బి.ఈశ్వరయ్యను నియమించాలని నిర్ణయించారు. బోర్డు సమావేశంలో ఇంకొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. సిబ్బంది బదిలీలు, పోస్టింగులు పారదర్శకంగా జరగాలి. విధుల పునర్విభజన చేయాలి. లీజు రెంట్లు చెల్లించని ఆపరేటర్లపై రెగ్యులర్‌రైజేషన్ చట్టం అమలు చేయాలి. ఏపీటీడీసీలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ అమలు చేయాలి. డిప్యూటేషన్ సిబ్బందిని డీవీఎంలుగా నియమించకూడదు. పత్రికలలో ప్రచురితమైన ప్రతికూల వార్తలకు ఖండన ఇవ్వాలి. కొత్త బస్సులు, కార్లు కొనాలి. హోటళ్లలో డ్రైవర్ల కోసం డార్మిటరీలు, బంకర్ బెడ్లు ఏర్పాట్లు చేయాలి. సమావేశంలో బోర్డు డైరెక్టర్లు గంటా స్వరూపాదేవి, సుబ్బలక్ష్మి, స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, ఎండీ కాటా అమ్రపాలి పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

తండ్రి ప్రేమకు తార్కాణం




తిరుపతిలో ఎండ వేడికి జనం అల్లాడిపోతున్నారు. బుధవారం పగటి ఉష్ణోగ్రత 45 డిగ్రీలుగా నమోదైంది. ఈ నేపథ్యంలో మండుటెండలో తాను నడుస్తూ... తన కుమార్తెను గొడుగు నీడన సైకిల్‌పై కూర్చొపెట్టుకుని తండ్రి ఇంటికి ఇలా తీసుకువెళుతున్నాడు.
– సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి

సెలవుల సరదా..!



వార్షిక పరీక్షలు ముగియడంతో రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో బుధవారం విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డు సమీపంలో దర్గాపురం వద్ద పాఠశాల విద్యార్థులు రోడ్లపై కాగితాలు ఎగరవేసి తమ సరదాను తోటి స్నేహితులతో ఇలా పంచుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పూల 'దారి'...



గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా చెట్లు..వాటి నుంచి రాలిపడుతున్న అందమైన పసుపు పువ్వులు అటువైపుగా వెళ్లేవారిని విశేషంగా కనువిందు చేస్తున్నాయి. రహదారి పూలపాన్పులా కనిపిస్తున్న ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇండస్ట్రీ విభాగంలో దూసుకెళ్లేలా హిందుస్థాన్ షిప్‌యార్డు అడుగులు వేస్తోంది. దేశీయ నౌకల తయారీపై దృష్టి సారిస్తూ, అత్యుత్తమ సేవలందించేందుకు మినీరత్నగా ఆవిర్భవించనుంది. విశాఖపట్నంను కేవలం షిప్ రిపేర్ హబ్‌గా మాత్రమే కాకుండా.. షిప్ బిల్డింగ్ హబ్‌గా తీర్చిదిద్దేలా రూ.19,048 కోట్లతో 5 భారీ యుద్ధ నౌకల నిర్మాణ పనులను దక్కించుకుంది. నష్టాల బాటలో కొట్టుమిట్టాడిన ఈ నౌకా నిర్మాణ సంస్థ.. దివంగత వైఎస్సార్ చొరవతో కొత్త అవతారం ఎత్తి, ఇప్పుడు తిరుగులేని శక్తిగా అవతరిస్తోంది. ఓ వైపు దేశీయ ఆర్డర్లతో పాటు అంతర్జాతీయ నౌకల మరమ్మతులను దక్కించుకుంటూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది.
– సాక్షి, విశాఖపట్నం



మన షిప్‌యార్డు మినీ రత్నం!

మూడేళ్లుగా లాభాల బాటలో..

రూ.19 వేల కోట్ల ఆర్డర్లతో బిజీబిజీ

త్వరలోనే మినీరత్న హోదా దక్కే అవకాశం

ఏటా రూ.100 కోట్లకుపైగా నికరలాభం ఆర్జిస్తున్న హిందుస్థాన్ షిప్‌యార్డు

ప్రైవేటీకరణ సమయంలో వైఎస్సార్ చొరవతో నిలబడిన హెచ్‌ఎస్‌ఎల్

వరస ఆర్డర్లతో బిజీబిజీ

మూడు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్(ఎఫ్‌ఎస్‌ఎస్) నిర్మాణానికి సంబంధించి రక్షణ మంత్రిత్వ శాఖతో హిందుస్థాన్ షిప్‌యార్డు ఒప్పందం కుదుర్చుకుంది. 45 మిలియన్ టన్నుల డిస్‌ప్లేస్‌మెంట్ సామర్థ్యం కలిగిన ఈ నౌకల తయారీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నౌకల నిర్మాణాల వల్ల హెచ్‌ఎస్‌ఎల్ వార్షిక టర్నోవర్ కూడా గణనీయంగా పెరిగింది. వీటిలో ఒక షిప్‌ని జూలైలో నౌకాదళానికి అందజేసేందుకు హెచ్‌ఎస్‌ఎల్ సిద్ధమవుతోంది.దీంతో పాటు భారత నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకలు, కార్గో షిప్స్, పోర్టు గ్రీన్ టగ్‌లు, కోస్ట్‌గార్డ్ వెసల్స్, జలాంతర్గాముల రీఫిట్, మరమ్మతుల పనులతో షిప్‌యార్డు తీరిక లేకుండా ముందుకు సాగుతోంది. అలాగే ఆగ్నేయాసియా దేశాలకు ప్రధాన రక్షణ ఉత్పత్తుల ఎగుమతిదారుగానూ, నౌకల తయారీ కేంద్రంగానూ ఎదగడానికి షిప్‌యార్డు ప్రణాళికలు వేస్తోంది. విదేశీ నౌకలను మరమ్మతు చేయడం ద్వారా అంతర్జాతీయ వ్యాపారాన్ని ఇది వరకే ఆకర్షించిన షిప్‌యార్డు, ఇప్పుడు విశాఖ కేంద్రంగా అంతర్జాతీయ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తోంది. 2021లో 17,000 టన్నుల విదేశీ నౌకను డాక్ చేసి మరమ్మతులు విజయవంతంగా పూర్తి చేసింది. భారత్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో తొలి ఓషన్ సర్వైలెన్స్ షిప్ (ఓఎస్‌ఎస్) అయిన ఐఎన్‌ఎస్ ధృవ్‌ను నిర్మించిన హెచ్‌ఎస్‌ఎల్.. 2022లో 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన డైవింగ్ సపోర్ట్ వెసల్స్ ఐఎన్‌ఎస్ నిస్తార్, ఐఎన్‌ఎస్ నిపుణ్ నౌకలను విజయవంతంగా అందించి తన సామర్థ్యాన్ని నిరూపించుకుంది. ఇప్పటికే 364 ఎంఎస్‌ఎంఈ వెండార్ల సహకారం తీసుకుంటున్న హెచ్‌ఎస్‌ఎల్.. మరిన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు చేయూతనందించేందుకు కృషి చేస్తోంది.

ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషి



వరుసగా లాభాల బాటలో షిప్‌యార్డు నడుస్తోందంటే దానికి కారణం ఉద్యోగులు, కార్మికులతో పాటు ఎంఎస్‌ఎంఈల సహకారమే. మినీరత్న హోదా పొందేందుకు అర్హత సాధించడం షిప్‌యార్డు చరిత్రలోనే గొప్ప రోజుగా భావిస్తున్నాం. పెరుగుతున్న ఒప్పందాలకు అనుగుణంగా.. షిప్‌యార్డును ఆధునీకీకరించేందుకు సన్నద్ధమవుతున్నాం. రూ.1000 కోట్లతో యార్డుని రానున్న మూడేళ్లలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రక్షణ మంత్రిత్వ శాఖతో కుదుర్చుకున్న ఒప్పందం.. షిప్‌యార్డు భవిష్యత్‌ను మార్చబోతోంది. ఫ్లీట్ షిప్స్ తయారీ ద్వారా అనుబంధ పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈలకు కూడా సహకారం లభిస్తుంది. షిప్స్ తయారీలో దాదాపు 90 శాతం వరకు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన పరికరాలు, సామగ్రిని వినియోగిస్తాం. దేశీయ నౌకల నిర్మాణంతో పాటు అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాలపైనా దృష్టి సారించాం.
– కమొడర్ హేమంత్‌ఖత్రి, సీఎండీ, హిందుస్థాన్ షిప్‌యార్డ్

1941లో సింధియా షిప్‌యార్డుగా ప్రారంభం కాగా.. 1961లో సంస్థను జాతీయం చేసి హిందుస్థాన్ షిప్‌యార్డుగా పేరు మార్చారు. జల రవాణా మంత్రిత్వ శాఖ పరిధిలోని షిప్‌యార్డు నష్టాలతోనే నడిచి, చివరికి ఉద్యోగాలకు జీతాలివ్వలేని స్థితికి చేరుకుంది. ఈ దశలో ప్రైవేటీకరణే శరణ్యమైంది. విషయం తెలుసుకున్న అప్పటి ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో 2010లో రక్షణ శాఖ పరిధిలోకి షిప్‌యార్డు వచ్చింది. తొలినాళ్లలో ఆర్డర్లు రాక ఇబ్బందులు పడినా.. క్రమంగా ఒక్కో అవరోధాన్ని అధిగమించింది. ఎలాంటి నౌకలు, సబ్‌మెరైన్ల మరమ్మతులైనా రికార్డు సమయంలో పూర్తి చేస్తున్న హెచ్‌ఎస్‌ఎల్.. ఇప్పుడు ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రంగా దూసుకుపోతోంది. ఐదేళ్ల కాలంలో ఏకంగా 14 ప్రాజెక్టులను పూర్తి చేసి ఆర్డర్ల పెండెన్సీని గణనీయంగా తగ్గించుకుంది. 40 నౌకల రీఫిట్ పనులను ఐదేళ్ల కాలంలో పూర్తి చేసి ఔరా అనిపించుకుంది.

మినీరత్న హోదా దిశగా..

వరుసగా లాభాల బాటలో పయనిస్తున్న హిందుస్థాన్ షిప్‌యార్డు త్వరలోనే అరుదైన ఘనతని సొంతం చేసుకోనుంది. ఎలాంటి అప్పులు లేకుండా.. ఏటా లాభాలు ఆర్జించే ప్రభుత్వ రంగ సంస్థలకు అందించే మినీరత్న హోదాకు షిప్‌యార్డు పూర్తి అర్హత సాధించింది. ప్రస్తుతం దేశంలో కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్(జీఆర్‌ఎస్‌ఈ), గోవా షిప్‌యార్డు వంటి కొన్ని సంస్థలకు మినీరత్న హోదా ఉంది. నిజానికి, 2023–24 ఆర్థిక సంవత్సరంలోనే షిప్‌యార్డు ఈ ఘనతను సొంతం చేసుకునేది. ఐదు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్ నిర్మాణ పనులను తొలుత హెచ్‌ఎస్‌ఎల్‌కు ఇచ్చేందుకు రక్షణ శాఖ సిద్ధమైంది. అయితే చివరి నిమిషంలో రెండు షిప్స్ నిర్మాణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడంతో షిప్‌యార్డు మూడింటితోనే సరిపెట్టుకుంది. ఈ కారణంగా మినీరత్న హోదా ఒక ఏడాది ఆలస్యమైంది. 40 ఏళ్ల షిప్‌యార్డు చరిత్రలో ఎన్నడూ లేనంతగా.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,586 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గతంతో పోలిస్తే 36 శాతం వృద్ధితో రూ.166 కోట్ల నికరలాభాన్ని పొందడంతో.. మినీరత్నగా అవతరించడం లాంఛనంగా మారింది.



కల్యాణము చేతము రారండీ..

సత్యదేవుని కల్యాణోత్సవాలకు అధికారుల సన్నాహాలు

అన్నవరం: సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల దిశగా కాకినాడ జిల్లా అధికారులు ఎట్టకేలకు అడుగులు వేశారు. ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై దేవస్థానం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో రత్నగిరిపై సమన్వయ సమావేశం నిర్వహించారు. కల్యాణోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎటువంటి ఏర్పాట్లు చేయాలనే అంశాలపై ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఉత్సవాలకు దేవస్థానం తరఫున చేపట్టే ఏర్పాట్లను ఈఓ ఈ సమావేశంలో వివరించారు.

దేవస్థానం దృష్టి పెట్టాల్సిన అంశాలు ఇవీ..

- వచ్చే నెల 7 నుంచి 13వ తేదీ వరకూ కల్యాణోత్సవాలు జరగనున్నాయి. 8వ తేదీ రాత్రి 9.30 గంటలకు సత్యదేవుని దివ్యకల్యాణం నిర్వహిస్తారు. దీనికి 10 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశముంది. అయితే, స్వామివారి వార్షిక కల్యాణ వేదిక ముందున్న విశ్రాంతి షెడ్డులో సుమారు 2 వేల మంది మాత్రమే తిలకించే అవకాశం ఉంది. ఆ షెడ్డుకు ఇరువైపులా ఉన్న ఆవరణలో స్వామివారి కల్యాణాన్ని తిలకించేలా పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేస్తే మిగిలిన భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.
- భక్తులకు మంచినీరు, కల్యాణానంతరం అన్నదాన పథకంలో ఉచిత ఫలహారం రెండుమూడు చోట్ల పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఫలహారం ప్యాకెట్లు రూపంలో పంపిణీ చేస్తే భక్తులు వాటిని తీసుకుని వెళ్లిపోయే అవకాశం ఉంటుంది.
- కల్యాణానంతరం ఉచిత ప్రసాదం, తలంబ్రాలు ఒకేచోట మాత్రమే పంపిణీ చేస్తుండటంతో ఏటా భక్తుల తోపులాట జరుగుతోంది. అలా కాకుండా స్వామివారి సర్క్యులర్ మండపంతో పాటు మరో రెండుచోట్ల పంపిణీ చేయడం మేలు.
- భక్తులు భారీగా వచ్చే అవకాశమున్నందున వారిని నియంత్రించేందుకు సుమారు 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలి.
- సత్యదేవుని దివ్యకల్యాణం జరిగే మే 8న ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి. చిన్న, ద్విచక్ర వాహనాలు మినహా మిగిలిన వాటిని సాధ్యమైనంత వరకూ కొండ దిగువనే నిలిపివేయాలి. భక్తులను కొండ మీదకు తరలించేందుకు సుమారు 20 బస్సులు వినియోగించాల్సిన అవసరం ఉంటుంది.
- పశ్చిమ, తూర్పు రాజగోపురాల పరిసరాల్లోని పార్కింగ్ స్థలాల వద్ద భక్తుల సౌకర్యార్థం ఎక్కువ సంఖ్యలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. సుమారు వంద మంది అదనపు సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.
- కల్యాణోత్సవాలు జరిగే ఏడు రోజులూ దేవస్థానానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలి.
- మే 13న సత్యదేవుని శ్రీపుష్పయాగం స్వామివారి నిత్య కల్యాణ మండపంలో నిర్వహిస్తారు. మహిళలకు రవికెల వస్త్రాలు పంపిణీ చేస్తున్న సమయంలో ఏటా గందరగోళం ఏర్పడుతోంది. దీని నివారణకు పక్కా చర్యలు చేపట్టాలి.



కల్యాణోత్సవం సందర్భంగా పశ్చిమ రాజగోపురానికి రంగులు అద్దుతున్న దృశ్యం

జలగండం తప్పినట్టే..

పంపా జలాశయం గత నెలలో డెడ్ స్టోరేజీకి చేరినప్పటికీ ఈ నెలలో కురిసిన వర్షాలతో నీటిమట్టం 82.5 అడుగులకు చేరింది. దీంతో, కల్యాణోత్సవాల వరకూ నీటి సమస్య దాదాపు పరిష్కారమైనట్టే. అయితే, ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. మే 12న స్వామివారి చక్రస్నానం పంపా జలాశయంలో నిర్వహించాలి. ఉత్సవాలకు ఇంకా రెండు వారాల సమయం ఉంది. ఈలోగా ఎండలు తీవ్రమైతే ఉన్న నీరు కొంత ఆవిరయ్యే అవకాశం ఉంటుంది. అందువలన గతంలో కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించిన విధంగా ఏలేరు నుంచి పంపాకు నీటిని తరలించడం మేలు.

మద్యం దుకాణాలు బంద్ చేయాలి

గతంలో అన్నవరం మెయిన్ రోడ్డులో పాత బస్టాండ్ సమీపాన ఒకే ఒక్క మద్యం దుకాణం ఉండేది. ఈ ఏడాది బస్ కాంప్లెక్స్ వెళ్లే దారిలో మరో మద్యం దుకాణం కూడా ఏర్పాటు చేశారు. ఈ దుకాణాల ముందు నుంచే రథోత్సవం జరుగుతుంది. అందువలన కల్యాణోత్సవాలు జరిగే ఏడు రోజులూ అన్నవరంలో పంపా సత్రం వద్ద ఉన్న మద్యం దుకాణాలను 48 గంటల ముందు నుంచే బంద్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలి.

రథోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

కల్యాణోత్సవాల సందర్భంగా మే 7 నుంచి 11వ తేదీ వరకూ సత్యదేవుని వివిధ వాహనాల్లో కొండ దిగువన ఊరేగిస్తారు. ఈ వాహనాల్లో రూ.1.08 కోట్లతో రూపొందించిన భారీ టేకు రథం చాలా పెద్దది. 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఈ రథంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తారు. దీనిని తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. రథాన్ని లాగేందుకు పోటీ పడే అవకాశం ఉంటుంది. ఆ రోజు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రమాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలి. రథం లాగేందుకు అనుభవం కలిగిన నిపుణులను నియమించాలి. గత ఏడాది రథోత్సవం నాడు అన్నవరంలో చాలాచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలా కాకుండా ఆ రోడ్డు వరకూ మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేసేలా, సాధ్యమైనంత త్వరగా రథోత్సవం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

393 మార్కులతో నిరాశ

ఆత్మహత్యకు పాల్పడిన టెన్త్ విద్యార్థి



శ్రీకాకుళం క్రైమ్ : 60 శాతానికి పైగా వచ్చిన మార్కులు ఆ విద్యార్థికి అవమానంగా తోచాయి. తోటి పిల్లలతో పోల్చి చూసుకునే తత్వం ప్రాణాల మీదకు తెచ్చింది. గౌరవప్రదమైన మార్కులే అయినా ×పోటీ∓ ప్రపంచానికి మార్కులు చెప్పలేక ఓ బాలుడు ఊపిరి వదిలేశాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ బిడ్డ బలవన్మరణానికి పాల్పడడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. బుధవారం ఉదయం జిల్లా కేంద్రంలోని బలగ హడ్కో కాలనీకి చెందిన పదోతరగతి విద్యార్థి గూరుగుబిల్లి వేణుగోపాలరావు(15) ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సంతోష్‌కుమార్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు..శ్రీకాకుళం జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలోని ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గూరుగుబిల్లి అమ్మినాయుడు తన భార్య, కుమార్తె, కుమారునితో కలసి బలగ హడ్కో కాలనీలో నివాసముంటున్నారు. కుమార్తె బీటెక్ ఇంజినీరింగ్ చదువుతుండగా కుమారుడైన వేణుగోపాలరావు పదో తరగతి చదువుతున్నాడు.

393 మార్కులే రావడంతో..

బుధవారం ఉదయం 11 గంటలకు పదో తరగతి ఫలితాలు విడుదల కావడంతో వేణుగోపాల్ ఇంటి వద్దనే తల్లి మొబైల్‌లో ఫలితం చూసుకున్నాడు. అప్పటి నుంచి మౌనంగానే వేరే గదిలోకి వెళ్లి తలుపు మూసుకున్నాడు. అప్పటికే తనయుని ప్రవర్తనపై తల్లికి అనుమానం వచ్చింది. తలుపు కొట్టినా ఎంతకీ తీయకపోవడంతో ఆందోళన చెందిన తల్లి బయటకు వెళ్లి వేరేవారి మొబైల్ తీసుకుని భర్తకు కాల్ చేసింది. విధుల్లో ఉన్న వేణుగోపాల్ తండ్రి హుటాహుటిన ఇంటికొచ్చి తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. ఫ్యానుకు చీరతో ఉరేసుకున్న కుమారున్ని చూసి హతాశులయ్యారు. కొన ఊపిరైనా ఉంటుందేమోనని అంబులెన్సును పిలిపించి రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ చేరేసరికే చనిపోయాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ కస్టడీకి గోరంట్ల మాధవ్

గుంటూరు లీగల్: ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై దాడి చేసిన కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నేత గోరంట్ల మాధవ్‌తో పాటు మరో ఆరుగురు నిందితులుకు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అఫ్ ఫస్ట్ క్లాస్ స్పెషల్ మొబైల్ కోర్టు ఏప్రిల్ 24 వరకు రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. దీంతో వీరిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే వీరిని గుంటూరు నగరంపాలెం పోలీసులు 5 రోజులు పోలీస్ కస్టడీకి అడగ్గా 2 రోజులు పాటు పోలీస్ కస్టడీ వేస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. వీరిని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కస్టడీకి విచారణ నిమిత్తం బుధవారం తీసుకువచ్చారు. వీరిని ఈ నెల 24, 25వ తేదీల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించనున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 61,828 మంది స్వామిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.61 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. మే 7 నుంచి 14 వరకు జరగనున్న చినవెంకన్న తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా 11న రాత్రి స్వామివారి కల్యాణం, 12న రాత్రి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని జరుగుతున్న ఏర్పాట్లలో భాగంగా ఆలయ పరిసరాలను, దర్శనం క్యూలైన్లను రంగులతో ముస్తాబు చేసేందుకు, అలాగే స్వామివారి పాదుకా మండప ప్రాంతంలో, ఆలయ ధ్వజస్తంభం వద్ద తాటాకు పందిళ్లు నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం గుడి సెంటర్‌లోని ప్రధాన కూడలిలో 40 అడుగుల శ్రీవారి భారీ విద్యుత్ కటౌట్‌ను నిర్మిస్తున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటంలో గొడ పాలెంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కోదండరామస్వామి విగ్రహంతోపాటు పలు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మంత్రి జోగి రమేష్, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ముందుగా గ్రామంలోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌడపాలెంలో శ్రీ కోదండరామస్వామి, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, మంగళగిరి నియోజకవర్గ మాజీ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానంద రెడ్డి పాల్గొన్నారు.

లాం ఫాంలో సలహా మండలి సమావేశం

గుంటూరు రూరల్: కృష్ణ మండలం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ శాఖలు సంయుక్త ఆధ్వర్యం వహించాయి. నగర శివారుల్లోని లాంఫాం నందున్న సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశానికి పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ రైతుల సలహాలు, సూచనలు దృష్టిలో ఉంచుకుని పరిశోధన ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు.

టెక్నాలజీతో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

తిరుపతి సిటీ: టెక్నాలజీని సంస్కృత శాస్త్రాల్లో విరివిగా వినియోగంచుకుని విద్యార్థులు జ్ఞానాన్ని పొందాలని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి సూచించారు. వర్సిటీలో జాతీయ సంస్కృత వర్సిటీ, సీడాక్ సంస్థ సంయుక్తంగా ఏఐ, ఎంఎల్, క్వాంటం కంప్యూటింగ్, ఐకేఎస్‌పై రెండు రోజులు నిర్వహించిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ సంస్కృతాన్ని ఆధునిక సమాజానికి అందించాలంటే టెక్నాలజీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణప్రపూర్ణ, విభాగాధిపతి ప్రొఫెసర్ గణపతి భట్, ప్రొఫెసర్ రమాశ్రీ, డాక్టర్ జానకి, ప్రొఫెసర్ చంద్రశేఖరం, శ్రీధర్, నాగలక్ష్మి, ప్రసన్న, సంకీర్తి పాల్గొన్నారు.

పరిశోధనలతోనే సమస్యలకు పరిష్కారం

తిరుపతి సిటీ: వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిశోధనలతోనే పరిష్కార మార్గం దొరకుతుందని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ అభిప్రాయపడ్డారు. ఎన్జీరంగా వర్సిటీ ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం పీజీ విద్యార్థులకు బ్రిడ్జింగ్ సైన్స్ సస్టయినబులిటీ అండ్ ఫుడ్ సెక్యూరిటీ అనే అంశంపై జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలకు దీటైన పరిశోధనలు జరగాలన్నారు. విద్యార్థులు జాతీయ సదుస్సుల్లో పాల్గొనడం ద్వారా వివిధ రాష్ట్రాల విద్యార్థుల మధ్య పరిశోధన అంశాలపై చర్చ, సమాచార మార్పిడి జరుగుతుందన్నారు.

శాంతి చర్చలపై షరతులు వద్దు

ఆయుధం పట్టినవారిని చంపాలని ఏ రాజ్యాంగంలో ఉంది?

- నెలరోజులపాటైనా ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించాలి
- మావోయిస్టు పార్టీలో వివిధ కమిటీలు ఒకచోట చేరి చర్చించాలి
- చావుకు తెగించి విప్లవంలోకి వచ్చాం.. లొంగిపోవడం మా విధానం కాదు
- మీడియా ఇంటర్వ్యూలో మావోయిస్టు పార్టీ ఉత్తర – పశ్చిమ సబ్ జోనల్ కార్యదర్శి రూపేశ్ స్పష్టీకరణ


బస్తర్‌లో ఓ యూట్యూబ్ చానల్ ప్రతినిధితో మాట్లాడుతున్న రూపేశ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఎలాంటి షరతులు విధించొద్దని మావోయిస్టు పార్టీ ఉత్తర – పశ్చిమ సబ్ జోనల్ కమిటీ కార్యదర్శి రూపేశ్ విజ్ఞప్తి చేశారు. శాంతి చర్చల అంశంపై మరింత వివరణ ఇచ్చేందుకు బస్తర్‌లోని గుర్తు తెలియని ప్రదేశం నుంచి ఓ యూట్యూబ్ చానల్‌కు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

చంపాలని ఏ రాజ్యాంగంలో ఉంది..?

రాజ్యాంగబద్ధంగా మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి వస్తే చర్చలకు సిద్ధమని ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి విజయ్‌శర్మ అంటున్నారు. మరి ఆయుధాలు పట్టుకున్న వారిని చంపేయాలని ఏ రాజ్యాంగంలో రాసి ఉంది.? ఏ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బూటకపు ఎన్‌కౌంటర్లలో మా వాళ్లని చంపేస్తున్నారు.? మేం ఎందుకు ఆయుధం పట్టుకున్నామో అందరికీ తెలుసు. అలా ఆయుధం పట్టుకున్న వారితో ఎలా వ్యవహరించాలనేది రాజ్యాంగంలో రాసి ఉంది కదా.. మరి దాన్ని ఎందుకు ప్రభుత్వం పాటించడం లేదు.? వాళ్లకు తెలిసే తప్పులు చేస్తున్నారు. కామ్రేడ్ రేణుక, నాకు మధ్య ఇటీవల శాంతి చర్చల ప్రక్రియ మీద చర్చ జరిగింది. ఆ మర్నాడే బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆమె చనిపోయింది. దీనిపై భద్రతా దళాలు సంబరాలు చేసుకున్నాయి. దీన్ని మేం ఎలా అర్థం చేసుకోవాలి?. కాబట్టి, షరతులు లేకుండా మమ్మల్ని చర్చలకు పిలవాలి. ఇరు వర్గాలు కూర్చుని మాట్లాడుకుని సమస్యలను పరిష్కరించుకునేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని కోరుతున్నాం. శాంతి చర్చలు జరగాలని ప్రభుత్వం అనుకుంటే జరుగుతాయి. వారు కాదనుకుంటే మేమేం చేయగలం. మేం శాంతి చర్చల ప్రతిపాదన తెచ్చాం. ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నాం.

సీజ్ ఫైర్ కావాలి..

శాంతి చర్చలపై ముందుగా అభయ్ నుంచి లేఖ వచ్చింది. తర్వాత నేను లేఖలు ఇచ్చాను. మా పార్టీకి సంబంధించిన వేర్వేరు కమిటీలు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. శాంతి చర్చల అంశంపై మా కమిటీలన్నీ కూర్చుని విధి విధానాలపై మాట్లాడుకుని ప్రభుత్వం దగ్గరకు వెళ్లాలని అనుకుంటున్నాం. కానీ నిర్బంధం కారణంగా ఇది సాధ్యం కావడం లేదు. ఆరంభంలో ఆరు నెలలు సీజ్ ఫైర్ అడిగాం. ఇప్పుడు నెల రోజులు చాలంటున్నాం. క్యాంపులు ఎత్తి వేయనక్కర్లేదని చెబుతున్నాం. శాంతి చర్చలకు ముందు సీజ్ ఫైర్ అమలు చేయడం ఎక్కడైనా ఆనవాయితీనే. ఇజ్రాయెల్ – గాజా పోరాటంలోనూ ఇదే జరిగింది. అడవిలో అభివృద్ధి పనులు జరిగే చోట, రోడ్ ఓపెనింగ్ పార్టీలు వెళ్లే చోట బాంబులు పెట్టొద్దని ఇప్పటికే నా వరకు నేను ఆదేశాలు ఇచ్చాను. వ్యూహాత్మక ప్రాంతాల్లో రక్షణ చర్యలు తప్పవు.

చావుకు తెగించే వచ్చాం

లొంగిపోయే మావోయిస్టులకు మంచి ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం అంటోంది. అనారోగ్య సమస్యలు ఉన్నవారు, విప్లవంపై నమ్మకం సడలిన వాళ్లు, భయపడ్డవారు, స్వార్థపరులు లొంగిపోతారు. కానీ ప్రాణాలకు తెగించి విప్లవ పోరాటంలోకి వచ్చిన వాళ్లు లొంగిపోరు. కడదాక పోరాడతారు. ఇటీవల ఎదురుకాల్పుల్లో చనిపోయిన ప్రతీ మావోయిస్టు దగ్గర ఆధునిక ఆయుధాలు కనిపిస్తున్నాయి. అవన్నీ మావి కావు.

డీఆర్‌జీతో నష్టాలు

ప్రభుత్వం నెలకొల్పిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్‌తోనే మాకు ఎక్కువ నష్టం జరిగిందంటున్నారు. కానీ డీఆర్‌జీలో పనిచేసే వాళ్లు ముందుగా మా దగ్గరే శిక్షణ తీసుకుని వెళ్లారనే విషయం మరువొద్దు. పార్టీ నియమ నిబంధనలు పాటించని వారు, నైతిక ప్రవర్తన సరిగా లేని వారు, తోటి మహిళా కామ్రేడ్లపై అనుచితంగా ప్రవర్తించిన వారిపై పార్టీ చర్యలు తీసుకుంది. ఇలాంటి వాళ్లే వెళ్లి ప్రభుత్వం నెలకొల్పిన డీఆర్‌జీలో చేరుతున్నారు.

మార్క్సిజానికి అంతం లేదు

పార్టీకి వరుసగా నష్టాలు జరుగుతున్నాయి. ఇప్పుడు కష్టాల్లో ఉన్నాం. ప్రజల్లో మాకు మద్దతు తగ్గిందనే వాదనలు వినిపిస్తున్నాయి. తీవ్రస్థాయిలో ప్రభుత్వం నుంచి నిర్బంధం ఉన్నప్పుడు.. సామాన్య ప్రజానీకం కొంత వెనకడుగు వేయడం సహజం. ఇంత నిర్బంధంలోనూ మాకు అన్నం పెడుతున్నారు. మా కామ్రేడ్లు చనిపోతే కన్నీరు పెడుతున్నారనే విషయం గమనించాలి. దళాలు, కమిటీలు ఏర్పాటు చేయండంటూ మాకు విజ్ఞప్తులు వస్తూనే ఉన్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పినట్టు 2026 మార్చి నాటికి నక్సలైట్లు దేశంలో అంతం కారు. మార్క్సిజం మరో రూపంలో తన పోరాటం కొనసాగిస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆయుధాలు పట్టుకోవలసి వస్తుంది.

శాంతి చర్చలకు హిడ్మా సిద్ధమా?

నేను కలిసిన వివిధ కమిటీల కామ్రేడ్లు శాంతి చర్చలకు సుముఖంగానే ఉన్నారు. దీనిపై హిడ్మా అభిప్రాయం ఏమిటనేది తెలియదు. ఎందుకంటే నేను ఆయనను కలవలేదు. కానీ పార్టీ ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత.. ఎవరైనా దానికి కట్టుబడి ఉండాల్సిందే. శాంతి చర్చల ప్రస్తావన వచ్చిన తర్వాత మా దగ్గర ఐదుగురిని చంపారు. ఇవే పరిస్థితులు కొనసాగితే మా నుంచి ప్రతిస్పందన తప్పదు.

అడవుల్లోకి వచ్చి చూడండి

మావోయిస్టులకు వ్యతిరేకంగా టీవీ స్టూడియోల్లో కూర్చుని మాట్లాడేవారికి ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాం. మీరు కానీ.. మీ పిల్లలు కానీ ఒక రెండు రోజులు అడవుల్లోకి రండి. ఇక్కడి గుట్టలు ఎక్కండి. పరిస్థితులు చూడండి. అప్పుడు మేం ఏం చేశామో తెలుస్తుంది.

ఆ దాడిలో పొరపాటు జరిగింది

సుక్మా జిల్లా జీరామ్‌ఘాటీ దగ్గర 2013లో చేసిన దాడిలో మహేంద్రకర్మను లక్ష్యంగా చేసుకున్నాం. అయితే పొరపాటున కాంగ్రెస్ నేత నందకుమార్ పటేల్‌తో పాటు ఇతరులు కూడా ఆ దాడిలో మరణించారు. మావోయిస్టు వ్యతిరేక విధానాలు అవలంబించడంలో కాంగ్రెస్, బీజేపీలది ఒకే బాట.



అడవులు ఆహుతి

- ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 11,09,588 ప్రమాదాలు
- 2021–22లో అత్యధికంగా 3,45,989గా నమోదు
- మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో అధికం
- ఏడో స్థానంలో తెలంగాణ
- టాప్ టెన్ జిల్లాల్లో ములుగు, భద్రాద్రి
- ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, వరంగల్: అడవులు అంటుకుంటున్నాయి. అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగా చెట్లు, వృక్షాలు కాలిపోతున్నాయి. 2019 నుంచి 2024 నవంబర్ వరకు అయిదేళ్లలో దేశవ్యాప్తంగా అడవుల్లో 11,09,588 అగ్నిప్రమాదాలు సంభవించాయి. అత్యధికంగా 2020–21లో 3,45,989 ప్రమాదాలకు అడవులు ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవించిన రాష్ట్రాల జాబితాలో మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలు ఉండగా.. తెలంగాణ ఏడో స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా అడవులు అంటుకున్న టాప్ టెన్ జిల్లాల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఉన్నాయి. అయితే దేశంలో అటవీ అగ్ని ప్రమాదాలను మోడరేట్ రిజల్యూషన్ ఇమేజింగ్ స్పెక్ట్రో–రేడియోమీటర్ (ఎంవోడీఐఎస్), పోలార్–ఆర్బిటింగ్ పార్టనర్‌షిప్ విజిబుల్ ఇన్‌ఫ్రారెడ్ ఇమేజింగ్ రేడియోమీటర్ సూట్ (ఎస్ఎన్‌పీపీ, ఐఐఆర్ఎస్) ఉపగ్రహ–మౌంటెడ్ సెన్సార్లను ఉపయోగించి గుర్తించినట్లు ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) తన నివేదికలో ప్రకటించింది.

ఏటా అంటుకుంటున్న అడవులు

మానవ తప్పిదాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల దేశవ్యాప్తంగా ఏటా అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయి. 2019–20లో జూన్ నుంచి నవంబర్ వరకు 1,23,473 ప్రమాదాలు జరగ్గా, 2020–21 నాటికి 3,45,989కు పెరిగాయి. 2021–22లో 2,23,333, 2022–23లో 2,12,249లు కాగా, 2023–24 నవంబర్ నాటికి 2,03,544లుగా నమోదయ్యాయి. 2019–20లో దేశవ్యాప్తంగా మహారాష్ట్రలో అత్యధికంగా 14,108 అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగ్గా, 2020–21 నాటికి 34,025కు పెరిగాయి. 2021–22లో 22,052, 2022–23లో 16,119, 2023–24లో 16,008లకు తగ్గాయి. ఒడిశాలో 2019–20లో 10,062గా ఉన్నా.. 2020–21 వచ్చేసరికి 51,968లతో మొదటి స్థానంలోకి చేరింది. ఆ తర్వాత స్థానంలో మధ్యప్రదేశ్ (2020–21లో) 47,795లు, ఛత్తీస్‌గఢ్‌లో 38,106 అగ్ని ప్రమాదాలు అడవుల్లో జరిగాయి. తెలంగాణ విషయానికి వస్తే 2019–20లో 12,312లు కాగా, 2020–21లో 18,237, 2021–22లో 13,737, 2022–23లో 13,117, 2023–24లో 13,479లతో దేశంలో ఏడో స్థానంలో ఉంది. ఉత్తరాఖండ్‌లో మొదటి సంవత్సరంలో 759గా ఉన్న ప్రమాదాల సంఖ్య 2023–24 నాటికి 21,033కు చేరింది. ఇలా పలు రాష్ట్రాల్లో అడవులు అంటుకున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అడవుల్లో అగ్నిప్రమాదాలు.. అందరికీ చేటే..

అడవులు అంటుకోవడం అనేది ఒక పెద్ద సమస్యగా మారింది.. ఇది చాలా కారణాల వల్ల జరుగుతుంది. ఉదాహరణకు అడవి కబ్జా ప్రయత్నాలతోపాటు సాధారణంగా చేసే పనుల వల్ల కూడా అడవి అంటుకుంటే.. అది పర్యావరణానికి, స్థానిక ప్రజలకు చాలా నష్టం కలిగిస్తుంది. అడవిలో అగ్నిప్రమాదాలు తరచూ జరుగుతాయి. ఇవి సహజంగా లేదా మానవుల నిర్లక్ష్యం వల్ల జరగవచ్చు. ఉదాహరణకు, ఎండిన ఆకులు, గడ్డిపై నిప్పు పడడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి.. లేదా కొంతమంది ఆకతాయి యువకులు అడవిలో మద్యం తాగి, సిగరెట్ పడేయడం వల్ల కూడా జరుగుతాయి. కొందరు అడవిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ, అడవిని తగలబెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో అటవీ అధికారులు.. అప్రమత్తంగా లేకపోతే అడవులు అంటుకునే ప్రమాదం పెరుగుతుంది.

– కె.పురుషోత్తం, అధ్యక్షుడు, అటవీ, పర్యావరణ పరిరక్షణ కమిటీ


ములుగు జిల్లా పాలాయిగూడెం చుంచుపల్లి మధ్య గడీల గుట్టపై ఆహుతవుతున్న అడవి

గత ఐదు అటవీ అగ్ని సీజన్లలో (2019 నుంచి 2024 వరకు..) ప్రమాదాలు.. (ఎఫ్ఎస్ఐ డేటా ప్రకారం..)

రాష్ట్రం / యూటీ	2019-20	20-21	21-22	22-23	23-2024
ఆంధ్రప్రదేశ్	9,996	19,328	14,138	19,367	18,174
అరుణాచల్‌ప్రదేశ్	1,786	3,914	3,449	2,447	2,053
అస్సాం	8,924	10,718	8,158	9,830	7,639
బిహార్	914	5,179	3,024	3,793	2,763
ఛత్తీస్‌గఢ్	6,360	38,106	25,792	20,306	18,950
ఢిల్లీ	21	14	03	07	16
గోవా	47	45	20	147	36
గుజరాత్	2,770	3,803	2,769	2,342	3,182
హరియాణా	68	152	135	82	166
హిమాచల్‌ప్రదేశ్	536	4110	5280	704	10,136
జార్ఖండ్	2,613	21,713	9,419	11,923	7,525
కర్ణాటక	4,232	5,784	4,973	13,074	5,500
కేరళ	864	296	504	1,550	1,110
మధ్యప్రదేశ్	9,537	47,795	32,728	17,142	15,878
మహారాష్ట్ర	14,018	34,025	22,052	16,119	16,008
మణిపూర్	8,800	10,457	5,544	10,127	4,498
మేఘాలయ	6,762	7,658	6,322	6,604	4,319
మిజోరాం	7,361	12,846	8,734	5,798	6,627
నాగాలాండ్	2,905	4,975	3,471	3,882	2,609
ఒడిశా	10,602	51,968	22,014	33,461	20,973
పంజాబ్	153	635	428	119	605
రాజస్తాన్	3,461	3,402	2,703	2,059	4,352
సిక్కిం	47	63	26	49	101
తమిళనాడు	1,368	1,220	1,035	1,998	3,380
తెలంగాణ	12,132	18,237	13,737	13,117	13,479
త్రిపుర	4,369	5,015	2,609	4,332	2,089
ఉత్తర్‌ప్రదేశ్	1,548	8,608	5,428	3,235	4,424
ఉత్తరాఖండ్	759	21,487	12,985	5,351	21,033
పశ్చిమ బెంగాల్	1,320	3,287	1,520	3,096	2,020
అండమాన్ అండ్ నికోబార్	39	16	33	20	21
చండీగఢ్	02	00	00	01	01
దాదర్, నాగర్ హవేలీ డామన్, డయ్యూ	21	34	18	16	16
జమ్మూ, కశ్మీర్	438	1,098	4,282	131	3,829
లద్దాఖ్				20	32
లక్షద్వీప్	00	00	00	00	00
పుదుచ్చేరి	00	01	00	00	00


ములుగు జిల్లా మంగపేట మండలం చుంచుపల్లి సమీపంలోని తోగు ప్రాంతంలో దగ్ధమవుతున్న అడవి

గద్వాలకు.. ప్రత్యేక సం‘స్థానం’

- ఎల్లలు దాటిన నలసోమనాద్రి సంస్థాన కీర్తి
- నేటికీ చెక్కుచెదరని అలనాటి ఆనవాళ్లు


గద్వాల కోట ముఖద్వారం


గద్వాల: అది క్రీస్తుశకం 16వ శతాబ్దం. అనగనగా ఒక రాజు.. ఒక రోజు వేటకు బయల్దేరాడు. ఇంతలో రాజు వెంట వచ్చిన కుక్కల్ని కుందేళ్లు తరిమికొట్టాయి. ఆ నేల విశిష్టతకు అబ్బురపడిన ఆ రాజు అక్కడే రాజ్యం స్థాపించాడు. అదే గద్వాల సంస్థానం.. ఆ రాజు పేరు నలసోమనాద్రి (పెద సోమభూపాలుడు). ప్రస్తుతం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సోమనాద్రి కాలనీలో కోట (ప్రస్తుత ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం) నిర్మించుకున్నారు. పూడూరు రాజధానిగా గద్వాల సంస్థానాన్ని అలంపూరు, కర్నూలు, కర్ణాటక వరకు రాజ్యాన్ని విస్తరించారు. 1663లో రాజ్యస్థాపన జరిగితే.. 1948 అంటే భారతదేశంలో విలీనమయ్యే వరకు గద్వాల సంస్థానం కొనసాగింది. గద్వాల సంస్థానాన్ని చివరగా ఆదిలక్ష్మీ దేవమ్మ మహారాణి పాలించారు.

1663-1948 వరకు గద్వాల సంస్థాన పాలకులు వీరే..

రాజు	పాలించిన కాలం
నలసోమనాద్రి	1663-1712
కల్ల వెంకటన్న	1712-1716
రమణయ్య	1716-1723
తిమ్మక్క	1723-1725
లింగమ్మ	1725-1740
తిరుమలరావు	1740-1742
మంగమ్మ	1742-1745
చొక్కమ్మ	1745-1747
రామరాయలు	1747-1761
చిన సోమభూపాలుడు	1761-1794
రామభూపాల్	1794-1807
సీతారామ భూపాల్	1807-1840
వేంకట లక్ష్మమ్మ	1840-1840 (4 నెలలు)
సోమభూపాల్	1840-1844
వేంకటలక్ష్మమ్మ	1844-1845
రామభూపాల్	1845-1901
సీతారామ భూపాల్	1901-1924
ఆదిలక్ష్మీ దేవమ్మ	1924-1948

ఎల్లలు దాటిన రాజ్య విస్తరణ..

గద్వాల సంస్థానాన్ని నలసోమనాద్రి (పెద సోమభూపాలుడు) 1663లో స్థాపించారు. ఆయన 1712 వరకు పాలన కొనసాగించారు. నలసోమనాద్రి పాలనలో గద్వాల సంస్థానం ఎల్లలు దాటి విస్తరించింది. గద్వాల, అలంపూర్ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా, కర్ణాటక రాష్ట్రంలో కూడా సోమనాద్రి పాలన కొనసాగింది. గద్వాలలో సోమనాద్రి పాలనలోని కోటగోడలు, పురాతన కట్టడాల ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. పూడూరు, అయిజ, రాజోళి, ప్రాగటూరు, అలంపూరు, కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటకలోని రాయచూరు, సిరిగుప్ప ప్రాంతాల్లో నేటికీ సోమనాద్రి పాలన ఆనవాళ్లు సజీవంగా కనిపిస్తాయి. గద్వాల కోటలో నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయం, రాజుల నివాసాలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు.



అధికారంలో ఉన్న భూ భాగాలు ఇవే..

- నడిగడ్డ ప్రాంతంలో.. గద్వాల, పూడూరు, ధరూరు, అయిజ, రాజోళి, బోరవెల్లి, ప్రాగటూరు, అలంపూరు.
- కర్నూలు ప్రాంతంలో.. కందనోలు, బండి ఆత్మకూరు, నంద్యాల, వెలుగోడు, శ్రీశైలం, చాగలమర్రి, అహోబిలం, సిరివెళ్ల, బనగానెపల్లె, బేతంచర్ల, డోన్, ఆదోని.
- కర్ణాటక ప్రాంతంలో.. మానవ (ప్రస్తుతం మాన్వి), రాయచూరు, సిరిగుప్ప ప్రాంతాలు నలసోమనాద్రి పాలనలో గద్వాల సంస్థానం కింద పరిపాలన కొనసాగించాయి.

సాహిత్య పోషకులు..

గద్వాల సంస్థానాధీశులు సాహిత్య పోషకులుగా పేరుగాంచారు. వీరి హయాంలో పండితులు స్వర్ణయుగం చూశారనే చెప్పవచ్చు. అందుకే గద్వాలకు విద్వత్ గద్వాల అని పేరు వచ్చినట్లు చరిత్రకారులు నేటికీ చెబుతారు.


గద్వాల కోటలోని ఆలయం

పహల్గాం మృతులకు బీసీ కమిషన్ నివాళి

సాక్షి, హైదరాబాద్: పహల్గాంలో తీవ్రవాదుల దాడిలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర బీసీ కమిషన్ సంతాపం తెలిపింది. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్ తదితరులు మృతులకు నివాళులు అర్పించారు. బీసీ కమిషన్ కార్యాలయంలో కొవ్వొత్తులు వెలిగించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి, సుమారు 28 మంది పర్యాటకులను అమానుషంగా హత్య చేయడాన్ని తెలంగాణ బీసీ కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ అమానుష నరమేధాన్ని అడ్డుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కమిషన్ కోరింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి ప్రసాదించాలని భగవంతుణ్ని కోరుతూ ఇంతటి తీవ్రమైన నష్టాన్ని తట్టుకునే శక్తిని ఆయా కుటుంబాలకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించింది.

ఉగ్ర మూకల మూలాలను దెబ్బతీయాలి

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం

సాక్షి, హైదరాబాద్: శాంతియుత సహజీవనానికి ఇబ్బందులు కలిగించే ఉగ్రమూకల మూలాలను పూర్తిగా దెబ్బతీయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) కోరింది. కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడి, నరమేధాన్ని తీవ్రంగా ఖండించింది. దాడిలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస్, ఏనుగు సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి క్రూర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ఇది మానవత్వంపై జరిగిన దాడి అని అభివర్ణించారు. విచక్షణ, వివేకం లేని ఉగ్రమూకలను కఠినంగా కట్టడి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సన్నిధి



● మాసం విశిష్టత

పర్వదినాల మాసం
వైశాఖం

(28, సోమవారం నుంచి మే 27, మంగళవారం వరకు వైశాఖమాసం

సంవత్సరంలోని అన్ని మాసాలూ విశిష్టమైనవే అని చాటి చెప్పే గొప్ప సంస్కృతి మనది. శ్రీమన్నారాయణునికి అత్యంత ప్రీతికరమైన వైశాఖమాసంలో స్నానానికి, దానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ వైశాఖమాసంలో ప్రతిరోజూ పుణ్యతీర్థాల్లో స్నానం చేయటం విశేష ఫలితాన్నిస్తుందని పద్మ పురాణం చెబుతోంది.



నెలంతా స్నానం చేయలేనివారు కనీసం శుక్లపక్ష త్రయోదశి, చతుర్దశి, పూర్ణిమ తిథుల్లో స్నానం చేసినా సకల పాపాల్ని నివృత్తి అవుతాయి. స్నానం తర్వాత త్రికరణశుద్ధిగా విష్ణుపూజ చేయాలి.

అట్లాగే యథాశక్తి ఏకభుక్తం, నక్తం ఆచరించేవారికి కోరిన కోరికలన్నీ సిద్ధిస్తాయని వైశాఖ పురాణం చెబుతోంది.

పాలిచ్చే ఆవును, పాదుకలు, చెప్పులు, గొడుగు, విసనకర్ర, అన్ని సౌకర్యాలతో కూడిన శయ్య, దీపం, అద్దం- ఇవన్నీ గురువుకి దానంగా ఇవ్వాలి. అశక్తులైన వారు చలివేంద్రాలు నిర్వహించటం, పరమశివునికి నిరంతరాయంగా అభిషేకం జరిగే ఏర్పాట్లు చేయడం, పితృదేవతల తృప్తి కోసం చెప్పులు, గొడుగు, పల్చని వస్త్రాలు, చందనం, పూలు, పండ్లు, ఇంకా నీటితో నింపిన కుండని దానం చేయటం అన్ని విధాలా మేలుని కలిగిస్తుంది.

ఈ మాసం ఈ పర్వదినాలు...

అక్షయతృతీయ...

వైశాఖ శుద్ధ తృతీయను అక్షయ తృతీయ అంటారు. ఈరోజున చేసే పూజలు, హోమం, దానం, పితృ తర్పణం అక్షయమైన పుణ్యఫలాన్ని ఇస్తాయి కాబట్టే దీనికా పేరొచ్చింది. ఈ పర్వదినాన నీటితో నింపిన కుండ, గోధుమలు, శనగలు ధాన్యాలు, పెరుగన్నం దానం చేయటం వల్ల శాశ్వతంగా శివ సాయుజ్యాన్ని పొందవచ్చని పురాణోక్తి. అదేవిధంగా గొడుగు, పాదరక్షలు, గోవు, భూమి, బంగారం, వస్త్రాలను దానం చేయటం ఎంతో పుణ్యప్రదం.

పరశురామ జయంతి...

శ్రీమహావిష్ణువు పరశురామునిగా అవతరించిన వైశాఖ శుద్ధ తదియ పరశురామ జయంతిగా చెప్పబడుతోంది. వైశాఖ శుక్ల తృతీయ నాడు పునర్వసు నక్షత్రంలో రాత్రి సమయంలో సాక్షాత్తూ ఆ హరియే పరశురాముడిగా రేణుకా గర్భం నుండి స్వయంగా అవతరించాడు. అంతటి మహా తపశ్శాలి జయంతిని మనం యుగయుగాలుగా జరుపుకుంటున్నాం.

ఈరోజు ఉపవాసం చేసి ప్రదోషకాలంలో పరశురాముని షోడశోపచారాలతో పూజించిన వారికి శత్రు పీడ ఉండదని వ్రత గ్రంథాలు చెబుతున్నాయి.

గంగోత్పత్తి...

గంగోత్పత్తి అంటే గంగాదేవి ఆవిర్భవించటం లేదా అవతరించటం. వైశాఖ శుక్ల సప్తమిన గంగోత్పత్తి అని పృథ్వీచంద్రోదయ గ్రంథం చెబుతోంది. వైశాఖ శుక్ల సప్తమిన జహ్ను మహర్షి కోపంతో గంగను తాగాడు. తన కోపం చల్లారాక మళ్ళీ కుడిచెవి నుండి వదిలిపెట్టాడు. ఈ కారణంగా ఈ రోజున గంగానదిలో స్నానం చేయటం చెప్పలేనంత ఫలితాన్ని ఇస్తుంది. కనీసం గంగాదేవిని స్మరిస్తూ పుణ్య నదుల్లో పవిత్ర స్నానం చేస్తే కూడా మంచి ఫలితాన్ని పొందవచ్చు. అదీ వీలు కానప్పుడు చెరువు వద్ద లేదా కాలువ వద్ద గంగను ధ్యానిస్తూ స్నానాలాచరించవచ్చు.

హనుమజ్జయంతి...

శ్రీరామ భక్తాగ్రేసరుడైన హనుమంతుడు - చైత్ర పౌర్ణమినాడు జన్మించినట్లు పలు గ్రంథాలు చెబుతున్నాయి. కాగా పరాశర సంహిత వైశాఖ బహుళ దశమిని ఆంజనేయుడి జన్మదినంగా పేర్కొంటోంది. అందుకే దక్షిణ భారతదేశంలో వైశాఖ బహుళ దశమినాడు హనుమజ్జయంతి జరుపుకుంటూ ఉండగా, ఉత్తర భారతదేశంలో చైత్ర పౌర్ణమిని హనుమజ్జయంతిగా భావించి వేడుకలు జరుపుతారు. ఈరోజున ఆంజనేయస్వామిని పూజించటం వలన గ్రహ దోషాలు నివారించబడతాయి. ఇంకా భూత, ప్రేత, పిశాచాల పీడలు తొలగి, గాలి చేష్టలు వంటి మానసిక రుగ్మతలు కూడా తొలగిపోతాయి. హనుమజ్జయంతినాడు సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణ చేయడం మంచిది. ఈ రోజు శ్రీ సీతారామచంద్రులను పూజించడం వల్ల హనుమంతుని అనుగ్రహాన్ని శీఘ్రంగా పొందవచ్చు.

వైశాఖ పూర్ణిమ- బుద్ధ పూర్ణిమ...

లోకంలోని ప్రజల దుఃఖ నివారణకోసం, శాంతిని నెలకొల్పటం కోసం గౌతముడు శుద్ధోదన చక్రవర్తికి, మహామాయకు జన్మించిన వైశాఖ శుద్ధ పూర్ణిమకే బుద్ధజయంతి అని పేరు. గౌతముడు బుద్ధుడిగా పరివర్తన చెందిన ఈ రోజుకే బుద్ధపూర్ణిమ అని కూడా పేరు.





వైశాఖ శుద్ధ దశమి - శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి...

తెలుగు రాష్ట్రాల్లోని హిందువులకు మరీ ముఖ్యంగా ఆర్యవైశ్యులకు వారి కులదైవం అయిన వాసవీ మాత ఎంతో ముఖ్యం. అలాంటి వాసవి జయంతి వైశాఖ శుద్ధదశమి నాడు, సాక్షాత్తు ఆ పరమేశ్వరి అవతారమైన వాసవీదేవి సుమారు వెయ్యేండ్ల క్రితం పెనుగొండలో 'కుసుమ శ్రేష్టి', కుసుమాంబ పుణ్యదంపతులకు వైశాఖ శుద్ధ దశమి, శుక్రవారం నాడు జన్మించింది.

వైశాఖ శుద్ధ ఏకాదశి - మోహినీ ఏకాదశి...

ఈ మాసంలో వచ్చే ఏకాదశినే మోహిని ఏకాదశి అని అంటారు. ఈ రోజు ఏకాదశి వ్రతం ఆచరించినవారికి మహావిష్ణువు అక్షయంగా సంపదలు ఇస్తాడని, వారు ఇహలోక ఆనందాన్ని అనుభవించిన పిమ్మట వారికి విష్ణు లోక ప్రవేశం కలుగుతుందని పురాణ వచనం.

వైశాఖ పూర్ణిమ - మహావైశాఖి...

వైశాఖ పూర్ణిమకి మహావైశాఖి అని పేరు. దశావతారాల్లో ద్వితీయ అవతారమైన కూర్మ రూపాన్ని శ్రీమహావిష్ణువు ఈనాడే ధరించాడు. ఈ వేళ శ్రీకూర్మరూపంలో ఉన్న శ్రీ మహావిష్ణువును పూజించడం సత్ఫలితాలనిస్తుంది.



వైశాఖ శుద్ధ పూర్ణిమ అన్నమయ్య జయంతి...

తెలుగులో తొలి వాగ్గేయకారుడు, సంకీర్తనాచార్యుడు, కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి 32 వేల కవితలతో సంకీర్తనలు సమర్పించిన పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుడు సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు నందక ఖడ్గం అంశగా నారాయణ సూరి, లక్కమాంబ దంపతులకు జన్మించిన పర్వదినం వైశాఖ శుద్ధ పౌర్ణమినాడు తిరుమల తిరుపతి దేవస్థానంలో పెద్ద ఎత్తున అన్నమయ్య జయంతి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుతారు.

నృసింహ జయంతి...

వైశాఖ శుద్ధ చతుర్దశినాటి సాయంకాలం నరసింహమూర్తి హిరణ్యకశిపుని వధించేందుకు ఆవిర్భవించాడని పురాణాలు చెబుతున్నాయి. నృసింహ జయంతినాడు బ్రహ్మ ముహూర్తంలో లేచి స్నానం చేసి స్వామికి షోడశోపచార పూజ జరిపి, శ్రీ నృసింహస్తోత్రం-శ్రీ నృసింహ సహస్ర నామ జపం చేసి పానకం-వడపప్పు, చక్ర పొంగలి-దద్ధ్యోదనం నివేదిస్తే స్వామి వారి అనుగ్రహంతో సర్వసంపదలు లభిస్తాయని ప్రతీతి.



శంకర జయంతి...

రామానుజ జయంతి...

వైశాఖ శుద్ధ పంచమి జగద్గురు ఆదిశంకరాచార్యులు వారు, రామానుజాచార్యుల వారు జన్మించిన అత్యంత విశిష్టమైన తిథి. ఈ రోజున వైష్ణవులు తప్పనిసరిగా రామానుజుల జయంతిని వైభవంగా జరుపుకుంటే, వైదిక మతానుసారులు శంకర జయంతిని చాలా నిష్ఠగా జరుపుకుంటారు.



వైశాఖ బహుళ విదియ- నారద జయంతి...

బ్రహ్మ మానస పుత్రుడు, పరమ భాగవతోత్తముడు, సకల శాస్త్ర పారంగతుడు, సంగీత కోవిదుడు, అనుక్షణం నారాయణ నామస్మరణతో ఆనంద పారవశ్యుడయ్యే నారదుడు పుట్టిన ఈ పర్వదినాన ఆయన పేరు మీదుగా పాత్రికేయులకు పురస్కారాలు ప్రదానం చేయడం ప్రతీతి. నారాయణ లోక కల్యాణం కోసం కలహ భోజనుడిగా పేరు తెచ్చుకున్న నారద మహర్షిని స్మరించుకోవడం చాలా మంచిది.

వైశాఖ బహుళ ఏకాదశి- నిర్జల ఏకాదశి...

ఈరోజు చుక్క నీటిని కూడా తాగకుండా ఉపవసించిన వారి పట్ల ప్రసన్నుడై శ్రీ మహావిష్ణువు సకల సంపదలు కలిగించి, అంతిమాన మోక్షం ప్రసాదిస్తాడని ప్రతీతి.

వైశాఖ శుద్ధ దశమి- అన్నవరం సత్యదేవుని కల్యాణ మహోత్సవం...

తిరుమల తరువాత అంతటి మహిమాన్వితమైన పుణ్యక్షేత్రం, కోరిన వరాలిచ్చే సత్యదేవుడు కొలువైన దివ్య క్షేత్రం అన్నవరం. శ్రీ అనంతలక్ష్మీ రమాదేవి అమ్మవార్లతో కలిసి రత్నగిరిపై (అన్నవరం కొండ)పై శ్రీ శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి కొలువైన ఈ పుణ్య స్థలంలో వెశాఖ శుద్ధ దశమినాడు సీతారాములే పెళ్లిపెద్దలుగా సత్యదేవుని వివాహం కన్నుల పండువగా జరుగుతుంది.

– డి.వి.ఆర్



● సువార్త

పాపుల రక్షకుడు



వ్యభిచారం, నరహత్య తదితరాలతో కూడిన అపరాధాలే పాపం, అపరాధములని బైబిల్ బోధిస్తోంది (యోహాను 3:1). ఇట్టి పాప బంధకాల నుంచి విడుదల/విమోచన ఎవరి ద్వారా అన్న విషయంలో – మీ అపరాధముల చేత, పాపము చేతను చచ్చినవారై యుండగా దేవుడు మనలను బతికించెనని/విమోచించెనన్నది బైబిల్ స్పష్టీకరించింది. (ఎఫిసీ 2:1). మరి పాపము/అపరాధములు చేయని నరులు ఎవరైనా వున్నారా? అనే సందేహానికి–అందరూ పాపం చేస్తున్నారని, దేవుని మహిమను పొందలేక పోతున్నారని (రోమా 3:22) బోధిస్తోంది. అందుచేత పాపునకు వచ్చు ఫలము, శిక్ష మరణం (రోమా 3:23). మన అపరాధాలను క్షమించటానికి దేవుడు సిద్ధంగా వున్నాడు కానీ అవే దేవునికి మనకు అడ్డుగా వుండి, సైతానుకు బానిసలగుచున్నాము (యోహాను 8:34). అయితే ఎంత పాపినైనా యేసు చేర్చుకొనును.

ఒకరోజు నాతానే ప్రవక్త మహారాజైన దావీదును దర్శించాడు. భావగర్భితమైన ఉపమానం చెప్పాడు ఉదాహరణగా. ఒక పట్టణంలో ఒక ధనవంతుడు ఒక దరిద్రుడున్నారని, ధనవంతునికి గొర్రెలు, ఎద్దులు కలిగిన మహా సంపన్నుడని, దరిద్రుడికి ఒకే ఒక గొర్రెపిల్ల కలిగి తన బిడ్డలతో పాటు, పాత్రలోనివి త్రాగుతూ నిద్రలో కౌగిలిలో పడుకొని జీవించుచుండగా, వేరొక అతడు సంపన్నుడే ఆ మహా ధనవంతుని యింటికి అతిథిగా రాగా, ఈ ధనవంతునకు కలిగిన గొట్టెలను కాకుండా పేదవాని కౌగిలిలో పెట్టుకొని తన బిడ్డలతోపాటు బిడ్డగా చూస్తున్న ఒకే ఒక గొర్రెపిల్లను వధించి భోజనము సిద్ధపరచెననగా, అప్పుడు దావీదు మహారాజు ఎవరీ ఘోరపాపి అట్టివాడు మరణపాత్రుడు అనెను. అప్పుడు నాతాను ప్రవక్త రాజును చూసి 'నీవే ఆ పాపాత్ముడవు. ఇశ్రాయేలు దేవుడు నిన్ను దీవించి రాజుగా పట్టాభిషేకం చేసి రాజుగా చేయగా ఊరియా అను పేరుగల సైనికుని భార్యతో శయనించావని, యుద్ధ రంగంలో వున్న ఆమె భర్త అయిన ఊరియాను చంపించావని చెప్పి, అందుచేత రాజు నీ యింటివారి వల్లే నీకు అపాయం కలుగుతుందని, కానీ ఆమె వల్ల కలుగబోవు బిడ్డ చనిపోవునని శపించి వెళ్ళిపోయెను (సాము 12:1–15).

మహారాజైన దావీదు ఒకటి వ్యభిచారం చేశాడు. రెండోది అధికార దుర్వినియోగం చేశాడు. మూడవది నరహత్య చేయించాడు. నాలుగవది పొరుగువాని భార్యతో శయనించాడు. వీటన్నింటికీ పశ్చాత్తాపపడ్డాడు కానీ శిక్ష నుండి తప్పించుకోలేకపోయాడు. ప్రవక్త చెప్పిన నేరాన్ని అంగీకరించాడు. కారణం? పాపం చేసి దేవుని ఆజ్ఞలను అతిక్రమించాడు. నాతాను ప్రవక్త మహారాజుతో ఆయన చేసిన పాపమనే నేరాల్ని ధైర్యంగా చెప్పాడు. కారణం ప్రవక్తలో దేవుని ఆత్మ వున్నది (శిక్ష? సాము 12(సామ్యు 12:13 పశ్చాత్తాపపడ్డాడు).

యెరూషలేము లోని కోనేటి మంటపాల దగ్గర ముప్పది ఎనిమిది ఏండ్ల నుండి దేవదూత నీటిని కదిలించనప్పుడు ఎవడూ ఆ కోనేటి దగ్గరకు పక్షవాయువు గల రోగిని తీసుకొని వెళ్ళేవారు లేక పడిగాపులు పడుతున్న వాడిని యేసు అతనిని చూసి, స్వస్థపరచాడు, వ్యాధిగ్రస్తులగుటకు కారణం పాపం, అపరాధాలు. నా పాపాలను బట్టి నా యెముకలలో స్వస్థత లేదని చెబుతోంది వాక్యం (కీర్తనలు 38: 3–4).

యేసుప్రభువు వేరొకచోట కపెర్నహూములో ఒక రోగిని స్వస్థపరచుట, పాపములు క్షమించుట –యూదుల అంతరంగ ఆలోచనల్లో దేవదూషణ చేస్తున్నాడని ఆలోచించారు. ఎందుకనగా దేవుడొక్కడికే పాపాన్ని క్షమించగల అధికారం ఉందని వారి అభిప్రాయం. వీరి ఆలోచన ఎరిగిన ప్రభువు –పాపము క్షమించుట సులభమా? స్వస్థపరచుట సులభమా? అని అడిగి ఆ రోగిని స్వస్థపరచాడు. అనగా భూమి మీద మనుష్య కుమారునికి అధికారం కలదని తెలుసుకొనుటకే వారితో చెప్పెను. (మార్కు 2 : 1–12). కనుక పాప భారాల నుండి విమోచించబడుదము గాక. ఎంత పాపినైనను యేసు చేర్చుకొనును అని గ్రహించుము.

– కోట బిపిన్

● ఇస్లాం వెలుగు

వక్ఫ్ ద్వారా మానవీయ సేవ



ప్రస్తుతం అందరి నోళ్ళలో నానుతున్న పదం 'వక్ఫ్'. దీని శాబ్దిక అర్థం నిలకడ, ఆపుదల, ధర్మసొత్తు, ధర్మార్థము అని వస్తుంది. షరియత్ పరిభాషలో ఎవరైనా ఒకవ్యక్తి తనకు చెందిన ఆస్తిపై లేక వస్తువుపై తన హక్కును, యాజమాన్యాన్ని పూర్తిగా వదులుకొని దైవానికి దఖలు పరచడాన్ని 'వక్ఫ్' అంటారు. అంటే ఏదేని భూమి, వస్తువు లేక మరేదైనా వక్ఫ్ చేసిన తరువాత ఇక తనకు కాని, తన వారసులకు కాని మరెవరికైనా దానిపై ఏవిధమైన హక్కూ అధికారం ఉండదు. అది పూర్తిగా దైవానికే చెందిన ఆస్తి. వక్ఫ్ ఒక ఆరాధన. వక్ఫ్ ప్రధాన ఉద్దేశ్యం దైవాన్ని సంతోష పరచడం, సాటి మానవులపై ప్రేమను వ్యక్త పరచడం. నిజానికి ఇస్లాంకు పూర్వం వక్ఫ్ భావన లేదు. పవిత్ర ఖురాన్ లో, మీరు అధికంగా ప్రేమించే వాటిని దైవమార్గంలో వినియోగించనంతవరకు మీరు ధర్మపరాయణులు కాలేరు' (3–92) అన్న వాక్యం అవతరించినప్పుడు, అది తెలుసుకున్న అనేకమంది ప్రవక్త అనుచరులు తమ విలువైన ఆస్తిపాస్తుల్ని (తోటలు, కోటలు, భూములు వగైరా) దైవమార్గంలో వితరణ చేశారు. ప్రవక్త కాలంలో ప్రారంభమైన వక్ఫ్ భావన ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ కొనసాగుతోంది. భారతదేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన ముస్లిం రాజులు అసంఖ్యాక మసీదులు, ఖబ్రస్తాన్‌లు, దర్గాలు, విద్యాలయాలకు విలువైన భూములు, ఆస్తులు వక్ఫ్ చేశారు. వక్ఫ్ ప్రాముఖ్యం, నిరంతరం, తరంతరం లభించే పుణ్య ఫలాన్ని దృష్టిలో ఉంచుకొని ముస్లింలు తమ విలువైన ఆస్తిపాస్తుల్ని వక్ఫ్ చేస్తూ వచ్చారు. మసీదులు, విద్యాలయాలు, దర్గాలు, స్మశానవాటికలు, సత్రాలు మొదలైనవి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిరాటంకంగా కొనసాగడానికి ఈ ఆస్తులు దోహదపడాలని వాటిని దేవుని పేర అంకితం చేశారు. కనుక వక్ఫ్ ఆస్తులను అర్హత కలిగిన పేదసాదల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలి.

ఒక హదీసు ప్రకారం: మానవులు మరణించిన తర్వాత వారి కర్మలు కూడా ముగుస్తాయి. కానీ మూడు ఆచరణలు మాత్రం కొనసాగుతాయి. 1. సదఖయె జారియా (శాశ్వత దానం), 2. ఉపయోగకరమైన విజ్ఞానం. 3.అతని కోసం ప్రార్థించే సంతానం. (సహీహ్ ముస్లిం, హదీస్ నెం.1631)

వక్ఫ్ ద్వారా మసీదుల నిర్మాణం, పాఠశాలలు, ఆసుపత్రులు, నీటి వనరులు, స్మశాన వాటికలు, ఇంకా అనేక ప్రజోపయోగమైన పనులు చేపట్టవచ్చు. దీనివల్ల ఇహలోక ప్రయోజనం, పరలోక సాఫల్యం రెండూ సిద్ధిస్తాయి. కనుక వక్ఫ్ అనేది వ్యక్తిగత ఆరాధన మాత్రమే కాదు, సమాజంలోని అవసరార్థులకు, పేదలు, అనాథలు, విద్యార్థులు, యాత్రికులు ఇంకా అనేక వర్గాల సంక్షెమానికి వక్ఫ్ ద్వారా మానవీయ సేవలు అందించవచ్చు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

1.శచీదేవి మరో పేరు?
2. స్వర్గ సుఖాలు అందించే దేవతలెవరు?
3. సంపదలను ఏ దేవత ప్రసాదిస్తుంది?
4. శ్రీహరిని భర్తగా కోరినది ఎవరు?
5. సుదాముడు ఎలా జన్మించాడు?
6. బృంద భూలోకంలో వెలసిన అవతారం?
7. రమాసమేత నారాయణుడుండే శిల?
8. భారతదేశానికి పూర్వనామం?
9.హిరణ్యకశిపుని వంశంలోని వారు?
10. సుందోపసుందుల కుమారులు?

జవాబులు
1. ఇంద్రాణి 2. ఆదిత్యాది దేవతలు
3. దుర్గాదేవి 4. బృందాదేవి 5. శంఖచూడునిగా 6. తులసి 7. సాలగ్రామం
8. జంబూద్వీపం
9. సుందోపసుందులు
10. శుంభనిశుంభులు

ధర్మ సందేహం

మకర తోరణం కథ ఏమిటి?

వివిధ దేవాలయాలలో ద్వారతోరణ మధ్యభాగంలో కనుగుడ్లు ముందుకు చొచ్చుకు వచ్చిన ఒక రాక్షసముఖం కనబడుతుంది. దానికే మకరతోరణమని పేరు. ఈ రాక్షస ముఖాన్ని తోరణమధ్యంలో అలంకరించటానికి గల కారణం గురించి స్కందమహాపురాణంలో ఒక కథ ఉంది.

పూర్వం 'కీర్తిముఖుడ'నే రాక్షసుడు బ్రహ్మను మెప్పించి అనేక వరాలు పొంది అలా వచ్చిన బలపరాక్రమాలతో సమస్త భువనాలలోని సంపదలను తన సొంతం చేసుకున్నాడు. చివరకు నారదుని ప్రేరణతో శివపత్ని జగన్మాతను కూడా పొందాలని ఆశపడ్డాడు. అతని దురాశను చూసి కోపించిన మహేశ్వరుడు అతనిని మింగివేయమని అతిభీకరమైన అగ్నిని సృష్టించాడు. లోకాలను అన్నింటినీ మింగివేస్తూ ఆ అగ్ని ఆ రాక్షసుణ్ణి తరమసాగింది. మరణం లేకుండా వరం పొందిన కీర్తిముఖుడు ఆ అగ్ని తనను ఎక్కడ దహించివేస్తుందో అని భయంతో పరుగులు తీస్తూ అన్నిలోకాలూ తిరిగి ఆ అగ్ని ప్రతాపానికి తట్టుకోలేక చివరకు పరమశివుని శరణు వేడాడు. భక్తవశంకరుడైన శివుడు ఆ రాక్షసుణ్ణి రక్షించటంకోసం ఆ అగ్నిని ఉపసంహరించి తన నుదుట మూడవ కన్నుగా ధరించాడు. ఆ తరువాత కీర్తిముఖుడు తనకు తట్టుకోలేనంత ఆకలిగా ఉందని, తను తినటానికి ఏదైనా పదార్థాన్ని చూపమని మహాదేవుని కోరాడు. యుక్తిగా శివుడు 'నిన్ను నువ్వే తిను' అని చెప్పాడు. శివుని వచనానుసారం మొసలి రూపును ధరించి ఆ కీర్తిముఖుడు తనను తాను ముందుగా తోకభాగం నుంచి తినటం మొదలు పెట్టాడు. తన శరీరాన్ని అలా తింటూ తింటూ కంఠం వరకూ తిన్నాడు. తన తలను తానే ఎలా తినాలో అతనికి తెలియలేదు. అతని ఆకలి ఇంకా తీరలేదు. శివుని ప్రార్థించాడు. నీవు ఈ నాటినుంచి సమస్త దేవాలయాలలో తోరణాగ్రభాగాన్ని అలంకరించు. దేవతా దర్శనానికి వచ్చే ప్రజలందరిలో ఉండే దుష్టమైన అహంకారాన్ని, ఆశను తింటూ ఉండు. నీవు అందరికీ పూజనీయుడవు అవుతావు 'అని వరమిచ్చాడు. ఆ నాటినుంచి కీర్తిముఖుడు దేవాలయాలలోని తోరణ మధ్యభాగాన్ని తన రాక్షస మకర ముఖంతో అలంకరించి భక్తులలో ఉండే వికారాలను, అహంకారాన్ని, దురాశను కబళిస్తూ విరాజిల్లుతున్నాడు. అందుకనే దేవతామూర్తుల వెనుకనుండే తోరణానికి మకర తోరణం అని పేరు వచ్చింది.



బిజినెస్ రీల్

అరబిందో ఫార్మా 'క్యాన్సర్' ఔషధానికి ఎఫ్‌డీఏ ఆమోదం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డసాటినిబ్ ట్యాబ్లెట్ల తయారీ, విక్రయానికి తమ అనుబంధ కంపెనీ యూజియా ఫార్మా స్పెషాలిటీస్‌కు అమెరికా ఔషధ రంగ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏ అనుమతులు లభించినట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. నిర్దిష్ట రక్త క్యాన్సర్ల చికిత్సలో దీన్ని ఉపయోగిస్తారని వివరించింది. స్ప్రైసెల్ ట్యాబ్లెట్లకు ఇది జనరిక్ వెర్షన్.

హైదరాబాద్‌లో ఏబీసీ ఫిట్‌నెస్ ఇన్నోవేషన్ సెంటర్



హైదరాబాద్: ఫిట్‌నెస్ సంస్థలకు టెక్నాలజీ సేవలు అందించే గ్లోబల్ సంస్థ ఏబీసీ ఫిట్‌నెస్ హైదరాబాద్‌లో తమ ఇన్నోవేషన్ హబ్‌ను ఆవిష్కరించింది. ఫిట్‌నెస్ పరిశ్రమకు అవసరమైన టెక్నాలజీలను రూపొందించడంపై ఇది ప్రధానంగా దృష్టి పెడుతుంది. అంతర్జాతీయంగా ఎఫ్45 ఫ్రాంచైజీ, స్థానికంగా ది ఫిట్ స్ట్రీక్‌లాంటి ఇరవైపైగా కస్టమర్లకు కంపెనీ సర్వీసులు అందిస్తోంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా సైంటిస్టులు సహా వచ్చే ఏడాది వ్యవధిలో 200 మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు సంస్థ సీఈవో బిల్ డేవిస్ వివరించారు.

భారత్‌లో ఒసాము సుజుకీ ఎక్సలెన్స్ సెంటర్

న్యూఢిల్లీ: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం సుజుకీ మోటర్ కార్పొరేషన్ తమ మాజీ చైర్మన్, దివంగత ఒసాము సుజుకీ గౌరవార్థం భారత్‌లో ఆయన పేరిట సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను (ఓఎస్‌సీవోఈ) ఏర్పాటు చేయనుంది. దేశీ కార్ల దిగ్గజం మారుతీ సుజుకీతో కలిసి గుజరాత్, హర్యానాలో ఓఎస్‌సీవోఈని నెలకొల్పనుంది. తయారీ రంగం అధిక వృద్ధి సాధనలోను, విడిభాగాల తయారీ సంస్థల ప్రమాణాలను మెరుగుపర్చడంలోను ప్రభుత్వ లక్ష్యాలకు తోడ్పడేదిగా ఇది ఉంటుందని మారుతీ సుజుకీ తెలిపింది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-4-2025

విశాఖ	405-00
చిత్తూరు	450-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

బోర్డు సమావేశాలు

హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఏసీసీ, సైయంట్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, నాల్కో, నెస్లే ఇండియా, పెర్సిస్టెంట్ సిస్టమ్స్, ఎస్‌బీఐ కార్డ్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, శాంతి గేర్స్, తాన్లా ప్లాట్‌ఫామ్స్, వారీ టెక్నాలజీస్, ఆవాస్ ఫైనాన్షియర్స్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, ఎల్‌అండ్‌టీ టెక్నాలజీస్, లారస్ ల్యాబ్స్, ఎంఫసిస్.

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HCLTECH	1,594.40	7.74
TECHM	1,442.00	4.76
TATAMOTORS	658.85	4.44
WIPRO	243.2	3.87
INFY	1,476.20	3.75

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
KOTAKBANK	2,221.40	-2.09
HDFCBANK	1,920.70	-2.09
GRASIM	2,695.00	-1.98
SBIN	813.5	-1.08
EICHERMOT	5,730.00	-0.93

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,784
ఎన్‌ఎస్‌ఈ	1,16,245
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	4,28,430
ఎఫ్‌ఐఐ	+ 3,333
డీఐఐ	- 1,234

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.95 (రాత్రి 11.30కు)	$ 63.67 (క్రితం ముగింపు)
బ్రెంట్	65.68 (రాత్రి 11.30కు)	$ 67.03 (క్రితం ముగింపు)

ట్రాక్టర్ విక్రయాలు.. రికార్డ్!

- 2025–26లో 9.75 లక్షల యూనిట్లు
- 5 శాతం వరకు పెరగొచ్చు
- సాగు, నిర్మాణ రంగం నుంచి డిమాండ్
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ట్రాక్టర్లకు బలమైన డిమాండ్ ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా. కీలక పంటలకు అధిక మద్దతు ధరలకు తోడు, నిర్మాణ రంగం నుంచి డిమాండ్, పాత వాహనాలను మార్చడం, సాధారణం కంటే అధిక వర్షాలు పడతాయన్న అంచనాలతో క్రిసిల్ రేటింగ్స్ ఆ అంచనాకు వచ్చింది. 2025–26లో ట్రాక్టర్ల విక్రయాలు 9.75 లక్షల యూనిట్లుగా ఉండొచ్చని.. క్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 3–5 శాతం వరకు పెరుగుతాయని తన తాజా నివేదికలో పేర్కొంది. ట్రాక్టర్ల తయారీ పరిశ్రమలో రూ.4,000 కోట్ల మూలధన పెట్టుబడులకు అవకాశాలున్నట్టు తెలిపింది. ప్రస్తుత తయారీ సామర్థ్యంలో వినియోగం 75–80 శాతానికి చేరుకోవడం, పర్యావరణ అనుకూల టెక్నాలజీలకు మద్దతు మూలధన నిధుల వ్యయాలకు మద్దతుగా నిలుస్తాయని పేర్కొంది. కర్బన ఉద్గారాల నిబంధనలు 'టర్మ్ 5' 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని.. కనుక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివర్లో ట్రాక్టర్ల ముందస్తు కొనుగోళ్లు ఊపందుకోవచ్చని కూడా క్రిసిల్ అంచనా వేసింది. కనుక 2022–23 ఆర్థిక సంవత్సరంలో నమోదైన ట్రాక్టర్ల గరిష్ట విక్రయాలు 9.45 లక్షల యూనిట్ల మార్క్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అమ్మకాలు అధిగమించొచ్చని పేర్కొంది. 2024–25లో ట్రాక్టర్ల అమ్మకాలు 7 శాతం పెరిగినట్టు తెలిపింది.

వర్షపాతం అంచనాలతో సానుకూల సెంటిమెంట్

''సాధారణం కంటే ఎక్కువ వర్షాలు నమోదవుతాయంటూ భారత వాతావరణ శాఖ వేసిన అంచనాలు గ్రామీణ సెంటిమెంట్‌ను బలపరుస్తాయి. రైతుల్లో ఆత్మవిశ్వాసం బలపడుతుంది. ట్రాక్టర్లు సహా సాగుపై పెట్టుబడులకు ఇది కీలకంగా పనిచేస్తుంది''అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనుజ్ సేతి తెలిపారు. కీలక పంటలకు కనీస మద్దతు ధరలు పెరుగుతాయని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. అలాగే నిర్మాణ రంగంలో కార్యకలాపాలు ఊపందుకోవడం వంటివి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ట్రాక్టర్ల విక్రయాలు పెరిగేందుకు సానుకూలిస్తాయన్నారు. ముఖ్యంగా 2026 ఏప్రిల్ 1 నుంచి టర్మ్ 5 నిబంధనలు అమల్లోకి వస్తుండడంతో ట్రాక్టర్ల ధరలు పెరుగుతాయని.. ఇది కూడా ముందస్తు కొనుగోళ్లను పెంచుతుందని అంచనా వేశారు. అమ్మకాల్లో పెరుగుదల, తయారీ వ్యయాలు తగ్గుముఖం పట్టడం వంటివి ట్రాక్టర్ల కంపెనీల మార్జిన్లను 13–13.5 శాతం స్థాయిలో స్థిరంగా కొనసాగేందుకు దారితీస్తాయని క్రిసిల్ నివేదిక తెలిపింది. వర్షాల్లో తాత్కాలిక అవాంతరాలు, వ్యవసాయ రంగం, గ్రామీణ ఆదాయాలపై దీని ప్రభావం, కమోడిటీల ధరలు, వడ్డీ రేట్లు, కాలుష్య ఉద్గారాల నిబంధనల అమలు ప్రభావం వంటివి మధ్య కాలానికి గమనించాల్సిన అంశాలుగా పేర్కొంది.

జీసీసీల్లో ఫ్రెషర్లకు కొలువుల జాతర

- 2030 నాటికి 4 లక్షల ఉద్యోగాలు
- ఫస్ట్ మెరీడియన్ నివేదిక



ముంబై: దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) ఫ్రెషర్లకు భారీగా కొలువులు రానున్నాయి. 2030 నాటికి 4 లక్షల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరగనుంది. హెచ్‌ఆర్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫాం ఫస్ట్‌మెరీడియన్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. డిజిటల్ సామర్థ్యాలున్న నిపుణుల లభ్యత, వ్యయాలపరంగా అనుకూల పరిస్థితులు తదితర అంశాల కారణంగా భారత్‌లో జీసీసీ వ్యవస్థ వేగంగా ఎదుగుతోంది. 2030 నాటికి ఇది 110 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయని ఫస్ట్‌మెరీడియన్ బిజినెస్ సర్వీసెస్ సీఈవో సునీల్ నెహ్రా తెలిపారు. ఈ వృద్ధితో 2030 నాటికి జీసీసీల్లో మొత్తం ఉద్యోగుల సంఖ్య 30 లక్షలకు చేరుతుందని పేర్కొన్నారు. ఇందులో సుమారు ఎంట్రీ స్థాయి ఉద్యోగాలు గణనీయంగా ఉంటాయని వివరించారు. జీసీసీ సిబ్బందిలో మహిళల వాటా 40 శాతానికి చేరవచ్చని పేర్కొన్నారు.

భారత వృద్ధి రేటుకు కోత



- 2025–26లో 6.3 శాతానికి తగ్గింపు
- ప్రకటించిన ప్రపంచ బ్యాంక్
- గత అంచనా 6.7 శాతం

న్యూఢిల్లీ: భారత జీడీపీ వృద్ధి అంచనాలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) తగ్గిస్తున్నట్టు ప్రపంచబ్యాంక్ ప్రకటించింది. 6.7 శాతం వృద్ధి నమోదు కావచ్చన్న గత అంచనాలను 6.3 శాతానికి తగ్గించింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక బలహీనత, విధానపరమైన అనిశ్చితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ''2024–25లో భారత వృద్ధి రేటు నిరాశపరిచింది. ప్రైవేటు పెట్టుబడులు, ప్రభుత్వ మూలధన వ్యయాలు అంచనాలకు అనుగుణంగా లేకపోవడం ఇందుకు దారితీసింది. భారత జీడీపీ వృద్ధి 2024–25లో ఉన్న (అంచనా) 6.5 శాతం స్థాయి నుంచి 2025–26లో 6.3 శాతానికి నిదానించొచ్చు. ప్రైవేటు పెట్టుబడులు, ద్రవ్యపరమైన సడలింపులు, నియంత్రణ పరమైన సానుకూలతలను.. అంతర్జాతీయంగా నెలకొన్న బలహీనత, విధానపరమైన (వాణిజ్యం) అనిశ్చితులు తటస్థం చేయొచ్చు''అని ప్రపంచ బ్యాంక్ తన నివేదికలో వివరించింది. మరోవైపు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) సైతం భారత జీడీపీ అంచనాలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గతంలో వేసిన 6.5% నుంచి 6.2 శాతానికి తగ్గించడం గమనార్హం.

''పన్ను తగ్గింపులతో ప్రైవేటు వినియోగం పుంజుకోవచ్చు. ప్రభుత్వ మూలధన వ్యయాలు కూడా పెరుగుతాయి. కానీ, అంతర్జాతీయంగా వృద్ధి నిదానించడం, వాణిజ్య విధానాల్లో మార్పులతో ఎగుమతుల డిమాండ్ తగ్గుతుంది''అని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. మరోవైపు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న అనిశ్చితి దక్షిణాసియా వృద్ధి అవకాశాలను బలహీనపరుస్తుందని పేర్కొంది. 2025లో దక్షిణాసియా ప్రాంతంలో 6.1 శాతం వృద్ధి నమోదవుతుందన్న గత అంచనాలను 5.8 శాతానికి కుదించింది.

యాపిల్, మెటాకు ఈయూ షాక్

- డిజిటల్ కేసుల్లో భారీగా జరిమానా

లండన్: డిజిటల్ కాంపిటీషన్ చట్టాల ఉల్లంఘనకుగాను అమెరికన్ టెక్ దిగ్గజాలు యాపిల్, మెటాకు యూరోపియన్ కమిషన్ షాకిచ్చింది. రెండు వేర్వేరు కేసుల్లో యాపిల్‌పై 500 మిలియన్ యూరోలు, మెటాపై 200 మిలియన్ యూరోల జరిమానా విధించింది. యాప్ స్టోర్ వెలుపల చౌక ఆప్షన్ల గురించి యూజర్లకు తెలియనివ్వకుండా యాప్‌ల తయారీదారులను నియంత్రించిందుకుగాను యాపిల్‌కి పెనాల్టీ విధించింది. వ్యక్తిగతీకరించిన యాడ్‌లను చూడాలని లేదా వాటిని తప్పించుకోవాలంటే కొంత రుసుములు చెల్లించాలని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ యూజర్లపై ఆంక్షలు విధించినందుకు జరిమానా కట్టాలంటూ యూరోపియన్ కమిషన్ ఆదేశించింది. రెండు కంపెనీలు 60 రోజుల్లోగా ఈ ఆదేశాలు పాటించకపోతే మరిన్ని పెనాల్టీ మరింత పెరుగుతుందని పేర్కొంది. గతంలో బిలియన్ డాలర్ల స్థాయిలో విధించిన జరిమానాలతో పోలిస్తే తాజా పెనాల్టీలు గణనీయంగా తక్కువగా ఉండటం గమనార్హం.

ఈపీఎఫ్‌వోలో 16 లక్షల మంది చేరిక

- ఫిబ్రవరి పేరోల్ గణాంకాలు విడుదల
- 58 శాతం 25 ఏళ్లలోపు వారే



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సామాజిక భద్రతా పథకం కిందకు ఫిబ్రవరి నెలలో నికరంగా రూ.16.10 లక్షల మంది సభ్యులు చేరారు. 2024 ఫిబ్రవరి నెలలో సభ్యుల నికర చేరికతో పోల్చితే 4 శాతం ఎక్కువ మందికి ఉపాధి లభించినట్టు ఈపీఎఫ్‌వో పేరోల్ గణంకాలు తెలియజేస్తున్నాయి. ఇందులో 7.39 లక్షల మంది కొత్తగా చేరారు. పెరుగుతున్న ఉపాధి అవకాశాలు, ఉద్యోగుల ప్రయోజనాలపై విస్తృతమవుతున్న అవగాహన, ఈపీఎఫ్‌వో అవగాహన కార్యక్రమాలు కొత్త సభ్యుల చేరిక పెరిగేందుకు కారణమని కార్మిక శాఖ తన ప్రకటనలో పేర్కొంది. కొత్త సభ్యుల్లో 4.27 లక్షల మంది 18–25 ఏళ్ల వయసు నుంచి ఉన్నారు. మొత్తం కొత్త సభ్యుల్లో వీరి వాటాయే 58 శాతంగా ఉంది. అంటే సంఘటిత రంగంలో వీరు మొదటిసారి ఉపాధి పొందినట్టు తెలుస్తోంది. సుమారుగా 13.18 లక్షల మంది సభ్యులు ఒక సంస్థను వీడి మరో సంస్థలో చేరిపోయారు. గతేడాది ఇదే నెలలో పోల్చి చూస్తే 12 శాతం పెరుగుదల నమోదైంది. పాత ఖాతాను మూసివేయకుండా, కొత్త సంస్థకు బదిలీ చేసుకున్నారు.

3.37 లక్షల మంది మహిళలు..

ఫిబ్రవరిలో ఈపీఎఫ్‌వోలో నికరంగా చేరిన సభ్యుల్లో 3.37 లక్షల మంది మహిళలు కావడం గమనార్హం. 2024 ఫిబ్రవరి గణాంకాలతో పోల్చి చూస్తే 9.23 శాతం పెరుగుదల నమోదైంది. ఇందులో 2.08 లక్షల మంది కొత్తగా చేరారు. 2024 ఫిబ్రవరితో పోల్చి చూస్తే కేవలం 1.26 శాతమే పెరిగింది. అత్యధికంగా మహారాష్ట్ర నుంచి ఫిబ్రవరిలో 20.90 శాతం సభ్యులు నికరంగా చేరారు. ఆ తర్వాత తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, హర్యానా, ఢిల్లీ, తెలంగాణ, యూపీ నుంచి 5 శాతానికి పైన సభ్యులు నమోదయ్యారు. ఫిష్ ప్రాసెసింగ్, నాన్ వెజిటేరియన్ ఆహార కేంద్రాలు, సొసైటీలు, క్లబ్‌లు, స్వీపింగ్ సేవల్లో సభ్యుల చేరిక పెరిగింది. ఎగుమతి సేవల్లో సభ్యుల చేరిక 41.72 శాతంగా ఉంది.

గోల్డ్ లోన్స్‌లోకి బ్యాంక్‌బజార్

ముత్తూట్ ఫిన్‌కార్ప్‌తో జత



న్యూఢిల్లీ: కో‌బ్రాండెడ్ క్రెడిట్ కార్డులు, క్రెడిట్ స్కోర్ సర్వీసులందించే ఫిన్‌టెక్ సంస్థ బ్యాంక్‌బజార్.కామ్ తాజాగా బంగారు ఆభరణ రుణాలలోకి ప్రవేశించింది. ఇందుకు అనుగుణంగా ఎన్‌బీఎఫ్‌సీ ముత్తూట్ ఫిన్‌కార్ప్‌తో చేతులు కలిపింది. తద్వారా హామీ(సెక్యూర్డ్) రుణ విభాగంలో కార్యకలాపాలు విస్తరించనుంది. ఒప్పందంలో భాగంగా ముత్తూట్ ఫిన్‌కార్ప్ ఈక్విటీ ఇన్వెస్టర్‌గా బ్యాంక్‌బజార్‌కు రూ. 15 కోట్లు అందిస్తోంది. సిరీస్ డీ2 రౌండ్‌లో భాగంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్ పటిష్టతకు బ్యాంక్‌బజార్ నిధులను సమీకరిస్తోంది. తాజా రౌండ్‌లో భాగంగా రూ. 1,700 కోట్ల విలువలో రూ. 55 కోట్లు సమకూర్చుకుంది. బ్యాంక్‌బజార్‌లో రూ. 15 కోట్లు ఇన్వెస్ట్‌చేసిన ముత్తూట్ ఫిన్‌కార్ప్ 1 శాతం వాటా పొందనుంది. మిగిలిన రూ. 40 కోట్లు ప్రస్తుత వాటాదారులే సమకూర్చినట్లు ఫిన్‌టెక్ కంపెనీ వెల్లడించింది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం ప్లస్

క్యూ4లో రూ. 1,129 కోట్లు
షేరుకి రూ. 45 డివిడెండ్



ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం ఎల్‌టీఐ మైండ్‌ట్రీ గతేడాది(2024–25) చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 3 శాతం వృద్ధితో రూ. 1,129 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,101 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,893 కోట్ల నుంచి రూ. 9,771 కోట్లకు బలపడింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 45 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం స్వల్పంగా పుంజుకుని రూ. 4,602 కోట్లను తాకింది. 2023–24లో రూ. 4,585 కోట్లు ఆర్జించింది. క్యూ4లో పన్నుకుముందు లాభాల మార్జిన్లు 14.7 శాతం నుంచి 13.8 శాతానికి బలహీనపడ్డాయి. కంపెనీ మొత్తం సిబ్బంది సంఖ్య 2024 డిసెంబర్‌లో నమోదైన 86,800 నుంచి 84,307కు తగ్గింది. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు నిలకడగా 14.4 శాతంగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 4,539 వద్ద ముగిసింది.

వారీ ఎనర్జీస్ లాభం వారెవ్వా

క్యూ4లో రూ. 648 కోట్లు



న్యూఢిల్లీ: సోలార్ మాడ్యూల్స్ తయారీ దిగ్గజం వారీ ఎనర్జీస్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 254 శాతం దూసుకెళ్లి రూ. 648 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం సైతం 38 శాతం ఎగసి రూ. 4,141 కోట్లకు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 107 శాతం జంప్‌చేసి రూ. 1,932 కోట్లను తాకింది. ఇక మొత్తం ఆదాయం 28 శాతం వృద్ధితో రూ. 14,846 కోట్లకు చేరింది. మార్చికల్లా ఆర్డర్ బుక్ రూ. 47,000 కోట్ల విలువైన 25 గిగావాట్లను అధిగమించింది. మొత్తం ఉత్పత్తి 4.77 గిగావాట్ల నుంచి 7.13 గిగావాట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 15 శాతం జంప్‌చేసి రూ. 3,006 వద్ద ముగిసింది. ఒక దశలో 19 శాతంపైగా దూసుకెళ్లి గరిష్టంగా రూ. 3,120కు చేరింది.

ఎస్‌బీఐ జనరల్ లాభం రెట్టింపు

క్యూ4లో రూ. 509 కోట్లు



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం(2024–25) ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. నికర లాభం రెట్టింపునకుపైగా జంప్‌చేసి రూ. 509 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) కేవలం రూ. 240 కోట్లు ఆర్జించింది. స్థూల ప్రీమియం ఆదాయం(జీడబ్ల్యూపీ) సైతం 11 శాతం ఎగసి రూ. 14,140 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది రూ. 12,731 కోట్ల జీడబ్ల్యూపీ సాధించింది. కంపెనీ సాల్వెన్సీ రేషియో ఆర్థిక పటిష్టతను సూచిస్తూ 2ను మించింది. నిబంధనల ప్రకారం 1.5 నిష్పత్తిని మించింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐకు సాధారణ బీమా రంగ అనుబంధ సంస్థ ఇది.

టాటా కన్జూమర్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 349 కోట్లు
- షేరుకి రూ. 8.25 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 64 శాతం జంప్‌చేసి రూ. 349 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 212 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం ఎగసి రూ. 4,608 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 3,927 కోట్ల అమ్మకాలు సాధించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 8.25 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 1,287 కోట్లను తాకింది. ఇక మొత్తం ఆదాయం 15 శాతంపైగా వృద్ధితో రూ. 17,812 కోట్లకు చేరింది. క్యూ4లో టాటా స్టార్‌బక్స్ జేవీ 6 పట్టణాలలో కొత్తగా 6 స్టోర్లను జత చేసుకుంది. ఈ కాలంలో పానీయాల బిజినెస్ దేశీయంగా 18 శాతం వృద్ధితో రూ. 2,937 కోట్లకు చేరగా.. విదేశాల నుంచి 13 శాతం అధికంగా రూ. 1,194 కోట్లు లభించింది. మొత్తం వ్యయాలు 21 శాతం పెరిగి రూ. 4,180 కోట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 1.2% లాభంతో రూ. 1,149 వద్ద ముగిసింది.

ప్రధాన నగరాల్లో మెరుగ్గా ఆఫీస్ లీజింగ్

- జనవరి–మార్చి మధ్య 4.5 శాతం వృద్ధి
- బెంగళూరులో 28 శాతం డౌన్
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా టాప్–8 నగరాల్లో ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంలో స్థూల ఆఫీస్ లీజింగ్ మెరుగుపడింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 4.5 శాతం వృద్ధితో 202.9 లక్షల చదరపు అడుగులుగా (ఎస్‌ఎఫ్‌టీ) ఉన్నట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ సంస్థ వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో ఇది 194.2 లక్షల చదరపు అడుగులుగా ఉండడం గమనార్హం. నికర ఆఫీసు లీజింగ్ 20 శాతం వృద్ధితో ఎనిమిది నగరాల్లో 134.4 లక్షల ఎస్‌ఎఫ్‌టీగా నమోదైంది. విడిగా ఒక్కో నగర మార్కెట్‌ను గమనించినట్టయితే పరిస్థితి భిన్నంగా ఉంది. ముఖ్యంగా బెంగళూరులో ఆఫీస్ వసతుల లీజింగ్ మార్చి క్వార్టర్‌లో క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 28 శాతం తక్కువగా 48.6 లక్షల ఎస్‌ఎఫ్‌టీకి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో స్థూల లీజింగ్ 67.4 లక్షల ఎస్‌ఎఫ్‌టీగా ఉంది. నికర ఆఫీస్ లీజింగ్ సైతం 33 శాతం తక్కువగా 24.9 లక్షల చదరపు అడుగులుగా ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. బెంగళూరులో నూతన ఆఫీస్ వసతుల సరఫరా జనవరి–మార్చి మధ్య క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 52% పెరిగి 32.8 లక్షల ఎస్‌ఎఫ్‌టీగా ఉంది. ఖాళీ ఆఫీసు వసతుల రేటు 9.7 శాతంగా ఉంది. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, అహ్మదాబాద్ నగరాల డేటాను విశ్లేషించి ఈ వివరాలను కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ విడుదల చేసింది.

భారత్ మార్కెట్ పటిష్టం..

''పెద్ద ఒప్పందాలు కుదరడం, తాజా లీజింగ్ బలంగా ఉండడం 2025 మొదటి త్రైమాసికానికి ఆఫీస్ స్పేస్ విభాగంలో సానుకూల సెంటిమెంట్‌ను కొనసాగేలా చేశాయి. భారత్‌లో తమ కార్యకలాపాలను విస్తరిస్తామన్న అంతర్జాతీయ సంస్థలు సంకేతాలు ఇవ్వడం ఇక్కడి మార్కెట్‌పైన విశ్వాసాన్ని తెలియజేస్తోంది. అయినప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు ఏలా మలుపు తీసుకుంటాయో చూడాల్సి ఉంది. టెక్నాలజీ, ఆర్‌అండ్‌డీ, ఆవిష్కరణలకు అంతర్జాతీయ కేంద్రంగా భారత్ స్థానం బలపడుతుంది''అని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఇండియా సీఈవో అన్షుల్ జైన్ తెలిపారు. మొత్తం లీజింగ్‌లో 30 శాతానికి పైగా గ్లోబల్ కేపబులిటీ కేంద్రాలే (జీసీసీ) వినియోగించుకుంటున్నట్టు, ఇది ఆయా సంస్థల్లో ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఇదే ధోరణి కొనసాగుతుందన్నారు. దీనికితోడు దేశీయంగా ద్రవ్యోల్బణం దిగిరావడం, మరిన్ని రేట్ల కోతల అంచనాలు ఆఫీస్ లీజింగ్ వృద్ధికి సానుకూలిస్తాయని చెప్పారు.



సెమీఫైనల్లో రుద్రాక్ష్ సింగ్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్–15, అండర్–17 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. పోటీల నాలుగో రోజు బుధవారం బరిలోకి దిగిన ఆరుగురు భారత బాక్సర్లు విజయాలతో సెమీఫైనల్స్‌లో అడుగుపెట్టారు. బాలుర అండర్ –15 విభాగం 46 కేజీల క్వార్టర్‌ఫైనల్లో రుద్రాక్ష్ 3–0 పాయింట్ల తేడాతో ఐదర్ ముసేవ్ (కిర్గిస్తాన్)పై టెక్నికల్ సుపీరియారిటీతో విజయం సాధించాడు. 37 కేజీల క్వార్టర్ ఫైనల్లో హర్ష్‌ల్, 49 కేజీల క్వార్టర్స్‌లో సంచిత్ జయానీ ప్రత్యర్థులపై 5–0తో విజయాలు సాధించారు. 35 కేజీల విభాగంలో సంస్కార్ వినోద్ ఆత్రమ్ 4–1తో గెలుపొందగా... 40 కేజీల విభాగంలో హోరాహోరీగా సాగిన బౌట్‌లో ప్రిక్షిత్ బాలాహ్రా 3–2తో మంగోలియా బాక్సర్ నూర్‌సలేమ్‌పై విజయం సాధించాడు. బాలికల అండర్–15 విభాగం 43 కేజీల క్వార్టర్‌ఫైనల్లో మిల్కీ మైనమ్ 5–0తో యెల్దానా అబ్దిగని (కజకిస్తాన్)పై గెలిచి సెమీస్‌లో అడుగు పెట్టింది.

బెంగళూరు ఎఫ్‌సీ అవుట్

భువనేశ్వర్: సూపర్‌కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఇంటర్ కాశీ జట్టు సంచలనం సృష్టించింది. బెంగళూరు ఎఫ్‌సీ జట్టుతో జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లో ఇంటర్ కాశీ జట్టు 5–3తో 'షూటౌట్'లో గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. అంతకుముందు నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో ఇంటర్ కాశీ తరఫున డేవిడ్ మునోజ్, బిజోయ్, నికోలా స్టాజనోవిచ్, అరిత్రా దాస్, బాబోవిచ్ ... బెంగళూరు తరఫున రియాన్ విలియమ్స్, సునీల్ ఛెత్రి, జార్జి పెరీరా సఫలమయ్యారు.

నాలుగేళ్ల తర్వాత...

టెస్టు మ్యాచ్ నెగ్గిన జింబాబ్వే ● తొలి టెస్టులో 3 వికెట్లతో బంగ్లాదేశ్ ఓటమి



ముజరబానీకి సహచరుల అభినందన

సిల్హెట్ (బంగ్లాదేశ్): ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన జింబాబ్వే పురుషుల క్రికెట్ జట్టు నాలుగేళ్ల విరామం తర్వాత టెస్టు విజయం సాధించింది. బంగ్లాదేశ్ పర్యటనలో భాగంగా బుధవారం ముగిసిన తొలి టెస్టులో జింబాబ్వే 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తద్వారా రెండు టెస్టుల సిరీస్‌లో 1–0తో ముందంజ వేసింది. 2021లో అఫ్గానిస్తాన్‌పై టెస్టు విజయం అనంతరం జింబాబ్వేకు సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇదే తొలి గెలుపు. ఈ క్రమంలో తమ టెస్టు క్రికెట్ చరిత్రలో జింబాబ్వే జట్టు నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించింది. ఓవర్‌నైట్ స్కోరు 194/4తో బుధవారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్... చివరకు 79.2 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ నజ్ముల్ హసన్ షంటో (60; 7 ఫోర్లు) క్రితం రోజు స్కోరు వద్దే వెనుదిరగగా... జాకీర్ అలీ (111 బంతుల్లో 58; 4 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. మెహదీ హసన్ మిరాజ్ (11), తైజుల్ ఇస్లామ్ (1) విఫలమయ్యారు. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ 6 వికెట్లతో అదరగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో జింబాబ్వే జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 50.1 ఓవర్లలో 7 వికెట్లకు 174 పరుగులు చేసింది. ఓపెనర్లు బ్రియాన్ బెనెట్ (81 బంతుల్లో 54; 7 ఫోర్లు, 1 సిక్స్), బెన్ కరన్ (75 బంతుల్లో 44; 7 ఫోర్లు) రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహదీ హసన్ మిరాజ్ 5 వికెట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసిన జింబాబ్వే బౌలర్ ముజరబానీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య సోమవారం నుంచి రెండో టెస్టు ప్రారంభం కానుంది.

దంచికొట్టిన ఓపెనర్లు..

నాలుగేళ్లుగా ఒక్క టెస్టు మ్యాచ్‌లోనూ విజయం సాధించని జింబాబ్వే జట్టు ముందు... బంగ్లాదేశ్ 174 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటి వరకు నాలుగో ఇన్నింగ్స్‌లో జింబాబ్వే ఛేదించిన అత్యధిక స్కోరు 162 (1998లో పాకిస్తాన్‌పై) పరుగులే. ఈ నేపథ్యంలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే ఓపెనర్లు బెనెట్, బెన్ కరన్ సాధికారికంగా ఆడారు. బంగ్లా బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఈ జోడీ ఎడాపెడా బౌండరీలు బాదుతు వేగంగా పరుగులు జోడించింది. ఈ క్రమంలో ఓపెనర్లు 21 ఓవర్లలోనే 95 పరుగులు జోడించడంతో ఛేదన సులువైంది. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (10)తోపాటు సీన్ విలియమ్స్ (9), నిక్ వెల్చ్ (10), వికెట్ కీపర్ మయావో (1) విఫలం కాగా... ఆఖర్లో వెస్లీ మెద్వెదెవ్ (55 బంతుల్లో 19 నాటౌట్; 3 ఫోర్లు) కీలక పరుగులు చేసి జట్టును గెలుపు గీత దాటించాడు. బంగ్లా స్పిన్నర్ మెహదీ హసన్ మిరాజ్ 5 వికెట్లు తీసినా కీలక సమయాల్లో జింబాబ్వే బ్యాటర్లు ఆధిక్యం కనబర్చారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ తరఫున టెస్టుల్లో ఎక్కువసార్లు 10 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా మెహదీ రికార్డుల్లోకెక్కాడు. ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి మిరాజ్ 10 వికెట్లు పడగొట్టాడు. టెస్టు మ్యాచ్‌లో 10 వికెట్లు తీయడం మిరాజ్‌కు ఇది మూడోసారి. తైజుల్ ఇస్లామ్ 2 సార్లు ఈ ఫీట్ అందుకున్నాడు.

నీరజ్ ఆహ్వానానికి నదీమ్ నో

లాహోర్: వచ్చే నెలలో బెంగళూరు వేదికగా జరగనున్న 'నీరజ్ చోప్రా క్లాసిక్ జావెలిన్ ఈవెంట్'లో తాను పాల్గొనడం లేదని... పాకిస్తాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ స్పష్టం చేశాడు. వచ్చే నెల 24న బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో ఈ మీట్ జరగనుండగా... అందులో పాల్గొనాల్సిందిగా నదీమ్‌కు భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఆహ్వానించాడు. అయితే ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు సిద్ధమవుతుండటంతో నీరజ్ ఆహ్వానాన్ని తిరస్కరించినట్లు నదీమ్ బుధవారం వెల్లడించాడు. నీరజ్ నుంచి ఆహ్వానం రావడం చాలా గొప్పగా ఉందని అయితే అనుకోకుండా తాను పాల్గొనలేకపోతున్నానని అన్నాడు. 'నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్ మే 24న జరగనుంది. ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించాలనే లక్ష్యంతో మెరుగైన సాధన కోసం నేను మే 22న కొరియా వెళ్తున్నా' అని నదీమ్ వివరించాడు. మే 27 నుంచి 31 వరకు కొరియాలోని గుమీలో ఆసియా చాంపియన్‌షిప్ జరగనుంది. అంతకుముందు ఈ అంశంపై స్పందించిన నీరజ్ చోప్రా... ఈ టోర్నీలో పాల్గొనేందుకు నదీమ్‌కు ఆహ్వానం పంపినట్లు తెలిపాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో నదీమ్ జావెలిన్‌ను 92.97 మీటర్ల దూరం విసిరి పసిడి పతకం చేజిక్కించుకోగా... నీరజ్ 89.45 మీటర్లు విసిరి రజత పతకం కైవసం చేసుకున్నాడు. భారత్ వేదికగా నిర్వహిస్తున్న తొలి జావెలిన్ మెగా ఈవెంట్‌లో అంతర్జాతీయ స్టార్లు అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), థామస్ రోలెర్ (జర్మనీ), జూలియస్ యెగో (కెన్యా), కర్టిస్ థాంప్సన్ (అమెరికా) పాల్గొంటున్నారు. ఈ టోర్నీకి ప్రపంచ



అథ్లెటిక్స్ సమాఖ్య 'ఎ' కేటగిరీ గుర్తింపు ఇచ్చింది. షెడ్యూల్ ప్రకారం నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్ పంచ్‌కులాలో జరగాల్సినా... నిర్ణీత ప్రమాణాలతో కూడిన ఫ్లడ్‌లైట్లు లేకపోవడంతో వేదికను బెంగళూరుకు మార్చారు.

సహజ పరాజయం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ100 చార్లోట్స్‌విల్లె ఓపెన్ టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించడంలో విఫలమైంది. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలోని చార్లోట్స్‌విల్లె నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 320వ స్థానంలో ఉన్న సహజ క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో 6–0, 6–1తో మరియా కరోలినా ఫెరీరా టర్చెటో (బ్రెజిల్)పై విజయం సాధించింది. అయితే క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో సహజ 4–6, 1–6తో ప్రపంచ 556వ ర్యాంకర్ మరియా కొజిరెవా (రష్యా) చేతిలో ఓడిపోయింది. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ 4 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఏడుసార్లు కోల్పోయిన సహజ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. సహజ ఫస్ట్ సర్వ్‌లో 17 పాయింట్లు, సెకండ్ సర్వ్‌లో 11 పాయింట్లు సాధించింది. పుణేలో ఈనెల తొలి వారంలో జరిగిన బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్–1 టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాక సహజ ఆడిన తొలి టోర్నీలో ఇదే కావడం గమనార్హం.



చిన్నస్వామిలో చిందేసేనా!

నేడు రాజస్తాన్ రాయల్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 'ఢీ' ● రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం





యశస్వి

బెంగళూరు: ఐపీఎల్ 18వ సీజన్‌లో ప్రత్యర్థుల మైదానాల్లో దుమ్మురేపుతున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) సొంతగడ్డ చిన్నస్వామి స్టేడియంలో మాత్రం విజయం కోసం నిరీక్షిస్తోంది. ఇప్పటి వరకు ఇక్కడ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన బెంగళూరు... రాజస్తాన్ రాయల్స్‌పై అయినా గెలవాలని చూస్తోంది. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లాడిన ఆర్‌సీబీ 5 విజయాలు, 3 పరాజయాలతో 10 పాయింట్లు ఖాతాలో వేసుకొని ప్లే ఆఫ్స్ వైపు దూసుకెళ్తుంటే... మరోవైపు రాజస్తాన్ రాయల్స్ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిన రాజస్తాన్ విజయం కోసం ఎదురుచూస్తోంది. మిగిలిన స్టేడియాలతో పోల్చుకుంటే కాస్త చిన్నదిగా ఉండే... చిన్నస్వామి మైదానంలో బెంగళూరు బ్యాటర్లు సమష్టిగా సత్తా చాటాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఫుల్‌ఫామ్‌లో ఉండగా... సాల్ట్, పడిక్కల్, రజత్ పాటీదార్ నుంచి మరిన్ని మెరుపులు రావాల్సి ఉంది. రాజస్తాన్ రాయల్స్ రెగ్యులర్ కెప్టెన్ సంజూ సామ్సన్ గాయంతో జట్టుకు దూరం కావడంతో... అతడి స్థానంలో రియాన్ పరాగ్ సారథిగా వ్యవహరించనున్నాడు. గత మ్యాచ్ తోనే ఐపీఎల్ అరంగేట్రం చేసిన 14 ఏళ్ల ప్లేయర్ వైభవ్ సూర్యవంశీపై అందరి దృష్టి నిలవనుంది.

సొంతగడ్డపై ఓ విజయం కోసం!

ఐపీఎల్ ఆరంభం నుంచి బరిలోకి దిగుతున్నా... ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయిన ఆర్‌సీబీ... ఈసారి మెరుగైన ప్రదర్శనతో తమ చిరకాల కల నెరవేర్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. వరుస విజయాలు సాధించలేకపోతున్నా... మెరుగైన ప్రదర్శనతో ముందుకు సాగుతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి బెంగళూరు బౌలింగ్ దళం మెరుగైన ప్రదర్శన చేస్తుండగా... బ్యాటర్లు ఫర్వాలేదనిపిస్తున్నారు. భువనేశ్వర్, యశ్ దయాళ్, హాజల్‌వుడ్, కృనాల్ పాండ్యా, సుయాశ్ శర్మతో కూడిన బౌలింగ్ బృందం ఆర్‌సీబీకి ప్రధాన బలంగా మారింది. ఇక బ్యాటింగ్‌లో స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి చక్కటి ఆటతీరు కనబరుస్తుండగా... కెప్టెన్ రజత్ పాటీదార్ నుంచి యాజమాన్యం మరింత ఆశిస్తోంది. మిడిలార్డర్‌లో జితేశ్ శర్మ, రొమారియో షెఫర్డ్, డేవిడ్, కృనాల్ కీలకం కానున్నారు. వీరంతా కలిసికట్టుగా కదంతొక్కితే బెంగళూరు భారీ స్కోరు చేయడం పెద్ద కష్టం కాదు. రాయల్స్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ నుంచి ఆర్‌సీబీకి ప్రధాన సవాలు ఎదురుకానుంది.

అందరి చూపు... వైభవ్ వైపు

మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్ ఈ సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోతోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన రాయల్స్... ఆ తర్వాత రెండు మ్యాచ్‌లు నెగ్గింది. అనంతరం ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ రాజస్తాన్‌కు పరాజయాలే పలకరించాయి. ఈ నేపథ్యంలో ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన స్థితిలో బెంగళూరుతో పోరుకు రెడీ అయింది. బౌలర్ల ఫామ్ లేమి, బ్యాటర్ల నిలకడ లేమికి తోడు... కెప్టెన్ సామ్సన్ గాయం రాజస్తాన్‌ను ఇబ్బంది పెడుతోంది. ఈ నేపథ్యంలో ఆ జట్టుకు సానుకూల అంశం ఏదైనా ఉంది అంటే... గత మ్యాచ్ ద్వారానే ఐపీఎల్ అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ. తొలి పోరులో అంతర్జాతీయ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న ఈ 14 ఏళ్ల బుడ్డోడు... ఆడిన మొదటి బంతికే సిక్స్ కొట్టి సంచలనం రేపాడు. క్రీజులో ఉన్నంతసేపు లక్నో బౌలర్లను ఓ ఆటాడుకున్న సూర్యవంశీ అదే జోరు కొనసాగించాలని చూస్తున్నాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ మంచి ఫామ్‌లో ఉండగా... నితీశ్ రాణా, ధ్రువ్ జురెల్, హెట్‌మైర్, శుభమ్ దూబే రాణించాల్సిన అవసరముంది. అటు కెప్టెన్‌గా, ఇటు మిడిలార్డర్ బ్యాటర్‌గా రియాన్ పరాగ్‌పై అదనపు బాధ్యతలు ఉన్నాయి. జోఫ్రా ఆర్చర్, తీక్షణ, సందీప్ శర్మ, తుషార్ దేశ్‌పాండే పేస్ బాధ్యతలు చూసుకోనుండగా... వనిందు హసరంగా స్పిన్ భారం మోయనున్నాడు.

33 ఐపీఎల్ చరిత్రలో బెంగళూరు, రాజస్తాన్ జట్లు ముఖాముఖిగా 33 సార్లు తలపడ్డాయి. 16 మ్యాచ్‌ల్లో బెంగళూరు, 14 మ్యాచ్‌ల్లో రాజస్తాన్ విజయం సాధించాయి. 3 మ్యాచ్‌లు రద్దయ్యాయి. రాజస్తాన్‌పై బెంగళూరు అత్యధిక స్కోరు 200కాగా, అత్యల్ప స్కోరు 70 పరుగులు. బెంగళూరుపై రాజస్తాన్ అత్యధిక స్కోరు 217కాగా, అత్యల్ప స్కోరు 58 పరుగులు.

తుది జట్లు (అంచనా)

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లి, పడిక్కల్, జితేశ్ శర్మ, షెఫర్డ్, టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, హాజల్‌వుడ్, యశ్ దయాళ్, సుయాశ్ శర్మ.

రాజస్తాన్ రాయల్స్: రియాన్ పరాగ్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, నితీశ్ రాణా, ధ్రువ్ జురెల్, హెట్‌మైర్, శుభమ్ దూబే, హసరంగ, ఆర్చర్, తీక్షణ, తుషార్ దేశ్‌పాండే, సందీప్ శర్మ.

ఉగ్రదాడిని ఖండించిన క్రీడాలోకం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని క్రీడాలోకం ముక్తకంఠంతో ఖండించింది. ఇలాంటి క్లిష్ట సమయంలో మనమంతా ఒక్కటిగా ఉండి... బాధితులకు అండగా నిలవాల్సిన అవసరముందని పలువురు క్రీడాకారులు అభిప్రాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌లో 'మినీ స్విట్జర్లాండ్'గా పేరుగాంచిన బైసరన్ లోయలో మంగళవారం ఉగ్రవాదులు భీకర దాడికి పాల్పడగా... ఈ ఘటనలో 28 మంది మృతి చెందారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, మొహమ్మద్ సిరాజ్, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్, పార్థివ్ పటేల్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, అనిల్ కుంబ్లే, రవిశాస్త్రి, శ్రీవత్స గోస్వామి, టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్, స్టార్ షట్లర్ పీవీ సింధు, సైనా నెహ్వాల్, జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, షూటర్ అభినవ్ బింద్రా, బాక్సర్ నిఖత్ జరీన్, పీఆర్ శ్రీజేశ్ తదితరులు ఉగ్రవాదుల దాడిని ఖండించారు. పాకిస్తాన్‌తో క్రీడా సంబంధాలు ఎప్పటికీ పునరుద్ధరించకూడదని పలువురు ప్లేయర్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలు ఊహించలేని కష్టాలు ఎదుర్కొంటున్నాయి. ఈ కష్టకాలంలో భారత్‌తో పాటు యావత్ ప్రపంచం వారికి అండగా నిలుస్తోంది. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా. న్యాయం జరగాలని ప్రార్థిస్తున్నా.
-సచిన్ టెండూల్కర్

ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు శాంతి, బలం చేకూరాలని ప్రార్థిస్తున్నా. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నా. ఇలాంటి క్రూరమైన చర్యకు న్యాయం జరగాలని కోరుకుంటున్నా.
-విరాట్ కోహ్లి

అమాయకులైన పర్యాటకులపై దాడి హేయమైన చర్య. దీనికి రాబోయే కాలంలో మన ధైర్యవంతమైన సైనికులు గట్టి బదులిస్తారు. జమ్మూకశ్మీర్‌లో శాంతికి భంగం కలగించాలనుకునే వారి ప్రణాళికలు ఎప్పటికీ విజయవంతం కావు.
-విజేందర్ సింగ్, బాక్సర్

పహల్గాం ఉగ్రదాడి బాధితుల కోసం నా హృదయం బాధిస్తోంది. ఎలాంటి కారణమైన ఇంత క్రూరత్వాన్ని సమర్థించవు. బాధితుల దుఃఖం మాటల్లో చెప్పలేనిది. కానీ వారు ఒంటరి వారు కాదు. వారి వెంట యావత్ దేశం ఉంది. క్లిష్ట సమయంలో ఒకరికొకరు అండగా నిలుద్దాం. శాంతి పునరుద్ధరణ తప్పక జరుగుతుంది.
-పీవీ సింధు

జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడితో హృదయం విదారకంగా మారింది. బాధితులు, వారి కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా.
-నీరజ్ చోప్రా

శ్రీలంక జట్టులో భారీ మార్పులు

- 8 మందికి కొత్తగా అవకాశం
- ముక్కోణపు టోర్నీకి జట్టు ప్రకటన
- ఆదివారం లంకతో భారత్ తొలి మ్యాచ్



కొలంబో: స్వదేశంలో జరగనున్న మహిళల ముక్కోణపు వన్డే టోర్నమెంట్ కోసం శ్రీలంక జట్టు భారీ మార్పులు చేసింది. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న టోర్నీ కోసం శ్రీలంక జట్టు 8 మార్పులు చేసి బుధవారం 17 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ టోర్నీలో శ్రీలంకతో పాటు భారత్, దక్షిణాఫ్రికా జట్లు పాల్గొంటున్నాయి. గత నెలలో న్యూజిలాండ్ చేతిలో శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు 0–2తో సిరీస్ కోల్పోవడంతో జట్టును ప్రక్షాళన చేసింది. సీనియర్ బ్యాటర్ చమరి ఆటపట్టు లంక జట్టుకు సారథ్యం వహిస్తుండగా... న్యూజిలాండ్‌తో టి20 సిరీస్‌లో ఆకట్టుకున్న మీడియం పేసర్ మల్కీ మదారాకు తొలిసారి వన్డే జట్టులో చోటు దక్కింది. ఈ టోర్నమెంట్‌లో ఒక్కో జట్టు మిగిలిన రెండు జట్లతో రెండేసి సార్లు తలపడనుంది. మ్యాచ్‌లన్నీ ప్రేమదాస స్టేడియంలోనే జరగనున్నాయి. వచ్చే నెల 11న ఫైనల్ జరుగుతుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకతో భారత అమ్మాయిల జట్టు అమీతుమీ తేల్చుకోనుంది.

శ్రీలంక జట్టు: చమరి ఆటపట్టు (కెప్టెన్), హర్షిత సమరవిక్రమ, విష్మి గుణరత్నె, నీలాక్షిక సిల్వ, కవిషా దిల్హారి, అనుష్క సంజీవని, మనుడి ననయక్కర, హాసిని పెరెరా, అచిని కులసూర్య, పియూమి బడాల్గే, దేవ్‌మి విహంగ, హన్సిమ కరుణరత్నె, మల్కీ మదారా, ఇనోషి ప్రియదర్శిని, సుగంధిక కుమారి, రష్మిక, ఇనోక రణవీర.

తాజ్ మహల్‌ను సందర్శించిన జేడీ వాన్స్

ఆగ్రా/జైపూర్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబం తాజ్ మహల్‌ను సందర్శించింది. తన భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో కలిసి బుధవారం ఉదయం తాజ్ మహల్‌కు చేరుకున్న జేడీ వాన్స్.. తాజ్ మహల్ అంతటా కలియదిరిగారు. ఓ గంటపాటు ఆ అద్భుత నిర్మాణాన్ని వీక్షించారు. సందర్శన అనంతరం 'తాజ్ మహల్ ఓ అద్భుతం. నిజమైన ప్రేమకు, మానవ నైపుణ్యానికి నిదర్శనం'అని వాన్స్ సందర్శకుల డైరీలో రాశారు. అంతకుముందు జైపూర్ నుంచి ఆగ్రా విమానాశ్రయానికి చేరుకున్న వాన్స్ కుటుంబానికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘనంగా స్వాగతం పలికారు. వారు ఆగ్రా విమానాశ్రయం నుంచి తాజ్ మహల్ వరకు కారులో ప్రయాణించారు. వారి కాన్వాయ్ మార్గం వెంబడి ఉన్న మార్గాలను ప్రత్యేకంగా అలంకరించారు. వందలాది మంది పాఠశాల పిల్లలు వీధుల్లో నిలబడి, అమెరికా-భారత్‌ల జాతీయ పతాకాలను ఎగురవేశారు. తాజ్ మహల్ దారి పొడవునా రంగురంగుల ముగ్గులు, ఇసుకతో బొమ్మలు సహా వివిధ అలంకరణలతో పండుగ వాతావరణాన్ని సృష్టించారు. వాన్స్ కుటుంబానికి స్వాగతం పలుకుతూ పలు చోట్ల భారీ హోర్డింగులు కూడా ఏర్పాటు చేశారు. హైప్రొఫైల్ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పర్యటన అనంతరం వాన్స్ కుటుంబం జైపూర్‌కు తిరిగి వచ్చింది. ముందే షెడ్యూల్ అయిన జైపూర్ సిటీ ప్యాలెస్ పర్యటనను వారు రద్దు చేసుకుని, నేరుగా రామ్ బాగ్ ప్యాలెస్‌కు వెళ్లారు. నాలుగు రోజుల భారత పర్యటనలో ఉన్న వాన్స్ కుటుంబం గురువారం ఉదయం అమెరికాకు తిరిగి వెళ్లనుంది.



కశ్మీర్ పర్యాటక రంగానికి కోలుకోలేని దెబ్బ

- కశ్మీర్‌లో 80 శాతం రిజర్వేషన్లు రద్దు
- ఢిల్లీలో రద్దయిన 90 శాతం రిజర్వేషన్లు

శ్రీనగర్/న్యూఢిల్లీ: పహల్గాంలో ఉగ్రవాదుల దాడి.. జమ్మూకశ్మీర్ పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జమ్మూకశ్మీర్ పర్యటనకు ప్లాన్ చేసుకున్నవారంతా ఇప్పుడు రిజర్వేషన్లు రద్దు చేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లోని ట్రావెల్ ఏజెన్సీల్లో దాదాపు 90శాతం రిజర్వేషన్లు రద్దయ్యాయి. గతంలో కశ్మీర్‌లో ఉగ్రదాడులు జరిగాయి. కానీ ఈ దాడుల్లో ఇంతకు ముందెన్నడూ పర్యాటకులను గుర్తించి చంపలేదు. పహల్గాం సంఘటన తర్వాత మాత్రం మొత్తం పర్యాటక పరిశ్రమ, భాగస్వాములందరినీ ప్రభావితం చేసింది. కశ్మీర్‌లో దాదాపు 80శాతం రిజర్వేషన్స్ రద్దయ్యాయి. జమ్మూకశ్మీర్‌కు దాదాపు 90 శాతం బుకింగ్‌లను పర్యాటకులు రద్దు చేసుకున్నట్లు ఢిల్లీలోని పలు ట్రావెల్ ఏజెన్సీలు తెలిపాయి. వచ్చే నెలలో కశ్మీర్‌లో పర్యటించడానికి రిజర్వేషన్లు చేసుకున్నారని, ఇప్పుడు ఇప్పుడు రద్దు చేయాలని కోరుతున్నారని వెల్లడించాయి. కశ్మీర్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన గుల్మార్గ్, హౌజ్ వ్యాలీ, తులిప్ గార్డెన్స్ ఎక్కువగా బుక్ అయ్యాయని, ఇప్పుడు అవన్నీ రద్దయ్యాయని తెలిపారు. అక్కడకు వెళ్లి ప్రాణాలను పణంగా పెట్టబోమని, రిఫండ్ చేయాలని కోరుతున్నారని ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు. అయితే కొంతమంది పర్యాటకులు కశ్మీర్‌కు బదులుగా వేరే ప్రాంతాలకు మార్చుకుంటున్నారని ఢిల్లీలోని ట్రావెల్ ఏజెన్సీలు నివేదించాయి. ''కొన్ని కుటుంబాలు బస్సు, విమాన టిక్కెట్ల నుంచి హోటళ్ల వరకు అన్నీ ముందుగానే బుక్ చేసుకున్నారు. అయితే ఉగ్రదాడి వార్త తెలిసిన మరుక్షణం నుంచే రద్దు చేయాలని మాకు కాల్స్ రావడం ప్రారంభించాయి''అని ఓ ట్రావెల్స్ యజమాని తెలిపారు. జమ్మూకశ్మీర్ పర్యటనకు కీలక కేంద్రంగా ఉన్న కోల్‌కతాలోనూ అనేక మంది రిజర్వేషన్లను రద్దు చేసుకున్నారు. తమ రిజర్వేషన్లను రద్దు చేయాలని లేదా వాయిదా వేయాలని క్లయింట్ల నుంచి నిరంతరాయంగా కాల్స్ వస్తున్నాయని టూర్ ఆపరేటర్లు చెబుతున్నారు. అయితే.. జమ్మూకశ్మీర్‌కు బుకింగ్ చేయడం నిలిపేయాలని ఆదేశాలు వచ్చినట్లు మరికొన్ని ట్రావెల్ ఏజెన్సీలు తెలిపాయి. అన్ని రవాణా, బుకింగ్‌లను నిలిపివేయాలని ట్రావెల్ అసోసియేషన్ ఆఫ్ శ్రీనగర్ తమను ఆదేశించిందని, తదుపరి నోటీసు వచ్చే వరకు జమ్మూకశ్మీర్ పర్యటనలకోసం కొత్త బుకింగ్‌లు చేయబోమని ప్రకటించాయి.

ఇప్పట్లో కశ్మీర్‌కు పర్యాటకులు రావడం కష్టమే...

'పర్యటనలు రద్దు చేసుకుని పర్యాటకులు వెళ్లిపోతున్నారు. మరో నెల రోజుల ప్యాకేజీలను కూడా రద్దు చేశారు. ఇలాంటి ఘటనల తరువాత కూడా పర్యాటకులు ఇక్కడ ఉంటారని, వెంటనే ఇక్కడికి వస్తారని ఆశించలేం. గత కొన్నేళ్లుగా చేసిన మంచి పనులన్నీ వృథాగా పోయాయి. కశ్మీర్‌కు మళ్లీ పర్యాటకులను రప్పించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది'శ్రీనగర్‌కు చెందిన ట్రావెల్ ఆపరేటర్ ఐజాజ్ అలీ తెలిపారు.

నష్టాన్ని తగ్గిస్తాం: కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

పహల్గాం దాడి నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో పర్యాటక రంగంపై పడే నష్టాన్ని తగ్గించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. జమ్మూకశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పర్యాటక శాఖ కార్యదర్శితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు.

ఎక్కడికక్కడ భద్రత...

భయంతో చాలామంది పర్యాటకులు వెళ్లిపోతుండగా.. చాలా కొద్దిమంది ఉండేందుకు సుముఖత చూపుతున్నారు. 'దాడి గురించి వినగానే భయం వేసింది. ముంబైకి తిరిగి వెళ్లాలనుకున్నాం. కానీ హోటల్ సిబ్బంది మేం సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేలా చేశారు. మాకు ఎలాంటి భయం లేదు. ఎక్కడికక్కడ భద్రత ఉంది. పహల్గాం సందర్శించాలి అనుకుంటున్నాం. పరిస్థితి బాగుంటే రేపు అక్కడికి వెళ్తాం. బయటకు వచ్చి చూడగా ఎక్కడ చూసినా పోలీసులు, సైన్యం ఉండడంతో టూరిస్టులు సేఫ్‌గా ఫీలవుతున్నారు. ఇప్పుడు భయం తగ్గుముఖం పడుతోంది'అని మహారాష్ట్రకు చెందిన ఓ పర్యాటకురాలు చెబుతున్నారు.

శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమానాలు

పహల్గామ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక చర్యలు

- ఢిల్లీ, ముంబైకి నాలుగు ప్రత్యేక విమానాల ఏర్పాటు
- టికెట్ల ధరలు పెంచరాదని విమాన సంస్థలకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. బాధిత పర్యాటకులు, మృతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేసింది. ఉగ్రదాడి జరిగిన తర్వాత వెంటనే కేంద్ర హోంమంత్రితో సమన్వయంతో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు చర్యలు చేపట్టి, శ్రీనగర్ నుంచి ఢిల్లీకి రెండు, ముంబైకి రెండు ప్రత్యేక విమానాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అవసరమైతే మరిన్ని విమానాలను సిద్ధంగా ఉంచేలా కూడా చర్యలు చేపడతామని తెలిపారు. ఇలాంటి విపత్కర సమయంలో ప్రయాణికులపై భారం పడరాదన్న ఉద్దేశంతో విమాన ధరలకు రెక్కలకు బ్రేక్ వేస్తూ ఏకకాలంలో టికెట్ల ధరలు పెరగకుండా ఉండేందుకు అన్ని ఎయిర్‌లైన్స్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, కశ్మీర్‌లో ఉన్న తెలుగు పర్యాటకుల రాకపోకలు సమన్వయం చేసేలా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా, పహల్గామ్ వద్ద ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖపట్నం వాసి చంద్రమౌళి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే విశాఖ కలెక్టర్‌తో మాట్లాడి, మృతదేహాన్ని గౌరవంగా విమానమార్గంలో తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మృతుల తరలింపునకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎయిర్‌లైన్స్, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తున్నారు.

చొరబాటుకు ప్రయత్నించిన ఇద్దరు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని సైన్యం భగ్నం చేసింది. బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉత్తర కశ్మీర్ జిల్లాలోని యురీ నాలాలో నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నించినట్లు సైన్యం తెలిపింది. 'ఏప్రిల్ 23, 2025 న, బారాముల్లా (ఉత్తర కాశ్మీర్)లోని యురి నాలా వద్ద జనరల్ ఏరియా సర్జీవన్ గుండా సుమారు 2-3 యుఐ ఉగ్రవాదులు చొరబడటానికి ప్రయత్నించారు. నియంత్రణ రేఖ వద్ద ఉన్న దళాలు చొరబాటుదారులను తిప్పికొట్టాయి. ఫలితంగా భారీ ఎదురు కాల్పులు జరిగాయి. ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టాం'అని చినార్ కార్ప్స్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఉగ్రవాదుల నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఇతర యుద్ధ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని, ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొంది.

కుల్గాం జిల్లాలోనూ...: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. తంగ్‌మార్గ్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో ఉగ్రవాద దాడిలో 26 మంది మృతి చెందిన 24 గంటల్లోనే ఈ చొరబాటు యత్నం, ఎదురుకాల్పులు జరగడం గమనార్హం.

బూత్ లెవల్ ఏజెంట్లకూ ఈసీ శిక్షణ

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారిగా బూత్ లెవల్ ఏజెంట్(బీఎల్ఏ)లకూ శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల ప్రక్రియలో క్షేత్రస్థాయిలో రాజకీయపార్టీల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎలక్షన్ కమిషన్.. బీఎల్ఏలకు శిక్షణ ఇవ్వడం మొదలెట్టింది. ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్(ఐఐఐడీఈఎం) భవనంలో ఈ శిక్షణ ఆరంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో బిహార్‌లోని 10 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన దాదాపు 280 మంది బీఎల్ఏలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు బీఎల్ఏలనుద్దేశిస్తూ ప్రసంగించారు. మార్చి నాలుగోతేదీన జరిగిన చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల సమావేశంలో బీఎల్ఏల శిక్షణ అంశంపై తుది నిర్ణయం తీసుకున్నారు. ప్రజా ప్రతినిధుల చట్టం, 1950, 1951, ఎలక్టర్ రిజిస్ట్రేషన్ నిబంధనలు-1960, ఎన్నికల నిబంధనల అమలు-1961లతో సమకాలీనంగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమనిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా బీఎల్ఏలు నడుచుకునేలా ఈ శిక్షణా కార్యక్రమం ఎంతగానో దోహదంచేయనుంది. ఎన్నికల నిబంధనల ప్రకారం తమ పాత్ర, బాధ్యతలు ఎలాంటివో ఈ శిక్షణ తర్వాత బీఎల్ఏలకు మరింత స్పష్టమైన అవగాహన వస్తుందని కేంద్ర ఎన్నికల సంఘం ఆశిస్తోంది. ఇందుకోసమే బీఎల్ఏలకు శిక్షణా కార్యక్రమం ఆచరణలోకి వచ్చింది.

జెలెన్‌స్కీ యుద్ధాన్ని పొడిగిస్తున్నారు: ట్రంప్

కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. శాంతి ఒప్పందంలో భాగంగా క్రిమియాను రష్యాకు అప్పగించే విషయంలో వెనక్కి తగ్గకుండా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని జెలెన్‌స్కీ పొడిగిస్తున్నారని బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ భూభాగాన్ని రష్యాకు అప్పగించే ఆలోచనను తోసిపుచ్చిన జెలెన్‌స్కీ 'మాట్లాడటానికి ఏమీ లేదు. ఇది మా భూమి, ఉక్రేనియన్ ప్రజల భూమి' అని మంగళవారం ఉద్ఘాటించారు. ఆ వ్యాఖ్యలపై స్పందించిన ట్రంప్.. ఈ ప్రకటన రష్యాతో శాంతి చర్చలకు చాలా హానికరమన్నారు. ఇది చర్చనీయాంశం కూడా కాదని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాశారు. బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే ఉక్రెయిన్ క్రిమియాను కోల్పోయిందని, క్రిమియా కావాలనుకుంటే పదకొండేళ్ల కిందట రష్యాకు అప్పగించినప్పుడు వారు దాని కోసం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు.

చివరి నిమిషంలో సమావేశం రద్దు..

కీవ్: రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కోసం బుధవారం లండన్‌లో జరగాల్సిన సమావేశం చివరి నిమిషంలో రద్దయ్యింది. మూడేళ్లకు పైగా సాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు పలు దేశాలు చేస్తున్న ప్రయత్నాల్లో పురోగతి కనిపించకపోవడం, షెడ్యూల్ సమస్య కారణంగా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆకస్మిక రద్దుతో చర్చల దిశపై సందేహాలు వ్యక్తమయ్యాయి. శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు పుతిన్ ప్రకటించినా.. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తూనే ఉంది. 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని రష్యా ఉల్లంఘించడంతో ఉక్రెయిన్ ప్రతి దాడులకు దిగింది. వెయ్యి కిలోమీటర్ల ఫ్రంట్ లైన్ వెంబడి ఇరు పక్షాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. శాంతి ఒప్పందంపై సమావేశం జరుగుతుందని భావించిన బుధవారం ఉదయం కూడా రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసింది. తూర్పు ఉక్రెయిన్‌లో కార్మికులతో వెళ్తున్న బస్సుపై రష్యా చేసిన దాడిలో ఏడుగురు మహిళలు, ఇద్దరు పురుషులు మరణించారు. 40 మందికి గాయపడ్డారు.

ఇస్తాంబుల్‌లో 6.2 తీవ్రతతో భూకంపం

ఇస్తాంబుల్: తుర్కియే రాజధాని ఇస్తాంబుల్‌లో బుధవారం 6.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. టికిర్డాగ్, యలోవా, బుర్సా, బాలికేసిర్ ప్రావిన్సులతోపాటు ఇస్తాంబుల్‌కు దక్షిణంగా 550 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇజ్మీర్ నగరంలోనూ భూమి తీవ్రంగా కంపించింది. మధ్యాహ్నం 12:49 గంటలకు ఒకేసారి భూమి కంపించడంతో భయాందోళనకు గురైన స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరు భవనాలపై నుంచి దూకి గాయపడ్డారు. భూకంపం వల్ల ఎలాంటి ప్రాణహాని జరగలేదని తుర్కియే విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా, పలు జిల్లాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలు కూలిపోయాయి. తుర్కియేలో రెండు ప్రధాన ఫాల్ట్ లైన్లు ఉండటంతో భూకంపాలు తరచుగా సంభవిస్తాయి. 2023 ఫిబ్రవరి 6న 7.8 తీవ్రతతో ఒకసారి, వెంటనే 11 తీవ్రతతో మరోసారి భూకంపం సంభవించింది. దీంతో 53,000 మంది మరణించారు.



వాటికన్ నగరంలో సెయింట్ పీటర్ స్క్వేర్ మీదుగా పోప్ ఫ్రాన్సిస్ భౌతికకాయం తరలింపు. సెయింట్ బసిలికా చర్చిలో ప్రజల సందర్శనార్థం మూడు రోజులు ఉంచుతారు. ఇన్‌సెట్‌లో పోప్ ఫ్రాన్సిస్ భౌతికకాయం.

గాజా పాఠశాలపై దాడి

27 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: హమాస్‌తో యుద్ధాన్ని ముగించే ప్రతిపాదనపై అరబ్ దేశాలు పని చేస్తుండగా.. ఇజ్రాయెల్ దాడులు 27 మంది పాలస్తీనియన్లను పొట్టనబెట్టుకున్నాయి. పౌరులు ఆశ్రయం పొందిన గాజా నగరంలోని పాఠశాల భవనంపై ఇజ్రాయెల్ చేసిన వైమానిక దాడిలో 23 మంది మృతి చెందారు. అదే ప్రాంతంలోని రెండు ఇళ్లపైనా జరిపిన దాడుల్లో మరో నలుగురు మృతి చెందారు. బందీలందరినీ విడుదల చేసి, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధానికి ముగింపు పలకాలని హమాస్‌కు పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ పిలుపునిచ్చారు.

హిందూ ప్రొఫెసర్‌ను కల్మా చదివితే వదిలేశారు

న్యూఢిల్లీ: కల్మా చదవగలడం దేబాశిష్ భట్టాచార్య అనే హిందూ ప్రొఫెసర్ ప్రాణాలు కాపాడింది. ఆయన సిల్చార్‌లోని అస్సాం వర్సిటీలో బెంగాలీ బోధకుడు. సెలవుల్లో కుటుంబంతో కలిసి బైసారన్ వెళ్లారు. ఉగ్రవాదులు ఆయన కుటుంబాన్ని చుట్టుముట్టారు. అప్పుడేం జరిగిందో దేబాశిష్ భయం భయంగా గుర్తు చేసుకున్నారు. ''మగవారిని వరుసగా నిలబెట్టారు. కల్మా చదవమన్నారు. ఒక ఉగ్రవాది నా పక్కతన్ని కాల్చిపారేశాడు. నావైపు తిరిగి 'నువ్వేం చేస్తా'వని అడిగాడు. నేనేమీ బదులివ్వలేదు. నా చుట్టూ ఉన్నవాళ్లు నేలపై మోకాళ్ల మీద కూచుని ఇస్లాంలో మౌలిక విశ్వాసానికి ప్రతీకైన కల్మా చదవడం మొదలుపెట్టారు. నేనూ వారినే అనుసరిస్తూ బిగ్గరగా కల్మా చదవడం మొదలుపెట్టా. ఏమైందో తెలియదు, ఆ ఉగ్రవాది నన్ను కాల్చకుండానే వెనక్కు తిరిగి వెళ్లిపోయాడు. ఉగ్రవాదులంతా వెళ్లిపోగానే నా భార్య, కొడుకుతో కలిసి కంచె దూకి మరీ పరిగెత్తుకుంటూ పారిపోయాం. ఎక్కడా ఆగకుండా రెండు గంటలు నడిచాం. చివరికి ఓ స్థానికుడు దగ్గరుండి పహల్గాంలో దిగబెట్టాడు'' అని చెప్పాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన సుశీల్ నాథనియల్ (58) అనే ఎల్ఐసీ అధికారిని కల్మా చదవలేకపోవడంతో కాల్చేశారు. క్రైస్తవుడైన ఆయన ఈస్టర్ జరుపుకునేందుకు భార్యాపిల్లలతో కలిసి కశ్మీర్ వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. కూతురు ఆకాంక్షను ఉగ్రవాదులు కాళ్లపై కాల్చారు. పుణేకు చెందిన ఓ వ్యాపారిని కూడా కల్మా చదవలేకపోవడంతో కాల్చేశారు.

ఉగ్రదాడిపై నేడు అఖిలపక్ష సమావేశం

న్యూఢిల్లీ: పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ప్రభుత్వం గురువారం అఖిలపక్ష సమావేశం కానుంది. దీనికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించనున్నారు. ఈ అంశంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ వివిధ పార్టీల నేతలతో మాట్లాడుతున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేయడంతో కేంద్రం నిర్ణయం తీసుకుంది. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని 26 మందిని పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడి గురించి వివిధ పార్టీల నేతలకు రాజ్‌నాథ్ వివరించనున్నారు.

పొగచూరి ఎండతగలక.. చల్లబడిన న్యూయార్క్!

3 డిగ్రీ సెల్సియస్‌ల ఉష్ణోగ్రత తగ్గుదల • వాతావరణ మార్పుల దుష్ప్రభావాన్ని చవిచూసిన మహానగరం

కెనడా కార్చిచ్చే కారణం • తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూయార్క్: సూరీడుని అదృశ్య శక్తి మింగేయడం, దాంతో భూమి మీద సూర్యరశ్మి కరువై ఒక్కసారిగా వాతావరణం చల్లబడం వంటి అభూత కల్పనల్లో వింటుంటాం. అలాంటి అరుదైన, వింత ఘటనకు అగ్రరాజ్యం వేదికైంది. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 2023 జూన్‌లో భానుడు భగభగ మండుతున్నా సిటీలో మాత్రం వాతావరణం చల్లబడింది. ఆ నగరంలో భూమిపై సూర్యరశ్మి ప్రసరణ తగ్గిపోవడమే కారణం. ఆనాడు సమీప కెనడా దేశంలోని అటవీకార్చిచ్చు కారణంగా దట్టంగా కమ్ముకున్న దుమ్ము, ధూళి మేఘాల కారణంగా న్యూయార్క్‌లో ఆకాశం మొత్తం మసకబారి సూర్య కిరణాలకు కాస్తంతయినా జాగా లేకుండా పోయిందని, అందుకే ఉష్ణోగ్రత మూడు డిగ్రీ సెల్సియస్ తగ్గిందని ఒక అధ్యయనం తాజాగా వెల్లడించింది. సంబంధిత అధ్యయన వివరాలు నేచర్ కమ్యూనికేషన్స్ ఎర్త్ అండ్ ఎన్విరాన్మెంట్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. భూఉపరితాన్ని సూర్యరశ్మి తాకలేకపోవడంతో కాస్తంత వెలుతురు, వేడి తగ్గడాన్ని 'గ్లోబల్ డిమ్మింగ్'అంటారు. వాతావరణ మార్పుల దుష్పరిణామాలకు ఇది సంకేతమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గాలిని మరింత గరళం చేసే వాయువులు భూ వాతావరణంలో చిక్కుబడిపోవడంతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని రట్గర్స్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు చెప్పారు.

ఏకంగా 1,000 కిలోమీటర్లు ప్రయాణించి..

ఫిలిప్ డెమొక్రిటో, జార్జియస్ కెలిసిడీస్‌ల సారథ్యంలోని పరిశోధనా బృందం కెనడా దావానలం తాలూకు పొగ, ధూళి ఏకంగా 1,000 కిలోమీటర్ల దూరం ప్రయాణించి న్యూయార్క్, న్యూజెర్సీ నగరాలను కమ్మేసిన వైనాన్ని ఈ బృందం పరిశోధించింది. ''ఈ దుమ్ము, ధూళి మేఘాల్లోని గోధుమ రంగ కర్బన ఆర్గానిక్ అణువుల కారణంగానే సూర్యరశ్మి భూమిని తాకలేకపోయింది. ఉష్ణోగ్రత తగ్గడానికి ఇదే కారణం. ఈ భారీ 'దుమ్ము గొడుగు'కారణంగా స్వేచ్ఛగా ప్రయాణించాల్సిన సహజ గాలికి సైతం ఆటంకాలు ఏర్పడ్డాయి. గాలి అటు ఇటూ వేగంగా వెళ్లే పరిస్థితిలేకపోవడంతో ఎక్కడి వాయు కాలుష్యం అక్కడే గాఢంగా పరుచుకుపోయింది. ఈ కాలుష్య గాలిలోని సూక్ష్మధూళి కణాలు అలాగే భూమి సమీప వాతావరణంలోనే తిష్టవేశాయి. ఈ సమయంలో న్యూయార్క్ నగరంలో సూక్ష్మ ధూళి కణాలు(2.5 పీఎం) అత్యంత ఎక్కువ స్థాయిలో పోగుబడ్డాయి. పర్యావరణ పరిరక్షణా సంస్థ నిర్దేశించిన స్థాయి కంటే ఏకంగా మూడు రెట్లు ఎక్కువ సూక్ష్మధూళి కణాలు వాతావరణంలో ఉండిపోయాయి. ఇక ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుచేసిన స్థాయి కంటే ఎనిమిది రెట్లు ఎక్కువగా సూక్ష్మ ధూళి కణాలు నగర గాలిలో ఉన్నాయి''అని పరిశోధకులు చెప్పారు.

వ్యాధి నిరోధక శక్తి సగానికి..

ఊహించనంతగా పెరిగిన వాయుకాలుష్యం కారణంగా స్థానికులను శ్వాస సంబంధ సమస్యలు చుట్టుముట్టాయని అధ్యయనకారులు తెలిపారు. రట్గర్స్ బృందం చేసిన మరో పరిశోధన ఎన్విరాన్మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నల్‌లో ప్రచురితమైంది. ఈ పెను వాతావరణ పోకడ కారణంగా నగరంలోని ప్రతి ఒక్క ఒక్కరి ఊపిరితిత్తుల్లోకి అదనంగా సగటున 9.3 మిల్లీగ్రాముల బరువైన పొగ అణువులు చొరబడ్డాయని దీంతో ఇన్ఫెక్షన్లతో పోరాడే వాళ్ల వ్యాధినిరోధక శక్తి సామర్థ్యం ఏకంగా 50 శాతం క్షీణించిందని ఆ పరిశోధన పేర్కొంది. కెనడాలో కార్చిచ్చు ఘటనలు కొనసాగినన్ని రోజులూ న్యూయార్క్‌లో ఆస్తమా సంబంధ కేసులు 44 శాతం నుంచి ఏకంగా 82 శాతానికి పెరిగాయని ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని పరిశోధన ఉదహరించింది. ''ఈ ప్రాంతంలో ఇలాంటి దృగ్విషయం జరగడం ఇదే తొలిసారి. అయితే ఇదే చివరిసారి అని మాత్రం చెప్పలేం. వాతావరణ మార్పుల కారణంగా ఇలాంటి మళ్లీ సంభవించే ప్రమాదం ఉంది''అని పరిశోధకుడు ఫిలిప్ డెమొక్రిటో ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలో వాతావరణ మార్పుల కారణంగా ఇకపై తరచూ, అత్యధికంగా కార్చిచ్చు ఘటనలు సంభవించి ఈశాన్య అమెరికాకు కాలుష్య కష్టాలు పెరిగే అవకాశముందని ఫిలిప్ విశ్లేషించారు. కార్చిచ్చులకు, పట్టణ ప్రాంతంలో వాతావరణంలో మార్పులకు, ప్రజారోగ్యానికి మధ్య సంబంధాలను ఈ పరిశోధన విశదీకరించింది.

రాజీనామా చేయకపోతే బెయిల్ రద్దు!

తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీకి సుప్రీం హెచ్చరిక

న్యూఢిల్లీ: తమిళనాడు మంత్రి పదవికి రాజీనామా చేయకపోతే బెయిల్ రద్దు చేస్తామని డీఎంకే నేత వి.సెంథిల్ బాలాజీని సుప్రీంకోర్టు హెచ్చరించింది. పదవి కావాలో? స్వేచ్ఛ కావాలో? తేల్చుకోవాలని సూచించింది. ఉద్యోగాల కోసం నగదు కుంభకోణానికి సంబంధించిన కేసులో బాలాజీకి సెప్టెంబర్ 26న బెయిల్ మంజూరు చేశారు. అయితే.. బెయిల్ మంజూరైన కొద్ది రోజులకే బాలాజీని తిరిగి తమిళనాడు మంత్రిగా నియమించారు. బాలాజీ విడుదలైన తర్వాత మంత్రి అయినందున, ఈ కేసులోని సాక్షులను బెదిరిస్తున్నారని, కోర్టు ఇచ్చిన తీర్పును రీకాల్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం చేపట్టింది. బెయిల్ మంజూరు చేయడం అంటే సాక్షులను ప్రభావితం చేసే అధికారం ఇచ్చినట్లు కాదని ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు సాక్షులను ప్రభావితం చేస్తారని తీవ్ర భయాందోళనలు ఉన్నాయి. పదవి (మంత్రి), స్వేచ్ఛ రెండింటిలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాలి. ఏ నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నారో మాకు చెప్పండి'అని పేర్కొంది. మనీలాండరింగ్ కేసుల్లో కోర్టు రూపొందించిన ఉదార బెయిల్ చట్టాన్ని రాజకీయ నాయకులు దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కొంత సమయం కావాలంటూ బాలాజీ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ చేసిన అభ్యర్థనను అంగీకరించిన అత్యున్నత న్యాయస్థానం విచారణను ఏప్రిల్ 28కి వాయిదా వేసింది.

తొలి తెలుగు చరిత్రకారుడు ఏకామ్రనాథుడు



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయానంతర యుగం

భాష-సాహిత్యం

దేవగిరి యాదవులు, కాకతీయులపై ఢిల్లీ సుల్తాన్ల దండయాత్ర సమయంలో ఉర్దూ భాష దక్కన్ ప్రాంతంలో ప్రవేశించింది. ఉర్దూ భాష ఈ ప్రాంతంలో దక్కనీ ఉర్దూగా మారింది. తెలంగాణ భాషా సాహిత్యాలపై తనదైన ముద్ర వేసింది. పద్మనాయకుల రాజ్యంలో సంస్కృతంతోపాటు, తెలుగు భాషా సాహిత్యాలు ఆదరణ పొందాయి. సర్వజ్ఞ సింగభూపాలుడు రచించిన సారంగధరచరిత్రను తొలి యక్షగానంగా భావించవచ్చు. ఇతణ్నే ఒకటో సింగ భూపాలుడిగా పిలుస్తారు. అతడి కుమారుడైన అనపోతానాయకుడు రాచకొండ రాజ్యాన్ని విస్తరించాడు. అన పోతానాయకుడు కవి పండిత పోషకుడు. ఇతడు 'అభిరామ రాఘవమ'నే నాటకాన్ని రాశాడు.

విశ్వేశ్వరుడు చమత్కార చంద్రిక అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. దీన్ని సంస్కృత లక్షణ గ్రంథాలైన ధ్వన్యాలోకం, కావ్య ప్రకాశంతో పోల్చవచ్చు. ప్రతాపరుద్ర యశోభూషణం తరహాలోనే ఈ గ్రంథంలోని శ్లోకాలు కూడా సింగ భూపాలుడి ప్రశంసతో ఉన్నాయి. ఈ గ్రంథం నాటి చారిత్రక విషయాలను తెలుపుతోంది. వీరభద్ర విజృంభణం(డిమం), కరుణాకందళం(అంకం) ఇతడి ఇతర రచనలు. విశ్వేశ్వరుడు.. అనపోతానాయకుడి, రెండో సింగ భూపాలుడి ఆస్థానాల్లోనూ స్థానం పొందాడు. అనపోతనాయకుడి మరో ఆస్థానకవి పశుపతి నాగనాథ కవి. ఇతడు విశ్వేశ్వరుడి శిష్యుడు. ఇతడు మదన విలాసం(సంస్కృతం), విష్ణుపురాణం అనే గ్రంథాలను రచించాడు. మదన విలాసంలో పద్మనాయకుల చరిత్ర విశేషాలు కనిపిస్తాయి. ధర్మపురికి చెందిన గొప్ప పండితుడు నరసింహసూరి. ఇతడు విద్యారణ్య స్వామి సమకాలికుడు. ఇతడు ప్రయోగపారిజాతం అనే స్మృతి గ్రంథాన్ని రచించాడు.

అనపోతానాయకుడి కుమారుడైన రెండోసింగ భూపాలుడు బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి. ఇత డికి సంగీతం, నాటకం, నాట్యంలో మంచి ప్రావీణ్యం ఉంది. విశ్వేశ్వరుడు, నాగనాథుడు, బొమ్మకంటి అప్పయాచార్యుడు, శాకల్య మల్ల భట్టు తదితర కవి పండితులను పోషించాడు. రెండో సింగభూపాలుడు రసార్ణవ సుధాకరమనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. ఇతడి మరో ప్రసిద్ధ గ్రంథం సంగీత సుధాకరం. కందర్ప సంభవం అనే డిమం (నాటక భేదం)ను, కువలయావళి అనే నాటికను ఇతడు రచించాడు.

రాచకొండకు చెందిన మరో కవి మాధవ భూపాలుడు(రావుమాదానీడు). ఇతడు రామాయణానికి రాఘవీయ వ్యాఖ్య రాశాడు. ఇతడే 1376లో శ్రీశైల ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర బృహత్ శిలా మండపం కట్టించాడు. మాయిభట్టు దీనికి శాసనం రాశాడు. ఈ శాసన కావ్యంలో 28 శ్లోకాలు ఉన్నాయి. ఇందులో మాధవ నాయకుడి శౌర్య పరాక్రమాలను వర్ణించారు. మాధవ భూపాలుడి భార్య నాగాంబిక. ఈమె ఒక తటాకాన్ని నిర్మించింది. దాని కోసం 1429లో నాగారం శాసనాన్ని వేయించింది. ఈ శాసన రచయిత శంభునాథ కవి.

పద్మనాయకులతో సంబంధం లేకపోయినా ఈ యుగానికి చెందినవాడు కందనామాత్యుడు. ఇతడు సబ్బినాడు(కరీంనగర్, వరంగల్) పాలకుడైన ముప్ప భూపాలుడి మంత్రి. పద్మపురాణం, భాగవత దశమ స్కంధాలను మడికి సింగన, కందనామాత్యుడికి అంకితమిచ్చాడు. కందనామాత్యుడు రచించిన నీతితారావళి ద్వారా ఆ కాలం నాటి వ్యక్తుల ప్రవర్తనను తెలుసుకోవచ్చు. మడికి సింగన రచించిన 'సకలనీతి సమ్మతం' తెలుగులో తొలి సంకలన గ్రంథం. కాలగర్భంలో కలిసిపోయిన చాలామంది కవులపేర్లు ఈ గ్రంథం ద్వా రా తెలుస్తున్నాయి. 21 గ్రంథాల నుంచి లోక, రాజ నీతులను సంపుటీకరించిన గ్రంథమిది. ఇతడు పద్మ పురాణోత్తర ఖండం, భాగవత దశమ స్కంధం, జ్ఞానవాసిష్ట రామాయణం తదితర రచనలు చేశాడు.

తొలి కవయిత్రి గంగాదేవి

ఈ యుగానికి చెందిన తొలి కవయిత్రి గంగాదేవి. కాకతీయుల ఆడపడచు అయిన గంగాదేవి విజయనగర రాజైన బుక్కరాయల కోడలు. కంపరాయల భార్య. ఈమె సంస్కృతంలో 'మధురావిజయ'మనే కావ్యాన్ని రచించింది. నాగేంద్రకవి తొలి శతకాల్లో ఒకటిగా పేర్కొనదగిన రమాధీశ్వర శతకాన్ని రచించాడు. ఇతడు భువనగిరికి చెందినవాడు. కవి భల్లటుడు గణమంజరి, పదమంజరి, శూద్రక రాజ చరిత్ర, భేతాళ పంచవింశతి, విక్రమార్క చరిత్ర (తెలుగు) అనే కావ్యాలను రాశాడు.

పోతన కొంత కాలం మూడో సింగభూపాలుడి ఆస్థానంలో ఉన్నాడు. పోతనను ఒంటిమిట్ట నుంచి ఓరుగల్లు తీసుకురావడానికి ఎంతో శ్రమించాల్సి వచ్చింది. దేశీఛందస్సును పాల్కురికి ప్రవేశ పెట్టాడు. పోతన దీన్ని స్వీకరించలేదు. కానీ దేశీ కవిత్వంలోని సరళత్వం ఇతడి కవిత్వంలో కనిపిస్తుంది. పోతన భోగినీ దండకంలో నాటి రాజుల భోగలాలసత్వాన్ని వర్ణించాడు. ఇతడు రాజాశ్రయాన్ని తిరస్కరించి ప్రత్యామ్నాయ సంస్కృతికి పట్టం కట్టాడు. మూడో సర్వజ్ఞ సింగభూపాలుడు స్వయంగా గొప్ప పండితుడు. వెలుగోటి వంశావళిలో పేర్కొన్న శ్రీనాథుడి పద్యం ద్వారా ఈ విషయం తెలుస్తోంది. మల్లినాథసూరి మెదక్ జిల్లా కొలిచెలిమకు చెందినవాడు. ఇతడు రఘువంశం, కుమార సంభవం, మేఘ సందేశం, కిరాతార్జునీయం, శిశుపాలవధకు వ్యాఖ్యానాలు రాశాడు. మల్లినాథసూరి తమ్ముడైన పెద్దిభట్టు సంస్కృతంలో గొప్ప పండితుడు. పెద్దిభట్టు కుమారుడైన కొలిచెలిమ కుమారస్వామి సోమపీథి(సోమయాజి) కూడా గొప్ప వ్యాఖ్యాత. ఇతడు ప్రతాపరుద్రీయానికి రత్నాపణం అనే వ్యాఖ్యానం రాశాడు. రాచకొండకు చెందిన బొమ్మకంటి హరిహరుడు అనర్ఘరాఘవానికి వ్యాఖ్య రాశాడు.

నాథ సంప్రదాయం

రాచకొండ మంత్రుల వంశానికి చెందిన గౌరన ఈ యుగానికి చెందిన మరో గొప్పకవి. పాల్కురికి 'ద్విపద'ను స్వీకరించి హరిశ్చంద్రోపాఖ్యానం, నవ నాథ చరిత్రలను రచించాడు. ఇతడు తెలుగు సాహిత్యంలో తొలిసారిగా నాథ సంప్రదాయాన్ని ప్రవేశపెట్టాడు. అది తెలంగాణ, రాయలసీమల్లో విశేష ప్రాచుర్యం పొందింది. నాథ సంప్రదాయం విగ్రహారాధన, కులతత్వాన్ని నిరసించింది.

దేవరకొండకు చెందిన సూరన తొలి కల్పిత కావ్యమైన ధనాభిరామాన్ని రచించాడు. గౌరన కుమారుడైన భైరవకవి తెలంగాణలో బంధకవిత్వ ప్రక్రియకు ఆద్యుడు. ఇతడు శ్రీ రంగమహాత్మ్యం, రత్నపరీక్ష, కవి గజాంకుశం (ఛందోగ్రంథం)ను రచించాడు.

అనంతామాత్యుడు భోజరాజీయ కావ్యం, ఛందోదర్పణం, రసాభరణం అనే గ్రంథాలను రచించాడు. ఏర్పూరి సింగన భాగవత షష్ఠమస్కంధాన్ని రాశాడు. ఇతడు నల్లగొండ జిల్లాలోని ఏరూర్పుకు చెందినవాడు. ఇతడి మరో రచన కువలయాశ్వ చరిత్ర. బొప్పరాజు గంగన పంచమస్కంధను రచించాడు.

రేచర్ల రెడ్డి వంశస్థుల రాజధాని పిల్లలమర్రి. ఇది పిన వీరభద్రుడి జన్మస్థలం. 'వాణి నా రాణి' అని సగర్వంగా చెప్పుకున్న మహాకవి పిల్లలమర్రి పినవీరభద్రుడు. ఇతడు అవతారదర్పణం, నారదీయ పురాణం, మాఘమహాత్మ్యం, మానసోల్లాస సారం, శృంగార శాకుంతలం, జైమినీ భారతం అనే గ్రంథాలను రచించాడు. ప్రబంధాల్లో కనిపించే అనేక వర్ణనలకు, పద్యాల ఎత్తుగడలకూ ఒరవడి సృష్టించిన మార్గదర్శి పినవీరభద్రుడు.

కొలని గణపతి దేవుడు శివయోగసారం, మనోబోధ రచించాడు. కాకతీయ సామ్రాజ్య చరిత్రలో కొన్ని ఘట్టాలకు శివయోగసారం ఆధారం. భాగవతంలోని షష్ఠ, ఏకాదశ, ద్వాదశ స్కంధాలను పోతన అనువదించలేదు. వీటిని హరిభట్టు అనువదించాడు. రతి రహస్యం, వరాహపురాణం, మత్స్య పురాణం, నారసింహపురాణం ఇతడి ఇతర రచనలు. త్రిలోకభేది సకల ధర్మసారం రాశాడు. ఇతడు గౌరన మనవడు.

రాజుల మెప్పు కోసం కవులు.. అవధానం, సమస్య పూరణం, గర్భ, గోప్య, బంధ, అక్షరచ్యుత, మాత్రాచ్యుత, ఏక, ద్విసంధాదారణ ప్రక్రియలను అనుసరించడం ఈ కాలం నుంచే మొదలైంది.

ఏకామ్రనాథుడు

కాకతీయ రాజుల చరిత్ర, వంశావళి, వారి పూర్వీకుల క్రమాభివృద్ధి తదితరాలను తెలిపేందుకు ఏకామ్రనాథుడు ప్రయత్నించాడు. ఇతడు తొలి తెలుగు చరిత్రకారుడు. ఓరుగల్లుకు చెందిన ఇతడు ప్రతాపరుద్ర చరిత్రం, ద్వాత్రింశత్సాలభంజికల కథలు అనే గ్రంథాలను రచించాడని తెలుస్తోంది. ప్రతాపరుద్ర చరిత్రం తెలుగులో తొలి వచన రచన. తొలి చారిత్రక గ్రంథం. కాకతీయుల వివరాలతో పాటు నాటి మతాలు, మత వైషమ్యాలు, సంప్రదాయాలు, సాంఘిక ఆచారాలు, సంప్రదాయాలను ఇందులో పేర్కొన్నారు. ప్రతాపరుద్రుడి దినచర్య, వ్యక్తిత్వాన్ని గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. ఓరుగల్లు సమీపంలోని వివిధ వర్ణాల, వృత్తుల వారి సంఖ్య తదితర విషయాలను ఈ గ్రంథం తెలుపుతోంది. ప్రతాపరుద్ర చరిత్రం ఆనాటి సాంఘిక చరిత్ర.

కొరవి గోపరాజు

పాల్కురికి రచనల తర్వాత తెలంగాణ సాంఘిక జీవితాన్ని విస్తృతంగా వర్ణించిన కావ్యం 'సింహాసన ద్వాత్రింశిక'. దీని రచయిత కొరవి గోపరాజు. ఇతడు నిజామాబాద్ జిల్లా వేముగల్లు (భీమగల్లు)కు చెందినవాడు. ఇతడి పూర్వీకులు రాచకొండలో మంత్రులుగా పనిచేశారు. సింహాసన ద్వాత్రింశికకు విక్రమార్క చరిత్ర అనే సంస్కృత కావ్యం మూలం. కానీ గోపరాజు అనేక కల్పనలు చేసి దీన్ని స్వతంత్ర కావ్యంగా రూపొందించాడు. అందుకే ఈ గ్రంథంలో నాటి సాంఘిక జీవితాన్ని చిత్రించడం సాధ్యమైంది. గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో పేద, ధనిక తారతమ్యాలను చక్కగా వర్ణించాడు. మనసు లోతుల్ని విశ్లేషించిన తొలి మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తగా ఫ్రాయిడ్‌ను పేర్కొంటారు. కానీ శతాబ్దాల ముందే కొరవి గోపరాజు మనసు లోతుల్ని, కలల్ని విశ్లేషించాడు. సింహాసన ద్వాత్రింశిక తెలంగాణ గొప్ప కావ్యాల్లో ఒకటిగా నిలిచిపోయింది.

పిడుపర్తి కవులు పాల్కురికి మార్గంలో శైవ సాహిత్యాన్ని విరివిగా రాశారు. ఓరుగల్లుకు చెందిన పిడుపర్తి ఒకటో బసవకవి పిల్లనైనారుకథ, బ్రహ్మోత్తర ఖండంతోపాటు గురుదీక్షాబోధను రచించాడు. ఇతడి పెద తండ్రి కుమారుడైన పిడుపర్తి నిమ్మనాథుడు 'నిజ లింగ చిక్కయ్య కథ' అనే యక్షగానాన్ని రచించాడు.

రెండో సోమనాథుడు పాల్కురికి సోమనాథుడి పండితారాధ్య చరిత్రను పద్య ప్రబంధంగా రచించాడు. ఇతడు ఒకటో బసవకవి కుమారుడు. ఇతడే 'ప్రభులింగలీలలు' అనే ద్విపద కావ్యాన్ని కూడా రచించాడు. పిడుపర్తి రెండో బసవ కవి దీన్నే పద్య కావ్యంగా కూర్చాడు. ఇతడు ఒకటో బసవకవి మనవడు.

పొటాషియం లోపం వల్ల వచ్చే వ్యాధి



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ - కంటెంట్ (ఎస్.ఏ)

వ్యాధులు

1. ఒక వ్యాధిగ్రస్థుడికి నీటిని చూస్తే భయం, వణుకు పుడుతుంది. అతనికున్న వ్యాధి?
   1) డెంగ్యూ 2) టెటానస్
   3) రేబిస్ 4) ఎయిడ్స్
2. కిందివాటిలో ఏ వ్యాధి లైంగిక సంపర్కానికి సంబంధించింది కాదు?
   1) వైరల్ ఎన్‌సెఫాలిటిస్
   2) గనేరియా 3) సిఫిలిస్
   4) యాంటీ ఇమ్యునో డెఫిషియన్సీ - సిండ్రోమ్
3. లాలాజల గ్రంథులపై దాడి చేసే పారామిక్సో వైరస్ వల్ల కలిగే వ్యాధి?
   1) జలుబు 2) గవద బిళ్లలు
   3) మీజిల్స్ 4) డయేరియా
4. సిఫిలిస్, మలేరియా, కలరా వంటి వ్యాధులు సంక్రమించడానికి కారకాలు వరుస క్రమంలో?
   1) ప్రోటోజోవా - ప్రత్యక్ష సంబంధం - ఈగలు
   2) ఎలుకలు - ఆడ అనాఫిలిస్ దోమ - నీరు
   3) లైంగిక సంపర్కం - ఆడ అనాఫిలిస్ దోమ - ఈగలు
   4) మట్టిలోని బ్యాక్టీరియాజ -కలుషిత ఆహారం - గాలి
5. ట్రిపనో సోమా గాంబియన్సీ అనే ప్రోటోజోవన్ వల్ల కలిగే వ్యాధి?
   1) టైఫాయిడ్ 2) అతిసారం
   3) న్యుమోనియా 4) నిద్రాజాడ్యం
6. కిందివాటిలో సరైన జత?
   1) ప్లాస్మోడియం - సాండ్ ఈగ
   2) విబ్రియో కలరా - ఆడ అనాఫిలిస్ దోమ
   3) ట్రిపనో సోమా - సీసీ ఈగ
   4) క్లాస్ట్రీడియం టెటానీ - పెంపుడు జంతువు
7. చికిత్స కోసం వైద్యుడి వద్దకు వెళ్లిన వ్యాధిగ్రస్థులు చెప్పిన లక్షణాల క్రమం కింది విధంగా ఉంది.
   ఎ. చలిజ్వరం, తీవ్ర తల నొప్పి
   బి. రక్త విరేచనాలు - పొత్తి కడుపు నొప్పి
   సి. కండరాల సంకోచం - నరాల తీపులు
   వీరు బాధపడుతున్న వ్యాధులు వరుస క్రమంలో తెల్పండి.
   1) కలరా - టైఫాయిడ్ - డిఫ్తీరియా
   2) అమీబియాసిస్ - మలేరియా - డయేరియా
   3) మలేరియా - అమీబియాసిస్ - ధనుర్వాతం
   4) అపెండెసైటిస్ - ధనుర్వాతం - పోలియో
8. కిందివాటిలో ఏ వ్యాధి కలుషిత ఆహారం, ఈగల వల్ల సంక్రమించదు?
   1) మలేరియా 2) కలరా
   3) టైఫాయిడ్ 4) అమీబియాసిస్
9. న్యుమోనియా వ్యాధిని కలిగించే సూక్ష్మజీవికి సంబంధించింది?
   1) వైరస్ 2) బ్యాక్టీరియా
   3) ప్రోటోజోవన్ 4) శిలీంధ్రం
10. వ్యాధి, వ్యాధి కారకానికి సంబంధించి సరికాని జత?
    1) మలేరియా - ప్లాస్మోడియం
    2) స్లీపింగ్ సిక్‌నెస్ - ట్రిపనోసోమా
    3) గవదబిళ్లలు - ఎన్‌సెఫలాటిస్ వైరస్
    4) జలుబు - రినో వైరస్
11. ఏ వ్యాధి ప్రభావం శ్వాస అవయవాలపై ఉండదు?
    1) ట్యుబర్ క్యులోసిస్ 2) న్యుమోనియా
    3) కోరింత దగ్గు 4) మీజిల్స్
12. కిందివాటిలో క్షయ వ్యాధికి చెందిన లక్షణం?
    1) శ్లేష్మంతో కూడిన దగ్గు
    2) ఆకలి తగ్గడం, బరువు తగ్గడం
    3) జ్వరం 4) పైవన్నీ
13. 'హైడ్రోఫోబియా'ను కలిగించే వైరస్?
    1) హెర్పెస్ వైరస్ 2) రాబ్డో వైరస్
    3) ఎన్‌సెఫలాటిస్ 4) ఆరోమిక్సో వైరస్
14. ప్లేగు వ్యాధి నిర్మూలనకు ఎవరు కనుగొన్న టెట్రాసైక్లిన్ అనే ఔషధం ఉపయోగపడింది?
    1) అబ్దుల్ కలాం
    2) డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు
    3) లూయీ పాశ్చర్
    4) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
15. ఏ వ్యాధి బ్యాక్టీరియా, వైరస్, ప్రోటోజోవన్ వల్ల కలుగదు?
    1) క్యాషియోర్కర్ 2) టెటానస్
    3) మలేరియా 4) న్యుమోనియా
16. క్యాషియోర్కర్ దేని లోపం వల్ల వస్తుంది?
    1) ఇనుము 2) ప్రోటీన్
    3) అయోడిన్ 4) కాల్షియం
17. పొటాషియం లోపం వల్ల వచ్చే వ్యాధి?
    1) హైపోకలేమియా 2) హైపోనట్రీమియా
    3) హైపోగ్లైసిస్ 4) అనీమియా
18. పోషక పదార్థాలు, వాటి లోపాలకు సంబంధించి సరైన జతలు?
    ఎ. ఇనుము - కండరాల పక్షవాతం
    బి. సోడియం - హైపోనట్రీమియా
    సి. కాల్షియం - ఆస్టియో మలేసియా
    డి. పొటాషియం - క్వాషియోర్కర్
    1) ఎ, బి 2) ఎ, సి 3) బి, డి 4) సి, డి
19. అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధి?
    1) రక్తహీనత 2) బానపొట్ట
    3) థైరాయిడ్ వాయడం 4) మెరాస్మస్
20. ఒక వ్యక్తిలో నిర్జలీకరణం, రక్తపోటు తగ్గడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు గుర్తించారు. ఆ వ్యక్తిలో కింది వాటిలో ఏ ధాతు లోపం ఉన్నట్లు నిర్ధారించవచ్చు?
    1) కాల్షియం 2) అయోడిన్
    3) పొటాషియం 4) సోడియం

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 3; 5) 4; 6) 3; 7) 3; 8) 1; 9) 2; 10) 3; 11) 4; 12) 4; 13) 2; 14) 2; 15) 1; 16) 2; 17) 1; 18) 3; 19) 3; 20) 4.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. మలేరియా సోకిన మానవునిలో చలి జ్వరం వచ్చే సమయం?
   1) ఎర్ర రక్తకణాలు పగిలి మీరో జాయింట్లు విడుదలయ్యే సమయం
   2) స్పోరో జాయింట్ల ఉత్పత్తి సమయం
   3) స్పోరో జాయింట్లు కాలేయ కణాల్లో చేరే సమయం
   4) క్రిప్టో మీరో జాయింట్లు ఎర్ర రక్త కణాల్లో ప్రవేశించే సమయం
2. మానవుల్లో వచ్చే x-డిఫ్తీరియా, Y-తట్టు, Z- కోరింత దగ్గు అనే వ్యాధులను కల్గించే సూక్ష్మజీవుల పేర్ల క్రమం?
   1) x- వైరస్, Y-బ్యాక్టీరియా, Z- ప్రోటోజోవా
   2) x- ప్రోటోజోవా, Y-బ్యాక్టీరియా, Z- వైరస్
   3) x- వైరస్, Y-బ్యాక్టీరియా, Z- వైరస్
   4) x-బ్యాక్టీరియా, Y-వైరస్, Z-బ్యాక్టీరియా
3. ఏ వ్యాధి సోకితే శరీరం నుంచి ఎక్కువ శాతం నీరు బయటకు పోయి నిర్జలీకరణ స్థితి ఏర్పడుతుంది?
   1) టైఫాయిడ్ 2) మలేరియా
   3) కలరా 4) డిఫ్తీరియా
4. వేటిని తగినంత మొత్తాల్లో భుజించకపోతే మనం త్వరగా అలసిపోయి నీరసంగా తయారవుతాం?
   1) కార్బోహైడ్రేట్‌లు 2) ప్రోటీన్‌లు
   3) కొవ్వులు 4) విటమిన్‌లు
5. 'మిక్సోవైరస్ పరోటైడస్' వల్ల కలిగే వ్యాధి?
   1) మెదడువాపు 2) గవద బిళ్లలు
   3) తట్టు 4) హెపటైటిస్

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 1; 5) 2.

పోషక పదార్థాల లోపం వల్ల వచ్చే వ్యాధులు

పదార్థ లోపం	వ్యాధి	కారణం/లక్షణాలు
ప్రోటీన్	క్యాషియోర్కర్	తల్లిపాల బదులు కార్బోహైడ్రేట్ ఆహారంపై ఆధారపడ్డ ఐదేళ్లలోపు పిల్లలు ఈ వ్యాధికి లోనవుతారు. వికారంగా ఉండటం, పెరుగుదల ఆగిపోవడం, బరువు కోల్పోవడం, బాన పొట్ట, మానసిక వైకల్యం కలుగుతాయి.
ఖనిజాలు	మెరాస్మస్	తల్లిపాలకు బదులు పోషక విలువలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకునే ఏడాదిలోపు పిల్లలు ఈ వ్యాధికి లోనవుతారు. కండరాలు సరిగా ఎదగక పోవడం, అవయవాల బలహీనత, పక్క టెముకలు బయట పడటం వంటివి కలుగుతాయి.
ఇనుము (Fe)	రక్త హీనత	ఎర్ర రక్తకణాల్లో హీమోగ్లోబిన్ లోపం వల్ల వ్యక్తులు పాలిపోవడం, ఆకలి కోల్పోవడం, త్వరగా అలసిపోవడం.
పొటాషియం	హైపోకలేమియా	విపరీతమైన వాంతులు, విరేచనాలతో పొటాషియం కోల్పోవడం, హృదయ స్పందన రేటు అధికమవడం, మూత్రపిండం దెబ్బతినడం, బలహీనత, కండరాల పక్షవాతం.
సోడియం	హైపోనట్రీమియా	సోడియం నష్టపోవడం, నిర్జలీకరణం, రక్తపోటు తగ్గడం, బరువు కోల్పోవడం
అయోడిన్ (I)	గ్రంథివాపు	థైరాయిడ్ గ్రంథివాపు
కాల్షియం Ca	రికెట్స్, ఆస్టియో మలేసియా	విటమిన్ డి లోపం ఏర్పడుతుంది.

వైరస్‌ల వల్ల వచ్చే వ్యాధులు

వ్యాధి	కారకం	వ్యాపించే విధానం	లక్షణాలు
జలుబు	రినోవైరస్	తుంపరల వల్ల,ప్రత్యక్ష సంబంధం	ముక్కు కారడం, తలనొప్పి
పోలియో మైలిటిస్	పోలియో వైరస్, ఎంటరో వైరస్	ఈగలు, నీరు, ఆహారం	తలనొప్పి, వాంతులు, శరీరంలో ఒకటి రెండు అవయవాలకు పక్షవాతం, బలహీనత
గవద బిళ్లలు (మంప్స్)	పారామిక్సో వైరస్ పరోటైడస్	ప్రత్యక్ష సంబంధం, వైరస్ లాలాజల గ్రంథుల మీద దాడి	జ్వరం, తలనొప్పి, లాలాజలం అధికంగా ఊరడం - లాలాజల గ్రంథులు వాయడం, వాయడం, గొంతు ఎండిపోవడం
తట్టు (మీజిల్స్)	పారామిక్సో వైరస్ (తట్టు వైరస్)	ప్రత్యక్షసంబంధం దగ్గేటప్పుడు వెలువడే వాపు, తంపరల ద్వారా	ముక్కు కారడం, శ్లేష్మ పటలం చర్మం మీద ఎర్రని గుల్లలు
మశూచి (స్మాల్‌పాక్స్)	వరియొల వైరస్	ప్రత్యక్ష సంబంధం	జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి,చర్మం మీద గుల్లలు, పొక్కులు ఏర్పడి గుంటలు పడటం
ఇన్‌ఫ్లు యెంజా	ఆర్థోమిక్సో వైరస్	ప్రత్యక్ష సంబంధం, వస్తువుల ద్వారా	జ్వరం, కండరాల నొప్పి, గొంతు పుండు, పొడిదగ్గు, ఊపిరితిత్తు (ఫ్లూ)

విద్య, ఉద్యోగ సమాచారం

ఏడీసీఎల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలో అమరావతి డెవ లప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్-01, లేబర్ ఆఫీసర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, ఐసీడబ్ల్యూఏ, ఎల్ఎల్‌బీ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా
» **ఈమెయిల్:** recruitment.adcl@gmail.com.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.04.2025.
» **వెబ్‌సైట్:** https://adcl.in/

సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరులో 18 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

మైసూరులోని సీఎస్ఐఆర్-సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ)రెగ్యులర్ ప్రాతిపదికన టెక్ని కల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 10.05.2025.
» **రాతపరీక్ష తేది:** జూన్/జూలై, 2025.
» **వెబ్‌సైట్:** https://www.cftri.res.in/

బ్రిక్-ఎన్ఐఏబీ, హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని బ్రిక్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ).. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** మాస్టర్స్ డిగ్రీ(ఎంఎస్సీ, ఎంటెక్, ఎంవీఎస్సీ లేదా ఎంఫార్మ్), ఎంబీబీఎస్ లేదా బీటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు సీఎస్ఐఆర్ /యూజీసీ /డీబీటీ /ఐసీఎంఆర్ /ఐఎన్ఎస్‌పీఐఆర్‌ఈ నెట్ జేఆర్ఎఫ్ 5 ఏళ్ల ఫెలోషిప్ పొంది ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.04.2025.
» **ప్రవేశ పరీక్ష తేది:** 30.05.2025.
» **వెబ్‌సైట్:** https://www.niab.res.in/

ఐన్‌స్టీన్‌కు ఏ పరిశోధనకు నోబెల్ లభించింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్


కెమిస్ట్రీ

పరమాణు నిర్మాణం

క్వాంటం సిద్ధాంతం - కాంతి విద్యుత్ ఫలితం

కాంతి విద్యుత్ ఫలితం: ఒక లోహ ఉపరితలాన్ని కాంతి కిరణపుంజంతో ఢీకొట్టించినప్పుడు, దాని ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదలవుతాయి. ఈ దృగ్విషయాన్నే కాంతి విద్యుత్ ఫలితం(Photo Electric Effect) అంటారు.

- అన్ని రకాల కాంతి కిరణాలు అన్ని లోహాల ఉపరితలాల నుంచి ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేయవు.
- ఎలక్ట్రాన్‌లను తేలికగా కోల్పోయే స్వభావం అంటే అతి తక్కువ అయనీకరణ శక్మం (ఒక వాయు స్థితిలోని ఒంటరి పరమాణువు చిట్ట చివరి కక్ష్యలోని ఎలక్ట్రాన్‌ను తొలగించడానికి కావాల్సిన శక్తి) ఉన్నటువంటి లోహాలే కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపిస్తాయి.
- ప్రతి లోహానికి సంబంధించి ఒక అభిలాక్షణిక (దానికే ప్రత్యేకమైన) పౌనఃపున్యం ఉంటుంది. లోహ ఉపరితలాన్ని ఢీకొట్టే పతనకాంతి పౌనఃపున్యం, ఆ లోహానికి సంబంధించిన అభిలాక్షణిక పౌనఃపున్యం కంటే ఎక్కువ ఉన్నప్పుడే లోహ ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదలవుతాయి.
- ఉదాహరణకు పొటాషియం లోహ ఉపరితలం నుంచి ఊదారంగు కిరణాలు ఎలక్ట్రాన్‌లను విడుదల చేస్తాయి. కానీ, ఎరుపు రంగు కిరణాలు ఎలక్ట్రాన్‌లను విడుదల చేయవు.
- దీనికి కారణాలను ఆయా కాంతి కిరణాల పౌనఃపున్యాల (లేదా తరంగదైర్ఘ్యం లేదా శక్తి) ఆధారంగా విశ్లేషించొచ్చు.
- కింది పట్టికను పరిశీలిస్తే ఎరుపు కిరణాల పౌనఃపున్యం లేదా శక్తి తక్కువ (తక్కువ తరంగదైర్ఘ్యం) కాబట్టి పొటాషియం లోహ ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదల కావని తెలుస్తుంది.
- సాధారణంగా తక్కువ అయనీకరణ శక్మం ఉన్న క్షార లోహాలు ఫొటో విద్యుత్ ఫలితాన్ని చూపిస్తాయి. అవి పొటాషియం, రుబీడియం, సీజియం. ఈ క్రమంలోనే పరమాణు సైజు పెరిగి అయనీకరణ శక్మాలు పెరగడం వల్ల కాంతి విద్యుత్ ఫలితం చూపించే సామర్థ్యం కూడా ఎక్కువ. అంటే క్షార లోహాలైన లిథియం, సోడియం దాదాపుగా కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపించవు. సీజియం తేలికగా కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపిస్తుంది.
- కాంతి విద్యుత్ ఫలితాన్ని 'సాధారణీకృత క్వాంటం సిద్ధాంతం' ద్వారా ఐన్‌స్టీన్ వివరించాడు. ఆయన కృషి ఫలితంగా 1905 లో నోబెల్ బహుమతి లభించింది.



- ఈ సిద్ధాంత ప్రకారం ఫోటాన్‌లుగా భావించే కాంతి కణాల శక్తి (E), పౌనఃపున్యానికి (υ) అనులోమానుపాతంలో ఉంటుంది.
[E = hυ, h ప్లాంక్ స్థిరాంకం]
- లోహం నుంచి ఎలక్ట్రాన్‌ను బయటకు తొలగించడానికి అవసరమైన శక్తి ఫోటాన్ కు ఉన్నప్పుడే లోహ ఉపరితలాన్ని ఫోటాన్ ఢీకొట్టినప్పుడు దాని నుంచి ఎలక్ట్రాన్‌లు బహిర్గతమవుతాయి. ఫోటాన్ శక్తి అవసరమైన దానికంటే తక్కువగా ఉంటే అది లోహం నుంచి ఎలక్ట్రాన్‌లను విడుదల చేయదు.
- ఒక ఫోటాన్ లోహ ఉపరితలాన్ని ఢీకొట్టినప్పుడు అది రెండు పనులు చేయాలి. ఎలక్ట్రాన్‌ల మీద ఉన్న లోహ కేంద్రక ఆకర్షణ బలాలను అధిగమించి విడుదల చేయగలగాలి. తర్వాత వాటికి కొంత శక్తి(గతిజశక్తి) నిచ్చి లోహ ఉపరితలానికి దూరంగా(తిరి గి లోహంలో చేరకుండా) తీసుకెళ్లగలగాలి. అంటే ఈ రెండు పనులు చేయగలిగిన శక్తి లోహాన్ని ఢీకొట్టే ఫోటాన్‌లకు ఉండాలి.
- దీనికి సమీకరణ రూపం: hυ = W + KE
hυ = ఫోటాన్‌ల శక్తి
W = ఎలక్ట్రాన్‌లపై ఉన్న లోహ ఆకర్షణ బలాలను అధిగమించే శక్తి (పని ప్రమేయం)
KE = విడుదలైన ఎలక్ట్రాన్‌ల గతిజశక్తి

రంగు	తరంగ దైర్ఘ్య అవధి (nm)	పౌనఃపున్య అవధి (Hz)
ఎరుపు (Red)	622 – 780	$4.8 \times 10^{14} - 3.85 \times 10^{14}$
నారింజ (Orange)	597 – 622	$5.01 \times 10^{14} - 4.82 \times 10^{14}$
పసుపు (Yellow)	577 – 597	$5.19 \times 10^{14} - 5.05 \times 10^{14}$
ఆకుపచ్చ (Green)	492 – 577	$4.92 \times 10^{14} - 5.19 \times 10^{14}$
నీలి (Blue)	455 – 492	$6.59 \times 10^{14} - 6.10 \times 10^{14}$
ఊదా (Violet)	390 – 455	$7.69 \times 10^{14} - 6.59 \times 10^{14}$

కాంతి విద్యుత్ ఫలితానికి సంబంధించిన ముఖ్య విషయాలు

- ప్రతి లోహం, కొంత కనీస పౌనఃపున్యం లేదా శక్తి ఉన్న కాంతి పడినప్పుడే ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేస్తుంది. దీన్నే ఆరంభ లేదా ద్వార పౌనఃపున్యం (Threshold Frequency) అంటారు. ఈ ఆరంభ పౌనఃపున్యం కంటే తక్కువ పౌనఃపున్యం ఉన్న కాంతిని ఎంతసేపు ప్రసరింపజేసినా లోహ ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేయలేం.
- వేర్వేరు లోహాలకు ఈ ఆరంభ పౌనఃపున్యం వేరుగా ఉంటుంది. విడుదలైన ఎలక్ట్రాన్‌ల గతిజ శక్తి పతన (ఢీకొట్టిన) కాంతి పౌనఃపున్యం పై ఆధారపడి ఉంటుంది. దాని తీవ్రతపై ఆధారపడదు.
- ఒక సెకనులో విడుదలైన ఎలక్ట్రాన్‌ల సంఖ్య కాంతి తీవ్రతపై ఆధారపడి ఉంటుంది. దాని పౌనఃపున్యంపై ఆధారపడి ఉండదు.
- ఒకవేళ ఎలక్ట్రాన్ విడుదలకు కావాల్సిన శక్తికంటే తక్కువ శక్తి ఉన్న ఫోటాన్‌ను వస్తువు గ్రహించినప్పుడు ఎలక్ట్రాన్‌లు భూస్థాయి (అల్ప శక్తిస్థాయి) నుంచి ఉత్తేజిత శక్తిస్థాయి (అధిక శక్తిస్థాయి)లోకి పరివర్తనం చెందుతాయి. అయితే అధిక శక్తి స్థాయిల్లో ఎలక్ట్రాన్‌లు ఎక్కువసేపు ఉండలేవు (అస్థిరం). కాబట్టి తిరిగి భూస్థాయికొస్తాయి. ఈ ప్రక్రియలో అంటే ఎలక్ట్రాన్‌లు అధికశక్తి నుంచి తిరిగి భూస్థాయిలోకి వస్తున్నప్పుడు గ్రహించిన శక్తి విడుదలవుతుంది. ఈ విడుదలయ్యే శక్తి వికిరణ రూ పంలో ఉంటుంది. తద్వారా వర్ణపటాలు ఏర్పడతాయి. కాబట్టి వివిధ మూలకాలను వేడిచేసినప్పుడు అవి విలక్షణమైన రంగులనిస్తాయి. (దీపావళి టపాకాయలు)

లోహం	-	జ్వాల రంగు
మెగ్నీషియం	-	తెలుపు
కాల్షియం	-	ఇటుక ఎరుపు
స్ట్రాన్షియం	-	కెంపు రంగు
బేరియం	-	లేత ఆకుపచ్చ
లిథియం	-	సింధూర ఎరుపు
సోడియం	-	పసుపు
పొటాషియం	-	ఊదా
రుబీడియం	-	ఎరుపు – ఊదా
సీజియం	-	నీలి వర్ణం

మాదిరి ప్రశ్నలు

1. ప్లాంక్ సిద్ధాంతం ప్రకారం సరైన వాక్యాలు ఏవి?
ఎ) కాంతి ఫోటాన్‌లు (క్వాంటా) అనే చిన్న చిన్న శక్తి ప్యాకెట్‌ల రూపంలో ఉద్గారం లేదా శోషణం చెందుతుంది
బి) ఫోటాన్‌లు కాంతి వేగానికి సమానమైన వేగంతో ప్రయాణిస్తాయి.
సి) పదార్థ కాంతి శోషణం లేదా ఉద్గారం అవిచ్ఛిన్నంగా ఉంటుంది.
1) ఎ, సి 2) ఎ, బి
3) బి, సి 4) ఎ, బి, సి
2. తనపై పడిన వికిరణాలను సంపూర్ణంగా శోషించుకునే లేదా ఉద్గారం చేసే వస్తువును ఏమంటారు?
1) ఉత్సర్గ నాళిక 2) శీతల వస్తువు
3) కృష్ణ వస్తువు 4) హరిత వస్తువు
3. క్వాంటా అనేది?
1) శక్తి ప్యాకెట్ 2) కరెన్సీ
3) క్వింటాలు 4) కాంతి ప్రమాణం
4. ఫొటో విద్యుత్ ఫలితంలో ఫొటో ఎలక్ట్రాన్‌ల ఉద్గారం దేనిపై ఆధారపడి ఉంటుంది?
1) ఆరంభ పౌనఃపున్యం
2) పతన కాంతి తీవ్రత
3) లోహ స్వభావం 4) అన్నీ
5. ఐన్‌స్టీన్‌కు ఏ పరిశోధనకు నోబెల్ బహుమతి లభించింది?
1) సాపేక్షతా సిద్ధాంతం
2) కాంతి పరిక్షేపణం
3) కాంతి విద్యుత్ ఫలితం
4) క్వాంటం సిద్ధాంతం
6. ఒక ఫోటాన్ శక్తి ..... కు అనులోమాను పాతంలోనూ ..... కు విలోమాను పాతంలోనూ ఉంటుంది?
1) పౌనఃపున్యం, తరంగదైర్ఘ్యం
2) తరంగదైర్ఘ్యం, పౌనఃపున్యం
3) కాంతి తీవ్రత, తరంగదైర్ఘ్యం
4) పౌనఃపున్యం, కాంతి తీవ్రత
7. ఎక్కువ పౌనఃపున్యం (తక్కువ తరంగ దైర్ఘ్యం ఉన్న) దృగ్గోచర కాంతి రంగు?
1) నారింజ 2) ఎరుపు
3) పసుపు 4) ఊదా
8. అల్యూమినియం (Al) తలం పని ప్రమే యం **4.2eV.** సోడియం **(Na)** తలం పని ప్రమేయం **2.0eV** ఈ రెండు లోహాల తలాలపై వికిరణాలు పడి ఫొటో విద్యుత్ ఫలితం ఇవ్వగా కింది పరిశీలనలు వచ్చాయి.
1) Al, Naలకు ఒకే ద్వార పౌనఃపున్యం ఉంది.
2) Al ద్వార పౌనఃపున్యం > Na ద్వార పౌనఃపున్యం
3) Na ద్వార పౌనఃపున్యం > Al ద్వార పౌనఃపున్యం
4) ఏదీకాదు
9. లిథియం, సోడియం, పొటాషియం, కాల్షియంల ప్రథమ అయనీకరణ శక్మాలు **(eV)** వరుసగా **5.39, 5.13, 4.34, 6.11** అయితే ఏది కాంతి విద్యుత్ ఫలితాన్ని సులభంగా ప్రదర్శిస్తుంది?
1) పొటాషియం 2) లిథియం
3) సోడియం 4) కాల్షియం
10. సీజియం, సోడియం, అల్యూమినియంల పని ప్రమేయాలు వరుసగా **1.9eV, 2.0eV, 4.2eV** అయితే అతి తక్కువ ఆరంభ పౌనఃపున్యం ఉన్నది?
1) సీజియం 2) సోడియం
3) అల్యూమినియం 4) చెప్పలేం
11. నిశ్చిత వాక్యం **(A):** రేడియో తరంగాలు, అయస్కాంత క్షేత్రంలో వంగి ప్రయాణిస్తాయి.
వివరణ **(R):** రేడియో తరంగాలు స్వభావ రీత్యా విద్యుదయస్కాంతాలు
1) A, R రెండూ సరైనవే R, A కు సరైన వివరణ
2) A, R రెండూ సరైనవే, కానీ, R, A కు సరైన వివరణ కాదు
3) A సరైంది. R సరైంది కాదు.
4) A సరైంది కాదు. R సరైంది.

సమాధానాలు:
1) 2; 2) 3; 3)1; 4) 2; 5)3; 6) 1; 7) 4; 8) 2; 9) 1; 10) 1; 11) 1.

The synonym of Surreptitious is..

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Hindus constitute less than one per cent of the American population, (1)/ an overwhelming majority of who (2)/ are either from India (3)/or are people of Indian-origin. (4)/ No error (5)
2. Ever since the Supreme Court ruling (1)/ on the entry of women of all ages into Sabarimala, (2)/ questions of patriarchy, equality, (3)/ constitutional and tradition have been raised. (4)/ No error (5)
3. The controversy that began with a public tussle among (1)/ Mr. Verma and Special Director Rakesh Asthana (2)/ has ended with the former's removal, (3)/ although it is couched as a transfer. (4)/ No error (5)
4. India's largest software exporter Tata Consultancy Services has appointed Daniel Hughes Callahan, (1)/ popularly known Don Callahan as additional and independent director for a period of five years (2)/ with effect from January 10, 2019, based on the recommendations of the Nomination and Remuneration Committee, (3)/ and subject to approval of shareholders. (4)/ No error (5)
5. ISRO had hit upon (1)/ the idea of transforming (2)/ the expendable fourth stage (3)/ in a makeshift satellite to reduce space debris. (4)/ No error (5)

Directions: (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Drinking milk enriched with vitamin D may significantly reduce the risk of rickets and also aid for sufferers of heart disease, according to studies recently completed at the Indian Institute of Medical Sciences, New Delhi.
1) be significant in reducing the risk of rickets and aid for
2) significantly reduce the risk of rickets and aid
3) cause a significant reduction in the risk of rickets and aid to
4) significantly reduce the risk of rickets as well as aiding
5) no correction required
7. If you are in a three-month software design project and, in two weeks, you've put together a program that solving part of the problem, show it to your boss without delay.
1) and, you've put together a program that solves part of the problem in two weeks
2) and, you've put together a program that has solved part of the problem in two weeks
3) and, in two weeks, you've put together a program that solves part of the problem
4) and, in two weeks, you put together a program that solved only part of the problem
5) no correction required
8. Many of these environmentalists proclaim to save nothing less than the planet itself.
1) to save nothing lesser than
2) that they are saving nothing lesser than
3) to save nothing less than
4) that they save nothing less than
5) no correction required
9. The rate of inflation in this country has been increasing steadily, and this is a source of concern for those in power.
1) steadily: which
2) steadily; this trend
3) steadily, this increase
4) steadily: this
5) no correction required
10. Generally, in the fine print of insurance documents lies the clauses that make a fool out of the gullible consumer.
1) lie the clauses that makes a fool
2) lies the clauses that makes a fool
3) lie the clauses that make a fool
4) Lied the clause that making a fool
5) no correction required



Directions (Q.No.11-15): In the passage given below there are several blanks with numbers, choose the right word to fill in the blanks from the five options given against each blank to complete the passage.

Come New Year and the state of Andhra Pradesh will ______(11) a separate High Court as the Supreme Court has given the green signal for issuing the notification to this______ (12). It will be the 25th high court in the country and will ______ (13) function from a temporary structure till the permanent building comes up in the ambitious Justice City complex in the state's capital Amaravati. ______(14) the bifurcation of the state on June 2, 2014, Andhra Pradesh and Telangana have had a common High Court situated at Hyderabad, the______ (15) capital city.

11. 1) have 2) have been
3) being 4) have being
5) been
12. 1) affect 2) purpose
3) problem 4) effect
5) issue
13. 1) initial 2) initially
3) initialize 4) informally
5) formerly
14. 1) from 2) further
3) farther 4) for
5) since
15. 1) former 2) farther
3) latter's 4) later's
5) further

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

Bank Exams
GENERAL ENGLISH

A) On the one hand, Mr. Trump has steadily contributed to the strident and crude anti-migrant rhetoric, characterising prospective migrants from Latin America as drug-dealers, rapists and violent criminals and shutting down the U.S. border to travellers from certain Muslim-majority countries.
B) Matters took a darker turn as Mr. Trump doubled down on his refusal to negotiate over funding for the wall and said he may declare a state of national emergency over this uncomfortable status quo.
C) It began as a populist campaign promise that brought President Donald Trump's supporters cheering to their feet and paved the way for his election.
D) On the other, his insistence that he will not sign any appropriations bill to break the funding logjam in Congress and end what could soon become the longest shutdown in U.S. history, unless that bill includes $5.7 billion in financing for a border wall, has gone down badly with Democrats, who control the House.
E) Now, the border wall with Mexico has become a morass of partisan bickering that has stalemated the U.S. federal government into a three-week-long shutdown, leaving nearly 800,000 public sector workers furloughed without pay.
F) At the heart of this political crisis is the increasingly bitter polarization of public opinion over immigration.

16. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 21-23): Choose the correct synonym for the words given below

21. OBNOXIOUS
1) abhorrent 2) detect
3) pleasant 4) project
5) propel
22. SURREPTITIOUS
1) fugitive 2) renegade
3) punitive 4) clandestine
5) castigate
23. DOCILE
1) uncontrollable
2) plaint 3) wild
4) irrepressible 5) loathsome

Directions (Q.No. 24-25): Choose the correct antonym for the words given below

24. ABHORRENT
1) obscene 2) nasty
3) vile 4) salubrious
5) lousy
25. EXUBERANT
1) phlegmatic 2) ruckus
3) commotion 4) frolic
5) crank

Directions (Q.No. 26-35): Choose a word/words to fill in the blanks given below to complete the sentence.

26. There is no way around it: plagiarism is ______ to thievery.
1) tantamount 2) apathetic
3) fatuous 4) unscrupulous
5) indecisive
27. For ____ deeds during her mission overseas, Eesha was awarded the Congressional Medal of Honor.
1) inept 2) valorous
3) erroneous 4) malodorous
5) benign
28. Adrith read the employee manual so that he might ______ himself with his new responsibilities at the company.
1) relinquish 2) synthesize
3) orient 4) validate
5) motivate
29. I am ______ of the problems that this solution will cause, but I still believe that this is the best possible solution.
1) innocuous 2) cognizant
3) precipitous 4) reminiscent
5) belligerent
30. The spectacular presentation by a rainforest adventurer ______ Sampath with the desire to travel to South America to see the jungles for himself.
1) disheartened 2) inhibited
3) imbued 4) reconstituted
5) abhorred
31. As the city grew and stretched its borders, it began to feel the ______ problems of urban sprawl and overpopulation.
1) improvident
2) mendacious
3) ersatz 4) concomitant
5) surreptitious
32. Terrance, a dentist, ______ to be with the media, so he could see the concert for free.
1) facilitated 2) conjugated
3) purported 4) tended
5) placated
33. ______ on a lounge chair by the pool was the very tan owner of the estate, relaxing in the midday sunshine.
1) Trident 2) Renegade
3) Fraught 4) Renowned
5) Supine
34. Observing his sister's ______ behavior of riding without a helmet, Bandarkar ran to get his mother.
1) contemptuous
2) contented 3) ctitious
4) parlous 5) pensive
35. As the discussions ____ concluded, the____ continued further.
1) Definitely , problem
2) Miserably, issues
3) Purposefully, impasse
4) abruptly, stalemate
5) Soon, curfew

KEY

1) 2 2) 4 3) 1 4) 2 5) 4
6) 2 7) 3 8) 4 9) 2 10) 3
11) 1 12) 4 13) 2 14) 5 15) 3
16) 1 17) 4 18) 4 19) 3 20) 2
21) 1 22) 4 23) 2 24) 4 25) 1
26) 1 27) 2 28) 3 29) 2 30) 3
31) 4 32) 3 33) 5 34) 4 35) 4